# తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాల భాషా స్వరూపం

తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాద్

# తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాల భాషా స్వరూపం

ప్రధాన సంపాదకులు
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
**డా॥ సి. నారాయణ రెడ్డి**
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు

సంపాదకులు
**డా॥ జె.చెన్నయ్య**
ప్రధాన కార్యదర్శి, తెలంగాణసారస్వత పరిషత్తు

**తెలంగాణ సారస్వత పరిషత్తు**
తిలక్‌రోడ్, హైదరాబాద్-500001.
ఫోన్ నెం.: 040-24753724

**TELUGU PATRIKALU, PRASAARA MAADHYAMAALA BHAASHAA SWAROOPAM**

© Telangana Saraswatha Parishath

ప్రథమ ముద్రణ : ఆగస్టు 2016

పుటల సంఖ్య : 254

ప్రతులు : 500

మూల్యం : రూ. 100/-

డిటిపి : బి.గోపాల్‌రెడ్డి

ప్రతులకు:
**తెలంగాణ సారస్వత పరిషత్తు**
తిలక్‌రోడ్, హైదరాబాద్
ఫోన్: +91-40-24753724

ముద్రణ:
**సాయిలిఖిత ప్రింటర్స్**
ఖైరతాబాద్, హైదరాబాద్
040-65545979

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
**డాక్టర్ సి. నారాయణరెడ్డి** ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
**తెలంగాణ సారస్వత పరిషత్తు**
తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
**Dr. C. Narayana Reddy** Ex.M.P.
M.A.,Ph.D., D.Litt.
PRESIDENT
**Telangana Saraswatha Parishath**
Tilak Road,
Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

# అవతారిక

తెలంగాణలో 10 వ శతాబ్ది నుంచి ఎందరెందరో విశిష్ట ప్రాచీన కవులు అనర్ఘ కావ్యాలను సృజించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసినారు. తదనంతర కాలంలో సహితం కులీకుతుబ్‌షా వంటి సహృదయ పాలకులు తెలుగు వికాసానికి దోహదం చేకూర్చినారు.కాని నిజాం పాలనలో తెలుగు నిరాదరణకు గురి అయింది. ఈ దుస్థితిని అంతమొందించి తెలుగు పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ తెలంగాణ సారస్వత పరిషత్తు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కాళోజి నారాయణరావు, డా.బూర్గుల రామకృష్ణారావు, శ్రీ లోకనంది శంకర నారాయణ రావు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943 మే 26 న రూపుదిద్దుకుని ఈ రోజు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా॥దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి దక్షతతో నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతో పాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నవి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి

స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలవరించింది. 2013 లో పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది.

తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమై 2014 జూన్ 2 న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణను సర్వతోముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయటం హర్షణీయం. తెలంగాణ భాషా సాహిత్య కళా సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఏడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో ముందుకు సాగుతున్న తెలంగాణ సారస్వత పరిషత్తు బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు పాత్రలో భాగంగా విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నది. వాటిలో కొన్ని- తెలంగాణ మాండలిక పదాలు - ప్రయోగ వైశిష్ట్యం, తెలంగాణ ప్రాచీన తెలుగు కవుల కవితా ప్రాభవం, తెలంగాణ చిత్రకళ, శిల్పకళల వైభవం, తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలపై సదస్సు, తెలంగాణ కవయిత్రుల, కథయిత్రుల రాష్ట్రస్థాయి సమ్మేళనం.

తెలంగాణ వైభవోన్నతికి దర్పణాలుగా భాసించే 12 విలక్షణ గ్రంథాలను 2015 లో వెలవరించింది.

భావాభివ్యక్తికి ప్రధాన సాధనమైన భాష ఆధునిక సాంకేతిక విజ్ఞాన వ్యాప్తితో వివిధ పరిణామాలకు; నూతన భావజాలానికి, ఆవిష్కరణలకు తగిన పదకల్పనకు, వాక్య నిర్మాణ సంవిధానానికి చోటు కల్పిస్తున్నది. తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాల భాషా స్వరూపంలో మార్పులు వచ్చినై. పరిపాలన, విద్యారంగం, జనవ్యవహారంపై భాషాపరంగా వీటి ప్రభావం అనివార్యంగా ఉంటుంది. ఇందుకు సంబంధించిన భిన్న పార్శ్వాలను స్పృశిస్తూ అన్ని అంశాలను విశ్లేషించి అమూల్యమైన అభిప్రాయాలను, సూచనలను వ్యక్తం చేయటానికి సముచిత వేదికగా పరిషత్తు 'తెలుగు పత్రికలు ప్రసార మాధ్యమాల భాషా స్వరూపం' పై 2016 ఆగస్టు 20,21 తేదీలలో విస్తృత ప్రాతిపదికన సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో అనుభవజ్ఞులైన సంపాదకులు, పాత్రికేయులు, ప్రసార మాధ్యమాలలో విశేష సేవలందిస్తున్న నిపుణులు పాల్గొని దీనిని విజయవంతం చేసినారు. సదస్సు ప్రసంగ వ్యాసాలను

గ్రంథంగా ప్రచురించే సత్సంప్రదాయం ప్రకారం పరిషత్తు ఈ గ్రంథాన్ని వెలవరిస్తున్నది.

భాషాభిమానులకు పత్రికల, ప్రసార మాధ్యమాల ఉన్నతికోసం కృషి చేస్తున్న వారికి, పరిశోధకులకు ఈ గ్రంథం అత్యంత ప్రయోజనకారి కాగలదని భావిస్తున్నాను.

పరిషత్తు ప్రచురిస్తున్న ఈ గ్రంథం అందరి మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

(డా.సి.నారాయణ రెడ్డి)
అధ్యక్షులు
తెలంగాణ సారస్వత పరిషత్తు

హైదరాబాదు,
తేది : 21-08-2016.

**డా॥ జె. చెన్నయ్య**
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : 040-24753724

# ప్రవేశిక

తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విభిన్నమైన కార్యక్రమాల్లో పుస్తక ప్రచురణ విశిష్టమైంది. పరిషత్తు ప్రచురించిన గ్రంథాల పట్టికను చూస్తే ఎంత గొప్పవైన ప్రచురణలు వచ్చాయో తెలుస్తుంది. పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు పరీక్షల నిర్వహణ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే సదస్సుల నిర్వహణ, పెద్దల పేరిట నిర్వహించే సంస్మరణ ప్రసంగాలు, పరిణతవాణి ప్రసంగ పరంపర కొనసాగుతూ అనుబంధంగా పుస్తక ప్రచురణ జరుగుతున్నది. 2013 సంవత్సరంలో పరిషత్తు అధ్యక్షులు డా. సి.నారాయణరెడ్డి నేతృత్వంలో సప్తతి పూర్తి సందర్భంగా ఏడాది పొడవునా అనేకమైన ప్రత్యేక కార్యక్రమాలు పరిషత్తు ఏర్పాటు చేయడం జరిగింది. 'తెలంగాణ తెలుగు సాహిత్య వికాసం', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-ప్రయోగ రీతులు', 'తెలంగాణ ప్రాచీన నృత్య రీతులు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'తెలంగాణ కవయిత్రులు, కథయిత్రుల సమ్మేళనం' వంటి అనేక సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరుణంలో తెలంగాణలో సాహిత్య చైతన్యాన్ని పెంపొందించే కృషిలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పరిషత్తు భావించింది. నవ్య స్ఫూర్తితో ప్రచురణల్ని కూడా వెలువరించాలని నిర్ణయించింది. గత సంవత్సరం పరిణతవాణి ప్రసంగాలతో కూడిన తాజా సంపుటి, 'తెలంగాణ సాహిత్య వికాసం', 'వ్యాసగుళుచ్ఛం' రెండు సంపుటాలు ప్రచురించడం జరిగింది. వాటిని పాఠకులు ఆదరించారు.

తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ నూతన యుగోదయవేళ తెలంగాణ కు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనం జరగాలి. ఆ అధ్యయనానికి కావలసిన పఠనసామాగ్రిని సమకూర్చుకోవాలి. ఇప్పటివరకు ఉమ్మడి చరిత్రలో అంతర్భాగంగా వుండి తగినంత ప్రాధాన్యం లభించలేదని ప్రజల్లో వున్న అసంతృప్తిని పోగొట్టాలి. ఆ దిశగా తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విశిష్ట కార్యక్రమాల నిర్వహణలో ప్రచురణ ఒకటి. ఆ ప్రచురణల్లో 'తెలంగాణ సాహిత్యచరిత్ర', 'తెలంగాణ ప్రాచీనకవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు–కావ్యప్రయోగాలు', 'కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్యసేవ', 'మాఊరు మాట్లాడింది', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసావళి', 'తెలంగాణ ప్రముఖుల పరిణతవాణి' 'బంజారాల వివాహ ఆచార పద్ధతులు' 'డా.దేవులపల్లి రామానుజరావు యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' 'తెలంగాణ చరిత్ర' 'తెలుగు జానపద సాహిత్యం–స్త్రీల గేయాల్లో సంప్రదాయం' గత సంవత్సరం వెలువడ్డాయి.

'తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాల భాషా స్వరూపం' అనే అంశంపై సదస్సు నిర్వహించాలని, సదస్సు చర్చించే అంశాల్ని పుస్తకరూపంలో ముద్రించి అందరికీ అందించాలని పరిషత్తు భావించింది. భాష నిత్యచలనశీలంగా ఉన్నది. పత్రికలు, ప్రసార మాధ్యమాల్లోనే. భాషను అపరిమితంగా వాడుతున్నది పత్రికలు, ప్రసారమాధ్యమాల వారే. అవసరార్థం ఎప్పటికప్పుడు కొత్త పదాలను కనిపెట్టి ప్రయోగిస్తున్నది. వారే. భాషా వినియోగంలో ఎక్కువ తప్పులు జరగడానికి అవకాశమున్నదీ ఈ రంగంలోనేనన్నది యథార్థం. పత్రికలు, ప్రసారమాధ్యమాలు అనంతంగా విస్తరించిన కాలం ఒకవైపు, తెలుగు అధ్యయనాంశంగా అప్రధానంగా మారిన కాలంలో పత్రికలు, ప్రసారమాధ్యమాల్లోకి వస్తున్న ఈ తరం వారిలో భాషా విషయకమైన అవగాహనలో లోటు కనబడతున్న నేపథ్యంలో ఈ సదస్సును నిర్వహించడం ఆవశ్యకమని పరిషత్తు అధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సి.నారాయణ రెడ్డి సంకల్పించారు. వరిష్ఠ సంపాదకులు, భాషా ప్రయోగరీతుల్లో నిపుణులైన వారు సదస్సులో పాల్గొనడంతో పాటు తమ వ్యాసాలు ముందుగానే

అందించడం వల్లనే ఈ సంకలనాన్ని ముద్రించి అందించగలుగుతున్నాం. వారందరికీ కృతజ్ఞతలు. వ్యాసాల ఎంపికలో ప్రూఫులు దిద్దడంలో సహకారం అందించిన సీనియర్ పాత్రికేయులు శ్రీ టి,ఉడయవర్లు, ప్రముఖ రచయిత, అనువాదకులు శ్రీ గోవిందరాజు రామకృష్ణరావు గార్లకు, డి.టి.పి చేసిన మిత్రుడు బి.గోపాల్‌రెడ్డి కి, చక్కగా ముద్రించిన సాయిలిఖిత వై.వెంకటేశ్వరరావు గారికి కృతజ్ఞతలు తెలయజేస్తున్నాను.

**(డా.జె.చెన్నయ్య)**

ప్రధాన కార్యదర్శి

తెలంగాణ సారస్వత పరిషత్తు

హైదరాబాదు,

తేది :21-08-2016.

# విషయసూచిక


1. పట్టింపూ, పట్టుదల ప్రధానం 1
   – డా॥ కొండుభట్ల రామచంద్రమూర్తి

2. ప్రసార మాధ్యమాలు – భాష 8
   – డి. వెంకట్రామయ్య

3. పత్రికల పదసృష్టి 22
   – గోవిందరాజు చక్రధర్

4. ఉద్యోగంగా మారిన పాత్రికేయ వృత్తి 27
   – కె. ఎల్. రెడ్డి

5. తెలుగు పత్రికల భాష తీరుతెన్నులు 40
   – టి. ఉదయవర్లు

6. తెలుగు పత్రికల భాషా స్వరూపం 50
   – డా॥ జె. చెన్నయ్య

7. ప్రసార మాధ్యమాలలో భాష 65
   – డా॥ ఆర్. అనంత పద్మనాభరావు

8. 'తెలుగు తక్కువ' మనుషులతోనే సమస్యలు–భాషా భేషజాలు 70
   – దోర్బల బాలశేఖరశర్మ

9. తెలుగు న్యూస్ ఛానళ్లు భాష మెరుగుపడాలి 77
   – తోట భావనారాయణ

10. భాషాభివృద్ధిలో ప్రసారమాధ్యమాలది కీలక పాత్ర 89
    – ఆర్. దిలీప్‌రెడ్డి

11. భాషను పెంచుతున్నామా? తుంచుతున్నామా? 97
- డాక్టర్ రెంటాల జయదేవ

12. వార్తాపత్రికల్లో తెలుగు భాష 109
కొన్ని ఆహ్వానించదగిన మార్పులు
- టి.చంద్రశేఖర రెడ్డి

13. తెలుగు వార్తాపత్రికల్లోని భాష 115
తీరుతెన్నులు - పదసృజన
- రాంభట్ల పార్వతీశ్వరశర్మ

14. రేడియో కబుర్లు 134
- భండారు శ్రీనివాసరావు

15. టీవీ మాధ్యమం - భాష 140
- అమిర్నేని హరికృష్ణ

16. టీవీ భాషలో విచిత్రాలు 144
- జి.బుచ్చన్న

17. మీడియా భాష - ఆధునికత 150
- వొడ్నాల చంద్రమౌళి

18. తెలుగు దినపత్రికల్లో ఆదాన పదాలు-పరిశీలన 156
- డా. కొమాండూరి విజయభాను

19. తెలుగు పత్రికలు - ఇటీవలి భాషా స్వరూపం 163
- డా॥ వి. వీరాచారి

**20.** పత్రికాభాష - కాలానుగుణ మార్పులు **172**
- పి.గోపినాథ్ రాథోడ్

**21.** తెలుగు దినపత్రికలలో భాషాదోషాలు-కారణాలు **177**
- *రవీందర్ పారిపెల్లి*

**22.** పత్రికా భాష మూలాలపై శ్రద్ధ చూపాలి **184**
- *టి.వేదాంతసూరి*

**23.** పత్రికా భాష - ఒక పరిశీలన **188**
- *డా॥ బడుగుల వనిత*

**24.** పరిమితుల్లేని వ్యవస్థ మీడియా **198**
- *కోవెల సంతోష్ కుమార్*

**25.** తెలుగు దినపత్రికల శీర్షికల రచన-ఒక పరిశీలన **208**
- *పగడాల చంద్రశేఖర్*

**26.** వ్యాఖ్యాత - వ్యాఖ్యానం **217**
- డా॥ ఎ.రవీంద్రబాబు

**27.** తెలుగు దినపత్రికలు-తెలంగాణ మాండలిక పదప్రయోగం **225**
- *డా॥ భీంపల్లి శ్రీకాంత్*

**28.** తెలుగు భాష వికాసంలో మీడియా పాత్ర **229**
- *కూర సంతోష్*

**29.** జర్నలిజంలో సామాజిక మాధ్యమాలు **237**
- *కొలకలూరి శ్రీధర్*

# పట్టింపూ, పట్టుదల ప్రధానం

*- డా.కొండుభట్ల రామచంద్రమూర్తి*

తెలుగు పత్రికలలో, ఇతర తెలుగు ప్రసార సాధనాలలో కడచిన మూడు శతాబ్దాలలో పెను మార్పులు సంభవించాయి. పత్రికలలో అక్షరాలను చేతిలో కూర్చడం పోయి కంప్యూటర్లపైన అక్షరాలు కంపోజ్ చేస్తున్నారు. కంప్యూటర్–టు–ప్లేట్, కంప్యూటర్–టు–మెషిన్ టెక్నాలజీని వినియోగిస్తున్నాం. పత్రికల విస్తృతి పెరిగింది.ఎడిషన్లూ, పత్రికలలో విభాగాలూ పెరిగాయి. జిల్లా పత్రికలు (టాబ్లాయిడ్స్) వెలిశాయి. పేజీలు పెరిగాయి. విజయవాడలోనో, హైదరాబాద్‌లోనో ముద్రణ యంత్రాలు ఉండేవి. ఇప్పుడు ప్రతి జిల్లాలోనూ ముద్రణ యంత్రాలు ఉన్నాయి. ఏ జిల్లా ఎడిషన్ ముద్రణ ఆ జిలాలోనే జరుగుతోంది. ఇది వరకు సమాచారం టెలిప్రింటింగ్ ద్వారా రోమన్ లిపిలో పంపేవాళ్ళం. ఇప్పుడు అనేక సాధనాలు అందుబాటులో ఉన్నాయి. పత్రికలూ, రేడియోకూ తోడుగా టెలివిజన్ చానళ్ళు వచ్చాయి. డిజిటల్ మీడియా వచ్చింది. వెబ్ న్యూస్‌పేపర్లు అవిర్భవించాయి. మొబైల్ యాప్‌లు తయారైనాయి.

వార్తా సేకరణలో, వితరణలో వేగం పెరిగింది. పత్రికలకోసం వార్తలు సేకరించేవారికి ఉన్న వెసులుబాటు టీవీ న్యూస్ చానళ్ళకో, వెబ్‌న్యూస్ పేపర్లకో

వార్తలు సేకరించేవారికి ఉండదు. ఘటన జరిగిన వెంటనే 'బ్రేకింగ్ న్యూస్ (తక్షణవార్త లేదా తాజావార్త)' ఇవ్వాలి. ఆ తర్వాత సాధ్యమైనంత వేగంగా దృశ్యం (విజువల్) పంపించాలి. అవసరమైతే పీ-టు-సీ (పీస్ టు కెమరా) చెప్పాలి. తర్వాత వెంటనే వార్త పంపించాలి. ఆ తర్వాత సదరు సంఘటనకు సంబంధించిన ఏమైనా పరిణామాలు సంభవిస్తే వాటి సంగతి కూడా తెలియజేయాలి. ఉదయం జరిగిన ఘటనకు సంబంధించిన వార్తను పత్రికా విలేఖరి సాయంత్రం లోపు ఎప్పుడు పంపినా ఇబ్బంది లేదు. టీవీ, వెబ్ జర్నలిజంలో వేగం వల్ల భాష దెబ్బతింటుందనే వాదనలో నిజం ఉన్నది. మూడు, నాలుగు దశాబ్దాల కిందట తెలుగు పత్రికలలో ఉపయోగించే భాషపైన ఉండిన పట్టు కానీ పట్టింపు కానీ ఇప్పుడు లేదు. ఇదివరకు తెలుగు భాష పట్ల మమకారం, భాషపైన అధికారం ఉన్నవారు పత్రికారంగంలో వచ్చేవారు. అప్పటికే వారు అనేక పుస్తకాలు చదవడమో, కవిత్వం రాయడమో, ఇతర రచనలు చేయడమో ఆనవాయితీ. లేదా పత్రికారంగంలో ప్రవేశించిన అనంతరం తెలుగు భాషపై పట్టు సాధించడానికి విశేష కృషి చేసేవారు. పుస్తకాలు చదివేవారు. అప్పుడు పత్రికలలో వాడుతున్న తెలుగు భాషకూ, లోగడ వాడిన భాషకూ చాలా వ్యత్యాసం ఉంది. ఇప్పుడు మీడియాలో కనిపిస్తున్న, వినిపిస్తున్న తెలుగు వాక్యాలలో ఇంగ్లీషు పదాలు అలవోకగా దొర్లుతున్నాయి. ఇంగ్లీషు పదానికి ఆమోదయోగ్యమైన తెలుగు అనువాదం వాడుకలో ఉన్నప్పటికీ అనుభవజ్ఞులను అడిగి తెలుసుకొని దానిని ఉపయోగించాలన్న శ్రద్ధాసక్తులు జర్నలిస్టులలో లోపించాయి. వేగం పెరగడంతో పాటు పత్రికలనూ, ఇతర ప్రసార మాధ్యమాలనూ నిర్వహిస్తున్న వారికి భాషపైన మక్కువ లేకపోవడం, పట్టింపు లేకపోవడం కూడా భాషా ప్రమాణాలు తగ్గడానికి కారణం.

టీవీ వార్తాచానళ్ళు వచ్చిన కొత్తలో జీన్యూస్ బులెటిన్లలో హిందీ, ఇంగ్లీషు కలిపి చదివేవారు. ముంబాయిలో హిందీ, ఇంగ్లీషు పదాలను కలిపికొట్టే సంప్రదాయం చాలాకాలంగా ఉంది. జీన్యూస్ ప్రాసంగికత పెరగడానికి ఈ ప్రక్రియ కొంతమేరకు దోహదం చేసింది. భాష విషయంలో తెలుగు పత్రికలకు మొదటి నుంచీ తమిళ, కన్నడ పత్రికలకు ఉన్న పట్టింపు లేదు. శివలెంక శంభుప్రసాద్, నార్ల వెంకటేశ్వరరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, నండూరి రామమోహన్‌రావు.

సి.రాఘవాచారి, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఏబికే ప్రసాద్, వరదాచారి వంటి ప్రముఖ సంపాదకులకు తెలుగు భాషపైన ప్రేమ ఉండటం వల్ల పత్రికారచనలో సాధ్యమైనంత వరకూ తెలుగు మాటలనే ఉపయోగించాలనే సంకల్పం బలంగా ఉండేది. శ్రీశ్రీ, ఆరుద్ర, వేటూరి సుందరరామమూర్తి, గుంటూరు శేషేంద్రశర్మ, అజంతా వంటి సుప్రసిద్ధ కవులూ, పిలకా గణపతిశాస్త్రి, కొడవగంటి కుటుంబరావు, ముళ్ళపూడి వెంకటరమణ వంటి రచయితలు స్వల్పకాలం తెలుగు పత్రికలలో పని చేసినప్పటికీ పత్రికాభాషను కొంతమేరకు సుసంపన్నం చేశారు. ఈ తరం జర్నలిస్టులు సైతం తెలుగు కంటే ఇంగ్లీషు పదమే శక్తివంతంగా ఉంటుందని లేదా తేలికగా అర్థం అవుతుందని భావించినప్పుడు నిస్సంకోచంగా తెలుగు లిపిలో ఇంగ్లీషు మాటలను పనికట్టుకొని తమ భాషలోకి అనువదించుకుంటున్నారు. సినిమా పేర్లలో, సంభాషణలలోనూ ఈ వ్యత్యాసం కనిపిస్తుంది. ఉదాహరణకు రజనీకాంత్ సినిమాకు తెలుగులో 'రోబో' అని ఇంగ్లీషులోనే నామకరణం చేస్తే తమిళంలో 'మాంత్రికన్' అన్నారు. ఆర్డినెన్స్‌ను తెలుగు పత్రికలు ఆర్డినెన్స్ అనే రాస్తున్నారు ఇప్పటికీ. కన్నడ పత్రికలు మాత్రం సుగ్రవాజ్ఞ అని చక్కగా అనువదించాయి. ఇద్దరు తెలుగువాళ్ళు కలిస్తే ఇంగ్లీషులో మాట్లాడుకునే జాడ్యం ఉన్నట్లే తెలుగు పత్రికలలో ఇంగ్లీషు పదాలు ఉపయోగించినా తప్పులేదనే బలహీనత సర్వాత్ర ఉన్న మాట వాస్తవం. పత్రికల ఎడిషన్లు విస్తరించిన తర్వాత ఉపసంపాదకుల అక్కర విపరీతంగా పెరిగింది. భాషపైన ఏ మాత్రం గౌరవం లేనివారూ, భాషాపరిజ్ఞానం బొత్తిగా లేనివారూ పత్రికారంగంలోకీ, టీవీ న్యూస్‌చానళ్ళలోకీ పెద్ద సంఖ్యలో వచ్చి చేరుతున్నారు. కొత్తగా వాడుకలోకి వచ్చిన ఇంగ్లీషు పదానికి తెలుగు అనువాదం చేయాలనే ఆలోచన కానీ, చేసే సామర్థ్యం కానీ కొత్తతరం జర్నలిస్టులకు అంతగా లేదు. ఇంగ్లీషు మాటనే తెలుగు లిపిలో రాసేస్తున్నారు. పత్రికలలో అదే విధంగా వస్తున్నాయి. ఇరవై మూడు జిల్లా పత్రికలూ (టాబ్లాయిడ్‌లూ), ప్రధాన పత్రికా, విశేష శీర్షికలతో అనుబంధాలూ ప్రచురించవలసి రావడంతో సంపాదకులకూ, వారి సహాయకులకూ భాషా లోపాలను గుర్తించి సరిచేసే అవకాశం లేదు. తెలుగు భాషాజ్ఞానం లేనివారిని తీసుకొని సంవత్సర కాలం శిక్షణ ఇవ్వడానికి అన్ని పెద్ద తెలుగు పత్రికలలోనూ పటిష్ఠమైన వ్యవస్థ ఉన్నది. శిక్షణలో తెలుగు భాష నేర్పడానికి కృషి జరుగుతోంది.

రాంభట్ల కృష్ణమూర్తి, బూదరాజు రాధాకృష్ణ వంటి ఉద్దండులు ఈ దిశలో మార్గదర్శకులుగా నిలిచారు. బూదరాజు పత్రికా పదకోశం వెలవరించారు. ఒక సంవత్సరం శిక్షణలో తెలుగు భాషను పూర్తిగా నేర్చుకోవడం సాధ్యం కాదు. భాష పట్ల గౌరవం, ప్రేమ, అభిమానం లేకపోతే అది వంటబట్టదు. తెలుగులో పరిమిత పరిజ్ఞానంతో పత్రికలలో, టీవీ చానళ్ళలో పనిచేసే వారి సంఖ్య అధికం. పాత తరంవారికి పాత్రికేయం ఉద్యమసదృశ్యంగా ఉండేది. భాష పట్ల అంకితభావం ఉండేది. సంకరసమాసం వచ్చినా, వ్యాకరణం వికటించినా, అక్షర దోషాలు కనిపించినా విలవిలలాడేవారు. వారికి సామాజిక నిబద్ధత ఉండేది, చరిత్ర గురించి అవగాహన ఉండేది. రాజకీయాలు కరతలామలకం. ఇప్పుడు చాలామందికి జర్నలిజం కేవలం ఉద్యోగం. ఉద్యోగంలోకి రాకముందు పుస్తకాలు చదివే అలవాటున్నవారు బహుకొద్దిమంది. ఉద్యోగంలోకి వచ్చిన తర్వాత వృత్తిలో రాణించేందుకూ, తెలుగుపైన అధికారం సాధించేందుకూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నవారు కూడా కొద్దిమందే. ఎక్కువ మంది పరిమితమైన భాషా పరిజ్ఞానంతో పత్రికలలో సంవత్సరాల తరబడి పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఈ రోజుల్లో మీడియా ఉద్యోగాలలో ప్రవేశిస్తున్నవారూ, మీడియా సంస్థలలో శిక్షణ పొందుతున్నవారూ అత్యధికంగా ఇంజనీరింగ్ పట్టభద్రులు. జీవితంలో నిర్దిష్టమైన లక్ష్యం లేనివారు. ఎక్కడికి వెళ్ళాలో, అక్కడికి వెళ్ళాలంటే ఏమి చదువుకోవాలో తెలియనివారు. చదువుకున్న రంగాలలో ఉద్యోగాలు లభించక, పోటీ పరీక్షలలో విజయం సాధించలేకపోయినవారు. ఇంజనీరింగ్ పట్టభద్రులలో ఎక్కువ మందికి తెలుగు రాదు. ఇంగ్లీషూ రాదు. కంప్యూటర్ ఎట్లా ఉపయోగించుకోవాలో మాత్రం తెలుసు. శ్రద్ధగా అధ్యయనం చేస్తే రెండు భాషలలోనూ ఎంతోకొంత ప్రావీణ్యం సంపాదించవచ్చు. అధ్యయనం చేయాలన్న సంకల్పం వారికి ఉండాలి. అందుకు మీడియా సంస్థలు కొత్త ఉద్యోగులను ప్రోత్సహించాలి.

తెలుగు పత్రికలలో తెలుగు మాత్రమే రాయాలన్న సూత్రం పాటించడానికి తెలుగు భాషలో పాండిత్యం అక్కరలేదు. సరళమైన తెలుగు రాయగలిగితే చాలు. తెలుగు భాష పట్ల గౌరవప్రపత్తులు ఉంటే చాలు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో, రాజకీయ, దౌత్య రంగాలలో కొత్తగా వస్తున్న ఇంగ్లీషు పదజాలానికి తెలుగు

అనువాదం తెలుసుకొని ఉపయోగించాలన్న పట్టింపు మాత్రం తప్పనిసరిగా ఉండాలి. కొత్తగా వాడుకలోకి వస్తున్న ఇంగ్లీషు పదాలకు తెలుగు అనువాదాలను తయారు చేసుకోవలసిన అవసరం మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టులకే ఉన్నది. అనంతరం అనువాదాలు సవ్యంగా ఉన్నాయో లేదో పరిశీలించి రూఢి చేయవలసిన బాధ్యత విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులుగా పని చేస్తున్న వారిపైనా, తెలుగు పండితులపైనా ఉన్నది. ఈ దిశగా పొత్తూరి వెంకటేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఒక ప్రయత్నం జరిగింది. కొంతమంది సీనియర్ సంపాదకులూ, భాషాశాస్త్రవేత్తలతో ఆయన ఒక సంఘాన్ని నియమించారు. కొత్తగా వాడుకలోని వచ్చిన మాటలను పరిశీలించి, రూఢి చేసిన జాబితాను తెలుగు పత్రికల సంపాదకులకు పంపించే సంప్రదాయం నెలకొల్పారు. అన్ని మంచి కార్యక్రమాల వలెనే ఈ కార్యక్రమం సైతం కొద్ది మాసాల తర్వాత ఆగిపోయింది. దాన్ని పునరుద్ధరించే ప్రయత్నం జరగలేదు. తెలుగు అకాడెమీ లేదా తెలుగు విశ్వవిద్యాలయం ఇటువంటి కార్యక్రమానికి ఒక వేదికను ప్రసాదించవచ్చు. ఇంగ్లీషు పదాలను పరిహరించి కేవలం తెలుగు మాటలనే వాడాలనే ప్రయత్నం కొన్ని పత్రికలలో జరుగుతోంది. మొబైల్‌ను సంచారవాణి అనీ, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ని గుండ్రటి బల్ల సమావేశమనీ అనువదించడం ప్రారంభంలో కృతకంగా కనిపించవచ్చును. కాలక్రమేణా అలవాటు అవుతుంది. అన్ని పత్రికలూ కలిసి సమిష్టిగా ఇటువంటి ప్రయత్నం చేస్తే ప్రయోజనం ఉంటుంది. ఇది నిరంతరం కొనసాగవలసిన కృషి. ఒకసారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ ఆధ్వర్యంలో జుబిలీహాల్‌లో అనువాద సమస్యలపైనా, మీడియాలో ఉపయోగించే భాషపైనా సదస్సు జరుగుతుంది. మాజీ ప్రధాని పాములపర్తి నరసింహారావు, తదితర ప్రముఖులు హాజరైనారు. టెలివిజన్‌కు తెలుగులో అనువాదం ఏమిటనే ప్రస్తావన వచ్చింది. నరసింహారావు చెప్పిన ఉపాయం బాగానే ఉందనిపించింది. టీవీని తీసుకొని వెళ్ళి ఒక గ్రామం కూడలిలో పెట్టాలనీ, ప్రజలు దానిని ఏమని పిలిస్తే అదే రాయాలనీ సూచించారు. ఒక ప్రాంతంలో బుల్లితెర అనవచ్చు. మరో ప్రాంతంలో బొమ్మలపెట్టే అనవచ్చు. ఆ విధంగా స్థానికంగా ఉపయోగించే మాటలను సేకరించి మీడియాలో వినియోగించాలని సలహా చెప్పారు. ఇటువంటి ప్రయత్నం జరగాలి. ఇందుకు ఏదైనా సంస్థ పూనుకోవాలి.

మీడియాలో ప్రయోగించే భాషపైన రెండు జిల్లాల (కృష్ణా, గుంటూరు) ప్రభావం అమితంగా ఉన్నదనే షికాయతు ఉండనే ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి కొద్ది కాలం కిందట నెలకొల్పిన 'నమస్తే తెలంగాణ'లో పనిగట్టుకొని తెలంగాణ యాసతో రాస్తున్నారు. అదే సంస్థకు చెందిన టీన్యూస్‌లో, తెలంగాణలో వెలసిన మరో న్యూస్‌చానల్ వీసిక్స్‌లో తెలంగాణ తెలుగు ప్రయోగిస్తున్నారు. సమస్య ఏమిటంటే, తెలంగాణలో సైతం ప్రతి వంద కిలోమీటర్లకూ యాస మారుతుంది. తెలంగాణ, రాయలసీమ, దక్షిణకోస్తాంధ్ర, ఉత్తరకోస్తాంధ్ర అంటూ విభజించినా గోదావరి జిల్లాలు ఏ వర్గీకరణ కిందికీ రావు. ఉభయ గోదావరి జిల్లాలలోనూ రకరకాల యాసలు ఉన్నాయి. ఏలూరులో మాట్లాడే భాషకీ, అమలాపురంలో భాషకీ వ్యత్యాసం ఉంటుంది. ఇప్పుడు జిల్లాలోనే జిల్లా టాబ్లాయిడ్స్ తయారవుతున్నాయి. కనుక జిల్లా పత్రికలలో స్థానిక మాండలికం ఉపయోగిస్తున్నారు. ఇది అంత శ్రద్ధగా, పట్టుదలతో జరగడం లేదు. కానీ సంపాదకులు పట్టుబడితే స్థానిక భాషకు జిల్లా టాబ్లాయిడ్స్‌లో పట్టం కట్టవచ్చు. పత్రికను ప్రజలకు మరింత దగ్గరగా తీసుకొని వెళ్ళవచ్చు. ప్రధాన పత్రికలో సైతం ఏ ప్రాంతం నుంచి వార్త వెలవడిందో ఆ ప్రాంతం యాస ఆ వార్తలో అంతర్లీనంగా ఉంటుంది. దాన్ని అదే విధంగా ఉండనీయడం వల్ల ప్రధాన పత్రికలోనూ వైవిధ్యం పెరుగుతుంది. ఏకరూపత సాధించాలనే నియమంలో నియంతృత్వం ఉంది. అది ప్రజాస్వామ్యబద్ధమైన ఆలోచన కాదు. మాండలికాలను వదిలిపెడుతూ, కేవలం రెండు జిల్లాల భాషకే మీడియాను పరిమితం చేస్తే తెలుగు భాష ఎదగదు. అన్ని మాండలికాలనూ గౌరవించే ప్రజాస్వామ్య సంస్కృతి మీడియా నిర్వాహకులలో ఉండాలి. ప్రజల ఆలోచనలనూ, అలవాట్లనూ విశేషంగా ప్రభావితం చేసే అపారమైన శక్తి మీడియాకు ఉన్నది. మీడియా భాషలో వైవిధ్యం లేకపోతే ప్రజలు మాట్లాడే భాషలోనూ విస్తృతి తగ్గిపోతుంది. ఆంగ్ల భాష సంపద్వంతం కావడానికి ఇతర భాషల నుంచి పదాలను ఉదారంగా స్వీకరించడమే కారణం. గ్రీక్, లాటిన్, స్పానిష్ వంటి యూరోపియన్ భాషల నుంచే కాకుండా హిందీ, ఉర్దూ, తెలుగు వంటి భారతీయ భాషల నుంచి సైతం అనేక మాటలను ఆంగ్లం తనలో ఇముడ్చుకుంది. అందుకే ఆభాష నిరంతరం విస్తరిస్తూ వస్తుంది. తెలుగులోనూ ఉర్దూ మాటలు, ఇంగ్లీషు మాటలు చేరి స్థిరపడిపోయాయి. ఇతర భాషల నుంచి పదాలను నిరభ్యంతరంగా స్వీకరిస్తున్నప్పుడు

మన మాండలికాలను ఎందుకు దూరం చేసుకోవాలి? ఏ ప్రాంతంలో ప్రచురించే పత్రికలో ఆ ప్రాంతపు మాండలికాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులూ, కొత్తగా మీడియాలో ప్రవేశించినవారూ నిత్యం కొన్ని గంటలను అధ్యయనానికి కేటాయించాలి. సరళంగా రాయడం తేలిక కాదు. చాలా కష్టం. పత్రిక చదివే ప్రతి పాఠకుడికీ, టీవీ చూసే ప్రతి వీక్షకుడికీ, రేడియో వినే ప్రతి శ్రోతకీ అర్థమయ్యే విధంగా రాయగలగాలి. సంస్కృత భూయిష్టమైన సమాసాలు రాయకూడదు. చిన్న పదాలతో, సరళమైన భాషలో సూటిగా రాయగలగాలి. జర్మన్ భాషా శాస్త్రజ్ఞుడు రుడాల్ఫ్ ఫ్లెష్ పరిశోధన చేసి రూపొందించిన రీడబిలిటీ ఫార్ములా (చదివించే సూత్రం) ప్రకారం మీడియాకోసం రాసే వార్తలలో, వ్యాఖ్యలలో, వ్యాసాలలో సాధ్యమైనన్ని ఎక్కువ పేరాలు ఉండాలి. ప్రతి పేరాలోనూ సాధ్యమైనన్ని తక్కువ వాక్యాలు ఉండాలి. ప్రతి వాక్యంలోనూ సాధ్యమైనంత తక్కువ పదాలు ఉండాలి. ప్రతి పదంలోనూ సాధ్యమైనన్ని తక్కువ అక్షరాలు ఉండాలి. ఈ సూత్రాన్ని అనుసరిస్తే సరళంగా రాయడం అలవాటు అవుతుంది. మన భాషాపరిజ్ఞానం ప్రదర్శించడానికి మీడియాలో రాయకూడదు. అందరికీ అర్థమయ్యే విధంగా అతి సరళంగా, సూటిగా రాస్తేనే ప్రయోజనకరం. తెలుగు పండిత పరిషత్తు వంటి సంస్థను నెలకొల్పితే తెలుగు మీడియాలో తారసపడే భాషా విధ్వంసాన్ని అరికట్టే ప్రయత్నం చేయవచ్చు. నెలకు ఒక సారి సమీక్ష జరిపి మీడియా ప్రతినిధుల గోష్ఠి ఏర్పాటు చేసి మీడియా సంస్థల తప్పొప్పుల పట్టికను విడుదల చేయవచ్చు. భాషను భ్రష్టు పట్టిస్తున్న మీడియా సంస్థలనూ, జర్నలిస్టులనూ మందలించవచ్చు. అటువంటి భయం ఉంటే భాష విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అనుభవజ్ఞులైన జర్నలిస్టులూ. యజమానులూ సంకల్పిస్తారు. మీడియాలో భాషా ప్రమాణాలు దిగజారుతున్నాయనీ, తెలుగు భాష నాశనం అవుతోందనీ గుండెలు బాదుకోవడం కంటే మంచి భాష రాసేవారిని ప్రోత్సహించడానికీ, సవ్యంగా రాయనివారిని మందలించడానికీ ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే మంచిది. తెలంగాణ సారస్వత పరిషత్తు ఈ విషయంలో చొరవ తీసుకోవడం శుభపరిణామం. పరిషత్తు అధినేత డాక్టర్ సి.నారాయణరెడ్డి గారికీ, ఇతర బాధ్యులకూ హృదయపూర్వకమైన ధన్యవాదాలు.

వ్యాసకర్త – ***ఎడిటోరియల్ డైరెక్టర్, సాక్షి మీడియా గ్రూప్***

# ప్రసార మాధ్యమాలు - భాష

- డి.వెంకట్రామయ్య

నీరు ప్రవహిస్తుంది.

భాష కూడా ప్రవహిస్తుంది.

ప్రవాహ శీలం కలిగిన భాషే పదికాలాల పాటు జీవించగలుగుతుంది. పది విధాల పరిణమిస్తుంది. పరిమళిస్తుంది.

'భాషకూడా ప్రవహిస్తుంది అన్న మాట కేవలం చమత్కారార్థకం కాదు. ఒకరివాక్కు నించి మరొకరి మనసులోకీ హృదయంలోకీ భాష ప్రవహిస్తుంది.

పత్రాల్లో, పత్రికల్లో, పుస్తకాల్లో లిఖితమైన అక్షరాల నించి, రేడియో, టెలివిజన్, సినిమా, ఇంటర్నెట్ వంటి ఎలక్ట్రానిక్ సాధనాలనించి, ఇంకా అనేక దృశ్య, శ్రవ్య మాధ్యమాల నించీ మాటగా, పాటగా, పాఠంగా, ప్రసంగంగా, ప్రకటనగా, ఉపన్యాసంగా, ఉపదేశంగా వివిధ ప్రక్రియల రూపంలో వినబడే, కనబడే భాష శ్రోతల, ప్రేక్షకుల మనసుల్లోకి హృదయాల్లోకీ నేరుగా ప్రవహిస్తుంది. ప్రసరిస్తుంది. ఈ భాష సజీవమైనట్లయితే, ఆ విధంగా ప్రవహించగలిగిన భాషే ప్రయోజనకరమవుతుంది. అప్పుడే ఆ భాష సార్థకమవుతుంది.

ఈ విధమైన సార్థకత సాధించాలంటే ఆ భాష జీవద్భాష కావాలి. నిత్య వ్యవహారంలో ప్రజల నాలుకలపై నర్తిస్తున్న భాష కావాలి. పదిమందికీ తేలికగా అర్థమయ్యే భావం, తేలికగా అవగతమయ్యే భాష కావాలి. వినియోగించే మాధ్యమాన్ని బట్టి భాష స్వరూపమూ, స్వభావమూ మారుతుంది. మారాలి. పుస్తకాలు, పత్రికల వంటి ముద్రణా మాధ్యమాల (Print Media) లో వాడే భాషకంటే, రేడియో, టెలివిజన్, సినిమా వంటి శ్రవ్య, దృశ్య మాధ్యమాలలో (Audio Visual Media) వాడే భాష మరింత సరళంగా సహజంగా సజీవంగా వుండాలి. ప్రజలు తమ నిత్య వ్యవహారాల్లో వినియోగించే భాషకి అది ఎంత దగ్గరగా వుంటే అంత మంచిది. అంటే, ఈ మాధ్యమాలకి గ్రాంథిక భాషకంటే వ్యావహారిక భాష అవసరం ఎక్కువగా వుంటుంది.

## ప్రసార భాషగా తెలుగు-

మన దేశంలో అక్షరాస్యతా శాతం ఇప్పటికీ అంతంత మాత్రంగానే వుంది. ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో, జీవన ప్రమాణాల్లో ఎంతోకొంత పురోగతి కనిపించినప్పటికీ అందుకనుగుణమైన అభివృద్ధి అక్షరాస్యతలో కనిపించడం లేదు. ఒక విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే, రేడియో, టెలివిజన్ వంటి జనమాధ్యమాలు (Mass Media) ఈ దేశ ప్రజల్లో అధిక సంఖ్యాకుల అందుబాటులోకి వచ్చినప్పటికీ ఈ మాధ్యమాలను వినియోగించుకునే వారిలో సూటికి పాతిక, ముప్పయి మంది ఇప్పటికీ నిరక్షరాస్యులే. మరో పది, పదిహేను మంది స్వల్పంగా చదువుకున్నవారు, ప్రాథమిక స్థాయికే చదువు పరిమితమైన వారుంటారు. అంటే మొత్తమ్మీద ఈ మాధ్యమాలు వినియోగించుకునేవారిలో నూటికి 35 నుంచి 45 మంది వరకూ అసలు చదువుకోని వారుగాని, స్వల్పమాత్రంగా చదువుకున్నవారు గాని వుంటారన్న మాట. ఇలువంటి వారికోసం రేడియో, టెలివిజన్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో తప్పనిసరిగా సులభమైన, సరళమైన, నిత్యవ్యవహారంలో ప్రజా బాహుళ్యానికి పరిచితమైన భాష – అంటే వ్యావహారిక భాషనే వాడవలసి వుంటుంది. ఇటువంటి భాషనే వాడాలనటానికి మరో ముఖ్యమైన కారణం కూడా వుంది.

పత్రికలు, పుస్తకాల వంటి ముద్రణా మాధ్యమాలు వినియోగించేవారు,

అంటే పాఠకులకు తాము చదివే అంశం ఏదయినా అర్థం కాకపోతే, ఆ అంశానికి చెందిన వాక్యాన్ని , వాక్య సముదాయాన్ని, ఆపాఠ్య భాగాన్ని మరో మారు, ఎన్నిమార్లు అవసరమైతే అన్నిమార్లూ చదువుకునే అవకాశం వుంటుంది. భాషాపరమైన అర్థాలు తెలియకపోతే నిఘంటువులు తోడ్పడుతాయి. విషయపరమైన సందేహాలుంటే ఆ విషయ పరిజ్ఞానం కలిగిన వారినడిగి సందేహ నివృత్తి చేసుకోవచ్చు. కాని,ఎలక్ట్రానిక్ మాధ్యమాల విషయంలో ఈ వెసులుబాటు లేదు. రేడియోలో ఒక వార్త వింటున్నా, టీవీలో ఒక సీరియల్ చూస్తున్నా, సినిమాలో ఒక నటుడి డైలాగు వింటున్నా ఆయా ప్రక్రియల ద్వారా ప్రసారమయ్యే భాష శ్రోతకి లేదా ప్రేక్షకుడికి తక్షణమే అర్థమయ్యేలా, ఆ విషయం వారి అవగాహనకి అందేలా వుండాలి. న్యూస్ రీడర్ చదివే ఒక వార్త అర్థం కాలేదనుకోండి, ఆ వార్త మళ్ళీ వినలేం కదా ! ఒక నాటికలోని సంభాషణ, ఒక ప్రసంగంలోని వాక్యాలు మనకి అర్థం కాకపోతే, వాటిలోని భావం మన అవగాహనకి అందకపోతే ఆ నాటికనీ ఆ ప్రసంగాన్నీ వెంటనే మరో మారు వినలేం కదా ! ఈ విధంగా అర్థం కాకపోవటమనే సమస్య నిరక్షరాస్యులకే కాదు, విద్యావంతులకీ ఉత్పన్నం కావచ్చు.

ఈ సమస్యకి ప్రధాన కారణం ఏమిటంటే – ఆయా ప్రసారాల్లో వినియోగించిన భాష సరళంగా లేకపోవడం, స్పష్టంగా, సులభ గ్రాహ్యంగా, వినీ వినగానే అర్థమయ్యేట్టుగా లేకపోవటం, పదాలు, పదబంధాల వినియోగం, వాక్య నిర్మాణం సంక్లిష్టంగా వుండటం. ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాల ద్వారా వాడే భాషలో పెద్ద పెద్ద మాటలు, కఠినమైన పదాలు, పొడుగైన వాక్యాలు వుండకూడదనేది ఇందుకు సంబంధించిన ప్రాథమిక నియమం. ప్రథమ సూత్రం. అయితే – ఒక్కొక్క మారు ప్రసారమయ్యే కార్యక్రమ స్వరూపాన్ని బట్టీ, ప్రత్యేకమైన అంశాన్ని బట్టీ గ్రాంథిక భాషా వినియోగం జరగవచ్చు. ప్రౌఢ భాషా వినియోగమూ జరగవచ్చు. 'నన్నయ భాషా వైదుష్యం' అన్న విషయం గురించి రేడియోలోనో టెలివిజన్‌లోనో ఒక ప్రసంగం ప్రసారమౌతున్నదనుకోండి. అలాంటప్పుడు ఆ విషయానికనుగుణమైన భాషనే ప్రసంగకర్త వినియోగించవలసి వుంటుంది. అదే విధంగా శాస్త్ర, వైజ్ఞానిక విషయాలు చర్చిస్తున్నప్పుడూ భాష, ఆ పరిభాష, సామాన్య శ్రోతలకి ప్రేక్షకులకీ అంత తేలిగ్గా అర్థం కాకపోవచ్చు. అలాగే వార్తలు గాని, ఇతర ప్రక్రియలకి చెందిన

అంశాలుగాని ఇంగ్లీషు వంటి పరభాషల నించి అనువదించినప్పుడు ఆ భాషలో కూడా కొంత మేర సహజత్వం లోపించవచ్చు. ఆ భాష అంత సరళంగానూ వుండకపోవచ్చు. ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో వాడే భాష వీలయినంత మేరకు వ్యావహారికమై వుండాలనీ, సరళమై సులభగ్రాహ్యమై వుండాలనీ పెట్టుకున్న నియమం ఇటువంటి ప్రత్యేక సందర్భాలకు వర్తించదు.

## భాషా దోషాలు:

ముద్రణా మాధ్యమాలలో కంటే రేడియో, టెలివిజన్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలలోనే భాషా దోషాలు ఎక్కువగా వుంటున్నాయనీ, భాషా వినియోగంలో విశృంఖలత్వం మితిమీరుతోందని కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విమర్శల్లో కూడా ఎంతో కొంత నిజం వుందని భాషా శాస్త్రవేత్తలు, పండితులే కాదు - ఈనాడు ఈ మాధ్యమాలను వినియోగిస్తున్న సామాన్య శ్రోతలు, ప్రేక్షకులు సైతం అంగీకరిస్తున్నారు.

ముద్రణా మాధ్యమాలకంటే ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో భాషా పరమైన దోషాలు ఎక్కువగా వుండాటానికి, భాష విషయంలో నియమ రాహిత్యమేకాక నియమోల్లంఘనలు కూడా అధిక స్థాయిలో జరగడానికీ పలు కారణాలున్నాయి. భాషా పరమైన దోషాలు ఎత్తి చూపి, వాటిని ఆయా మాధ్యమాల నిర్వహకుల లేదా అధినేతల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ముద్రణామాధ్యమాల పాఠకులకి వున్నంతగా ఎలక్ట్రానిక్ మాధ్యమాల శ్రోతలకి, ప్రేక్షకులకీ ఉండదు. ఉదాహరణకి, ఒక పత్రికలో ప్రచురితమైన వార్తలో, వ్యాసంలో లేదా మరో రచనలో భాషాపరమైన దోషాలు ఒక పాఠకుడికి కనిపించాయనుకుందాం. ఆ పాఠకుడు వెంటనే ఆ విషయాన్ని ఆ పత్రికా సంపాదకుని దృష్టికి తీసుకువస్తూ ఉత్తరం రాయవచ్చు. లేదా టెలిఫోన్ ద్వారా, ఈమెయిల్ ద్వారా, ఫ్యాక్స్ ద్వారా తెలియపరచవచ్చు. లేదా వ్యక్తిగతంగానూ తెలియపర్చవచ్చు. ఆవిధంగా తెలియపరిచే ముందు తాను కనిపెట్టిన దోషాలేమిటో నిర్ధారించుకోవటానికి, దోషాలున్నాయనుకుంటున్న వార్తాంశాలన్నీ, లేదా వ్యాసాన్నీ ఎన్నిమార్లు అవసరమైతే అన్నిమార్లు చదవడానికి ఆ పాఠకుడి చేతిలో ఆ పత్రిక సిద్ధంగా వుంటుంది.

తాను దోషంగా భావిస్తున్నది అసలు దోషమా కాదా అని తేల్చుకోవడానికి ఇతరులతో చర్చించే అవకాశం కూడా ఆ పాఠకుడికి వుంటుంది. ఇటువంటి అవకాశం ఒక రేడియో శ్రోతకీ, ఒక టెలివిజన్ ప్రేక్షకుడికీ వుండదు. రేడియోలో ప్రసారమవుతున్న ఒక ప్రసంగంలో, నాటికలో, లేదా వార్తల్లో భాషాపరమైన దోషాలు దొర్లాయనుకుందాం. ఈ దోషాలను ఎత్తి చూపడానికి అసలవి దోషాలా కాదా అని నిర్ధారించుకోవడానికీ, నిరూపించడానికి ఆ ప్రసారం వింటున్న శ్రోత వద్ద ఆధారం ఏదీ వుండదు. తాను విన్న పదాలలో, పద బంధాలలో లేదా వాక్యాల్లో దోషాలున్నాయని ఆ శ్రోత గ్రహించే సరికే దోషపూరితమైన ఈ వాక్యాలు గడిచిపోతాయి. అసలు ఆ కార్యక్రమమే ముగియవచ్చు. లేదా ఆ ప్రసారమే ముగిసిపోవచ్చు. కేవలం తన చెవిన పడిన మాటల జ్ఞాపకాన్ని బట్టి ఆ కార్యక్రమ నిర్వాహకుడికి లేదా ప్రసార విభాగ నిర్వహకుడుకీ ఆ శ్రోత ఫిర్యాదు చెయ్యవలసి వుంటుంది. టెలివిజన్ కార్యక్రమాలను వీక్షించే ప్రేక్షకులకీ ఇదే విధమైన సమస్య ఉత్పన్నమౌతుంది. అయితే దోషాలను పసిగట్టిన ఆ రేడియో శ్రోత, ఆటెలివిజన్ ప్రేక్షకుడూ తాను వింటున్న కార్యక్రమాన్ని లేదా తానుచూస్తున్న కార్యక్రమాన్నీ రికార్డు చేశారనుకుందాం. అప్పుడు తమ ఆరోపణలను నిరూపించగల ఆధారం వారికి లభిస్తుంది. అయితే ఈ అవకాశం ఎంత మంది శ్రోతలకీ, ఎంతమంది ప్రేక్షకులకీ వుంటుంది? నూటికి పదిమందికి కూడా వుండదు. తాను వినబోయే, చూడబోయే కార్యక్రమంలో భాషా దోషాలు పట్టుకుందామని ముందుగానే ఆడియో వీడియో రికార్డర్లు సిద్ధం చేసుకుని ఎవరూ కూర్చోరు గదా !

ముద్రణా మాధ్యమాలు ఎంతో కాలం నించి వున్నాయి. మన దేశంలోని ఎలక్ట్రానిక్ మాధ్యమాలకంత 'వయసు' లేదు. అందువల్ల తమ మాధ్యమాల ద్వారా జరిగే తప్పులు తెలుసుకోవడానికి ఆ తప్పులు దిద్దుకోవడానికి ఎలక్ట్రానిక్ మాధ్యమాలకు లభించిన అవకాశాలు తక్కువ .

తాము వినియోగిస్తున్న భాష సరియైనదా కాదా అని తెలుసుకోవడానికీ, తాము చేస్తున్న తప్పులు గుర్తించడానికీ, ఆ తప్పులు సవరించుకోవడానికీ ఎన్నేళ్ళు కావాలి. ఎన్ని దశాబ్దాలు కావాలి అని ఎవరైనా అడగొచ్చు. నిజమే జరుగుతున్న తప్పులు తెలుసుకోవడానికీ , ఆదోషాలు సవరించుకోవడానికీ దశాబ్దాల సమయం

అవసరం లేదు. అయితే, ఈ విధమైన సవరణలు సంస్కరణలూ చేపట్టే కృషిలో ముద్రణా మాధ్యమాలకున్న సౌలభ్యమూ సంస్థాగతమైన సౌకర్యమూ ఎలక్ట్రానిక్ మాధ్యమాలకుండవు. ఎలాగంటే – ఒకానొక పత్రికలో కొన్ని పదాలు తప్పు అర్థంలో వాడుతున్నారనుకోండి. ఆ విషయం గురించి అదే పత్రికలోనో అరుదుగానైనా ఇతర పత్రికల్లోనూ తద్విషయ పరిజ్ఞానం కలిగిన పాఠకుల ద్వారా పండితుల ద్వారా విస్తృతమైన చర్చలు జరిగే అవకాశం వుంది. ఈ చర్చల ఫలితంగా ఆయా పదాలను, లేదా పద బంధాలను ఏ అర్థంలో ఏ విధంగా వాడాలన్నది నిర్ధారితమౌతుంది. ఒక మాట ఈ విధమైన నిర్ధారణజరిగిన తర్వాత ఆ పదాన్ని, లేదా పద బంధాన్ని అపసవ్యమైన రీతిలో వినియోగించడానికి సామాన్యంగా ఎవరూ సాహసించరు. ఈ పదాన్ని ఈ అర్థంలో వినియోగించటం తప్పు ఈ వాక్య నిర్మాణం తప్పు అని తెలిసి కూడా అదే తప్పు పదే పదే చేసే పత్రికలూ ఎలక్ట్రానిక్ మాధ్యమాలు వుంటాయి. తెలిసి తప్పులు చేసేవారిని ఎవరూ బాగు చెయ్యలేరు. ఈ విధంగా దోష నివారణకూ దోష సవరణకూ ప్రయత్నించే అవకాశం ఎలక్ట్రానిక్ మాధ్యమాలకూ అంతగా వుండదు.

భాషాపరమైన తప్పులు జరగకుండా చూసుకోవడానికీ జరిగిన తప్పులు దిద్దుకోవడానికీ ముద్రణా మాధ్యమాల (వార్తా పత్రికలు) కుండే అంతర్గత వ్యవస్థ ఎలక్ట్రానిక్ మాధ్యమాలకు సాధారణంగా వుండదు. ఉన్నా అంత పకడ్బందీగా వుండదు. సాధారణంగా రిపోర్టర్ స్థాయిలో, సబ్ ఎడిటర్ స్థాయిలో దోషాలు సవరించడానికి వార్తా పత్రికల్లో అంచెల వారీగా అనేక మంది ఉద్యోగులుంటారు. ఎక్కడికక్కడ కింది స్థాయిలో జరిగే తప్పులు పై స్థాయి వారు దిద్దే అవకాశముంటుంది. పత్రికలోని వివిధ విభాగాలకు వెలుపలి రచయితల నించి వచ్చే వ్యాసాలు కథలూ కవితల వంటి వివిధ రచనలను పరిశీలించి పరిష్కరించడానికీ భాషా పరమైన దోషాలు సవరించడానికీ ఆయా విభాగాలకి ప్రత్యేకంగా సంపాదకులుంటారు. ఇలువంటి ఏర్పాట్లు ఎలక్ట్రానిక్ మాధ్యమాలకుండవా అంటే, వుంటాయి, కాని ఇంత విస్తృత స్థాయిలో వుండవు.

పత్రికా రచనకి సంబంధించిన మౌలిక సూత్రాలు నియమాలు ప్రావీణ్యాన్ని సంపాదించే పద్ధతులూ తెలియజెప్పే గ్రంథాలూ, అటువంటి విషయాలు బోధించే

శిక్షణా సంస్థలూ వున్నంతగా ఎలక్ట్రానిక్ మాధ్యమాలకి సంబంధించి లేవు. ఈ మాధ్యమాలలో అనుభవజ్ఞులైన నిపుణులైన శిక్షకులూ అంతగా లేరు.

పూర్తిగా కాకపోయిన కొంత మేరకైనా ముద్రణా మాధ్యమాల భాషకు భిన్నమైన భాష ఎలక్ట్రానిక్ మాధ్యమాలకు అవసరమనీ, వివిధ రకాల ఎలక్ట్రానిక్ మాధ్యమాలకు (రేడియో, టెలివిజన్, సినిమా , ఇంటర్నెట్ వగైరా) విభిన్నరీతుల్లో భాషని వినియోగించవలసి వుంటుందనీ, ఆయా మాధ్యమాలలో పనిచేసే వారిలో చాలా మందికి ఇప్పటికీ తెలియకపోవటం అత్యంత విచారకరమైన విషయం.

## ప్రసారాలలో పరిణామాలు

తెలుగులో వివిధ రకాల పత్రికల ప్రచురణ అన్నది పందొమ్మిదో శతాబ్దంలోనే ప్రారంభమైనట్టు ఈ విషయమై జరిగిన పరిశోధనలను బట్టి తెలుస్తోంది. అయితే అన్ని విధాలా వార్తా పత్రికలనదగ్గవి మాత్రం ఈ శతాబ్దపు చివరి దశాబ్దంలోనూ ఇరవయ్యో శతాబ్దపు తొలి దశాబ్దంలోనూ ప్రారంభమైనాయి. (తెలుగులో ఏది తొలి పత్రిక, ఏది తొలి వార్తాపత్రిక అన్న విషయంలో వేర్వేరు పరిశోధకులు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేశారు) ఇక ఎలక్ట్రానిక్ మాధ్యమాల మాటకొస్తే, మన దేశంలో ప్రభుత్వ ఆధీనంలో ఏర్పడిన 'ఆకాశవాణి' (All India Radio) 1936 లో వార్తా ప్రసారాలు ప్రారంభించింది. అయితే ఈ ప్రసారాలు పరిమితంగానూ దేశంలోని కొన్ని ప్రాంతాల్లోనూ మాత్రమే జరిగేవి. (అంతకు ముందు ఔత్సాహిక రేడియో క్లబ్బుల–Amateur Radio Clubs–ద్వారానూ, 'ఇండియన్ స్టేట్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్' (Indian State Broad Casting Service) అన్న పేరుగల ప్రభుత్వ సంస్థ ద్వారానూ మరింత పరిమిత స్థాయిలో ప్రసారాలు జరిగేవి.)

1947 లో దేశం స్వతంత్రమయ్యే నాటికి 'ఆకాశవాణి' కి దేశ వ్యాప్తంగా పది కేంద్రాలు మాత్రమే వుండేవి. ఇప్పుడా సంఖ్య సుమారు 250 కి చేరుకుంది. ఇక టెలివిజన్ మాటకొస్తే, దేశంలో తొలి టెలివిజన్ కేంద్రం1959లో ఢిల్లీలో ఏర్పాటైనప్పటికీ దాని ప్రసార పరిధి అతి స్వల్పంగా వుండేది. టెలివిజన్ కార్యక్రమ నిర్మాణ కేంద్ర మొకటి 1965లో ఢిల్లీలో నెలకొన్నప్పటికీ ఆ తర్వాత దాదాపు

రెండు దశాబ్దాల వరకూ దేశ వ్యాప్తమైన టెలివిజన్ ప్రసారాలు జరగలేదు. సుమారు ఇరవయ్యేళ్ళ క్రితం దేశంలోని కొన్ని కేంద్రాలలో ఇంగ్లీషు, హిందీ భాషల్లోనూ, ఆ తర్వాత మరో రెండు మూడు సంవత్సరాలకి తెలుగులోనూ ప్రైవేటు సంస్థల ద్వారా టెలివిజన్ ప్రసారాలుప్రారంభమైనాయి. అప్పటి వరకూ మన దేశంలో 'టెలివిజన్' అంటే ప్రభుత్వ సంస్థ 'దూరదర్శన్' అనే అనుకోవాలి. 'రేడియో' అంటే 'ఆకాశవాణి' అనే అర్థం. ప్రైవేటు టెలివిజన్ ఛానల్స్ ప్రారంభమైన తర్వాత మరికొన్ని సంవత్సరాలకి గాని ప్రైవేటు రేడియో (ఎఫ్.ఎం) ఛానల్స్ ప్రారంభం కాలేదు. గతంలో ప్రభుత్వ సంస్థలుగా వున్న 'ఆకాశవాణి', దూరదర్శన్' లు సుమారు పదేళ్ళక్రితం 'ప్రసారభారతి' అన్న ఉమ్మడి పేరుతో స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలుగా ఏర్పడ్డాయి. (అయినప్పటికీ ఆ సంస్థల పనితీరులో మౌలికమైన మార్పులేవీ జరగలేదు. ప్రభుత్వ నియంత్రణ అనేది ప్రత్యక్షంగా లేనప్పటికీ అవి ఇప్పటికీ ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న సంస్థలే. మిగతా ప్రభుత్వ శాఖల్లో కనిపించే 'బ్యూరోక్రసీ', నిరాసక్తత, నిర్లక్ష్యం, అసమర్థత, అలసత్వం అన్నీ ఇప్పటికీ యథాతథంగా ఈ ప్రసార సంస్థల్లోనూ వున్నాయి.)

ప్రజా బాహుళ్య మాధ్యమాలలో (Mass Media) నిన్నమొన్నటి వరకూ అత్యంత ప్రధాన స్థానంలో వున్న రేడియో (ఆకాశవాణి) ప్రసారాలు తెలుగులో ప్రారంభమైనప్పటినుంచీ కూడా, అప్పటికే ప్రజలకు బాగా అలవాటయిపోయి వున్న వార్తా పత్రికల భాషనే, 'శిష్ట వ్యావహారికం' అన్న పేరుతో, 'ప్రామాణిక భాష' అన్న పేరుతో పుస్తకాలలో పత్రికల్లో వాడుతున్న భాషనే ఆ ప్రసారాలలో వాడుతూ వచ్చారు. ప్రారంభ దశలో కొన్ని ప్రసంగాలలో, మరికొన్ని ప్రత్యేక కార్యక్రమాలలో గ్రాంథిక భాషనూ, ఒక సామాజిక వర్గానికే పరిమితమై 'మడి' భాషనూ వినియోగించేవారు. క్రమంగా ఈ పరిస్థితి కొంత మారినప్పటికీ, వ్యావహారిక భాషా వినియోగం క్రమంగా పెరిగినప్పటికీ శ్రవ్య మాధ్యమానికి పూర్తిగా అనుకూలమైన, అవసరమైన భాషను ఇప్పటికీ 'ఆకాశవాణి' అలవర్చుకున్నదా అంటే అవునని గట్టిగా చెప్పలేం. 'ఆకాశవాణి' అవతరించిన తర్వాత దాదాపు నాలుగు దశాబ్దాలకి అంకురించిన 'దూరదర్శన్' ఆదినుంచీ తన ప్రసారాలకు కూడా 'ఆకాశవాణి' భాషనే అనుసరిస్తూ వచ్చింది తప్ప, దృశ్య మాధ్యమానికి అవసరమైన ప్రత్యేక భాషను

రూపొందించుకోలేకపోయింది. 'ఆకాశవాణి' లో జరిగినట్టే 'దూరదర్శన్' లో కూడా భాషా విషయంలో క్రమానుగతంగా కొన్ని మార్పులు జరిగినప్పటికీ – ఇప్పటికీ 'దూరదర్శన్' ప్రసారాల్లో వాడుతున్న భాష పూర్తిగా దృశ్యమాధ్యమానుకూలమేనని చెప్పలేం.

ఈ నూతన మాధ్యమాల పరంపరలో వీటి పరిణామక్రమంలో ఏర్పడిన ఒక విచిత్ర విషాద పరిస్థితి ఏమిటంటే భాషా విషయంలో వార్తా పత్రికల్ని అనుసరిస్తూ వచ్చిన 'ఆకాశవాణి' ఆయా పత్రికా భాషల్లోని అనర్థాలనూ అనుచిత ప్రయోగాలనూ స్వీకరిస్తే, 'ఆకాశవాణి' ని అనుకరిస్తూ వచ్చిన 'దూరదర్శన్' ఆ దోషాలన్నిటినీ తానూ స్వీకరించింది.

రేడియో, టెలివిజన్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాల ప్రసక్తి వచ్చినపుడు గుర్తు పెట్టుకోవలసిన ముఖ్య విషయం మరొకటుంటుంది. మన దేశంలో నిన్న మొన్నటి వరకూ ప్రధాన ప్రసార మాధ్యమాలుగా వున్న (దేశ వ్యాప్తమైన నెట్‌వర్క్ విషయంలో ప్రైవేట్ సంస్థలకంటే ఇప్పటికీ 'ఆకాశవాణి', 'దూరదర్శన్' లే అగ్రస్థానంలో వున్నాయి.) 'ఆకాశవాణి', 'దూరదర్శన్' లు చాలా కాలం పాటు ప్రభుత్వ యాజమాన్యంలోనూ, ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థలుగానూ పనిచేస్తూ వుండటం చేత మిగతా విషయాల్లో మాదిరిగానే భాషా విషయంలో కూడా ఎంతో కొంత 'మితవాద ధోరణి' ని (Conservative Approach) అనుసరిస్తూ వచ్చాయి. ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులు అలవర్చుకోవడానికీ, కొత్త ప్రయోగాలు చెయ్యడానికీ ఈ మితవాద ధోరణి అడ్డు తగులుతుంది. బాగా నలిగిన పాత దారినే నడిస్తే ప్రమాదం వుండదు గదా అనే ఈ ధోరణి ప్రగతి నిరోధక మనుకున్నప్పటికీ, దీని వల్ల కొత్త తప్పులేమీ జరగవు. 'ఆకాశవాణి', 'దూరదర్శన్' ప్రసారాల భాషా విషయంలో సరిగా ఇదే జరిగింది! భాష విషయంలో ముద్రణా మాధ్యమాలలో ముఖ్యంగా వార్తా పత్రికలు చేసిన ప్రయోగాలు, సాహసాలు, దుస్సాహసాలు ఆకాశవాణి, దూరదర్శన్‌లు చేయ్యలేదు. కొత్త మార్పులేవీ లేనప్పుడు కొత్త తప్పులూ వుండవుగదా!

ఎలక్ట్రానిక్ మాధ్యమాల రంగంలో నిన్నమొన్న ప్రవేశించిన ప్రైవేటు సంస్థలు మాత్రం వచ్చీరాగానే విచ్చలవిడిగా ప్రసారాలు ప్రారంభించాయి. భాషా వినియోగ

విషయంలోనే ఈ విచ్చవిడితనం ముందుగా ప్రవేశించి, క్రమంగా పెరిగి, ఇప్పుడు అన్ని హద్దులూ మీరి పోతుంది! ప్రసారాంశాన్ని బట్టి ఈ పరిస్థితిలో మార్పులుండవచ్చు గాని, సాధారణంగా అన్ని అంశాల్లోనూ భాషా వినియోగ విధానాలు అసంతృప్తికరంగానూ, కొన్ని సందర్భాల్లో అభ్యంతరకరంగానూ వుంటున్నాయి. ముఖ్యంగా వార్తాప్రసారాల విషయంలో ప్రైవేట్ టెలివిజన్ సంస్థల వారు వాడుతున్న భాష– అనవసరమైన పదాలతోనూ, అత్యుత్సాహంతో, అనుభవ రాహిత్యంతో జరిపే అపసవ్య ప్రయోగాలతోనూ శ్రోతల, ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించేట్టుగా వుంటోంది. ఇవ్వాళ ఏ ప్రైవేట్ టీవీ ఛానల్ చూసినా సినిమాలు, సినిమా సంబంధమైన కార్యక్రమాలూ, సీరియల్సే ప్రధానాంశాలుగా వుంటున్నాయి. దేశంలో టెలివిజన్ ప్రసారాలు ప్రారంభమై ఇన్ని దశాబ్దాలు గడిచినప్పటికీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో సినిమాలపై ఆధారపడకుండా పూర్తిగా స్వతంత్రమైన, సృజనాత్మకమైన, భావుకతతో కూడిన కార్యక్రమాలు రూపొందించుకునే శక్తి ఈనాటికీ ప్రసార సంస్థలు సమకూర్చుకోలేకపోయాయి. అతి జాగ్రత్త వల్ల, మార్పులూ, ప్రయోగాలూ జరపడానికి ఉండే జంకువల్లా ప్రజలకు ఏది అవసరం, ఏది ఆసక్తికరం అనే ఆలోచనలేని మూస కార్యక్రమాల వల్లా దూరదర్శన్ ప్రసారాలు తమ ప్రాధాన్యతనూ ప్రయోజనాన్నీ కోల్పోతూ వుండగా – అత్యుత్సాహం వల్లా ఏదో విధంగా ప్రేక్షకుల్ని ఆకర్షించి, వ్యాపార ప్రకటనలు పెంచుకుని లాభాలు మూటగట్టుకునే ప్రయత్నంలో ఉచితానుచితాలు విస్మరించటం వల్లా, ప్రైవేటు టెలివిజన్ ప్రసారాలు చెడుతున్నాయి. ఎక్కడైనా ఒకటి, రెండు కార్యక్రమాలు బాగుండవచ్చు. ఏదో ఒక ఛానల్ కాస్త మెరుగైన రీతిలో బాధ్యతయుతమైన ప్రసారాలు జరపవచ్చు. అటువంటి సందర్భాలు అతి స్వల్పం.

'వ్యావహారికం',' శిష్ట వ్యావహారికం', 'మాండలికం' వంటి భాషా భేదాల గురించి ఇంతకు ముందు విపులంగా చర్చించుకున్నాం గనుక – రేడియో, టెలివిజన్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో ప్రస్తుతం వాడుతున్న తెలుగు భాష ఏ కోవకి చెందుతుంది? అని ఎవరైనా అడగవచ్చు. ఈ ప్రశ్నకి సూటిగా ఒక్కమాటలో సమాధానం చెప్పడమన్నది సాధ్యం కాదు. ఎందువల్లనంటే ఇప్పటి మాధ్యమాలలో వాడుతున్న భాషా స్వరూపం ఇదమిత్థంగా ఇలాంటిదని చెప్పలేం. రూపం చెదిరి,

అర్థం చెడి, కొన్ని సందర్భాలలో అర్థమేలేని రీతిలో కలగాపులగపు భాష ఎక్కువగా వాడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు టెలివిజన్, రెడియో ఛానల్స్‌లో ఆ విధమైన నియమరహిత, నిర్జీవ, నైరూప్య భాషా వినియోగం విశృంఖలంగా జరగుతోంది. 'ఆకాశవాణి', 'దూరదర్శన్' ప్రసారాలు ఈ విషయంలో చాలా మెరుగు. వాస్తవానికి కార్యక్రమ స్వభావాన్ని బట్టి, అందులోని విషయాన్ని బట్టి భాషా స్వరూపం మారుతుంది. మారాలి. ఈ రకమైన విచక్షణ కూడా ప్రైవేటు ఎలక్ట్రానిక్ మాధ్యమ ప్రసారాల్లో స్వల్ప స్థాయిలోనే కనిపిస్తోంది. ముఖ్యంగా వార్త ప్రసారాల్లో విచక్షణ కూడా ప్రైవేటు ఎలక్ట్రానిక్ మాధ్యమ ప్రసారాల్లో స్వల్ప స్థాయిలోనే కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రసారాల్లోనూ, వివిధ కార్యక్రమాల సమర్పకులు, ('ప్రజెంటర్' - 'స్పాన్సర్' కాదు) సంధానకర్తలూ (Anchors) వాడే భాషలోనూ ఈ విశృంఖలత్వం ఎక్కువగా వుంటోంది.

సాధారణ వార్తలకి కూడా రంగులు పులమటం. వార్త ఉన్నదున్నట్టు కాక దానికి వ్యాఖ్యానాన్ని జోడించటం కొన్ని సందర్భాల్లో అసలు వార్తకంటే వ్యాఖ్యలే ఎక్కువగా వుండటం, ప్రతి వార్తనీ సంచలనాత్మకం చెయ్యాలని ప్రయత్నించటం - ఇలాంటి వన్నీ ఇటీవలి కాలంలో వార్తా పత్రికల్లో అధికంగా కనిపిస్తున్న అవాంఛనీయ పరిణామాలు. ఇటువంటి పరిణామాల పర్యవసానంగా అనవసరమైన విశేషణాలు, అర్థరహితమైన పదప్రయోగం, తప్పుడు అర్థంలో పదాలు వాడటం, పరభాషా పదాలు అసందర్భంగా వినియోగించటం జరుగుతోంది. ప్రైవేటు టెలివిజన్ ఛానల్స్ అన్నీ ఈ అపసవ్య ప్రయోగాలన్నిటినీ యథాతథంగాప్రసారం చేస్తున్నాయి.

ఇక 'యాంకర్స్' (Anchors) అనబడే కార్యక్రమ సమర్పకులూ- సంధానకర్తలూ- వాడే భాష మరింత విశృంఖలంగా, మరిన్ని దుష్ప్రయోగాలతో, మరింత దుస్సాహసంగా వుంటోంది. వీళ్ళు మాట్లాడే మాటలకి సాధారణంగా ఒక 'స్క్రిప్టు' (Script) అనేది వుండదు గనుక, అవసరాన్ని బట్టి ఆశువుగా, సందర్భోచితంగా మాట్లాడాలి. గనుక, కేవలం వారి ప్రతిభా వ్యుత్పత్తులను బట్టీ, భాషా పరిజ్ఞానాన్ని బట్టీ వారి మాటలుంటున్నాయి. కార్యక్రమం ఏదైనా, చక్కగా సందర్భోచితంగామాట్లాడి ప్రేక్షకుల్ని ఆకర్షించి అలరించగల 'యాంకర్స్' వున్నారు. అయితే అలాంటి వారు అతి తక్కువగా వున్నారు.

తెలుగులో ప్రైవేటు రేడియో (F.M ఛానల్స్) ప్రసారాల్లో వినియోగించే భాష గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. టెలివిజన్ ఛానల్స్‌లో యాంకర్స్ వున్నట్టే ఈ ఎఫ్.ఎం. ఛానల్స్‌లో రేడియో జాకీ (Radio Jockey) లుంటారు. వీళ్ళు చేసే పని ఏమిటంటే ఎంత సేపూ ఎడతెరిపి లేకుండా నోటికి వచ్చినట్టల్లా మాట్లాడుతూ వుండటం. 'వాగుతూ' వుండటమన్నది ఇక్కడ వాడాల్సిన సరైన మాట. ఈ 'వాగుడు' కి ఏ విధమైన నియమాలు, హద్దులూ వుండవు. అర్థమూ వుండనక్కర్లేదు. వీళ్ళు మాట్లాడే భాషకి నిర్దిష్ట రూపము, స్వభావమూ వుండవు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ వంటి అన్ని భాషలూ, అన్ని 'యాస' లూ, అన్ని మాండలికాలూ కలగలిపిన సంకర, వంకర భాష అది! అన్ని విధాలా కలుషితమైన భాష అది!

ఇక మాండలికం మాటకొస్తే – రేడియో టెలివిజన్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో అప్పుడప్పుడూ కొన్ని సందర్భాలలో కొన్ని కార్యక్రమాలలో మాండలిక భాష వాడుతున్నారు. 'వర్గ మాండలికం' కంటే 'ప్రాంతీయ మాండలికం' ఎక్కువగా వాడుతున్నారు. అయితే – చాలా సందర్భాలలో ఈ మాండలిక భాషా వినియోగమన్నది అపసవ్యమైన రీతిలో జరుగుతోంది. ఉన్నది ఉన్నట్టుగా కాక, అపభ్రంశ రూపాలతో ఆ మాండలిక స్వరూపాన్ని చెడగొడుతున్నారు. ఇటువంటి దుర్వినియోగం కూడా ప్రైవేటు ఛానల్స్‌లోనే ఎక్కువగా జరుగుతోంది.

మన దేశంలో రేడియో, టెలివిజన్ వంటి ప్రజా బాహుళ్య మాధ్యమాలు (Mass Media) ఎంతగా పెరిగి, అధిక సంఖ్యాకులకు అందుబాటులోకి వచ్చినప్పటికీ ప్రేక్షకుల్లో, ముఖ్యంగా సామాన్య ప్రేక్షకుల్లో 'సినిమా'కి వున్న ప్రాధాన్యం ఇసుమంతయినా తగ్గలేదు. ప్రపంచంలో మిగతా అన్ని దేశాల కంటే అధికంగా మన దేశంలో చలనచిత్రాలు తయారవుతున్నాయి. చలనచిత్రాల సంఖ్య విషయంలో – దేశంలో ద్వితీయ, లేదా తృతీయ స్థానం తెలుగు చిత్రాలదే. కేవలం సంఖ్యా పరంగానే కాక, సాంకేతికంగా కూడా తెలుగు చిత్రాలు ఎంతో అభివృద్ధి సాధించాయి. అయితే, భాష విషయంలో ఈ అభ్యుదయం కనపడదు సరిగదా, నానాటికీ ప్రమాణాలు పతనమవుతున్నాయి. విలువలు నశిస్తున్నాయి. తెలుగులో నిర్మితమయ్యే చలన చిత్రాల్లో కనీసం నూటికి ముప్పాతిక సినిమాల్లో వాడుతున్న భాష

అధమస్థాయిలో, అభ్యంతరకరమైన రీతిలో వుంటోంది. చవకబారు మాటలూ, అశ్లీల ధ్వనులూ, ద్వంద్వార్థాలూ మాత్రమేకాదు – 'బూతు' అనిపించే మాటలు కూడా నిస్సంకోచంగా, విశృంఖలంగా వాడుతున్నారు. స్త్రీ పాత్రల చేతా, బాల పాత్రల చేతా కూడా ఆ మాటలు పలికిస్తున్నారు.

'ఇంటర్‌నెట్' (Internet) అనేది ఇటీవలి కాలంలో ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో చోటు చేసుకుని, నానాటికీ విస్తృతమౌతున్న వ్యవస్థ. అయితే రేడియో, టెలివిజన్ వంటి సాధనాలు ప్రజలకి – ముఖ్యంగా సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చినంతగా కంప్యూటర్ ఇంకా రాలేదు గనుక, కంప్యూటర్ ద్వారా 'వెబ్‌సైట్లు' (Web Sites) వెబ్ పత్రికలు (Web Magazine), 'బ్లాగులు' (Blogs) వంటి సౌకర్యాలను వినియోగించుకోవటమనేది మన దేశంలో ఇంకా అంత విస్తృతస్థాయిలో జరగటం లేదు.

ప్రస్తుతం నడుస్తున్న ప్రధాన పత్రికలన్నీ ఇంటర్నెట్‌లో యథాతథంగానో, కొంతమేరకు తగ్గించో తమ పత్రికలను ప్రదర్శిస్తున్నారు. ఇంటర్నెట్ ఎడిషన్ల కోసం ప్రత్యేకంగా కొంత 'ఎడిటింగ్' జరిగినప్పటికీ ఆయా పత్రికల్లోని వార్తలు, వ్యాసాలు, ఇతర అంశాలు భాషలో మటుకు మార్పులేవీ వుండటం లేదు.'వెబ్‌సైట్లు', 'బ్లాగు' ల వంటి వాటి ద్వారా సినిమాలు, సాహిత్యం వంటి విషయాలపై చర్చలు జరుగుతున్నా ఇలాంటి వాటికి వినియోగించే భాషలో ప్రత్యేక ప్రమాణాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. అలాగే వెబ్ పత్రికలలో వాడే భాష కూడా మామూలు పత్రికల్లో వుండేదే తప్ప ప్రత్యేకమైనదికాదు.

రేడియో, టెలివిజన్, సినిమా వంటి ప్రధాన ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో ప్రస్తుతం మనకు వినిపిస్తున్న, కనిపిస్తున్న (టెలివిజన్‌లో 'స్క్రోల్' (Scroll) రూపంలోనూ ఇతర విధాలా కనిపించే భాష) తెలుగుభాష సత్పరిణామాల కంటే దుష్పరిణామాలకే ఎక్కువగా లోనుకావడమన్నది విచారకరమైన విషయం. సినిమా అన్నది ఒక ప్రత్యేక పరిశ్రమ, లాభార్జనమే ప్రధాన ధ్యేయంగా గల వాణిజ్య పరిశ్రమ. ప్రేక్షకుల్ని ఆకర్షించి, ఆకట్టుకోవడమే ప్రధానమని భావించడం తప్పుకాదు గాని, అందుకోసం సినిమాల్లో చూపించే దృశ్యాల్లో గాని, వినిపించే మాటలు, పాటల్లో

గాని ఏ విధమైన నియమాలు, ప్రమాణాలు పాటించనక్కర్లేదనుకోవడం అవివేకం. ఆత్మహత్యా సదృశ్యం.

ప్రైవేటు సంస్థల యాజమాన్యంలో నడిచే రేడియో, టెలివిజన్ ఛానల్స్ కూడా లాభార్జనే ముఖ్యమనుకునే పరిశ్రమలే అనుకున్నప్పటికీ – లక్షలాది, కోట్లాది ప్రజలకు సమాచార, వినోద, విజ్ఞానాలను అందించే ప్రసార మాధ్యమాలుగా ఆ ప్రజల పట్ల గల బాధ్యతను యాజమాన్యాలు, ఆయా సంస్థల కోసం పనిచేసే అధికారులు, సిబ్బంది, రచయితలు, కళాకారులు విస్మరించకూడదు. అదే విధంగా ప్రభుత్వ యాజమాన్యంలో లేదా ప్రభుత్వరంగ సంస్థలుగా పనిచేసే ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో కూడా పనితీరునూ, కార్యక్రమ స్థాయినీ, నాణ్యతనూ, ప్రమాణాలనూ పెంచడానికి గట్టి ప్రయత్నాలూ, నిరంతర కృషీ జరగాలి, అప్పుడే ఆయా మాధ్యమాలలోని మిగతా అంశాలతో పాటు వాటిలో వినియోగించే భాష కూడా మెరుగుపడుతుంది. సక్రమమైన సముచితమైన రీతిలో వినియోగపడుతుంది.

చివరిగా ఒక్కమాట. మంచి సినిమాకి మాటలక్కర్లేదు. దృశ్యమే సినిమాభాష. అదే విధంగా టెలివిజన్ కార్యక్రమాలకి కూడా (వార్తలు, చర్చలు, ఇంటర్వ్యూల వంటివి మినహా) మాటలకంటే దృశ్యాలే ప్రధానం, ప్రాణం. ఇక రేడియో కార్యక్రమాలకి (సంగీతం, సౌండ్ ఎఫెక్ట్ – Sound Effects– వంటివి మినహా) మాటలు చాలా అవసరం. ఆ మాటలు సందర్భోచితమైన సముచితమైన భాషారూపంలో వినిపించడం మరీ అవసరం.

వ్యాసకర్త – **సుప్రసిద్ధ రచయిత, రేడియో జర్నలిస్టు**

# పత్రికల పదసృష్టి

*- గోవిందరాజు చక్రధర్*

మానవ జీవన గమనం మాదిరే భాష కూడా నిత్య పరిణామశీలం కలది. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి, ఆర్థిక సంస్కరణల ప్రభావం కారణంగా ప్రపంచ భాషల్లో కొత్తపదాలు, భావనలు నిరంతరం వచ్చి చేరుతున్నాయి. ఇంటర్నెట్ అనుసంధానంగా అందుబాటులోకి వచ్చిన యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విటర్ వంటి పలు సామాజిక వేదికలు కొత్త పలుకుబళ్లకు, వ్యక్తీకరణలకు బాట వేస్తున్నాయి. షేర్‌లు, లైకులు, కామెంట్లు, పోస్టులు నిత్యవ్యవహారాలయ్యాయి.

ఏ భాష అయినా జీవనది ప్రవాహం. నదీ గమనంలో అనేకానేక నీటి పాయలు, కల్మషాలు వచ్చి చేరుతున్నట్లే, జీవద్భాషా ప్రవాహంలో కూడా కొత్త పదాలు, అపభ్రంశాలు కలుస్తుంటాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా భాష ఎదిగి అండగా 'నేనున్నానని' అంటుందేగానీ ఆ భాష మాట్లాడే ప్రజలను ఇబ్బంది పెట్టదని, కొత్త పదాలను కొన్నిసార్లు సహజ రూపమన్నంతగా ఒడిలోకి తీసుకోనూవచ్చు. ఆయా ప్రాంతాల ప్రజల అవసరాలను బట్టి, భౌగోళిక వాతావరణ స్థితిగతులను బట్టి కొన్ని భాషల్లో కొన్ని వ్యక్తీకరణలకు ఎక్కువ పదజాలం అందుబాటులో ఉండవచ్చు. ఈ పరిస్థితులు లేని ప్రాంతాల్లో అంతటి పరిపుష్ట

పదజాలం ఉండదు. హిమాలయ ప్రాంతాల్లో నివసించే కొన్ని తెగల ప్రజలు మాట్లాడే భాషల్లో మంచుకూర్పులకు సంబంధించి స్వల్ప ఛాయా భేదాలను చెప్పటానికి కావలసినన్ని పదాలున్నాయి. తెలుగులో పొగమంచు, గూడమంచు తర్వాత మాటలను వెతుక్కోవాలి. హిమాలయాల దాకా ఎందుకు? మన ఆవకాయ, మాగాయ, మెంతికాయ, గుత్తికాయ, నీళ్లావకాయ, పెసరకాయ, వెల్లుల్లి ఆవకాయ, ముక్కల పచ్చడి, రోటి పచ్చడి, కొబ్బరి మామిడి పచ్చడి వగైరా వివిధ రకాల పచ్చళ్లకు ఇంగ్లీషులోనో వాటి వినియోగం లేని భాషల్లోనో పదాలు దొరకవు.

తెలుగునాట గ్రాంథిక, వ్యావహారిక భాషా రీతులను దాటుకుని చాలా ముందుకు వచ్చాం. పత్రికాభాష అనే ప్రత్యేక భాషారీతిని కూడా గుర్తిస్తున్నాం. అనేక విశ్వవిద్యాలయాలు, పరిశోధనలకు వాడదగిన ప్రమాణభాషగా పత్రికాభాషకు పట్టం గట్టాయి. ప్రచార సాధనాల విస్తృతి, వ్యాప్తి కారణంగా ప్రజలపై పత్రికలు, టీవీల భాషల ప్రభావం కూడా ప్రబలంగానే ఉంది.

ప్రచార సాధనాలు సమాచార నివేదన కోసం ఓ ప్రత్యేక తరహా పదజాలం ఏర్పరచుకుని వాడుతున్నాయి. ఘాటుగా విమర్శించారు, ఉద్ఘాటించారు, ఉటంకించారు, ఉల్లేఖించారు, విశ్లేషించారు వంటి పదాలు ప్రజల సామాన్య వ్యవహారంలో విన్పించవు. కానీ రాజకీయ నాయకులు సహా అనేక మందిపై పత్రికాభాష ప్రభావం కనిపిస్తోంది. నేతల ప్రసంగాల్లో, ప్రకటనల రాతల్లో ఈ పదాలు విన్పిస్తున్నాయి, కన్పిస్తున్నాయి. "ఈ ప్రకటనను తాను ఖండిస్తున్నా" నంటాడోనేత, "తీవ్రవాదులు ప్రధాన జనజీవన స్రవంతిలోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటాడు మరో నాయకుడు.

అక్షరాస్యత ఇంతలేని రోజుల్లో సినిమాల మాటల ప్రభావం కన్పించేది. ఇప్పటికీ ఆ ధోరణి కొనసాగుతూనే ఉంది. సినిమా రచయితలు కూడా ప్రజల వ్యక్తీకరణలకు పట్టం కడుతుండడంతో సినిమాల ద్వారా అవి మరింత విస్తృత ప్రజానీకానికి చేరుతున్నాయి. అస్మదీయులు, తస్మదీయులు, లైట్‌తీస్కో, ఫేస్ టర్నింగిచ్చుకో లాంటి పదాలు ఉదాహరించవచ్చు.

## కొత్త పదకల్పన:

ముందే చెప్పుకున్నట్లు శాస్త్రసాంకేతిక రంగ అభివృద్ధి, ఆర్థిక సంస్కరణల ఫలితంగా అనేక కొత్త భావనలు, పదాలు వెల్లువలా ముంచెత్తుతున్నాయి. వీటికి తెలుగులో సమాన పదాలను రూపొందించే బాధ్యతను కొంతకాలంగా ఈనాడు పత్రిక భుజానికెత్తుకుంది.

కొత్త పదాలను పత్రికలు సృష్టించడం అనేది పూర్వం నుంచీ ఉన్నదే. నార్ల వేంకటేశ్వరరావు డ్రెడ్జర్ కు ప్రజల పలుకుబడి నుంచి గ్రహించి తవ్వోడ అనే పదాన్ని ఉపయోగించారు. నాన్ ఎలైన్డ్ మూవ్‌మెంట్ కు ప్రాముఖ్యం ఉన్న రోజుల్లో అలీనోద్యమం అనే పదాన్ని స్థిరపరచుకున్నాం. ఆంధ్రపత్రిక వారు విబంధ ఉద్యమం అని రాసేవారు. అలీనోద్యమం కంటే విబంధ ఉద్యమం మరింత భావ స్ఫోరకంగా ఉన్నా నిలబడలేకపోయింది. బ్లూస్టార్ ఆపరేషన్‌కు చేసిన నీలి నక్షత్ర యుద్ధం కూడా నిలబడలేదు. ఆయా పత్రికల ప్రాచుర్యం కూడా భాషారీతులను తీర్చిదిద్దడంలో పాత్ర పోషిస్తోంది. సర్కులేషన్ ఎక్కువగా ఉన్న పత్రికలో వచ్చిన పదమే మంచి చెడ్డల ప్రసక్తి లేకుండా ప్రజల నాల్కలపై నడయాడుతోంది. సమష్టి సరైన రూపమే అయినా పత్రికలు వాడకం వల్ల 'సమిష్టి'గా చలామణి అవుతోంది.

పత్రికలోని ఉపసంపాదకుడు అర్ధరాత్రి వేళ వడివడిగా వార్తలను అనువదిస్తూ అప్పటికప్పుడు కొత్తపదాన్ని ఆ క్షణంలో బుద్ధికి తోచిన రీతిలో ప్రయోగించి ప్రజలమీదకు సంధిస్తాడు. ఆ మరునాడు తాపీగా కూచుని ఆలోచించినపుడు ఇతరులకు అంతకంటే మెరుగైన పదం స్ఫురించవచ్చు. కానీ, పత్రికలో వచ్చేసింది కనుక ఆ పదమే ప్రజల్లోకి చొచ్చుకు వెళుతుంది.

'ఈనాడు' ఈ పదాలను వాడుతూ ప్రాచుర్యంలోకి తెస్తోంది.

| | | |
|---|---|---|
| మొబైల్ ఫోను | – | చేవాణి, చరవాణి |
| ఇంటర్నెట్ | – | అంతర్జాలం |
| వైఫై | – | నిస్తంత్రీజాలం |
| స్క్రాఫ్‌బుక్ | – | ఖాళీ పుస్తకం |

| | | |
|---|---|---|
| ప్రొటోకాల్ | - | శిష్టాచారం |
| ఫుడ్ సప్లిమెంటు | - | సంపూరకాహారం |
| కంట్రాక్టర్ | - | గుత్తేదారు |
| ఫైలు | - | దస్త్రం |

ఈ పదాలను ప్రజలు తమ వాడకంలో ఉపయోగించే అవకాశాలు తక్కువ కనుక ప్రయాసపడి తెలుగు పదాలను సృష్టించటం వృధాప్రయాస అని వాదించే వారున్నారు. మొబైల్ ఫోనుకు చేవాణి, చరవాణి అని ఎవరూ వాడటం లేదు. వాడినా కృతకంగా ఉంటుందని వారు భావిస్తున్నారు. నిజానికి ఏ కొత్త పదమైనా మొదటిసారి విన్నపుడు చెవికి ఇంపుగా అన్పించదు. ప్రయోగానికి వీలుకాదనో, వినసొంపుగా లేదనో ఆ పదాన్ని తిరస్కరించటం సబబుకాదు.

ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో భాషాభిమానం ఎక్కువ. జాతీయ, అంతర్జాతీయ వేదికల నుంచి కూడా తమిళంలో మాట్లాడటానికి వెనకాడరు. ఇంగ్లీషులో ప్రసంగించగలిగి వుండీ కేవలం మాతృభాష మీద ఉన్న అభిమానంతో తమిళంలోనే మాట్లాడతారు. పార్లమెంటు ప్రసంగాల్లోనూ దీన్ని చూడవచ్చు. కొత్తగా ప్రవేశిస్తున్న పదాలకు తమిళ సమానార్థకాలను తయారు చేసుకుని విరివిగా వాడుతున్నారు. ఇది హర్షించదగిన విషయమే.

ఇంగ్లీషు నుంచి వచ్చి చేరుతున్న పదాలను యథాతథంగా ఉపయోగిస్తూ వెళితే కొంతకాలం తర్వాత మన భాష మనది కాకుండా పోయే ప్రమాదం ఉంది. మనమాట , పలుకుబడి, వ్యవహారాలకు విఘాతం కలుగుతుంది. తెలుగు పదసృష్టి కేవలం మౌఖిక భాషావసరాలకే కాక లిఖిత భాషావసరాలకు కూడా తప్పనిసరి ఇంగ్లీషులోని వివిధ శాస్త్రాలను, విషయాలను తెలుగులోకి తర్జుమా చేసుకోవలసి వచ్చినపుడు సమానపదం అవసరం ఏర్పడుతుంది.

ఈ విషయంలో పత్రికల కృషి మరింత సార్థకం కావాలంటే ఈ దిగువ అంశాలపై భాషా విభాగాన్ని నెలకొల్పాలి.

1. కొత్త పదాలను సృష్టించి మెరుగైన రూపాన్ని ఖాయపరచటానికి ప్రతి పత్రికలో భాషా విభాగాన్ని నెలకొల్పాలి.

2. ఖరారు చేసిన పదాలను తమ పత్రికలోని వివిధ ప్రచురణ కేంద్రాలలోని సిబ్బంది అదే రూపంలో వాడేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం నిర్ణీత కాలవ్యవధుల్లో భాషా సమాచార లేఖలను పంపవచ్చు. శైలీ పత్రాలను రూపొందించుకోవచ్చు.

3. వివిధ తెలుగు పత్రికల సంపాదకులు సమావేశమై అన్ని పత్రికల్లో ఒకే రీతిలో పదాలు వాడేందుకు నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో ప్రెస్ అకాడమీ వంటి సంస్థలు చొరవ తీసుకుని సమన్వయ బాధ్యత వహించవచ్చు.

4. ప్రజలలో ఇప్పటికే వాడుకలో ఉన్న రూపాలను స్వీకరించి విరివిగా ప్రచారంలోకి తేవచ్చు. అది మాండలిక పదమైనా సరే, బాగుందనుకున్నపుడు సాధారణీకరణం చేయటం అవసరం. రైల్వేసిగ్నల్‌కు రెక్కమాను అనే వ్యవహారం కొన్ని ప్రాంతాల్లో ఉంది. ఆ పదాన్ని వాడటంలో అభ్యంతర మెందుకు ఉండాలి? అలాగే ఫ్లై ఓవర్ కు పైదారి, పై బాట అనే రూపాలను ప్రజలు ఉపయోగిస్తున్నారు. ఇలాంటి వాటిని సేకరించి ప్రాచుర్యంలోకి తేవలసిన బాధ్యతను పత్రికలు, టీవీలు స్వీకరించాలి.

5. వృత్తి మాండలికాలు, కుల మాండలికాల నుంచి కూడా సాధారణీకరించదగ్గ పదాలను ఎంచుకోవచ్చు.

మన సంస్కృతి, సంప్రదాయాలు అన్నింటికీ మూలం మన భాషే. ఆ భాష పట్ల నిరాదరణ చూపటమంటే – మన సంస్కృతి, సంప్రదాయాల నుంచి దూరం మళ్లటమే. తెలుగు జాతి అస్తిత్వం తెలుగు భాషతోనే ముడిపడి ఉందన్న వాస్తవం మరవవద్దు.

వ్యాసకర్త – ***సీనియర్ జర్నలిస్టు, రచయిత***

# ఉద్యోగంగా మారిన పాత్రికేయ వృత్తి

**- కె.ఎల్.రెడ్డి**

జర్నలిజం రంగం ఉపాధి నిర్వచనం పరిధిలోకి రాదు. వృత్తి నిర్వచనం పరిధిలోకి వస్తుంది. ఉద్యోగం కానీ వృత్తికానీ ఉపాధికి తోడ్పడేవే. ఉదర పోషణకు ఉపయోగపడేవే. అయితే, ఈ రెండు రంగాల మధ్య వ్యత్యాసం వుంది. గానుగెద్దు మాదిరి నిత్యం అలవాటుగా ఒకే పద్ధతిలో చేసే దినచర్య ఉద్యోగం. అంటే, రొటీన్ వర్క్. ఎప్పటికప్పుడు సరికొత్త పద్ధతులను మేళవిస్తూ ఉత్పత్తి నాణ్యతను పెంచేది వృత్తి.

జర్నలిజం వృత్తి గుమస్తా ఉద్యోగం వంటిది కాదు. మూస పోసినట్టుండే పూర్వపు దస్తావేజులను యథాతథంగా కాపీ చేస్తూనే అవసరానికి తగ్గట్టు అక్కడక్కడా కొద్దిపాటి మార్పులు చేసుకుంటూపోతాడు గుమస్తా. జర్నలిస్టు ఏవో కొన్ని పడికట్టు పదాలతో వార్తలు రాసి చేతులు దులిపేసుకుంటే వాటిలో నాణ్యత లోపిస్తుంది. అవి పాఠకులను ఆకట్టుకోలేవు.

జర్నలిజం రంగంలోకి వచ్చేవారికి భాషా పరిజ్ఞానం ఉండి తీరాలి. విషయ పరిజ్ఞానమూ తప్పనిసరి. భాషా పరిజ్ఞానంతో పాటు విషయ పరిజ్ఞానం కూడా ఉంటేనే జర్నలిస్టు తన వృత్తిలో రాణించగలుగుతాడు. తాను రాసే వార్తలలో

నాణ్యతను పెంచుకోగలుగుతాడు. ఈ రోజుల్లో జర్నలిజం రంగంలోకి వచ్చే వారిలో ఈ రెండు సుగుణాలలో ఏ ఒక్కటి పరిపూర్ణంగా ఉండటం లేదు. ఫలితంగా దినపత్రికల వార్తలలో నాణ్యత లోపిస్తున్నది. తెలుగుదనం లుప్తమవుతున్నది. తెలుగు నుడికారమూ కనిపించడం లేదు. జర్నలిజాన్ని వృత్తిగా కాక ఉద్యోగంగా భావించడం వల్లనే ఈ దురదృష్టకర పరిణామం సంభవిస్తున్నది.

## తెలుగు సంప్రదాయానికి విరుద్ధమైన ధోరణులు

అరకొర భాషా పరిజ్ఞానంతో రాసే వార్తలలో తెలుగు సంప్రదాయానికి విరుద్ధమైన పోకడలు పొడసూపుతున్నాయి. తెలుగు భాషలోని కమ్మదనం అడుగంటిపోతున్నది. దినపత్రికలు చదివే పాఠకుల దిమ్మదిరిగిపోతున్నది. ఉదాహరణకు–

**'చేతుల మీదుగా'**

**ముఖ్యమంత్రి 'చేతుల మీదుగా' క్రీడా జ్యోతిని అందుకున్నారు** (ఇది తెలుగు వాక్యం కాదు.)

ముఖ్యమంత్రి నుంచి క్రీడా జ్యోతిని అందుకున్నారు (తెలుగు వాక్యం ఇలా ఉంటుంది)

**కేసిఆర్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ – పట్టాలు పంపిణీ చేసిన కెసిఆర్**

**పత్రికా రచన ఏ ఒక్కరి చేతులమీదుగానో సాగే కృషి కాదు (ఇంగ్లీషు వాక్యం)**

**పత్రికా రచన ఏ ఒక్కరితోనో సాగే కృషి కాదు (తెలుగు వాక్యం)**

**చేనేత కార్మికుల చేతుల మీదుగా తయారైన వస్త్రాలు (ఇంగ్లీషు)**

**చేనేత కార్మికులు నేసిన వస్త్రాలు (తెలుగు)**

**'చేతుల మీదుగా' ప్రయోగాన్ని మానుకోవాలి.**

**'చేతిలో'**

**మాదాపూర్‌లో దుండగుల 'చేతిలో' ఒకరి హత్య**

మాదాపూర్‌లో ఒకరిని హతమార్చిన దుండగులు – అని రాయాలి.

**తండ్రి చేతిలో కొడుకు హతం**

**కొడుకును చంపిన తండ్రి – అని రాయాలి.**

(**'చేతిలో' ఒకరి హత్య'** అని రాయకూడదు)

**'చేత'**

**స్పీకర్ ఎమ్మెల్యేల 'చేత'** ప్రమాణం చేయించారు.

స్పీకర్ ఎమ్మెల్యేల **'తో'** ప్రమాణం చేయించారు – అని రాయాలి.

**'చే'**

**అమ్మ ఫౌండేషన్‌చే పుస్తకాల పంపిణీ – పుస్తకాలు పంచిన అమ్మ ఫౌండేషన్**

**సిబిఐచే విచారణ జరిపించాలి – సిబిఐతో విచారణ జరిపించాలి**

మావోయిస్టులచే రైలు పట్టాల పేల్చివేత –– రైలు పట్టాలు పేల్చేసిన మావోయిస్టులు

మిలిటెంట్ల **చే** కిడ్నాప్‌కు గురైన – మిలిటెంట్లు కిడ్నాప్ **చేసిన**

లాకప్‌డెత్‌పై సిట్టింగ్ జడ్జి**చే** విచారణ జరిపించాలి – లాకప్‌డెత్‌పై జడ్జి**తో** విచారణ జరిపించాలి.

**జరుగు/ చెందిన/ గురిచేస్తున్న/ సంబంధించిన**

తెలుగు జర్నలిస్టులు ఈ మాటలను తరచుగా ఉపయోగిస్తున్నారు. **జరుగు** పదం మరీ ఎక్కువగా దుర్వినియోగమవుతున్నది.

ఆంగ్ల భాషా సంప్రదాయాన్నుంచి ఊడిపడ్డ **"జరుగు"** క్రియాపదాన్ని తెలుగు జర్నలిస్టులు సందర్భశుద్ధి లేకుండా చీటికి మాటికీ వాడుతూ తమకు భాషా పరిజ్ఞానం లేదని చాటుకుంటున్నారు. ఉదాహరణకు –

ఊరేగింపు **జరిగింది.** ధర్నా **జరిగింది.** (ఈ వాక్యాలలో 'జరుగు' కు బదులు ఇతర క్రియారూపాలు వాడే వీలుంది.)

ఊరేగింపు **తీశారు**

ధర్నా **చేశారు**

**'జరుగు'** కు ప్రత్యామ్నాయ రూపాలుగా వాడిన **'తీశారు –చేశారు'** పదాల వల్ల ఆ వాక్యాలలోని అర్థం పిసరంత కూడా మారలేదు. పైగా **భావం** మరింత తేటతెల్లమైంది.

వార్తాపత్రికలు చదవడానికి అలవాటు పడిన రాజకీయ నాయకులు "పత్రికాభాష" ను పూర్తిగా ఒంట బట్టించుకుని తమకు తెలియకుండానే ఆ భాషలో మాట్లాడుతున్నారు. నాయకుల ప్రసంగాల నిండా "పత్రికా భాష" లోని **కృత్రిమ** పదాలు కోకొల్లలుగా దొర్లుతుంటాయి. ఉదాహరణకు –

"ఈ ఎన్నికలలో మమ్మల్ని గెలిపిస్తే భారీ ప్రాజెక్టులు చేపట్టటం **జరుగుతుంది.** బలహీన వర్గాలకు వేలు, లక్షల సంఖ్యలో ఇళ్లు కట్టడం జరుగుతుంది. మేం అధికారంలోకొస్తే జనాభాలోని అందరికీ అంతో ఇంతో ఉపకారం **జరగడం జరుగుతుంది.**

రూపొందించడం జరిగింది – రూపొందించారు

చేయడం జరుగుతుందని – చేస్తామని

చేయడం జరిగిందని – చేశామని

చర్చలు జరిపారు – ప్రచారం చేశారు

ప్రచారం జరిపారు – ప్రచారం చేశారు

గాలింపు జరుపుతున్నారు – గాలిస్తున్నారు.

భూసేకరణ జరిపారు – భూమి సేకరించారు

వాకౌట్ జరిపారు – వాకౌట్ చేశారు

ప్రభుత్వమే భూసేకరణ జరపాలి – ప్రభుత్వమే భూమి సేకరించాలి

సమీక్ష జరిపారు – సమీక్షించారు

సమర్థించడం జరిగింది – సమర్థించారు

ప్రస్తావించడం జరిగింది – ప్రస్తావించారు

**చెందిన**

కొండరెడ్ల తెగకు చెందినవాడు – కొండరెడ్ల తెగలవాడు

రామారం గ్రామానికి చెందిన మల్లయ్య – రామారం గ్రామస్థుడు మల్లయ్య

తెలంగాణకు చెందినవాడు – తెలంగాణ వాడు

అధికారపక్షానికి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు – 11 మంది అధికారపక్షం ఎమ్మెల్యేలు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు – ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికవేత్తలు

మెదక్ జిల్లాకు చెందిన 13 మంది రైతులు – 13 మంది మెదక్ జిల్లా రైతులు

వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు – వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

**'గురైన' – గురి చేసిన – గురికావడం**

పాము కాటుకు గురైన వ్యక్తి మృతిచెందాడు

ఇది తెలుగు వాక్యం కాదు గాక కాదు!

మాట్లాడేటప్పుడు ఎవరైనా **'పాము కరిచి అతడు చనిపోయాడు'** అంటారు.

ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు – ఒకరిని హతమార్చారు

**చోరికి గురైన లారీ లభ్యం – దొంగిలించిన లారీ దొరికింది**

**మిలిటెంట్లచే కిడ్నాప్‌కు గురైన – మిలిటెంట్లు కిడ్నాప్ చేసిన**

**కబ్జాకు గురైన చెరువు భూమి – చెరువు భూమి కబ్జా**

**అవమానాలకు గురి చేసిన వారిని – అవమానించిన వారిని**

**ఆశ్చర్యానికి గురైన – ఆశ్చర్యపోయిన**

**కిడ్నాప్‌నకు గురైంది – కిడ్నాపైంది**

**వేధింపులకు గురిచేస్తున్న – వేధిస్తున్న**

**ముంపునకు గురయ్యే గ్రామాలు – మునిగిపోయే గ్రామాలు**

**ముస్లింలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు – ముస్లిములను నిర్లక్ష్యం చేస్తున్నారు**

**వాడుక భాషలో ఇంత సూటిగా, సరళంగా చెప్పగలిగినప్పుడు విలేకరి రాత ఇంత కృత్రిమంగా ఎందుకు తయారవుతున్నది? ఓ కొన్ని పత్రికల్లో ఇలాగే రాస్తున్నారు గనుక తాను కూడా ఆ పద్ధతినే పాటిస్తున్నాడు విలేకరి. అతడు వెనకాముందూ ఆలోచించకుండా కృత్రిమ భాష రాస్తున్నాడు.**

**సంబంధించిన**

భారతదేశానికి సంబంధించిన ప్రాచీన వైద్య విధానాలు

భారతదేశ ప్రాచీన వైద్య విధానాలు

ఆస్తిపన్ను చెల్లింపుదారులకు చెందిన వివరాలు

ఆస్తిపన్ను చెల్లింపుదారుల వివరాలు

**సంబంధించిన** పదం లేకపోయినా వాక్యాలు సవ్యంగానే ఉన్నాయి. అర్థమూ మారలేదు.

**బడు**

సంస్కృతం, ఆంగ్ల భాషలలో మాదిరిగా తెలుగులో **కర్మణి (Passive voice)** ప్రయోగం లేదు. ఒక పని జరిగినట్టు సూటిగా (Active voice) చెప్పడం మంచిది. వాక్యంలోని **'కర్మ'** ను **'కర్త'** గా మార్చి Passive voice లో మాదిరిగా ఆ పనేదో **జరగబడినట్టు** చెప్పడం తెలుగు సంప్రదాయం కాదు

ఉదాహరణకు –

రాముడు రావణుని వధించాడు (సూటిగా)

రావణుడు రామునిచే వధించ**బడెను** (డొంకతిరుగుడు)

రాముడు నన్ను తన్నాడు (సూటిగా)

రాముడి చేత నేను తన్న**బడ్డాను** (డొంకతిరుగుడు)

బడు ధాతువు Passive voice ను సూచిస్తుంది. చెప్పదలచుకున్న విషయాన్ని డొంకతిరుగుడుగా కాకుండా సూటిగా చెప్పడమే తెలుగు పద్ధతి. సూటిగా చెపితేనే నలుగురికీ సులువుగా అర్థమవుతుంది. కానీ, దురదృష్టవశాత్తూ తెలుగు జర్నలిస్టులు ఇప్పటికీ ఆడపాదడపా **బడు** పదం వాడుతూనే ఉన్నారు.

వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా బడుగు వర్గాలకు రెండు లక్షల ఇళ్లు **కట్టబడతాయని** ముఖ్యమంత్రి చేప్పారు.

ఈ వాక్యంలోని **కట్టబడతాయి** పదానికి బదులుగా **కడతాము** అని ఉండాలి. రాజకీయ నాయకులు పత్రికాభాషలో మాట్లాడుతున్నారు.

**ఏదైతే - అదే**

ఆంగ్ల భాషకు ప్రత్యేక పలుకుబడులు, సంప్రదాయాలు ఉన్నాయి. ఒక విషయాన్ని వివరించే పద్ధతి తెలుగులోకన్నా భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు-

నేను **ఏదైతే** చెప్తానో **అదే** చేస్తాను (ఇంగ్లీషు వాక్యం)

తెలుగుభాషా సంప్రదాయానికి విరుద్ధమైన వాక్యం ఇది.

నేను చెప్పిందే చేస్తాను (తెలుగు వాక్యం)

నేను **ఏదైతే** అనుకున్నానో అదే జరిగింది (ఇంగ్లీషు వాక్యం)

నేను అనుకున్నదే జరిగింది (తెలుగు వాక్యం)

ఎక్కడైతే పట్టుదల ఉంటుందో అక్కడ గమ్యం కనిపిస్తుంది (ఇంగ్లీషు వాక్యం)

పట్టుదల ఉంటే గమ్యం గోచరిస్తుంది.(తెలుగు వాక్యం)

**ఎవడైతే - వాడు**

He, who can play tactics, can get through the elections.

(ఎవడైతే ఎత్తులు వేయగలడో, వాడే ఎన్నికలలో నెగ్గుకు రాగలడు (అనువాదం)

ఎత్తులు వేయగలిగినవాడే ఎన్నికలలో నెగ్గుకు రాగలడు (తెలుగు పద్ధతి)

**"ఎవడైతే....వాడు"** వంటి ప్రయోగం తెలుగులో లేదు.

సంస్కృతంలోనూ

ఇంగ్లీషు మాదిరిగా సంస్కృతంలోనూ **ఎవడైతే - వాడు** వంటి ప్రయోగాలు వాడుకలో ఉన్నాయి.

యత్ర నార్యాస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా

యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్ర ఫలాః క్రియాః

ఎక్కడ స్త్రీలను పూజిస్తారో గౌరవిస్తారో అక్కడ దేవతలు ఉంటారు. దైవత్వం ఉంటుంది

ఎక్కడ స్త్రీలను గౌరవించరో, ఆదరించరో అక్కడ సకల సత్క్రియలు విఫలమవుతాయి.

(ఇవి సంస్కృత వాక్యాల యథాతథ అనువాదం)

తెలుగు వాక్యాలు ఇలా ఉంటాయి

స్త్రీలను పూజించే గౌరవించే చోట దేవతలుంటారు

స్త్రీలను గౌరవించని, ఆదరించని చోట సకల సత్క్రియలు విఫలమవుతాయి.

**లేదని**

కాంగ్రెస్ కూటమితో కలిసేది లేదని – కాంగ్రెస్ కూటమితో కలువబోమని

బీజేపికి మద్దతిచ్చేది లేదని – బీజేపికీ మద్దతివ్వబోమని

నక్సలైట్ల ఆగడాలను చూస్తూ ఊరుకునేది లేదు – నక్సలైట్ల ఆగడాలను చూస్తూ ఊరుకోము

## మక్కీకి మక్కీ అనువాదాలు

ప్రపంచవ్యాప్తంగా అనేక భాషలలో వార్తాపత్రికలు ప్రచురితమవుతున్నాయి. వాటికి వేర్వేరు రచనా శైలులు, పదాల మూల స్వరూపాల గురించి తెలిపే శైలీపత్రాలు ఉన్నాయి. ప్రపంచ భాషగా చలామణీ అవుతున్న ఆంగ్లభాష నుంచి, జాతీయభాష హిందీ నుంచి తెలుగు దినపత్రికలకు ఎక్కువగా వార్తలు అందుతుంటాయి. పిటీఐ, యూఎన్ఐ వంటి అఖిల భారత వార్తాసంస్థలు సొంత టెలిప్రింటర్ల మీద జాతీయ, అంతర్జాతీయ వార్తలను ఆంగ్లంలో దినపత్రికలకు పంపుతూ ఉంటాయి. టెలిప్రింటరుమీద ఇంగ్లీషులో వచ్చే వార్తలను యాంత్రికంగా అనువదించడానికి తెలుగు జర్నలిస్టులు అలవాటుపడ్డారు. మక్కీకి మక్కీ అనువాదాల వల్ల తెలుగు వార్తాపత్రికల భాషలో, పదాలలో వికృత రూపాలు దొర్లి సహజత్వం లోపిస్తున్నది. తెలుగు భాష భ్రష్టుపట్టిపోతున్నది.

## తాగునీరు

**డ్రింకింగ్ వాటర్** అనే ఇంగ్లీష్ పదానికి మక్కీకిమక్కీ అనువాదం **తాగునీరు.** తాగే నీళ్లకు తెలుగులో **'మంచినీళ్లు'** అనే పదం ఉంది. ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో రాసే జర్నలిస్టులు **'మంచినీళ్లు'** పదాన్ని చంపేశారు. సాగునీరు – **తాగునీరు** అంటూ ప్రాసకోసం పాకులాడే జర్నలిస్టులు కూడా తాగునీరు వాడుకలోకి రావడానికి కారకులనే చెప్పుకోవాలి.

'లోతుగా'

**'లోతుగా' చర్చించారు. 'డీప్ (లోతు) డిస్కషన్' కు మక్కీకి మక్కీ అనువాదం ఇది.)**

చర్చలకు **లోతుగా** పదం సరైందికాదు. ఈ బావి లోతు **ఇరవై** అడుగులు. నడిసముద్రం **లోతెంతో** తెలియదు. చివరి రెండు వాక్యాలకు **'లోతు'** సరిపోతుంది.

**లోతుగా** చర్చించారుకు బదులుగా.... **కూలంకషంగా** చర్చించారు, లేదా **క్షుణంగా** చర్చించారు అనడం మెరుగ్గా ఉంటుంది.

తెలంగాణ సమస్యలను లోతుగా పరిశీలిస్తాం

తెలంగాణ సమస్యలను అమూలాగ్రం పరిశీలిస్తాం

**మక్కీకి మక్కీ** అనువాదాల వల్ల అర్థం తారుమారవుతున్నది. దీనికి ఉదాహరణలివి:

**గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ (ఇంగ్లీషు వాక్యం)**

**ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (మక్కీకి మక్కీ అనువాదం)**

**ప్రభుత్వ బాలికలు అంటూ ఎవరూ ఉండరు. ఉన్నత పాఠశాల ప్రభుత్వానిది. బాలికలు ప్రభుత్వానికి చెందిన వారు కాదు.**

**బాలికల ప్రభుత్వ పాఠశాల...** అని రాయాలి

**ఉచిత** కంప్యూటర్ శిక్షణ – కంప్యూటర్ **ఉచితం** కాదు. **శిక్షణ ఉచితం.** అందువల్ల

**'కంప్యూటర్ ఉచిత శిక్షణ'** – అని రాయాలి

**జాతీయ** ఓటర్ల దినోత్సవం – జాతీయ ఓటర్లు ఉండరు. జాతీయస్థాయిలో జరిగే ఓటర్ల దినోత్సవం.

ఓటర్ల **జాతీయ** దినోత్సవం

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం – క్యాన్సర్ ఉచితం కాదు. వైద్య శిబిరం **ఉచితం**

క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం

**ప్రపంచ** మధుమేహ దినోత్సవం

మధుమేహ ప్రపంచ దినోత్సవం

**ప్రపంచ** పక్షుల దినోత్సవం

పక్షుల **ప్రపంచ** దినోత్సవం

**WEIGHT (బరువు)**

ఈ ఇంగ్లీష్ పదాన్ని తెలుగులోకి అనువదించే సమయంలో కొందరు జర్నలిస్టులు తప్పులో కాలేస్తున్నారు. ఉదాహరణకు ఈ వాక్యం చూడండి.

నీ వాదనలో **'వెయిట్'** ఉంది అనే ఇంగ్లీష్ వాక్యాన్ని నీ వాదనలో 'బరువు' వుంది అని రాస్తున్నారు. ఈ వాక్యంలో **'బరువు'** సరైన పదం కాదు. **'బలం'** ఉందనాలి.

నీ వాదనలో **'బరువు'** వుంది – తప్పు

నీ వాదనలో **'బలం'** వుంది – ఒప్పు

లేదా

నీ వాదనలో సత్తా ఉంది (ఒప్పు)

సాధారణ వార్తలలో **బరువైన** పదాలు వాడకూడదు

సాధారణ వార్తలలో **కఠిన** పదాలను వాడకూడదు

(**బరువు** పదం **తూకానికి** సంబంధించినది)

'వ్యక్తి'

**రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి**

'వన్ పర్సన్ డెడ్ ఇన్ రోడ్ యాక్సిడెంట్' అనే ఇంగ్లీషు వాక్యానికి **మక్కీకి మక్కీ** అనువాదం ఇది.

తెలుగులో అయితే "రోడ్డు ప్రమాదంలో **ఒకరి మృతి**" అని రాస్తారు

ముగ్గురు వ్యక్తుల విడుదల – ముగ్గురి **విడుదల**

మోసగించిన వ్యక్తి అరెస్టు – మోసగాడి అరెస్టు

హత్య చేసిన వ్యక్తికి జైలు శిక్ష – హంతకుడికి జైలు శిక్ష

తెలుగుభాషలో **'వ్యక్తి'** అనే పదం అంతగా వాడుకలో లేదు. మనం మాట్లాడేటప్పుడు 'ఒక వ్యక్తి మరణించాడు' అనం. **ఒకరు** మరణించారు' అంటాం. మరి రాత విషయం వచ్చేసరికి ఇంగ్లీష్‌లో ఆలోచించి తెలుగులో రాస్తున్నారు. అందుకే తెలుగు వాక్యాలు కృత్రిమంగా తయారవుతున్నాయి. అవసరమైతేనే వ్యక్తి పదం వాడాలి.

దాడిలో ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నారు

దాడిలో ఐదుగురు పాల్గొన్నారు

**ఎదుర్కోవడం**

**ఫేసింగ్** అనే ఇంగ్లీష్ పదానికి మక్కీకి మక్కీ అనువాదం **ఎదుర్కోవడం**

పీపుల్ ఆర్ ఫేసింగ్ డిఫికల్టీస్ (ఇంగ్లీష్ వాక్యం)

ప్రజలు కష్టాలను ఎదుర్కొంటున్నారు (యథాతథ తెలుగు అనువాదం)

కష్టాలను ఎదుర్కోవడం ఏమిటి ? ప్రజలు కష్టాలలో **కూరుకుపోయారు** అనేది భావార్థం. ప్రజలకు కష్టకాలం **దాపురించిందని** కూడా రాయొచ్చు. తెలుగు జర్నలిస్టులు భావార్థాన్ని పట్టించుకోకుండా ఇంగ్లీష్ వాక్యాన్ని యథాతథంగా అనువదిస్తున్నారు. ఆంగ్ల భాషా సంప్రదాయం తెలుగుకు పొసగదు.

"Hower, The Telugu journalists are not supposed to "Translate" a news story, **word by word**. They are expected to "**Transcreate**". Verbatim Translation are not desirable at all.

**ట్రాన్స్‌క్రియేషన్ అంటే భావానువాదం.**

**మాట్లాడుతూ చెప్పారు**

“ముఖ్యమంత్రి పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్‌లో అదనంగా లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు.”

ముఖ్యమంత్రి ప్రెస్ కాన్ఫరెన్సుకు వెళ్లొచ్చిన చీఫ్ రిపోర్టరు రాసిన వార్తలోని ఒక వాక్యం ఇది.

మాట్లాడుతూ చెప్పడమేమిటి? మాట్లాడకుండా ఎవరైనా ఏదయినా చెప్పగలరా? చెప్పలేరన్నది నిర్వివాదాంశం. మరి చీఫ్‌రిపోర్టరు **‘మాట్లాడుతూ చెప్పారు’** అని ఎందుకు రాసినట్టు? ఇంగ్లీష్‌లో ఆలోచించి తెలుగులో వార్త రాయడం వల్ల !

“వైల్ టాకింగ్ టు రిపోర్టర్స్ ది చీఫ్ మినిస్టర్ సెడ్ దట్....” అనే ఇంగ్లీష్ వాక్యానికి మక్కీకి మక్కీ అనువాదం ఇది.

ముఖ్యమంత్రి చెప్పిన విషయంతో వార్త మెదలుపెడితే **‘మాట్లాడుతూ చెప్పారు’** అని రాయాల్సిన అవసరం ఉండదు. ఎలాగంటే.

వచ్చే ఖరీఫ్‌లో అదనంగా లక్ష ఎకరాలకు సాగునీరు సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి **పత్రికా ప్రతినిధులతో** చెప్పారు. (తెలుగు వాక్యం ఇలా ఉంటుంది.)

**పాల్గొని** ప్రసంగించారు

రమాదేవి సమావేశంలో **పాల్గొని** ప్రసంగించారు

ఆయా సమావేశాల వార్తలలో కనిపించే వాక్యం ఇది.

సమావేశంలో **పాల్గొంటేనే** మాట్లాడే అవకాశం వస్తుంది. సమావేశంలో **పాల్గొనకుండా** ఎవరూ ప్రసంగించలేరు.

రమాదేవి సమావేశంలో ప్రసంగించారు. (**పాల్గొని** అక్కర్లేదు)

**హజరై మాట్లాడారు**

సదస్సుకు కె.నారాయణ **హజరై** మాట్లాడారు

సదస్సుకు హాజరు కాకపోతే నారాయణ మాట్లాడలేరు కదా

సదస్సులో నారాయణ మాట్లాడారు (హాజరు అక్కర్లేదు)

**లక్ష్మి అనే మహిళ**

"The Fifty years old woman called Lakshmi"

యాభై సంవత్సరాల వయసున్న **లక్ష్మి** అనే **మహిళ.** (మక్కీకి మక్కీ అనువాదం)

లక్ష్మి అంటేనే మహిళ అని తెలుగుదేశంలోని అబాలగోపాలనికీ అర్థమవుతుంది. అందువల్ల **లక్ష్మి** అనే **మహిళ** అని రాయగూడదు. లక్ష్మికి యాభై సంవత్సరాలు అంటే ఆమె వయసు 50 ఏళ్లు అని కూడా తెలుగు వాళ్లందరికీ అర్థమవుతుంది.

తెలుగు జర్నలిస్టులు ఆంగ్లంలో ఆలోచించి ఇంగ్లీష్‌లో రాయడం మానేస్తేనే తెలుగు వాక్యాలలో తెలుగుదనం ఉట్టిపడుతుంది.

వ్యాసకర్త – **సీనియర్ జర్నలిస్టు**

# తెలుగు పత్రికల భాష తీరుతెన్నులు

- టి.ఉదయవర్లు

భావవ్యక్తీకరణకు భాష ఒక సాధనము. అది ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది.

ప్రపంచం ఒక మూలన జరిగిన విశేషాలు, ఆవిష్కరణలు ఇట్టే నిమిషాల్లో మరో మూలకు తెలిసిపోయే సమాచార, సాంకేతిక వ్యవస్థ ఇవ్వాళ ఆధునికుల ముంజేతి కంకణమైపోయింది. ఎప్పటికప్పుడు ఇతర భాషా ప్రాంతాలలో జరుగుతున్న శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిని, ఆర్థిక సంస్కరణల ప్రభావాన్ని, ఇరత అనేక రంగాల ప్రగతిని, పోకడలను - ఆయా రంగాలలో నిష్ణాతులు, జనసామాన్యం అర్థం చేసుకోవడానికి కొత్తకొత్త పదాల సృష్టి అవసరమవుతున్నది. భాషలో ఎలాంటి స్ఖాలిత్యాలు, కల్మషాలు లేకుండా భావస్ఫోరకంగా వాడడం సారస్వత ప్రియుల కర్తవ్యం. ముఖ్యంగా ముద్రణలో - పత్రికలలో ప్రచురించేదాన్ని ప్రమాణికంగా భావించేవారి సంఖ్య ఎక్కువ. కాని ఇటీవలికాలంలో పత్రికలలో తప్పులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. పత్రికల భాషనే ప్రమాణికంగా స్వీకరించే పరిశోధకులు, ఉపాధ్యాయులు జాకరూకతతో వ్యవహరించవలసి ఉంటుంది. పోటీ పరీక్షలు వ్రాసే విద్యార్థులు తప్పులనే ఒప్పులుగా భావిస్తే పప్పులో కాలేసినట్టే లెక్క

ఈ కారణంగా పత్రికలలో ప్రయోగించే పదాల విషయంలో పాత్రికేయులు, పండితులు, ఆయా రంగాలలో నిపుణులు ఎంతో పరిశ్రమించవలసిన అవసరం ఎంతైన ఉంది.

భాషకు ప్రవాహశీలం ఉన్నందున ఎన్నెన్నో కల్మషాలు వచ్చి చేరుతాయి. ఒక ఇంగ్లీషు లేదా విదేశీ పదానికి ఒకటి-రెండు తెలుగు పదాలను ఒకటి రెండు పత్రికలు ప్రయోగించినా చివరికి నిలిచేది, ప్రజల నాలుకపై నానేదే. ఉదాహరణకు నాన్‌ఎలైన్‌డ్ మూవ్‌మెంట్‌ను అలీనోద్యమం అని సుప్రసిద్ధ సంపాదకులు, పత్రికాభాషకు కొత్త ఒరవడి దిద్దిన నార్ల వెంకటేశ్వరరావు తాను పని చేసిన ఆంధ్రప్రభ, ఆ తర్వాత ఆంధ్రజ్యోతి లో ప్రయోగించారు. దాన్నే 'ఆంధ్రపత్రిక' - విబంధ ఉద్యమం అని వ్రాసేది. కాని చివరికి నిలిచింది 'అలీనోద్యమం' అనే పదమే. అట్లాగే - యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్‌ను ఐక్యరాజ్యసమితి అన్నారు నార్ల వెంకటేశ్వరరావు. లెజిస్లేటివ్ అసెంబ్లీని శాసనసభ అనీ, లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను శాసనమండలి అని నార్లగారు పనిచేసిన పత్రికలు వ్రాయగా, 'ఆంధ్రపత్రిక' వాటినే వరసగా విధానసభ అనీ, విధాన పరిషత్తు అని వ్రాసింది. కాని ప్రస్తుతం శాసనసభ, శాసనమండలి అనే పదాలే వాడుతున్నారు.

ఇట్లా ప్రతి పరభాషా పదాన్ని తెనిగించాలని నా భావం కాదు. తర్జుమా చేసినా భావం ప్రసారం చేయలేని పదాలను యదాతథంగా వాడుకోవచ్చు.

అంతేకాని అనువాదం సరి అనిపించినా, నుడికారం రీత్యా విపరీత అర్థం వస్తే దాన్ని వాడకలోకి తేకపోవటమే మంచిది.

ఇలాంటి పదాలకు ఉదాహరణగా ఎన్నైనా చెప్పొచ్చు. వైర్‌లెస్ అంటే వితంతు అనవచ్చునా? ఎంతఘోరం!

కోపరేటివ్ అంటే పరపతి అనుకుని పరపతి సౌకర్యం అని వ్రాసినప్పుడు ఆ అనువాదం ఎంతనీచమైందో తెలుస్తుంది.

రైల్ సిగ్నల్‌ను ధూమశకట గమనాగమన సూచిక అని వాడడం పిచ్చి. దాన్ని కొన్ని ప్రాంతాల్లో రెక్కమాను అంటారు. సిగ్నల్ అంటే తప్పేమి? రైలును పొగబండి అనికూడా అనకూడదు. ఇప్పుడున్నవి విద్యుత్ రైళ్ళే కదా. ఇక రోడ్‌ను రహదారి అనే అనాలా? రోడ్ అన్నా అందరికీ అర్థమవుతునే ఉంది కదా?

అట్లాగే బస్‌స్టాండ్ అంటే ఎంత హాయిగా ఉంది. దాన్ని ప్రయాణప్రాంగణం అనాలా?

ఔటర్‌రింగ్‌రోడ్‌ను – బాహ్యవలయదారి అని మక్కికిమక్కి అనువదించాలా? చుట్టుదారి అంటే తప్పేంటో? మాగ్జిమం అంటే గరిష్ఠ అనీ, మినిమమ్ అంటే కనిష్ఠ అని అనాలా? ఎక్కువ, తక్కువ అంటే అందరికి అర్థమవుతుంది కదా?

కాంట్రాక్టర్ అంటేనే అర్థమవుతుందని కొన్ని జిల్లాలవారు అంటే కాదు కాదు గుత్తేదారు అంటేనే అర్థమవుతుందని మరికొన్ని జిల్లాల వారు అంటున్నారు. ఫైల్‌ను కవిలె అనాలి అని కొందరంటే, దస్త్రం అంటే తెలుస్తుందని మరికొందరు అంటున్నారు.

రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ అంటే గుండ్రటిబల్ల సమావేశం అనడం ఏంబాగుంది?

వెనకటికి ఒక పెద్దమనిషి రవీంద్రభారతిలో ప్రదర్శించిన నాటకాన్ని "పుట్ ఆన్ ది బోర్డ్" అన్న ఇంగ్లీషు నుడికారాన్ని తెనిగిస్తూ బోర్డుపై పెట్టారు అని వ్రాశాడు. విచారణ ఇన్‌కెమెరా అంటే ఒక ప్రబుద్ధుడు విచారణను కెమెరాలో చిత్రీకరించమని ఆదేశించినట్టు వ్రాశాడు. "రెయిన్‌డ్ క్యాట్స్ అండ్ డాగ్స్" అంటే కుండపోత వర్షం అనకుండా పిల్లులు, కుక్కలపై వర్షం కురిసిందని వ్రాసిన ప్రబుద్ధులు ఉన్నారు.

ఇలీవల ఒక పత్రిక మిషన్ భగీరథను మంత్ర భగీరథ అని వ్రాసింది.

ఇంగ్లీషుపదం ఎలా ఆవిర్భవించిందో తెలియనివారు అనువాదం చేస్తే దొర్లే తప్పులలో – 'వాటర్‌గేట్' ను నీళ్ళ ద్వారం అనీ, 'కిచన్ కాబినెట్'ను వంటశాల మంత్రివర్గం అనీ, 'వైట్‌హౌజ్'ను శ్వేతగృహం అనీ, 'జీరో అవర్'ను శూన్యగంట అనీ, అర్థంపర్థం లేని పదాల తాలూకు సీమ చాంతాడు జాబితా ఇవ్వవచ్చు.

ఇంతేకాదు లోగడ తెలుగు సినిమా వార్తలు వ్రాసే ఒక తమిళుడు – సుప్రసిద్ధ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి బతికున్నప్పుడే – కీర్తిశేషులు దేవులపల్లి కృష్ణశాస్త్రి అని వ్రాసి గొప్ప ప్రయోగం చేసినట్టు పోజు పెట్టడం తెలుగుభాషకు ఆ పత్రిక పెద్దలు పట్టించిన దౌర్భాగ్యం.

ఏమైనా ఇతర భాషా పదాలను తెలుగులో ప్రయోగించినప్పుడు భావం అతి సులభంగా అర్థం అవడంతో పాటు చెవికి సైతం ఇంపుగా ఉంటే సొంపు.

లోగడ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమంగా ప్రవేశపెట్టిన తరుణంలో ఇంజనీరింగ్, మెడికల్, తదితర శాస్త్రాలన్నింటిని స్నాతకోత్తర స్థాయి దాకా ఉర్దూ భాషలోకి అనువదించడానికి నిపుణులైన భాషావేత్తలను నిజాం నియామకం చేసి, విజయవంతంగా కార్యాన్ని గట్టెక్కించాడు. జపాన్, జర్మనీ, రష్యా తదితర దేశాల్లో వారివారి దేశభాషల్లోనే అన్ని శాస్త్రాలు బోధిస్తారు. అంతదాకా ఎందుకు ప్రస్తుతం మన పొరుగున గల తమిళంలోను కొంగ్రొత్త పదాలన్నింటికి సమానార్థకాలు తయారుచేసి ఉపయోగిస్తున్నారు.

అన్ని పదాలకు సమానార్థకాలు రూపొందించాలని లేదు. తెలుగుభాష మాట్లాడేవారి పద సంపదనుంచి ఇంగ్లీషు పదాలకు సమనార్థకాలను స్వీకరించవచ్చు. ఉదాహరణకు "డ్రెడ్జర్"అనే ఒక తరహా ఓడను తెలుగు మాట్లాడే తీర ప్రాంతీయులు భాషా నిపుణులు కాకపోయినా, కనీసం చదువు సంధ్యలు కూడా లేనివారైనా – "తవ్వోడ" అంటారు.

ఆపదం 'డ్రెడ్జర్' అనే దానికి ఎంత అతికినట్టుగా, భావగర్భితంగా ఉందో! అందుకే ఆ పదాన్ని నార్లగారు యథాతథంగా స్వీకరించి వాడుకలోకి తెచ్చారు.

ఇకపోతే – కొన్ని ప్రాంతాల్లో ఒక పదాన్ని ఒక భావానికి వాడితే, మరికొన్ని ప్రాంతాల్లో అందుకు భిన్నమైన అర్థంలో ఉపయోగిస్తున్నారు. అందుచేత ఇలాంటి పదాలను వ్రాసేటప్పుడు జాగ్రత్తపడాలి.

ముద్దాయి అంటే ఒక ప్రాంతంలో ఉన్న అర్థానికి, మరో ప్రాంతంలో దానికి వ్యతిరేకమైన అర్థం ఉంది. అట్లాగే – పోయాడు అన్నా, వెళ్ళిపోయాడు అన్నా, కార్యం అన్నా, సాహిత్యం అన్నా, పంచె అన్నా, వేరువేరు ప్రాంతాలలో వేరువేరు అర్థాలున్నాయి.

పదాల రూపకల్పనే కాకుండా తెలుగులో సమాసదోషాలు, సంధిదోషాలు, విభక్తుల విషయంలోను అనేక పొరపాట్లు చేస్తున్నారు. ఈ మూడు అంశాలపై ఉదాహరణలతో మూడు ప్రత్యేక వ్యాసాలు వ్రాయవచ్చు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా వ్రాస్తే తెలుగులో నుడికారం మరుగైపోతుంది.

ఒత్తులు, దీర్ఘాలు, శ,ష,స తేడాలను థ,ధల, ణ,నల,ల,ళల భేదం తెలిసి వ్రాస్తే జీవద్భాషకు తిరుగులేదు.

ఇవ్వాళ మనం మాట్లాడే భాషలో తెలుగుపదం ఏదో, సంస్కృతపదం ఏదో తెలియనంతగా పెనవేసుకుపోయాయి. ఈ నేపథ్యంలో యథాతథంగా సంస్కృతపదం వాడితే తప్పేలేదు. కాని తత్సమాలుగా వాడుకునే తరుణంలో సంస్కృతభాషా నియమాలను పాటించడం ధర్మం. మనం వాడుతున్నపదం నామవాచకమా? విశేషణమా? మరి ఏమిటి ? అనే అంశాన్ని గమనించి విచక్షణతో ప్రయోగించవలసి ఉంటుంది. సమాసంగా వాడుతున్న సందర్భంలో సంకరం కాకుండా జాగ్రత్తపడాలి. ఒకవేళ సంధిచేయవలసి వస్తే అది సంస్కృత వ్యాకరణ సూత్రం ప్రకారమే జరిగితీరాలి. లేదా ఆపదం తప్పైపోతుంది.

సాధారణంగా పత్రికలలలో తప్పులుగా దర్శనమిచ్చే ఇలాంటి పదాల గురించి ప్రముఖ పండితుడు, పాత్రికేయుడు, పరిశోధకుడు – తిరుమల రామచంద్ర "పలుకుబడి" శీర్షికన వ్రాసిన వ్యాసాల్లో కూలంకషంగా చర్చించారు. వారు చెప్పినట్టుగా – సమిష్టి అనకూడదు. సమష్టి అనాలి. దారుఢ్యం కాదు దార్ఢ్యమ్ అనాలి. ఉపాధ్యాయుడు అనే పురుషవాచకానికి ఉపాధ్యాయిని అనే స్త్రీవాచకం వాడకూడదు. ఉపాధ్యాయిని అంటే ఉపాధ్యాయుడి భార్య కాని పాఠాలు చేప్పే మహిళ కాదు. బోధన చేసే మహిళను ఉపాధ్యాయీ అని వ్యవహరించాలి. ఉధృతం అని కాకుండాఉద్ధృతం అని వ్రాయాలి. అయిష్టం కాదు అనిష్టం అనాలి. కూటమి అనొద్దు, కూటము అనాలి. సంస్కృత ఉపసర్గల తెలుగు పదాలకు అతికించడం వ్యాకరణ సంప్రదాయ విరుద్ధం కాబట్టి నిష్పూచీ, నిష్పేచీ పదాలు వాడరాదు. శోభాస్కరం కాదు శోభాకరం అనాలి. జయంతి అన్నా, వర్ధంతి అన్నా ఒకటే. ఉత్తర భారతదేశంలో వర్ధంతిని జయంతికి పర్యాయపదంగా వాడుతున్నారు. ఉత్తరాది నుంచి దిగుమతి అయిన వర్ధంతిని వారిలాగా పుట్టినరోజుకు కాకుండా భిన్నంగా మనం మరణ తిథికి వాడుతున్నాము. చారిత్రక, చారిత్రిక పదాలలోచారిత్రక వ్యాకరణానికి దగ్గరిదన్నారు. ఆధ్వర్యంకాదు ఆధ్వర్యవం అనాలి. ఇష్టాగోష్ఠి కాదు ఇష్టగోష్ఠి అనాలి. సామాగ్రి కాదు సామగ్రి అనాలి. శుద్దకాదు శుద్ధ అనాలి. అర్ధించడం కాదు అర్థించడం అనాలి. మధ్యపానం కాదు మద్యపానం అనాలి. వాగ్మూలం

కాదు వాఙ్మాలం అనాలి. వాంగ్మయం కాదు వాఙ్మయం అనాలి. ప్రధానం కాదు ప్రదానం అనాలి. ప్రధాని అంటే ప్రధానమంత్రి అని అర్థం కాదు. పటిష్ఠానికి కాదు పటిష్ఠతకు లేదా పటిష్ఠత్వానికి అని వాడాలి. అభిలాషితార్థం తెలుపని ఔత్సాహికకు బదులుగా ఉత్సాహక వాడవచ్చు. ఘోటక బ్రహ్మచారి అనేది ప్రశంసకు వాడడం పొరపాటు. అది తిట్టు. కన్యత్వపరీక్ష కాదు కన్యాత్వపరీక్ష అనాలి. ఇలవేల్పు తప్పు. ఇలువేల్పు అని వ్రాయాలి. దృశ్యశ్రవణ కాదు దృశ్యశ్రవ్య అనాలి, దర్శనశ్రవణ విధానం అన్నా సరే. నిగర్వి తప్పు నిర్గర్వుడు ఒప్పు. సకుంటుంబ సపరివార సమేతంగా అని వ్రాయడం సరికాదు. సకుటుంబ పరివారంగా అనిగాని, కుటుంబ సమేతంగా అని గాని వ్రాయాలి. నిర్దోషి అనేది అపశబ్దం. నిర్దోషుడు, అదోషుడు, అదోషి అని వాడవచ్చు. విచక్షణా రాహిత్యం లేదు. విచక్షణతారాహిత్యం అనాలి. పర్యటనా కార్యక్రమం తప్పు పర్యటన కార్యక్రమం అనాలి. పర్యవేక్షణారాహిత్యం తప్పు పర్యవేక్షణరాహిత్యం అనాలి. క్షవరం అనరాదు క్షౌరం అని వ్రాయాలి.

వీటిలో ఏ పదాలు సాధువులో, ఏవికావో వివరించాలంటే – ఒక్కొక్క పదానికి ఒక్కొక్క వ్యాసాన్ని తిరుమల రామచంద్ర వ్రాశారు.

ఇవి కాకుండా ఇతర ప్రాంతాలు, దేశాలు, నగరాలు, వ్యక్తుల పేర్లను ఇంగ్లీషులో చదివి, తెలుగులో వ్రాస్తున్నాము. నిజానికి ఆయా ప్రాంతాల, దేశాల, నగరాల, వ్యక్తుల పేర్లను స్థానికులు,కుటుంబసభ్యులు ఎలా ఉచ్చరిస్తారో ఎలా వ్రాస్తారో అదే ప్రామాణికం. అంతేకాని ఇంగ్లీషు మాటను మక్కికిమక్కి వ్రాస్తే, పలికితే ఎంత తప్పో తెలుసుకుని దిద్దుకోవడం ఆయా పత్రికల, ఛానళ్ళ, జర్నలిస్టుల కర్తవ్యం. తెలిసిన తప్పును సరిదిద్దుకోకుండా అలాగే కొనసాగించడం మూర్ఖత్వం.

ఉదాహరణకు – అఫ్ఘానిస్థాన్‌ను అఫ్గనిస్తాన్ అనడం, బాంగ్లాదేశ్‌ను బంగ్లాదేశ్ అనడం, కఠ్మందూను ఖాట్మండు అనడం, మ్యూనిక్‌ను మ్యూనిచ్ అనడం, జ్యూరిక్‌ను జ్యూరిచ్ అనడం, షికాగోను చికాగో అనడం తప్పు. అట్లాగే – బిహార్‌ను బీహార్ అన్నా, పట్నాను పాట్నా అన్నా, హర్యాణాను హర్యానా అన్నా, లదాఖ్‌ను లడక్‌అన్నా, దిల్లీని ఢిల్లీ అన్నా, దేహ్రాదూన్‌ను డెహ్రాడూన్ అన్నా కశ్మీర్‌ను కాశ్మీర్ అన్నా తప్పే.

ఇక వ్యక్తులపేర్లు పరిశీలిస్తే – పండిత జవాహర్‌లాల్ నెహ్రూను పండిట్ జవహర్లాల్ నెహ్రూ అనడం, సత్యజిత్‌రాయ్‌ను సత్యజిత్‌రే అనడం, రవీంద్రనాథ్‌టాకూర్‌ను, రవీంద్రనాథ్ ఠాకూర్ అనడం , కణ్ణాబిరాన్‌ను కన్నాభిరాన్ అనడం, మురార్జీదేశాయ్‌ను మొరార్జీదేశాయ్ అనడం, దేవేగౌడను దేవగౌడ అనడం, నరేంద్రమోదీని, నరేంద్రమోడీ అనడం, లాల్‌క్రిషన్ అడ్వాణీని లాల్‌కృష్ణ అద్వాని అనడం, కిరణ్‌బేదీని కిరణ్‌బేడి అనడం, రబ్డీదేవిని రబ్రీదేవి అనడం, అమితాభ్‌ను అమితాబ్ అనడం, తబును టబు అనడం, పురందేశ్వరిని పురందీశ్వరి అనడం, సచిన్ తెందూల్కర్‌ను సచిన్ టెండూల్కర్ అనడం తప్పు. వెంకటేశ్, మహేశ్‌లను వెంకటేష్, మహేష్ అని వ్రాయడం వెనక ఈశ్వరుని లోని "ఈశ్" శబ్దజ్ఞానం లేకపోవడం కారణం ఇంకా ఇలా ఎన్నైనా చెప్పొచ్చు.

వార్తలు వ్రాసే సందర్భంలో మధ్యలో తరుచుగా పొడి అక్షరాలు వ్రాయడం వల్ల స్పష్టత కొరవడుతుంది. ఒక్కొక్కసారి తికమకగా, అశ్లీలంగా కూడా ధ్వనించే అవకాశం ఉంటుంది.

ఎందుచేతంటే – క,భ అంటే కరువు భత్యం అనీ, ప్ర.భ అంటే ప్రయాణ భత్యమనీ, ని.కా.ని అంటే నియత కాలిక నివేదిక అనీ, సె.ప్ర.రా.అంటే సెలవు ప్రయాణం రాయితీ అనీ, ఐ.రా.స. ఐక్యరాజ్యసమితి అనీ, ల.పా కి అంటే లక్ష్మీ పార్వతికి అని ఎంతమందికి తెలుస్తుంది? ఎస్.డి.రోడ్ అనడం వల్ల సరోజినీదేవి పేరు, ఎల్.బి.నగర్ అనడం వల్ల లాల్‌బహద్దూర్ శాస్త్రి పేరు మరుగున పడిపోయింది. ఈ పేర్లు పెట్టడం వెనక లక్ష్యం దెబ్బతిన్నది. ఇలా ఇంకా ఎన్నో ఉన్నాయి.

ఇది ఇట్లా ఉండగా లోగడ నార్ల వెంకటేశ్వరరావు హైదరాబాద్ నుంచి ప్రచురించే దినపత్రిక "ఆంధ్రజనత" ను చూసి ముచ్చటపడేవారు. ఒకసారి వారు హైదరాబాద్‌లోని "ఆంధ్రజనత" కార్యాలయానికి వెళ్ళి, అప్పుడు అందులో సహాయ సంపాదకులుగా ఉన్న జి.ఎస్.వరదాచారికి తనను తాను పరిచయం చేసుకుని – పత్రికలో ఆసాంతం "ఏకరూపత" కలిగిన వార్తలపట్ల సంతోషాన్ని, ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారట. ఈ ఏకరూపత సాధించాలని తాను సంపాదకుడుగా ఉన్న "ఆంధ్రప్రభ" దినపత్రికలో చేస్తున్న ప్రయత్నం విఫలమైందని విచారం వ్యక్తం చేశారట.

"ఆంధ్రజనత" విజయం వెనక రహస్యమేమిటని ఉత్సుకతతో ఆయన ప్రశ్నించారట.

కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం సంపాదకత్వంలో వెలువడుతున్న "ఆంధ్రజనత" లో జి.ఎస్.వరదాచారి, అజంతా-ఇరువురు సహాయసంపాదకులు. వార్తలు వ్రాసే సిబ్బంది వీరిరువురు తప్ప మరెవ్వరూలేరు. అదృష్టవశాత్తు వారిరువురి వాక్యవిన్యాసం, అనువాద ఫక్కీ, పదాల వాడకం ఒక్కలాగే ఉండేది. ఒకరు ఉదయం షిఫ్టులో ఉంటే, మరొకరు సాయంత్రం షిఫ్టులో ఉండేవారు. ఒకరు ఏ వార్త ఎక్కడి వరకు వ్రాశారో, తదుపరి వారికి చెబితే-వారు అక్కడి నుంచి మొదలుపెట్టి వ్రాసేవారు. మరునాడు వార్తలు చూస్తే – వారికి జ్ఞాపకం ఉంటే సరేకాని, లేదంటే – ఏది ఎవరు ? ఎంత వరకు వ్రాశారో, వారికే తెలియనంత ఏకరూపత ఉండేదట.

ఈ విషయం తెలుసుకున్న నార్ల వెంకటేశ్వరరావు తన సంపాదకత్వంలోని దినపత్రికలో 'ఆంధ్రజనత' లో మాదిరిగా ఒకరిద్దరి చేత మాత్రమే పని చేయించుకునే పరిస్థితికి తగ్గలేక, ఎక్కువ సంఖ్యలో ఉన్న ఉపసంపాదకులందరి శైలి ఒక మాదిరిగా ఉండే విధంగా శిక్షణ ఇవ్వలేక సతమతమయ్యారు.

అయితే – 1960 లో నార్ల వెంకటేశ్వరరావు సంపాదకత్వంలో ప్రారంభమై, నండూరి రామమోహనరావు నేతృత్వంలో ప్రజాదరణ పొందిన దినపత్రిక "ఆంధ్రజ్యోతి" లో ఏకరూపత సాధించాలనే లక్ష్యంతో – శైలికి సంబంధించిన కొన్ని సూచనలను ముద్రించి వార్తలు వ్రాసే వారందరికీ పంపిణీ చేశారు. శైలిపత్రాన్ని అధ్యయనం చేసి వార్తలు వ్రాసేప్పుడు తాము చేసిన సూచనలు పాటించవలసిందిగా వారు ఆదేశించారు.

నండూరి రామమోహనరావు జారీ చేసిన శైలి పత్రం ప్రకారం : "యొక్క" వాడవద్దు. అంటే – ప్రధాని యొక్క ప్రకటన అనకూడదు. ప్రధాని ప్రకటన అని వ్రాయాలి. "బడు" వాడవద్దు. అంటే – చేయబడింది అనొద్దు. చేశారు అనాలి. చేయకుండ, వెళ్ళకుండ అని వ్రాయరాదు. చేయకుండా, వెళ్ళకుండా అని వ్రాయాలి. లాభముండదు అనొద్దు. లాభం వుండదు అనాలి. దేశము, రాష్ట్రము అనకూడదు. దేశం, రాష్ట్రం అని వ్రాయాలి. ఉండదు అని కాకుండా వుండదు అని, యిప్పుడు

అని కాకుండా ఇప్పుడు అని వ్రాయాలి. వెళ్ళేరు, అడిగేరు అని వ్రాయవద్దు. వెళ్ళారు, అడిగారు అని వ్రాయాలి. చేసారు కాదు చేశారు అనాలి. రాయడం కాదు వ్రాయడం అనాలి. చేయాలనీ, కావాలనీ అని వ్రాయకూడదు. చేయాలని, కావాలని వ్రాయాలి. చేసినట్లు అనొద్దు, చేసినట్టు అనాలి. వారూ వీరూ అని వ్రాయవద్దు. వారు, వీరు అని వ్రాయాలి. వాళ్ళు అన్నా వారు అనే వ్రాయాలి. వెళ్లటం, రావటం అని కాకుండా వెళ్ళడం, రావడం అనాలి. వస్తోంది, పోతోంది తప్పు, వస్తున్నది, పోతున్నది ఒప్పు. సమర్థవంతంగా, పటిష్ఠవంతంగా అనికూడదు. సమర్ధంగా,పటిష్ఠంగా అని వ్రాయాలి. అందువలన అని కాకుండా అందువల్ల అని వ్రాయాలి. కాబట్టి అనకుండా కనుక అనాలి. కూడ, గూడ, గూడా అని వ్రాయడం తప్పు, కూడా అనడం ఒప్పు. గూర్చి అనకుండ, గురించి అనాలి. చేయుటకు, ఇచ్చుటకు బదులుగా చేయడానికి, ఇవ్వడానిక అని వ్రాయాలి. తారీఖు అని కాకుండా తేదీ అని వ్రాయాలి. కీ.శే; క్రీ.శ; క్రీ.పూ. అని పొడిపొడి అక్షరాలు కాకుండా కీర్తిశేషుడు, క్రీస్తుశకం, క్రీస్తుపూర్వం అని పూర్తిగా వ్రాయాలి. అట్లాగే డా॥ ప్రొ॥ రూ॥మొ॥ ఉదా॥ అని కూడా మొత్తంపదం వ్రాయడం బద్ధకించకుండా డాక్టర్, ప్రొపెసర్, రూపాయలు, మొదలైనవి, ఉదాహరణ అని మొత్తం పదం వ్రాయాలన్నారు.అట్లాగే ఐ.రా.స అనకుండా ఐక్యరాజ్యసమితి అని కూడా పూర్తిగా వ్రాయలన్నారు.

ఇంతేకాకుండా విదేశీయుల పేర్లు, ఇతర భాషా ప్రాంతాలవారి పేర్లు అందరూ ఒకేవిధంగా వ్రాయాలి. స్థలాలపేర్లు కూడా అంతే. ముఖ్యంగా కొత్తపేరు వచ్చినప్పుడు ఏదో ఒకటి స్థిరపరుచుకుని అందరూ అదే పాటించాలన్నారు.

విదేశీయుల పేరులో మొత్తం పేరు వ్రాయనప్పుడు చివర వున్న ఇంటిపేరునే వ్రాయాలి. ఉదాహరణకు – సైరస్‌వాన్స్ అని వ్రాయాలి. లేదా వాన్స్ అనాలి. విడిగా "సైరస్ ఇలా అన్నారు" అని వ్రాయకూడదు. హెరాల్డ్ విల్సన్ అని గాని, విల్సన్ అని గాని వ్రాయాలి. హెరాల్డ్ ఇలా ప్రకటించారు అనకూడదన్నారు.

సాధ్యమైనంత వరకు మిశ్రమ, వైరి సమాసాలు వ్రాయవద్దు. అంటే ఇంగ్లీషు, తెలుగు మాటలు, సంస్కృతం, తెలుగు మాటలు కలిపి సమాసం చేయవద్దు. ఉదాహరణకు – రాజ్యాంగ మార్పులు (రాజ్యాంగం మార్పులు) తీవ్రగలభా (తీవ్రమైన గలభా) మొదలైనవి వాడవద్దు.

వ్యక్తులపై వ్యక్తిగతమైన ఆరోపణలు వస్తే అవి ప్రకటించరాదు. లేదా ఎడిటర్‌ను, న్యూస్ ఎడిటర్‌ను సంప్రదించాలి.

హత్యలు మొదలైన నేరాల వార్తలలో ఫలానావాడు ఫలానావాడిని హత్య చేశాడు అని వ్రాయకూడదు. కేసు రిజిస్టరై పోలీసు అధికారి ఎవరైనా చెప్పినప్పుడే నేరస్థుడి పేరు ఇవ్వవచ్చు. త్వరగా వ్రాయడం ముఖ్యం. కాని అనువాదంలో తప్పులు లేకుండా వ్రాయడం ఇంకా ముఖ్యం. అనువాద దోషాలు రాకుండా జాగ్రత్తగా వ్రాయాలి. అనుమానం కలిగినప్పుడు అడిగి తెలుసుకోవడం మంచిది. తెలియకపోతే వదలివేసినా ఫరవాలేదు కాని అనువాదదోషం మాత్రం రానివ్వకూడదని వారు పేర్కొన్నారు. సంకీర్ణ వాక్యాలు, సుదీర్ఘ వాక్యాలు కాకుండా సరళ వాక్యాలు, చిన్న వాక్యాలు వ్రాయాలని సూచించారు.

అచ్చుతప్పులు పాఠకులకు చిరాకు కలిగిస్తాయి. పట్టిపట్టి దిద్దడం అలవాటు చేసుకొమ్మన్నారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటే తెలుగు పత్రికల భాష కచ్చితంగా ప్రామాణికమై తీరుతుంది.

వ్యాసకర్త – **సీనియర్ జర్నలిస్టు, రచయిత**

# తెలుగు పత్రికల భాషా స్వరూపం

**- డా॥ జె.చెన్నయ్య**

సారస్వతంలో పత్రికా రచన కూడా ఒక ముఖ్యమైన భాగం. అటు భాషకు ఇటు సాహిత్యానికీ వారధిగా నిలుస్తూ ఆధునిక భాష ప్రయోగానికి పెట్టని కోటగా పత్రికా రచన పురోగమిస్తున్నది. భాషా ప్రయోగ ప్రస్థానంలో విప్లవానికి ఇది నాంది పలికింది. కొన్నివేల మంది నిరంతర వార్తా ప్రసారానికి భాషను వైవిధ్య భరితంగా భిన్న శైలుల్లో వినియోగించే దశకు ఎదిగింది. ప్రజలు పత్రికా పాఠకులుగా, రేడియో శ్రోతలుగా, టెలివిజన్ వీక్షకులుగా విభిన్న మార్గాలలో భాషను స్వీకరిస్తున్నారు. మాధ్యమాలకు తగిన విధంగా భాషలో సాధిస్తున్న స్వల్ప భేదాలను సైతం గమనిస్తున్నారు.

## భాష పుట్టుక

మానవుడి భావ వ్యవక్తీకరణ సాధనం భాష. తన ఆలోచనలను, ఆకాంక్షలను ఎదుటివారికి స్పష్టంగా తెలిపేందుకు భాష ఉపకరిస్తుంది. భాష ఆవిర్భావం తర్వాత మానవ జీవన గమనం ఆధునికతను సంతరించుకుంది. భాషలో భావ సంచలనం. అభిప్రాయ ప్రకటన మౌఖికంగా, రాతపూర్వకంగా ఎదిగింది.

హద్దులు లేని ఆలోచనలు, ఊహలను ప్రపంచానికి భాష అందించింది. యావత్ ప్రపంచాన్నీ కళ్లముందు ఉంచింది. మొదట 'మాట' గా పలికిన భాష ఆ తర్వాత సాహిత్యంగా రూపుదిద్దుకొంది.

సాహిత్యానికి ముద్రణ తోడైంది. ప్రతి అద్భుత ఊహ వేలు, లక్షల ప్రతులుగా విస్తృతమైంది. ముద్రణ ఇచ్చిన ఆసరాతో భాష, సాహిత్యం కలిసి 'పత్రిక' రూపాన్నిచ్చాయి. సాహిత్యానికి అచ్చు రూపంలో మనం చూసే రూపమే పత్రిక.

## పత్రికల ఆవిర్భావం

తెలుగులో తొలిపత్రిక ఏది అన్న చర్చ చాలానే జరిగింది. 1933 నవంబర్ ఏషియాటిక్ జర్నల్‌లో ప్రచురితమైన పుస్తక సమీక్షను ఆధారంగా పేర్కొంటూ ఆచార్య జి.ఎన్.రెడ్డి "కర్నాటిక క్రానికల్" తొలి పత్రిక అన్నారు. అంతకు ముందు అంటే1832 జనవరి 4 న ప్రారంభమై "ఫోర్ట్‌సెంట్ జార్జి గెజిట్" లో, 1834 తర్వాత తెలుగులోనూ, తమిళంలోనూ అనువదించిన ప్రకటనలు ప్రచురితమయ్యాయి. అయితే "కర్నాటిక్ క్రానికల్" విగాని, "ఫోర్ట్‌సెంట్ జార్జి గెజిట్" విగాని ప్రతులు లభ్యం కాలేదు. తర్వాత 1838-41 సంవత్సరాల మధ్య నడిచిన 'వృత్తాంతి' వార పత్రికే తొలి పత్రికగా పరిశోధకులు భావించారు. 'వృత్తాంతి' లో 'లోకరక్షణి' అనే పేరుతో ఒక లేఖ1841 ఫిబ్రవరి 15 నాటి సంచికలో ప్రచురితమైంది. అప్పట్లో వివాహాల్లో జరిగే అనవసర వ్యయాన్ని గురించి పాఠకుడు ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేఖను గిడుగు రామమూర్తి, తన 'గద్య చింతామణి' లో ప్రస్తావించారు. సి.పి.బ్రౌను ఈ లేఖను తన జాబుల సంపుటంలో చేర్చారు. ఈ పత్రికలో ప్రచురితమైన ఇంకా అనేకమైన వివరాలు, వార్తలు అక్కడక్కడా నమోదయ్యాయి.

1843 మే 18 నాటి 'వర్తమాన తరంగిణి' పత్రికలో రాసిన అంశం నాటి పత్రికల భాష తీరును, 'వృత్తాంతి' ఉనికిని మనకు తెలుపుతుంది.

"చెన్న పట్టణమందు మిక్కిలి ప్రముఖులుగానున్న, ధనవంతులు అనే పేరుగలవారుగా కొందరు ఉండే సమాజంలో నేటివు పెద్దమనుషులు పూర్వం 'వృతాంతి' అనే ఒక ఆంధ్ర పత్రికను ప్రచురణ చేసి కొద్ది కాలం వరకు జరుగుతూ వుండెను. ఇంతలో దానికి అంత్యకాలము సంభవించి అది మృతి పొందింది."

ఈ విధంగా చూస్తే మనకు కనిపించిన తొలి పత్రిక 'వృత్తాంతి' అన్న విషయం స్పష్టమవుతోంది.

## తెలుగు పత్రికల్లో భాష - పరిణామక్రమం

తెలుగు పత్రికా భాష పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే పత్రికలు అడుగడుగునా ప్రజల అవసరాన్ని గుర్తించి తదనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పు చెందుతూ వచ్చినట్లు కనిపిస్తుంది. భాష ప్రవాహ సదృశ్యమైనదే కాక జీవనదితో పోల్చదగింది. కొన్ని సందర్భాల్లో రచనా భాషగా వున్న గ్రాంథికమూ, శిష్ట వ్యావహారికమూ కలగలిసిన భాషనే పత్రికలు స్వీకరించినట్లు కనిపిస్తున్నది. కొన్ని సందర్భాల్లో పూర్తిగా శిష్ట వ్యావహారికము, తర్వాతి కాలంలో పత్రికా రచయితల కృషి వల్ల, పాఠకుల కోరిక వల్ల వ్యవహారికము, సరళ వ్యవహారికము పత్రికల భాషగా వుంది. ఒకవైపు పత్రికల భాష, మరొకవైపు సాహిత్యానికి అనేక ఇతర అవసరాలకు ఉపయోగించిన భాష ఆధునికమూ, ప్రామాణికము కావడానికి ప్రయత్నించింది. ఆధునికము, ప్రామాణికమూ కావడానికి సాగిన కృషిలో పత్రికా రచయితలు, భాషా ఉద్యమకారులు ఇరువురూ పాలుపంచుకున్నారు. ముఖ్యంగా ఇరవయ్యవ శతాబ్ది తొలినాళ్ల నుంచి కొన్ని దశాబ్దాల పాటు సాగిన వ్యావహారిక భాషా ఉద్యమం ఆటుపోట్లను ఎదుర్కొంటూ కూడా అంతిమంగా పెద్ద విజయాన్నే సాధించింది. వ్యావహారిక భాష పేరుతో నాటి గ్రాంథిక భాషను కాదనుకుంటే చాలా అరిష్టాలు జరగుతాయని, భాష భ్రష్టుపట్టి పోతుందని సంప్రదాయవాదులు ఎన్నో అడ్డంకులను సృష్టించారు. అదే సమయంలో తెలుగులోకి ప్రవేశిస్తున్న పాశ్చాత్య భావాలు, కొంగ్రొత్త ప్రక్రియల్లో రచనలు చేయడానికి, ఇతరాత్రా పెరిగిన బాధ్యతల్ని సమర్థంగా మోయడానికి వ్యావహారిక భాషే శరణ్యమని గిడుగు వంటి వారు ఘోషించారు. దీనితో తొలుత గ్రాంథిక భాషానుకూలురుగా వున్న కందుకూరి వీరేశలింగం వంటి వారు వ్యావహారిక భాషా సమర్థకులుగా మారారు. ఫలించిన ఈ ఉద్యమం అనంతరం భాషా విస్తృతికి బాటలు వేసింది.

పత్రికలలో భాషా పరిణామాన్ని నాలుగు దశలుగా పరిశీలించడం సముచితమని అనుకోవాలి. పత్రికల ఆవిర్భావం అంటే 'వృత్తాంతి' (1838) నుంచి 'దేశాభిమాని' (1900) వరకు మొదటి దశగా పరిగణించాలి. కృష్ణాపత్రిక (1902)

నుంచి 'ఆంధ్రజ్యోతి' (1960) వరకు రెండవ దశగా, 'ఈనాడు' (1974) నుంచి 'వార్త' (1996) వరకు మూడవ దశగా విభజించవచ్చు. అక్కడ్నుంచి పత్రికలకు టెలివిజన్ ఛానళ్లు ముఖ్యంగా న్యూస్ ఛానళ్ళు తోడై భాషలో అంతకు మునుపు ఎప్పుడూలేని రీతిలో చోటు చేసుకున్న మార్పులను నాలుగవ దశ కింద పరిశీలిద్దాం. అంటే 1996 ల తర్వాత భాష పరిణామ క్రమంలో నాలుగో దశగా పేర్కొనవచ్చు.

## మొదటి దశ

'వృత్తాంతి'తో తెలుగు పత్రికల భాష ప్రారంభమైంది. వృత్తాంతి మూత పడుతున్న రోజుల్లో 1842 జూన్ 8 వ తేదీన 'వర్తమాన తరంగిణి' మద్రాసు నుంచి ప్రారంభమైంది. 'వృత్తాంతి' లాగే ఇందులో పాఠకుల లేఖలు, వ్యాపార ప్రకటనలు, ధరవరలు వంటి వార్తలు ప్రచురించేవారు. పాఠకుల లేఖలకు సమాధానాల్ని కూడా ఇచ్చేవారు. ఉత్తరాల్ని ప్రచురించడం వల్ల పత్రికల్లో స్థలం వృథా అవుతుందని ఒక పాఠకుడు సంపాదకునికి లేఖ రాస్తే 'ఉత్తరము వ్రాసిన వారికి ఎడిటరు మారు' ఈ కింది విధంగా వుంది:

"మా చందాదారులైన యొక్క పెద్ద మనిషి గారు మా పత్రికలోన నుత్తరములు బ్రచురపరచుట వలన కొంత స్థలము వృథా అయిపోతున్నదని వాడుకొన్నారట. వారి ఒక్కరి నిమిత్తము మాత్రమే మేము పత్రికను ప్రచురించుట లేదు. గాన యుత్తరములనెట్లు తిరస్కరింతమో గాని వాటి వల్లనున్నత ప్రయోజనము కద్దు – ద్రావిడ దీపిక యనే 4 పక్కల పత్రికలో 3 పక్కలుత్తరములున్ను, నాలుగో పక్క నొక్క కాలము సమాచారమున్నుండుట – వారు– చిత్తగించలేరు కాబోలు" – ఎడిటరు.

నాటి పత్రికల్లో శీర్షికలకు ఉదాహరణలుగా 'పాము కఱచుట', 'అద్భుతము' 'ఆకస్మికపు మరణము', 'హత్య', 'అగ్నిహోత్రుడు' వంటి వాటిని చెప్పుకోవచ్చు. పదాంతంలో పూర్ణానుస్వారం అప్పటి నియమం.

'దినవర్తమాని' (1856) లో ఒక వార్త చూద్దాం.

"హయిదరాబాదు...మిగులు ఘనత వహించిన గవర్నర్జనరల్లారా హయిదరా బాదు నిజాం గారిని గౌరవ పరచుటకు వారికి నయిట్ పట్టమివ్వబోవుచున్నారు.

ఆ యభిప్రాయమును తెలియపరచునట్టి యొక్క పత్రికను రెసిడంటుకు (కర్నల్ డెలిసన్) పంపగా నా దొరక్రమ ప్రకారము తనదు పరివారంతో కూడా నిజాందారి యొద్దకు బోయి మా పత్రికను ఒప్పగించిరి. వారు దాన్ని మిగులు తృప్తితో నంగీకరించి యా మంగళ వార్తను తెలియపరుచుటకు చిహ్నముగా తనదు రాజధాని యందు మాత్రము కాకుండా సికిందరాబాదు బొలారమునందును ఫిరంగీలు వేయించిరి".

'దిన వర్తమాని' పత్రిక భాష వ్యావహారికమని నిడదవోలు వేంకటరావు అభిప్రాయపడ్డారు. కాని ఇది పూర్తిగా సరళ గ్రాంథికమే. నుగాగమాలు, యడాగమాలు విరివిగా కనిపిస్తాయి. 'పోయిన తూరి' 'కొల్లెత్తు వాండ్రు', "పటాళములు" వంటి నాటి మద్రాసు ప్రాంత పదాలు కూడా వున్నాయి.

కందుకూరి వీరేశలింగం 19 వ శతాబ్ది పూర్వార్థంలో పత్రికలతో రచనానుబంధాన్ని కలిగి వున్నారు. సంఘ సంస్కరణ విషయాలపై అనేక పత్రికల్లో విస్తృతంగా రచనలు చేయడం, సంప్రదాయవాదులతో వాదాలు పెట్టుకోవడం జరిగింది. తర్వాత 1874లో ఆయనే స్వయంగా 'వివేకవర్ధిని' మాసపత్రికను ప్రారంభించారు. ఆ పత్రికకు ప్రతి సంచికలో తిలకస్థానంలో 'మహాభారతం' శాంతిపర్వంలోని 'ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబునకగు ద్రానొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మ పదవులకెల్లన్' అనే పద్యాన్ని ప్రచురించారు.

ఆ పత్రిక పెట్టడం వెనుక తనకున్న లక్ష్యాలను వీరేశలింగం ఇలా ప్రకటించుకున్నారు. – "తులసి రుద్రాక్షమాలాది బాహ్యచిహ్న ధారణముకంటే సత్ప్రవర్తనము మతమున కాధికావశ్యకమని జనులలో విశ్వాసం కుదురు వరకును మతము పరిశుద్ధమయి దురాచార – నివారకము కానేరదు. కాబట్టి పరిశుద్ధమత సిద్ధాంతములను బోధించుట వేరొక ఉద్దేశము.

వీరేశలింగం తొలుత గ్రాంథిక భాషా సమర్థకుడేనని తర్వాత గిడుగు వంటి వారి వాదాన్ని ఆమోదించి వ్యావహారిక భాషా వాదిగా మారాడని విదితమే. పై వాక్యాలు కందుకూరి సరళ గ్రాంథిక భావాలను సూచిస్తాయి.

ఆ కాలంలో వచ్చిన 'అముద్రిత గ్రంథ చింతామణి'. 'ఆంధ్ర ప్రకాశిక', 'హిందూజన సంస్కారిణి', 'సత్యసంవర్ధిని', 'శారద', 'చింతామణి', 'ప్రబంధ కల్పవల్లి' 'అనల్పజల్పితా కల్పవల్లి' వంటి పత్రికల్లో భాష సరళ గ్రాంథికమే.

తెలుగులో తొలి దినపత్రికగా 'దేశాభిమాని' ని చెప్పుకోవచ్చు. నిజానికి 1887 లో 'కృష్ణావృత్తాంతిని' అనే పేరుతో రాజకీయ పత్రిక వెలువడడం ప్రారంభించింది. అదే తర్వాత 'దేశాభిమాని' గా మారింది. వారపత్రికగా ప్రారంభమై ద్వైవార పత్రికగా, త్రైవారపత్రికగా వెలువడి దినపత్రికగా మారింది.

'తెలుగు జనన' అనే పత్రికలో ఆంధ్రలోకమున 'గౌతమి'యే మొదటి దినపత్రిక కాదు అట్టి భాగ్యమ్ము కృష్ణకే లభించింది. కాని అది కృష్ణ వెల్లువల వలెనే మూడు నాళ్ల మురిపమై సింధుగతమైనది. ఇది వరకు బెజవాడలో నుండి ఈ మధ్య కృష్ణ దాటి వెడలి గుంటూరు కొచ్చిన 'దేశాభిమాని' కొంత కాలము కిందట దినదినమున తలసూపుచు వచ్చెను...' "అన్నమాటల్ని బట్టి 'దేశాభిమాని' ని తొలి తెలుగు దినపత్రికగా భావించవచ్చు.

'గౌతమి', 'ఆంధ్ర ప్రకాశిక', 'శశిరేఖ' వంటివి మరికొన్ని దినపత్రికలు. 1908 ఆగస్టు 9 న బొంబాయిలో వారపత్రికగా ప్రారంభమైన 'ఆంధ్రపత్రిక' 1914 ఏప్రిల్ 1న (మద్రాసుకు తరలి) దినపత్రికగా మారింది.

## రెండవదశ

రెండవ దశలో 'కృష్ణాపత్రిక' నుంచి 'ఆంధ్రజ్యోతి' వరకు వచ్చిన పత్రికలను స్వీకరించాం. పత్రికా భాష మొదటి దశలో గణనీయమైన మార్పును చూడలేదు గానీ రెండవ దశలో చెప్పుకోదగ్గ రీతిలో మార్పు చెందింది.

తెలుగు పత్రికా చరిత్రలో 'కృష్ణాపత్రిక'కు ప్రముఖ స్థానం వుంది. 20వ శతాబ్ది తెలుగువారి సాహిత్య, రాజకీయ చైతన్య స్రవంతిలో కృష్ణా పత్రికదే అగ్రేసర పాత్ర. జాతీయోద్యమం ప్రారంభమై బెంగాల్ నుంచి బందరు వరకు విస్తరించి ప్రజల్లో చైతన్యం పెరగడానికి కృష్ణాపత్రిక వేదికగా నిలిచింది. అందులో ముట్నూరు కృష్ణారావు దర్బారు, సంపాదకీయాల ఒరవడి పత్రికా పాఠకుల సంఖ్యను పెంచాయి. భాష కూడా పూర్వం కంటే సరళతరమైంది. ఇది వార్తాపత్రికల యుగం.

"రాజ్య పద్ధతులను వానిలోపములను నివృత్తి చేయు మార్గములను, సంఘ సంస్కరణ రీతులను, రసవాద ప్రకృతిశాస్త్ర విశేషములను, వ్యవసాయమును, చేతిపనులు మొదలుగాగలనుపయుక్త విషయములనిందు వ్రాయుచుంటిమి. ఆ విషయములందు కూడా జన సామాన్యమునకు కొంత పాటి పరిచయము కలిగిన గాని దేశమభివృద్ధిగానేరదు....".

పదాంతంలోని 'ము' కారము అంతకు పూర్వం నుంచి వస్తున్న భాషా సంప్రదాయాన్ని సూచిస్తుంది. అది తప్ప మిగతా వాక్య నిర్మాణాన్ని పరిశీలిస్తే, భాష వ్యావహారికం దిశగా పయనిస్తున్నట్టు కనిపిస్తుంది.

తర్వాత చెప్పుకోదగిన వాటిలో ముఖ్యమైనది 'ఆంధ్రపత్రిక'. వార్తపత్రికలు అందులో దినపత్రికల యుగంలో 'ఆంధ్రపత్రిక' ది చిరస్మరణీయమైన పాత్ర. ఇది తెలుగువారి సమగ్ర జీవనరంగాల ప్రతిఫలనం. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఈ పత్రిక పెట్టిన లక్ష్యాన్నిఈ విధంగా ప్రకటించారు:

"విచారణీయంబులైన విషయంబులనేకములు గలవు. జనాభిప్రాయముల కనుకూలముగ విషయ విమర్శనను జేయుచు ననుదినమును నాంధ్ర దేశ వృత్తాంతాదులనుప్రచురించుటకు దినపత్రికను ప్రచురించుటకేర్పాటులు చేయబడినవి. కాని యనివార్యంబులైన యాటంకముల వలన విలంబన మేర్పడినందుకు జింతించుచున్నాము. దేశీయ మహాసభాధర్మములును, రాష్ట్రీయ సభాధర్మములను నాంధ్ర పత్రికాదర్శములు..."

ఈ మధ్యలో నల్లగొండ నుంచి 1922 ఆగస్టు 24 న షబ్నవీసు వెంకటరామ నరసింహారావు, 'నీలగిరి' పత్రికను ప్రారంభించారు. ఆ తర్వాత 4 రోజులకే వరంగల్లు జిల్లా ఇనగుర్తి నుంచి ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు సోదరులు 'తెనుగు పత్రిక'ను ప్రారంభించారు. తెలంగాణలో తెలుగు మాధ్యమంలో విద్యావకాశాలు లేని రోజుల్లో, తెలుగు ముద్రణ లేని రోజల్లో ఎన్నో సమస్యలనెదుర్కొంటూ ఈ పత్రికలు నడిచాయి. నాలుగేళ్ళ కాలమే నడిచినా తెలంగాణ ఆంధ్రోద్యమానికి ఊపునిచ్చాయి.

సురవరం ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికను 1926 మే 10 న ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ట్రూపు బజార్‌లో ఒక చిన్న ఇంట్లో ఒక పక్క ప్రెస్సు, మరోగది ప్రతాప్‌రెడ్డిది, పుస్తకాల బీరువాలు. అన్ని తానే అయి ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంటూ – ఆయన పత్రిక నడిపారు. నిద్రాణమైన తెలంగాణంలో 'సారస్వతజ్యోతి ప్రకాశనం చేసిన గోలకొండ భాషా సాహిత్యాల వ్యాప్తికి ఇతోధికంగా దోహదం చేసింది.

నెల్లూరు నుంచి 1930లో 'జమిందారు రైతు పత్రిక' గా ప్రారంభమైన పత్రిక తర్వాత 1934లో 'జమీన్‌రైతు'గా మారి నేటికీ వెలువడుతూ రైతుల్లో చైతన్యాన్ని కలిగించింది.

1935 లో 'జనవాణి' ప్రరంభమై తెలుగు దినపత్రికల్లో వ్యావహారిక భాషకు పట్టం గట్టింది. తాపీ ధర్మారావు ఈ పత్రిక ద్వారా ప్రవేశపెట్టిన కొత్తదనం తెలుగుపత్రికా రచనకు కొత్త ఒరవడిని దిద్దింది. పత్రిక యజమాని అయిన పిఠాపురం రాజా గ్రాంథిక భాషాభిమాని. కాని పత్రిక నాలుగేళ్ల కాలం నడిచి భాషా విషయకంగా తర్వాతి నడకను మార్చివేసింది. ఓడల్లో విదేశాల నుంచి సరకుల కింద పరచుకొని వచ్చిన పత్రికలను సేకరించి విదేశీ పత్రికల వార్తా రచన ధోరణులను నిశితంగా పరిశీలించి తెలుగు పత్రికా రచనను సమూలంగా మార్చే ప్రయత్నం చేశారు. సంపాదకీయ రచనలో నూతనత్వం. శీర్షికల్లో కొత్తదనం వెల్లివిరిసింది.

తాపీ ధర్మారావు స్వయంగా ఎక్కడో రాసిన వాక్యాలు చూస్తే 'జనవాణి' ద్వారా ఆయన ప్రవేశపెట్టిన మార్పులు బోధపడతాయి. "తక్కువ పదాలతో వాక్యాలు రాసేవాడ్ని. సుమారు మూడే పదాలుంటాయి వాక్యంలో. అందువల్ల వ్యావహారికమనిపిస్తుంది. క్రియా పదాల్ని వ్యావహారికం చేయడవే వ్యావహారికంకాదు. అదో టెక్నిక్ కనిపెట్టాడు. గ్రాంథిక భాషా వాదులకు కూడా ఆ రోజుల్లో దాన్ని కాదనగల ధైర్యం ఉండేది కాదు..."

1938 ఆగస్టు 15 న సోమవారం నాడు 'ఆంధ్రప్రభ' దినపత్రిక మద్రాసులో ప్రారంభమైంది. తొలుత ఖాసా సుబ్బారావు తర్వాత న్యాపతి నారాయణమూర్తి సంపాదకులుగా వున్నారు. తర్వాత నార్ల వెంకటేశ్వరరావు సంపాదకుడయ్యారు.నార్ల ప్రవేశంతో 'ఆంధ్రప్రభ' తెలుగు పత్రికా రచన ఆధునీకరణ దిశకు వేదికగా మారిందని

చెప్పవచ్చు. జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలకు తగిన ప్రాధాన్యతనివ్వడంతో పాటు వాటి అనువాదం సరళంగా, పాఠకులను ఆకర్షించే విధంగా చేసేది. సమకాలీనాంశాలైన, పౌరాణికాంశాలైనా నిక్కచ్చిగా ఉండేవి నార్ల అభిప్రాయాలు, ఆ అభిప్రాయాలెంత నిశితంగా ఉండేవో వాటిని వ్యక్తీకరించేందుకు ఆయన వాడిన భాష కూడా అంత సూటిగా శక్తిమంతంగా వుండేది.

పత్రికా భాషను గ్రాంథిక చెర నుండి విడిపించి వ్యావహారికం వైపు నడిపించిన పత్రికల్లో కమ్యూనిస్టు పత్రికలకు కూడా తగిన పాత్ర వుంది. నవశక్తి, స్వతంత్ర్య భారత్, ప్రజాశక్తి (వారపత్రిక), విశాలాంధ్ర, ప్రజాశక్తి (దినపత్రికలు) చెప్పుకోదగ్గవి.

1960 లో విజయవాడ నుంచి ప్రారంభమైన 'ఆంధ్రజ్యోతి' పత్రికా భాషకు మరింత పదును తెచ్చింది. పూర్వం 'ఆంధ్రప్రభ'లో నార్ల వెంకటేశ్వర రావు చేసిన ప్రయోగాలను 'ఆంధ్రజ్యోతి'లో కొనసాగించారు. వాడుక భాషకు పుష్టి కలిగించే విధంగా సంపాదకీయాలు, వార్తలు రాశారు. మాండలిక పదాలను కూడా పత్రికా రచనలోకి తెచ్చి ప్రామాణీకరించే ప్రయత్నం చేశారు. అనేక కొత్తపదాలను సృష్టించి అవి స్థిరపడేలా చేశారు. 1960 లో సికింద్రాబాదు నుంచి ప్రారంభమైన 'ఆంధ్రభూమి' సైతం ఈ కృషిలో సముచిత భాగస్వామ్యం వహించింది. గోరాశాస్త్రి సంపాదకీయాలు చిరస్మరణీయాలు.

## మూడవ దశ

తెలుగు పత్రికల భాషా పరిణామం 'మూడవ దశ' 'ఈనాడు' (1974)తో ప్రారంభమవుతుంది. 20వ శతాబ్ది పూర్వార్థం ముగుస్తుండగా పత్రికా భాష వ్యావహారికం వైపు మళ్ళిన విషయాన్ని ఇదివరకే చర్చించుకున్నాం. 'జనవాణి' వేసిన మార్గంలో తదనంతర పత్రికలు మునుముందుకు సాగాయి. తెలుగునాట రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విశేషాలే గాక అనువాదం ద్వారా జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను పాఠకులకు సుగమంగా అందించేందుకు పత్రికలు ఎంతగానో దోహదం చేశాయి. ఇలాంటి పూర్వరంగంలో 'ఈనాడు' దినపత్రిక విశాఖలో ఆవిర్భవించింది.

నార్ల తరం తర్వాత తెలుగు పత్రికల భాషను మలచడంలో నవనవోన్మేషంగా కృషి చేస్తూ అక్కడక్కడ వున్న పాత్రికేయులను ఈనాడు తన వద్దకు తెచ్చుకుంది. తెలుగు దినపత్రిక పాఠకుల ఆలోచనలను ప్రభావితం చేస్తూ వారి పఠనాభిరుచిని పెంపొందిస్తూ వారి పఠనావసరాలకు దీటుగా రూపొందుతూ వచ్చింది.

పాఠకుల సంఖ్యను పెంచుకోవాలి. సూర్యోదయానికల్లా దినపత్రిక వారికి చేరాలి. ప్రపంచాన్ని వారికళ్ళ ముందు ఆవిష్కరించాలి. ఈ పనిని వ్యూహాత్మకంగా చేయాలి అని 'ఈనాడు' భావించింది. అన్నిటికీ మించి పాఠకుల వద్దకు వెళ్లడానికి భాషను ప్రధానంగా ఎంచుకుంది. పత్రికా భాషను ఆధునీకరించే పనిని చేపట్టింది. భాషలో ఏకరూపత వాంఛనీయమని తీర్మానించింది. వివిధ ప్రాంతాల పత్రికా రచయితలు భిన్న శైలుల్లో రాసే రచనల్లో ఒక ఏకరూపత ముఖ్యావసరమని నిర్ణయించి రాసే భాషకు విధినిషేధాల్ని ఏర్పరుచుకొంది. ఈ విధినిషేధ ప్రణాళికకు శైలీ పత్ర రూపం కల్పించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక ముఖ్యమైన దశలో పలువురు పత్రికా రచయితలు 'ఈనాడు' ను వేదికగా చేసుకొని పత్రికా భాషకు కొత్తదారి వేశారు. ఆ దారిని తర్వాత పత్రికలన్నీ అనుసరించి మరిన్ని ప్రయోగాల్ని చేశాయి.

"దేశ రాజకీయ రంగం కొత్త మలుపు తిరిగింది. స్వాతంత్ర్య పోరాట కాలం నుంచీ దేశానికి సారథ్యం వహించిన కాంగ్రెస్ 30 సంవత్సరాల పాటు సాగించిన పాలన అంతమైంది. నూతన శకారంభంగా జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే ఎన్నికలలో కలిసికట్టుగా పోటీ చేసి విజయం సాధించిన జనతా, ప్రజాస్వామ్య కాంగ్రెస్‌లు కొత్త లోక్‌సభలో వేరు వేరు గ్రూపులుగానే వ్యవహరించనున్నాయి. కొత్త మలుపులో ఇవ్వాళ ఒక నూతన పరిణామం. ప్రజాస్వామ్యమా? నియంతృత్వమా? లేక 'సుస్థిరతా? అస్థిరత్వమా?' అనే నినాదాలు మధ్యసాగిన ఎన్నికల ఫలితాలను యావత్ ప్రపంచం గమనిస్తున్న తరుణంలో దేశపాలనా బాధ్యతలను జనతాపార్టీ స్వీకరిస్తున్నది." ఈనాడు: 1977 మార్చి 25.

తర్వాత వచ్చిన పత్రికలన్నీ చిన్నవీ, పెద్దవీ, దినపత్రికలు, వారపత్రికలు అన్న తేడా లేకుండా వాడుక భాషలోనే అన్ని అంశాలనూ రాయడం కొనసాగించాయి.

వార, మాస పత్రికల్లో వార్తాంశాలకు స్థానం తక్కువైనా వ్యావహారిక భాష విషయాలలో మాత్రం అందరికీ అనుసరణీయమైంది. సాహిత్యాంశాలు కూడా పత్రికల వార్తా రచనలో మెదిలే ప్రయోగాల నుంచి స్ఫూర్తిపొందాయి. సాహిత్యేతరమైన శీర్షికలు, సమకాలీనాంశాలు రచనకు పత్రికాభాష, దాని నూతన పరిభాష ఆలంబనగా నిలిచింది. గ్రాంథిక భాషకు పూర్తిగా దూరమై వాడుకభాషలో లిఖిత సంస్కృతిని దాటి కొంత మౌఖిక సంస్కృతి చోటు చేసుకోనారంభించింది.

ఈ దశలో చెప్పుకోదగిన కర్తవ్యాన్ని నిర్వహించిన 'ఉదయం', 'వార్త' దినపత్రికలు ప్రధానమైనవి. ఉదయం (1984) రాకతో దినపత్రికా రంగం మీదకు మరో కొత్త కెరటం వచ్చినట్లయింది. 'ఈనాడు' అంతకు పూర్వం పత్రికా భాష ఆధునీకరణను ప్రవేశపెట్టి కొత్తగా పాత్రికేయుల్ని తయారు చేసి, వారికి ఆధునిక రచనావశ్యకతను ఒంటబట్టించే ప్రయత్నాల్ని చేస్తే 'ఉదయం' ఆ ప్రయత్నాలను విస్తరింపజేస్తూ ముందుకు సాగింది. మరింత పెద్దఎత్తున పత్రికా రచయితల్ని తయారు చేసింది. ఒక కొత్త పత్రిక అందునా కొత్త బాధ్యతలతో కొత్త పోటీలో నిలిచే ఉద్యమతత్వంతో వచ్చిన పత్రిక కావడం వల్ల ఇందుకోసం కష్టపడవలసి వచ్చింది. అంతకు ముందున్న శీర్షికలు మరింత విస్తరించాయి. మరిన్ని వార్తలకు చెందిన పాఠకుల కోసం ప్రత్యేకమైన రచనలు వచ్చాయి. తదనుగుణంగా పాత్రికేయులను ప్రత్యేకంగా మలచుకోవడం ప్రారంభమైంది. ఒక్కసారిగా పాత్రికేయుల సంఖ్య పెరగడంతో భాషాపరమైన నాణ్యత ముఖ్యపట్టణాల ఎడిషన్ల స్థాయిలో చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కొత్తగా పత్రికలో చేరిన వారిలో ప్రగతిశీల ఉద్యమాల నేపథ్యం నుంచి వచ్చిన వారు భాషను కూడా కొత్త పుంతలు తొక్కించారు.

1996లో 'వార్త' ప్రారంభమైంది. ఏకకాలంలో పది కేంద్రాల నుంచి వెలువడిన తొలి తెలుగు దినపత్రికగా నిలిచింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంది. పాత్రికేయ యంత్రాంగాన్ని మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు విస్తృత పరుచుకుంది. కొత్తగా శాసనసభ నియోజకవర్గాలు, రెవెన్యూ సబ్ డివిజన్ల స్థాయిలో కేంద్రాల్ని ఏర్పాటు చేసుకుంది. పుటలు విస్తరించాయి. అంతకు ముందు ఈనాడు, ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ వంటి దినపత్రికలు ప్రారంభించిన స్థానిక ఎడిషన్లు నిలదొక్కుకున్నాయి. మరొక వ్యూహాత్మక

పత్రికగా ఆవిర్భవించిన 'వార్త' ఆ పోటీని అధిగమించి అగ్రగామిగా నిలదొక్కుకునే ప్రయత్నం చేసింది. ఇతర పత్రికల్లో అనుభవం గడించిన వారిని ఉన్నత స్థానాల్లో నియమించుకోవడం వల్ల భాష విషయంలో బాలారిష్టాలు లేకుండానే సాఫీగా ముందుకు నడవగలిగింది.

ఈ దశలో అన్ని దినపత్రికలకు భాషా విషయంగా ఎదురైన సవాలు – ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ, ముందుకు వచ్చిన నూతన సాంకేతిక విప్లవం. అంతకు ముందు రాజకీయంగా తప్ప దేశంలో పెద్దగా మార్పులు లేని దేశం మనది. కొత్త మార్పులు చాలా తీవ్ర స్థాయిలో రావడంతో పత్రికా భాష బాధ్యత పెరిగింది.

ప్రపంచంలోని ఏ మూలనుంచైనా నడపగలిగే స్థాయికి పత్రికలు ఎదగాలి. ఏ మూల నుంచి ఏ కొత్త అంశం వెలికి వచ్చినా అందుకొని తన పాఠకులకు సులభమైన శైలిలో అందించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ముద్రణ సాంకేతిక పరిజ్ఞానం మారింది. కంపోజింగ్, పేజినేషన్ పరిజ్ఞానం మారింది. తక్కువ శ్రమతో క్షణాల్లో అద్భుతమైన పత్రికను మారుమూల ప్రాంతాలకు సైతం అందించే సమయం వచ్చింది. సరిగ్గా ఈ తరుణంలో పత్రికాభాషా పరిణామంలో నాలుగవ దశ ప్రారంభమయింది.

## నాలుగవ దశ

నాలుగవ దశలో పత్రికా భాష ఎలక్ట్రానిక్ మాధ్యమాల ప్రభావంతో ప్రసార మాధ్యమాల భాషలో వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకొని ప్రసార మాధ్యమాల (మీడియా) భాషగా విస్తృతమైంది. 1940 వ దశకంలో టెలివిజన్ మాధ్యమం ప్రారంభమై కొన్నేళ్ళపాటు స్థిరపడే ప్రయత్నం చేసింది. విదేశీ ఉపగ్రహాల శక్తిని వినియోగించుకుంటూ విదేశాల నుంచే ఇక్కడికి ప్రసారాల్ని అందించింది. ప్రధానంగా తొలుత కేవలం వినోద ప్రధానమైన కార్యక్రమాలను రూపొందించి టేపులను పంపి అక్కడెక్కడి నుంచో ప్రసారం చేసింది. సినిమాలు, సినిమా ఆధారిత కార్యక్రమాలు దాటి ఇతర కార్యక్రమాలను ఎక్కువగా స్పృశించలేకపోయింది. కమ్యూనికేషన్ల శాఖ ప్రైవేటు టెలివిజన్ ఛానళ్ళకు అప్‌లింకింగ్ సౌకర్యం కల్పించిన తర్వాత టెలివిజన్ మాధ్యమం ఒక్కసారిగా ఊపందుకుంది. వార్తా ప్రసారాలు వచ్చాయి. వార్తాఛానళ్లు వచ్చాయి. 24 గంటల ప్రసారాల్ని అందించడం ప్రారంభించాయి.

ఈ రంగంలోకి గతంలో ఎన్నడూ లేనంత మందిని తీసుకువచ్చాయి. అంతకు ముందున్న పత్రికా ప్రపంచానికి తోడై మరొక ప్రత్యామ్నాయ దృశ్య ప్రపంచం ఆవిష్కృతమైంది.

ఈ దశలో పత్రికల వృద్ధి సమస్యపై సందేహాలు వ్యక్తమయ్యాయి. 24 గంటల తర్వాత వచ్చే పత్రికలు కంటే సంఘటన జరుగుతున్న సమయంలోనే ప్రత్యక్ష ప్రసారం ద్వారా టి.వి.లో తిలకించే పరిణామం వచ్చింది. ఈ సంఘటన వివరాలను పత్రికల్లో రేపు ప్రచురిస్తే, జనం చదువుతారా అనే సందేహం వచ్చింది. అయితే టీవీల్లో చూస్తున్నారు. పత్రికల్లోనూ చదువుతున్నారు. ఈ విషయాన్ని అనేక అధ్యయనాలు ధ్రువీకరించాయి. పత్రికల సర్కులేషన్ ఏటా సగటున 5 శాతం వంతున పెరుగుదల కనిపిస్తోంది. దీనితో పత్రికలకు మనుగడ సమస్య ఎదురుకాలేదని అర్థమయింది. ఎవరి దారిలో వారి ప్రయాణం సాగుతుంది. భాషా వినియోగంలో పత్రికలు, టెలివిజన్ వేటికవిగా కొత్తదనాన్ని తెచ్చుకుంటూ ఒకదానితో మరొకటి నేర్చుకుంటూనే ముందుకెళ్తున్నాయి.

సమాచార విజ్ఞాన విప్లవం- ఈ దశలో పత్రికల్లోనూ, టెలివిజన్ మాధ్యమంలోనూ సంపూర్ణంగా కంప్యూటరీకరణ రాజ్యమేలుతోంది. భాష విషయంలో పత్రికల్లో కొంత కట్టుబాటు ధోరణి, సంప్రదాయకమైన ఆలోచనతో కూడిన రచనా దృష్టి కనిపిస్తుండగా టెలివిజన్‌లో మౌఖిక భాషతో కూడిన వివరణ, ప్రసంగ ధోరణి, వినిపిస్తోంది. వెబ్ జర్నలిజంలో సంక్షిప్త రూపాలతో భాష వార్తా వేగాన్ని, రచనా వేగాన్ని అందిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనువాద పదాలు, అనుసరణ ప్రయోగాలు, భావ ప్రధానంగా పదాల కలయికలు చూస్తున్నాం. భాషకు రూపాంతరీకరణలో ప్రధానమైన దశ ఇది.

పత్రికా రంగంలో 'సాక్షి', 'సూర్య' వంటి కొత్త దినపత్రికలు, అంతకుముందున్న పత్రికలు తమ భిన్న ప్రచురణ కేంద్రాల నుంచి ఎడిషన్లను అందిస్తున్నాయి. పాత్రికేయ సిబ్బందిని ఎంపిక చేసుకొని తగిన శిక్షణనిచ్చి వార్తాసేకరణ రచనా బాధ్యతల్ని అప్పగిస్తున్నాయి. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు, రాష్ట్ర రాజధాని నుంచి జాతీయ, అంతర్జాతీయస్థాయి వరకు వార్తల్ని, విశేషాల్ని అందించే క్రమంలో భాషా విషయకంగా కొన్ని మార్పులు

స్పష్టమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రరాజధాని, జాతీయ అంతర్జాతీయ రంగంలో ప్రపంచీకరణ, పారిశ్రామిక, ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో క్షణక్షణానికీ సంభవిస్తున్న కొత్త పరిణామాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం జరగుతోంది.

ఓబామా ప్రమాణస్వీకారం నుంచి మైకెల్‌జాక్సన్ మరణం వరకు, వరదలు, భూకంపాల నుంచి సంపూర్ణ సూర్యగ్రహణం వరకు మీడియా జర్నలిస్టులకు భూగోళమే తమ కార్యరంగంగా విస్తరించింది. ఈ క్రమంలో అనుక్షణం అనునిత్యం జరిగే పరిణామాలను మాతృభాషలో అందించడం సవాలుగా మారింది.

అపరిమితమైన కొత్త పదాలను అప్పటికప్పుడే అనువదించడం పాత్రికేయులకు తలకుమించిన పనే అవుతున్నది. అనువాదంలో, వార్తా రచనానుభవంలో, భాషా పరిజ్ఞానంలో పండిపోయిన వారు ఈ సవాలును ఎదుర్కొంటున్నారు. తెల్లవారేటప్పటికి పాఠకుల ముందు ప్రపంచ విహంగ వీక్షణాన్ని ఆవిష్కరిస్తున్నారు. పత్రికను అధ్యయనం చేయాలిగాని పూర్వంతో పోలిస్తే ఇప్పుడు నిత్యం పెద్ద సంఖ్యలో కొత్తపదాలు పత్రికల్లో దర్శనమిస్తున్నాయి.

టీవీ రంగంలో ఉన్న పోటీ ఇంతా అంతా కాదు. ఒకవైపు ఇతర భాషా ఛానళ్ళతో పోటీ, మరొకవైపు తెలుగు ఛానళ్ళతోనూ పోటీ. ముంబాయి దాడుల సంఘటన వార్తలను ఎప్పటికప్పుడు అందించేందుకు తమ యంత్రాంగాన్ని ఆగమేఘాల మీద అక్కడికి పంపించడం. ఘటనా స్థలం నుంచి రిపోర్టర్ తన వద్దనున్న సమాచారాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వివరించడం ఒక సవాలు. నిమిషాలు, గంటలసేపు సమాచారాన్నంతటినీ గుక్క తిప్పుకోకుండా దృశ్యాలకనుగుణంగా వివరిస్తారు. అక్కడి పరిణామాలపై మన భాషరాని అధికారులు, ప్రత్యక్ష సాక్షులు వ్యాఖ్యానిస్తే అనువాదం కష్టమవుతుంది. ముందస్తుగా రికార్డు చేసిన అంశాలను ఇక్కడ ప్రసార కేంద్రంలోని వార్తా సిబ్బంది అనువాదం ద్వారా మన భాషలో ఇవ్వడం సాధ్యమే. టీవీ ఛానళ్ల ప్రసారాల్లో వార్తలు, ప్రత్యక్ష ప్రసారాల దగ్గర్నుంచి, న్యూస్ సెంటర్‌లో నిర్వహించే చర్చాకార్యక్రమాలు, నిపుణుల ప్రసంగాలన్నీ ఒక ప్రణాళిక ప్రకారం నిర్దిష్టంగా రాసుకొని భాషా దోషాల్లేకుండా చెప్పడం అసాధ్యమైపోతుంది. ఈ కార్యక్రమాలకు లిఖిత సంప్రదాయాన్ని అనుసరించే భాష సాధ్యమే. ఈ కార్యక్రమాల్లో దృశ్యాలకు అనుగుణంగా - వాయిస్ ఓవర్ ద్వారా,

న్యూస్ రీడర్ల ద్వారా వార్తలందించేందుకు టెలివిజన్ రిపోర్టర్లు, ఎడిటోరియల్ సిబ్బందికి భాషా పరిజ్ఞానం చాలా అవసరం. యాంకర్ల భాషపై ఇప్పటికే విమర్శలున్నాయి.

ధ,థ,భ,ఫ వంటి మహా ప్రాణాల ఉచ్చారణల విషయంలో టెలివిజన్‌లో వ్యాఖ్యాతలు ఎవరి భాషా పరిజ్ఞానాన్ని బట్టి విద్యాస్థాయిని బట్టి వారు వ్యవహరిస్తూ, ఏది సరైన ఉచ్చారణో తెలియని ఆయోమయ స్థితిని కలిగిస్తున్నారు. వార్తా సిబ్బందిలో కూడా భాషా పరమైన అవగాహన అడుగంటకుండా చూసుకోవాలి. లేకపోతే ప్రసారం చేసే అపస్వరమైన భాషే సరైనదని భావించాల్సి వస్తుంది.

పత్రికల్లో కూడా భాషాపరమైన కొత్త పరిణామం చోటు చేసుకున్నట్టు కనిపిస్తున్నది. విద్యా విధానంలో భాషాపరమైన బోధన లోపభూయిష్టంగా ఉండడం వల్ల ఈ తరం ఇటు తెలుగు, అటు ఆంగ్లం ఏదీ కావలసినంతగా నేర్చుకోలేకపోతున్నారు. ఈ ధోరణి పత్రికా రంగంలోనూ, టీవీ రంగంలోనూ ఉంది. రాయడంలో, పలకడంలో దోషాలు సర్వసాధారణమవుతున్నది. ఇది వాంఛనీయం కాదు. ఈ విషయంలో మీడియా సంస్థలు, ప్రభుత్వం ఆలోచించాలి.

పత్రికల సిబ్బందికైనా, టెలివిజన్ సిబ్బందికైనా భాషాపరమైన అవగాహన ఎంతో అవసరం. వారి ఎంపిక పరీక్షలో వృత్తిపరమైన పరిజ్ఞానం, భాషా పరమైన మెలకువలు రెండూ ప్రాధాన్యం వహిస్తాయి. ఒక్కోసారి వృత్తిపరమైన పరిజ్ఞాన ప్రాధాన్యంతో ఉద్యోగంలోకి రావచ్చు. వచ్చిన తర్వాతయినా భాషపై పట్టు సాధించాలి.

భాషలో వ్యావహారిక రచనకు, మాండలిక రచనకు స్పష్టమైన విభజన రేఖ వుంది. నేడు గ్రాంథిక భాష కూడా వ్యావహారికమే అయినా అక్కడక్కడా పాత గ్రాంథిక పదజాలం తారసపడుతున్నది. ఈ తేడాలను తెలుసుకోవాలి. ప్రామాణిక భాషను అలవరచుకోవాలి. ఏ అంశంలో పట్టభద్రులైనా ప్రసారమాధ్యమాల్లో ఉద్యోగాలు పొందే అవకాశాలు విస్తారంగా వున్నాయి. అయితే భాషపై పూర్తి అవగాహన, రచనా సామర్థ్యం చాలా ముఖ్యం.

వ్యాసకర్త – ***ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు***

# ప్రసార మాధ్యమాలలో భాష

*డా॥ ఆర్.అనంత పద్మనాభరావు*

మాట్లాడే భాషకు, వ్రాసే భాషకు చాలా తేడా వుంది. పత్రికల భాష వేరు. రేడియో భాష వేరు. 1960 దశకాలలో ప్రసార మాధ్యమాలలో రేడియో సామ్రాజ్యం వెలుగుతున్నప్పుడు ఆకాశవాణిలో వాడే అచ్చమైన తెలుగు భాషను ఇంటిల్లిపాదీ ఆస్వాదించేవారు .కేవలం శ్రవ్యమాధ్యమైన రేడియోలో శ్రుతిసుభగమైన ప్రసంగాలు, నాటకాలు, రూపకాలు వినిపించేవి.

ప్రవచనశాఖ – అని రేడియోలో ఒక ప్రత్యేక విభాగమే వుంది. గతంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి, జాషువా, దాశరథి, ఉషశ్రీ, రావూరి భరద్వాజ వంటి మహోద్దండులు ఈ శాఖాధిపతులు. రేడియోకి ఎలా వ్రాయాలి అని నేర్పేవారు. పత్రికలో వార్తను మళ్లీ మళ్లీ చదివి అర్థం చేసుకోగలం. రేడియోలో అలాకాదు విన్నంతనే అవగాహనకు రావాలి. దీర్ఘ సమాసాలు, ప్రౌఢ పదబంధాలు, సుదీర్ఘవాక్యాలు సరిపడవు. సులభమైన భాషలో చెప్పదలచుకున్న అంశాన్ని 10–15 నిమిషాలలో ముగించాలి.

తొలినాళ్లలో సమాచార ప్రసార మంత్రిత్వశాఖ మంత్రిగా పని చేసిన బి.వి.కేస్కర్ ఒకమాట అన్నారు.

"Radio is not a Literary Club" (రేడియో సాహిత్యపరమైన క్లబ్‌కాదు.) ఇందులో వాడే భాష గురించి నెహ్రూ వరకు ఫిర్యాదులు వెళ్లాయి. రేడియోలో హిందీభాష సాహిత్యపరంగా వుంటోందనీ, ఖడీబోలీగా చోటు కల్పించాలనీ ఒక వర్గం వాదించింది. బెజవాడ గోపాలరెడ్డి అప్పుడు సమాచార ప్రసారశాఖల మంత్రి. భాషాపరంగా ఒక కమిటీని నియమించారు. సరళమైన భాషను ప్రసారాలలో వాడాలని ఆ కమిటీ సూచించింది.

**ప్రసారమాధ్యమాల ప్రధానధ్యేయం** – శ్రోతలకు ప్రేక్షకులకు అర్థమయ్యే భాష వాడటం. ఏ వర్గానికి ఉద్దేశించి కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నారో వారికి దగ్గరలో వుండే భాషను ప్రయోగించాలి. లేకుంటే ప్రసారాల ప్రయోజనం శూన్యం. అందుకే ఆయా శ్రోతలనుద్దేశించిన కార్యక్రమాలకు వారికి తగిన భాషాప్రయోగం చేసేవారు. తమ పాండిత్య ప్రదర్శన చేసేవారు కాదు.

విజ్ఞాన, వినోద, వికాసాలను అందించడమే ఆకాశవాణి లక్ష్యం. అందుకు భాషామాధ్యమం ముఖ్యం. భాషలో వివిధ ప్రాంతాలకు చెందిన మాండలికాలు ఉన్నాయి. కాని పత్రికలు ఒక ప్రామాణిక భాషను ధ్రువపరచాయి. నార్ల వెంకటేశ్వరరావు ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి దినపత్రికల సంపాదకులుగా ఉన్నప్పుడు పత్రికల భాషను ప్రామాణీకరణ చేసి చూశారు. అలాగే ఆకాశవాణి కూడా ప్రాంతీయ యాసలకు తావివ్వకుండా సరళీకరించిన భాషను వాడింది. అయితే వ్యవసాయ కార్యక్రమాలు, గ్రామీణ కార్యక్రమాలలో, కార్మికుల కార్యక్రమాలలో ఆయా ప్రాంతాల మాండలికాలకు పట్టం గట్టారు. హైదరాబాదు ఆకాశవాణి ప్రసారం చేసిన కార్మికుల కార్యక్రమంలో Stock Characters అయిన బాలయ్య, చిన్నక్క తెలంగాణ మాండలికంలోనే తమ సంభాషణలు కొనసాగించారు. కడప ఆకాశవాణి రాయలసీమ మాండలికానికి పట్టం గట్టింది. ఇతర సాహిత్యకార్యక్రమాలలో, రూపకాలు, నాటకాలలో ప్రామాణిక భాషనే ప్రయోగించారు.

వ్రాసే భాషకు, మాట్లాడే భాషకు హస్తిమశకాంతరం. 20 వ శతాబ్ది తొలినాళ్లలో తెలుగునాట గ్రాంథిక వ్యావహారిక భాషా పదాలు చెలరేగాయి. గిడుగు పిడుగు వ్యావహారికోద్యమ బావుటా పూరించారు. అయితే పత్రికలు, రేడియో,

చలనచిత్రాలు, సృజనాత్మక సాహిత్యము వ్యావహారిక భాషకే పట్టంగట్టాయి. కోస్తా ప్రాంతంలో సాధారణజనులు మాట్లాడే భాషనే పత్రికలు వ్యాప్తం చేశాయి.

**రేడియో కృషి :** ప్రసార భాషను ప్రామాణీకరణం చేయడం ఆకాశవాణి వంతయింది. 1938 జూన్ 16 న మదరాసులో ఆకాశవాణి ప్రారంభమైంది. తొట్టతొలి ప్రసంగం రూపంలో ఆరాత్రి 'భారతదేశము-రేడియో' అనే సందేశాన్ని అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రధాని (ముఖ్యమంత్రి) సర్ కూర్మా వెంకటరెడ్డినాయుడు తెలుగులో మాట్లాడారు. వారి సందేశంలో ఇలా హెచ్చరించారు:

"ప్రస్తుతం మన దేశమునందు అన్నిటికంటే విద్యావ్యాప్తి చాల ముఖ్యము కనుక ఆకాశవాణిని సర్వజనోపకరమైన విషయములందును, ఆనందము కలుగజేయు పనులయందును స్వచ్ఛ మనసుతో ఉపయోగింపవలెనని నా హెచ్చరిక". – బహుజన సుఖాయ, బహుజన హితాయ – అనే లక్ష్యాన్ని ఆయన నొక్కి చెప్పారు.

1938 జూన్ 18 న గిడుగు రామమూర్తి పంతులు 'సజీవమైన తెలుగు' అనే అంశంపై ప్రసంగించారు. అంటే ఆకాశవాణి తన ప్రసారభాషను గూర్చి ఆలోచనలో పడింది. సజీవమైన భాషకే ప్రాధాన్యమిచ్చింది. కార్యక్రమసరళిలో అన్ని వర్గాల అవసరాలను దృష్టిలో పెట్టుకొంది. బాలురు, మహిళలు, పల్లీయులు, కార్మికులు, రైతులు – ఇలా వివిధ వర్గాల వారికి వినోద విజ్ఞానాలు సమకూర్చడానికి ప్రయత్నించింది.

సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖరశర్మ మదరాసు కేంద్రం నుండి చేసిన 'మన నాగరికత' అనే ప్రసంగధోరణి బాగా పరిశీలిస్తే, శ్రోతలనాడిని ఆయన ఎలా పట్టుకున్నారో అవగతమవుతుంది. మాట్లాడుతున్నట్లుగా, ఎదుటివ్యక్తికి విడమరచి చెబుతున్నట్లుగా ఉంది ఆ శైలి.

> "ఈయుగం ఎంత చిత్రమైనదో? ఇదంతా పరిశోధకయుగం
> వైజ్ఞానికయుగం. ప్రతి విషయంలోనూ పరిశోధనే !
> నిప్పు,నీరు,గాలి, ధూళీ ఇంతెందుకు మన పంచేంద్రియాల
> ద్వారా గ్రహించే ప్రతి విషయమూ అఖండ పరిశోధనకు
> పాటుపడుతున్నది."

ఇంత సరళమైన భాష వింటున్న శ్రోత తాదాత్మ్యం చెంది ప్రసంగకర్త ధోరణితో మమేకమవుతాడు. లేదంటే గ్రాంథికంలో మాట్లాడితే రేడియో కట్టివేస్తాడు.

**భాషా పాఠాలు :** విద్యార్థులకు విద్యాప్రసారాలు 1938 అక్టోబర్ నుండి మొదలయ్యాయి. పాఠ్యాంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ వారి నిపుణుల సహకారంతో ఈ ప్రసారాలు ఐదు దశాబ్దాలు అవిచ్ఛిన్నంగా కొనసాగాయి. పాఠశాలల్లో రేడియో సెట్లు పెట్టి విద్యార్థులకు ఆయా ప్రసారాలు వినిపించేవారు. భాష సరళసుందరం. నాటికలు, రూపకాల రూపంలో విద్యార్థులకు ఆసక్తిదాయకంగా ఈ ప్రసారాలు కొనసాగాయి. అలానే సంస్కృత భాషా పాఠాలను కేశవపంతుల నరసింహశాస్త్రి రెండు దశాబ్దాలు సహజ సుందరంగా కొనసాగించారు. 'కేయూరాని విభూషయంతి' అనే సంస్కృత శ్లోకంతో ప్రారంభమయ్యే ఈపాఠాలు సంస్కృత భాషాభిలాషను పెంపొందించాయి. అదేవిధంగా హిందీపాఠాలు ప్రసారమయ్యాయి.

టేప్‌రికార్డింగు సదుపాయంలేని తొలి రోజులలో ప్రసారాలు ప్రత్యక్షంగా ప్రసారమయ్యేవి. (Live Broad Casts) అలా చేయడం వల్ల ఆ ప్రసారాల గురుతులు, ఆనాటి రేడియో పరిభాష గాలిలోనే కలిసిపోయాయి. భావి పరిశోధకులకు అందుబాటులో లేవు.

**ఛానళ్ల ఆవిర్భావం :** దూరదర్శన్ ప్రసారాలు మొదలైన తర్వాత ఆకాశవాణి ధోరణినే దూరదర్శన్ భాషా విషయకంగా పాటించింది. అ తర్వాత గత మూడు దశాబ్దాలలో విశృంఖలంగా తెలుగు ఛానళ్లు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా అవి వార్తా ఛానళ్లు. మధ్య మధ్యలో వినోదం కోసం సీరియళ్లు, వినోదాత్మక కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నాయి.

**యాంకర్ల సంకరభాష :** వేగంగా మాట్లాడాలనే తాపత్రయంతో తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలను కలగా పులగం చేసి వ్యాఖ్యానాలను టి.వి. యాంకర్లు మొదలుపెట్టారు. ఇప్పుడొక Short Break అంటూ సెన్సేషనల్ వార్తలను మాటిమాటికీ అవే దృశ్య ఖండికలతో ప్రసారం చేస్తున్నారు. ఊ.ప్ర.ఆ రేటింగ్‌ల ఆధారంగా ప్రకటనల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకొనే ప్రయత్నాలలో పోటీపడుతున్నారు. వర్ణ సంకరమైతే పాతరోజులలో సంప్రదాయవాదులు

బాధపడినట్లే ఈరోజు భాషాసంకరాన్ని వినలేక/చూడలేక మధ్య తరగతి జనాలు మధనపడుతున్నారు.

ప్రైవేటు యఫ్.యం ల ఝుంఝూ మారుతం:

2000 సంవత్సరంలో భారత ప్రభుత్వం యఫ్.యం ప్రసారాలు ప్రైవేటీకరణ చేసింది. అలా ప్రధాన నగరాలలో రేడియోమిర్చీ, రేడియోసిటీ, బిగ్‌యఫ్.యం. రెడ్‌యఫ్.యం పేర పలు కేంద్రాలు ప్రసారాలుమొదలెట్టాయి. ఇందులో యాంకర్లు శ్రోతలకు తమ నూతన భాషా సృష్టితో చేరువయ్యారు. పురాణకథ- రామాయణం- చెబుతూ ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో మాట్లాడుతున్నారు. "సీత రావణుణ్ణి చూసి ఒక్కసారిగా డంగైపోయింది." ఇలా గంగార్ఝురిలా మాట్లాడటం బాగుంది. ఆకర్షణీయమే కాని భాషా సంకరం అవసరమా? మృదువైన సరళసుందర పదాలు లేవా? ఇది భవిష్యత్ తరాలు నిర్ణయించవలసిన అంశం. సినిమాల ప్రమాణాలు పడిపోయాయి- అనే వారికి సమాధానం- "ప్రేక్షకులు చూస్తున్నారు కాబట్టి అలా తీస్తున్నారు" అని. అలానే భాషా విషయంలో సరిపెట్టుకోవాలి.

వ్యాసకర్త - ***దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్***

# 'తెలుగు తక్కువ' మనుషులతోనే సమస్యలు - భాషా భేషజాలు

*- దోర్బల బాలశేఖరశర్మ*

అచ్చుతప్పుల నుంచి మొదలుకొని అనవసర ఆంగ్ల పదాల చొరబాటు దాకా, సంకర పదాల వంకరతనం నుంచి అశ్లీల వర్ణనల స్వైరవిహారం వరకూ ఎన్నని పత్రికలలో చదవడం లేదు? ప్రసార మాధ్యమాలలో ఎన్నెన్నని వినడం లేదు? ప్రచురణ, ప్రసార రంగాలలో ఇప్పుడు కనిపిస్తున్న, వినిపిస్తున్న భాష వికృతాలను తట్టుకోలేని మనసులకు గమ్మున కళ్లు, చెవులు మూసుకోవడం తప్ప మరేమీ చేయలేని నిస్సహాయ స్థితి. దీనికంతటికినీ ఎవరు కారణం? ఏమిటా నేపథ్యం?? ఇంకెంత కాలం మన భాషామతల్లికి ఈ అంటు స్వరూపం???

మానవాభివృద్ధికి, దేశ ప్రగతికి భాషలు సోపానాలు. మనుషులను సంస్కారవంతుల్ని చేసి, సభ్యసమాజం వైపు నడిపించే బృహత్ కార్యంలో వ్యక్తికి అంతర్గత శక్తిలా ఉపయోగపడేది మాతృభాష. కాబట్టి, ఎవరి అమ్మభాషల స్థానంలోకైనా అన్యభాషలు వచ్చి చేరకూడదు. దేని విలువ (స్థానం) దానిదే. ఏ ప్రజలకైనా ఇతరేతర భాషలేవైనా (ఆంగ్లంతో సహా) ఓ 'ఆసరా' కావాలి. అంతేకాని,

మాతృభాషను మించిన రీతిలో కొత్త భాషే సర్వస్వం (ఆధారం) కాకూడదు. కానీ, మన దగ్గరే కాదు, ప్రపంచవ్యాప్తంగానూ జరుగుతన్నది ఇందుకు పూర్తిగా విరుద్ధం.

ముఖ్యంగా ఇవాళ్టి మన 'పత్రికలు, ప్రసార మాధ్యమాలలో మాతృభాష తీరుతెన్నులు' పై పరిస్థితికి నిలువుటద్దం. ఇతర రంగాల మాటెలా ఉన్నా ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ వంటి ప్రసార సాధనాలు (మీడియా) లో మన భాషామతల్లికి ఇస్తున్న స్థానం ఇప్పటికీ దయనీయం. ఇన్నేళ్ల దేశ స్వపరిపాలన తర్వాత కూడా తెలుగు సొగసుదనం కొట్టొచ్చే పరిస్థితులు ఆయా రంగాలలో ఇంకా నెలకొనలేదు. ఆంగ్ల మాధ్యమ ప్రభావంలో పడి కొట్టుకుపోతున్న ఈ తరాలకు తెలుగుదనం రుచి చూపించ వలసిన అవసరం లేదా? ఈ పని చేయాల్సిన బాధ్యత మనందరిది కాదా ! ఒక్కసారి అందరం గుండెలమీద చేతులు వేసుకొని ఆత్మశుద్ధిగా పరిష్కారం వెతుక్కోవాల్సిన చారిత్రాత్మక సందర్భమిది.'తెలంగాణ సారస్వత పరిషత్తు' ఈ అంశంపై సదస్సు చేపట్టి , ఆ మేరకు వ్యాసాలను ఆహ్వానించడం ఎంత మంచి పనో ఇవాళ్టి ఈ నేపథ్యమే వెల్లడిస్తోంది. భారతదేశానికి స్వాతంత్ర్యం రాక ముందు, వచ్చిన తర్వాత తొలి రెండు-మూడు దశాబ్దాలలో, ఆ పిమ్మట పత్రికలు, ప్రసార మాధ్యమాలలో తెలుగు భాషా స్వరూపం ఇవాళ ఎంత రూపలావణ్యాన్ని కోల్పోతోందో తెలుస్తుంది.

'ఆంగ్ల భాషతోనే భవిష్యత్తు, అది లేకపోతే శూన్యం' అన్న భావనలో పడి ఉగ్గుపాలతో అబ్బిన సహజశక్తి మాతృభాష ని ఒడ్డున పడేస్తున్న వాళ్లెందరో. ప్రభుత్వాలైనా బాధ్యత నెరిగి, మాతృభాషా స్ఫూర్తిని వేగిర పరచగలిగితే ఈ దుస్థితికి చేరే వాళ్లమే కాదు. తాజా పరిస్థితి మరింత అందోళనకరంగా ఉంది. ఉదా॥ 2016-17 విద్యా సంవత్సరానికి గాను మన తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు పెద్ద సంఖ్యలో ఆంగ్ల మాధ్యమంలోకి మారిపోయాయి. పది జిల్లాలో కలిపి ఈ ఒక్క విద్యా సంవత్సరంలోనే 4,951 పాఠశాలలు ఆంగ్ల మాధ్యమం వైపు మళ్లగా, వాటిలో చేరిని విద్యార్థుల సంఖ్య 82,512. ఈ బడుల సంఖ్య త్వరలోనే 10,000 కు చేరవచ్చునని అంచనా. ఈ లెక్కన కొత్తగా రాబోయే తరాల వారూ ఏడాది కేడాది లక్షల సంఖ్యలో మన సమాజంలో ముఖ్యంగా ప్రసార సాధనాలలో తెలుగు భాషకు ప్రాథమిక స్థాయిలోనే దూరం కాబోతున్నారన్నమాట. ఆంగ్ల మాధ్యమంలో

చదవడం తప్పు కాదు. ఒక రకంగా ఉన్నత చదువులు, ఉద్యోగాలు, జీవన ప్రగతికి అది అత్యవసరం కూడా. కానీ ఆ యావలో పడి అదే ధ్యానంగా , అదే శ్వాసగా తెలుగు మొక్కలను ఎండబెట్టుకోవడమే అసలు సంక్షోభం.

అత్యధిక సంఖ్యలో తల్లిదండ్రులు, పిల్లలు ఆంగ్లమాధ్యమ బోధన బడులకే ప్రాధాన్యమిస్తుండడం వల్లే ఇవాళ తెలుగు భాషా స్వరూపం మసకబారి మబ్బులు కమ్మేస్తున్నది. అసలే, వ్యక్తిగత ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు (ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు) ఇబ్బడి ముబ్బడిగా ఉంటే, దీనికి తోడు ఇప్పుడు ప్రభుత్వ బడులు సైతం తెలుగును అప్రధానం చేసే స్థితికి వచ్చాయి. అనేక ఆంగ్లబడులలో పిల్లలు తెలుగులో మాట్లాడటమే తప్పయిపోతోంది. వచ్చినా, రాకున్నా, వచ్చీ రాని ఆంగ్గంలోనైనా సరే మాట్లాడాల్సిందే తప్ప 'తెలుగు పదాలు' నోట్లోంచి రాకూడదు. వస్తే వారు శిక్షలను భరించాల్సిందే.

ఇదే రకమైన దుస్థితే కనుక ఇంకా కొనసాగితే, రాబోయే అతి సమీప కాలం (15 ఏళ్లు) లోనే భాష మృతప్రాయం అవుతుందని యునెస్కో వెల్లడించినట్టు ఒక విశ్వసనీయ వార్త . ఇంతటి దయనీయ, అర్ధ పర్యవసానానికి అసలు మూలం మనదైన అమ్మభాష స్థానంలోకి ఆంగ్లభాషను చేర్చుకోవడమే కదా! బతుకు దెరువు కోసం ఆంగ్లంలో సిద్ధహస్తులమవుతాం. కానీ, అదే సమయంలో మనదైన అమ్మభాషనూ ఒంట పట్టించుకుందాం. దీని కోసమే త్రికరణ శుద్ధిగా ఆచరణకు దిగవలసిన తరుణమిది.

తెలుగు పత్రికలు ప్రారంభమైన తర్వాత అంటే స్వాతంత్ర్య సముపార్జనకు ముందు వెనక భాషకు సముచిత గౌరవమే ఇచ్చారు. అప్పట్లో గ్రాంథికం కలగలిసిన పండిత భాష పత్రికలలో కొనసాగేది. తర్వాత ఒక్కో దశాబ్దం గడుస్తున్న కొద్దీ భాషలో ఆధునిక పోకడలు పెరిగాయి. ఆంగ్లంలో మాట్లాడటం, రాయడం, చదవడం ఒక రీతి(ఫేషన్) గా మారింది. ఐతే, కవులు,రచయితలు, పాత్రికేయులు ముఖ్యంగా నవలాకారులు వార్తలు, కాల్పానిక సాహిత్యంలో సాధ్యమైనంత వరకు స్వల్పాక్షరాల పదాలు రాయడానికే ప్రాధాన్యమిచ్చారు. ఉదా॥ 'వచ్చినది' కాస్తా 'వచ్చింది' అయినట్లు సామాన్యులకు సులభంగా అర్థం కావడమే ప్రతిపదికగా భాషను సంస్కరించుకోవడం అవసరమే. అయితే, అదే సమయంలో అందులోని వక్రపోకడలను ఎవరూ సహించలేరు.

1960లలో ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి వార్తా పత్రికలు తెలుగుభాష పట్ల సముచిత ఆదరణ చూపాయి. సాధ్యమైనంత వరకు అచ్చతెలుగు పదాలే వాడేవారు. ఆంగ్ల పదాలకు తెలుగు అనువాదం ఇచ్చేవారు. అత్యవసరమైతే తప్ప ఆంగ్లపదాలు లేదా ఉర్దూ పదాలు వాడేవారు కాదు. తెలుగు భాష మాధుర్యం ఎక్కడా లోపించేది కాదు. 1970 లలో 'ఈనాడు' రాకతో తెలుగులో పత్రికా భాషకు పట్టాభిషేకం జరిగిందనాలి. ఇప్పటికీ ఆ పత్రిక తెలుగు నిబద్ధతను అదే చిత్తశుద్ధితో, మరింత క్రమశిక్షణతో పాటిస్తోంది. ఆంగ్ల పదాలను అత్యవసరమైతే తప్ప ఆ సంస్థ తన ప్రసార సాధనాలలో ప్రయోగించడం లేదు. 'ఈనాడు' సంస్థ నుంచే వెలవడుతున్న 'తెలుగు వెలుగు' మాసపత్రిక భాషా వికాసానికి చక్కని కృషిని గత కొన్నాళ్లుగా ప్రారంభించింది.

కొద్ది దశాబ్దాల కిందటి 'భారతి' వంటి విలువైన పత్రికలు ఇవాళ కావాలన్నా లేవు. దినపత్రికల నుంచి వార, మాస పత్రికల దాకా, అనేక మంది పాత్రికేయులు, రచయితలు భాషపట్ల ప్రత్యేక 'ప్రేమ'ను కనబరుస్తున్న ఆనవాళ్లు కనిపించడం లేదు. సరికదా, గడిచిన రెండు దశాబ్దాల కిందటే పత్రికా రంగంలో అసలు నిరూపణ నిర్ధారకుల (ప్రూఫ్‌రీడర్ల) వ్యవస్థనే తొలగించేశారు. విలేకరి లేదా ఉప సంపాదకుడే (సబ్ ఎడిటర్) అచ్చుతప్పులను, వాక్య నిర్మాణాలను, భాషా లోపాలను మొత్తం మీద పఠనాసక్తి (రీడెబిలిటీ) పెరిగేలా సవరించుకుంటూ ముద్రణకు పంపించవలసి వస్తోంది. వారి పనితోపాటు ఇదంతా వారికి అదనపు బాధ్యత. ఇలాంటి వాళ్లలో చాలామందికి అసలు అచ్చుతప్పులే తెలియవు. ఇక, భాషా నైపుణ్యం ఎక్కడ్నించి వస్తుంది.? పాఠశాలలు, కళాశాలల స్థాయిలోనే ఇలాంటి ఎందరికో 'తెలుగు' అభ్యాసం కొరవడిన దుష్పరిణామమే ఇదంతా.

ఇవాళ అచ్చుతప్పులు సర్వసాధారణమై పోయాయి. "భాషాదోషాలు లేకుండా, వాక్య నిర్మాణాలు గతి తప్పకుండా వార్త లేదా వ్యాసం ప్రచురితమైతే అదే పెద్దగొప్ప" అన్న భావన నెలకొంది. అన్నీ తెలిసిన వారు ఒక్కోసారి పని ఒత్తిడి వల్ల పొరపాట్లు చేస్తుంటారు. ఉదా॥ 'శివాలయాన్ని శవాలయం' అని ఒక పత్రిక రాస్తే, 'పండ్ల ధరలు' లో మొదటి అక్షరం 'స' గా మరో పత్రిక నెలల తరబడి ప్రచురించింది. తవ్వుతూ పోతే ఇలాంటి భాషా వికృతాలు మరెన్నో.

అంతర్జాలం (ఇంటర్నెట్), బాహ్యవలయం (రింగ్‌రోడ్) వంటి కొత్త తెలుగు పదాలను 'ఈనాడు' పత్రికే ఎక్కువగా వాడుతోంది. ఆంగ్ల పదాలకు తెలుగు మాటలను పత్రికలలో ఎంత విరివిగా వాడితే అవి ప్రజల నోళ్లలోకి అంత ఎక్కువగా చేరతాయి. గత్యంతరం లేని స్థితిలో ఇప్పటికీ అనేక ఆంగ్ల, ఉర్దూ పదాల (ఉదా॥ రైల్‌ను రైలు, బస్‌ను బస్సు అని)ను తెలుగులోనే రాస్తున్నాం. 'ఫ్యాన్'ను 'ఫంకా' అంటున్నా అదీ ఉర్దూ పదమే. కంప్యూటర్ వంటి అనేక సాంకేతిక, శాస్త్రీయ పదాలకు అచ్చమైన తెలుగు మాటలను సృష్టించుకోవలసి ఉంది.

ఏ తరం వారికైనా పెద్దలు అనుభవంతో చెప్పే మాటలు అంత తొందరగానచ్చవు. 'నీతులు చెప్పేవాళ్లంతా చేతకాని వాళ్లు' అనుకునేంత దాకా చాలామంది వచ్చేశారు. వెనుకటి పెద్ద మనషులు ఎన్నో కలలు కని ఎంతో ఆశతో, మరెంతో నమ్మకంతో మన దేశ స్వాతంత్ర్య సాధన కోసం ప్రాణాలను ఫణంగా పెట్టారు. మాతృభూమి పట్ల వీరు చూపిన అచంచలమైన భక్తి ప్రవత్తులే బ్రిటిష్‌వాళ్లను సమూలంగా సంచలితులను చేయగలిగాయి. అదే గాఢమైన దేశాభిమానాన్ని ఆనాటి తరాలు తమ పిల్లలకు ప్రబోధించాయి.

కానీ, తదుపరి తరాలు జన్మభూమికి ఎంతగా ద్రోహం చేస్తూ వచ్చియో చెప్పడానికి ఇవాళ్ళటికి ఈ దేశంలోని అనేక రాష్ట్రాల మాతృభాషల దుస్థితి ఒక్కటి చాలు. ప్రపంచీకరణను నెత్తిన పెట్టుకున్న దారుణ దుష్ఫలితాలలో భాగంగానే ఆంగ్లభాషా విస్తరణకు పెద్దపీట వేస్తూ అదే సమయంలో మాతృభాషలకు నిలవ నీడ లేకుండా వికటాట్టహాస దృశ్యాలను ఇవాళ దేశవ్యాప్తంగా చూస్తున్నాం. స్థానిక భాషామతల్లుల ఈ గర్భశోకం అరణ్యరోదనే అవుతోంది.

సమాజంలో "ఎలాంటి మార్పునైనా అంగీకరించవలసిందే" అన్నది నియంతృత్వమో, మూర్ఖత్వమో అవుతుంది తప్ప మానవీయత అనిపించుకోదు. మౌలికమైన విద్యారంగంతోపాటు పత్రికలు, ప్రసార మాధ్యమాలలో కూడా అనివార్యమైన ఆంగ్ల భాష చొరబాటు మన తెలుగు భాషను దోచుకుంటోంది. ఒకనాటి సంస్కృతం ఇవాల్టి దయనీయ పరిస్థితినే రానున్న కాలంలో తెలుగు ఎదుర్కోబోతోందనడానికి ఇదొక ప్రబల నిదర్శనం. సుమారు 4,000 ఏళ్ల చరిత్ర గలదిగా భావిస్తున్న తెలుగుకు ప్రాచీన భాష హోదాకోసం ఒకవైపు తపిస్తూనే మరోవైపు

దాని సంరక్షణ, పురోభివృద్ధి, విస్తరణలను వేగవంతం చేయకుండా స్తబ్ధశిలల్లాగా, మన్నుకొట్టిన రాళ్లలామనం ఇంకెన్నాళ్లు ఉందామో అందరం ఆలోచించుకోవాలి. ఆంగ్లమాధ్యమం ద్వారా ఉన్నత చదువులు చదివిన వారికి తెలుగు భాషలో ప్రావీణ్యం మాట అటుంచి కనీసం ఉచ్చారణ నుంచి, వాక్యనిర్మాణాల వరకైనా సరిగా రావడం లేదు. తెలుగులో దరఖాస్తు రాయలేని దీన అసహాయ దుస్థితిలో ఎందరెందరో ఉన్నారు. నిలువునా చీరినా అక్షరం ముక్కలు రాని వారే సమాజంలో నిండుకుంటున్నారు. వాళ్లలోని కొందరే ఈతరం పాత్రికేయులుగా ఇవాళ ప్రసార మాధ్యమాలలో కనిపిస్తున్నారు. ఇది ఘనత వహించిన మన తెలుగు జాతికి అవసరమా!

రాజకీయాలలో విప్లవాత్మక దశల పుణ్యమా అని పత్రికలు, ప్రసార మాధ్యమాలలో ఇవాళ్టికి 'తిట్లు' సర్వసాధారణమైనాయి. ప్రత్యేకించి తెలంగాణ ఉద్యమం సందర్భంగా వాడకూడని అనేక పదాలు (తిట్లు) వాడేయడం, రాసేయడం జరుగుతోంది. 'దగుల్బాజీ', 'బొంద' పెట్టడం వంటివి ఎన్నో. ఇదంతా ప్రజలకు తెలిసిన, వారు వాడే భాషనే వాడుతున్నామని 'వాళ్ల'కు అనిపించినా, గౌరవ ప్రదమైన భావన మాత్రం పాఠకుల్లో ఉండదు. ఇక, శృంగార పదాలు శ్రుతి మించడం. ఉదా।। 'స్వాతి' వారపత్రికలో వచ్చే శృంగార కథలలోని వర్ణన మరీ హద్దులు దాటుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. పచ్చి బూతు పుస్తకాల రాతలతో కొందరు రచయితలు పోటీలు పడుతున్నారు. ఒకనాటి 'అభిసారిక' పత్రికలో సైతం అంత దిగజారుడు వర్ణన ఉండేది కాదు.

రెండు, మూడు దశాబ్దాల కిందట కవిత్వం, కథలు, నవలలు వంటి సృజనాత్మక, కాల్పనిక సాహిత్యంలో తెలుగు మాటలు గౌరవప్రదంగానే ఉండేవి. తర్వాత్తర్వాత 'తీవ్ర' ధోరణులు పొడసూపాయి. ఇప్పటికి ముఖ్యంగా స్త్రీలపట్ల వాడకూడని భాష(తిట్లు) ను సైతం పలు రచనలలో చదువుతున్నాం. దీనికి కారణం, కొందరు కావాలని వాటిని వాడటానికి వెనుకాడక పోవడం. "వాడుక భాషను యధాతథంగా వాడుతున్నా" మంటూ సవరణలకు పోతుంటారు. ఇలాంటి పోకడల్లోని ఔచిత్యాలను బాధ్యత తెలిసిన సంపాదకులు, అనుభవజ్ఞులైన పాత్రికేయులు, రచయితలు, కవులు ఇప్పటికైనా సమీక్షించుకోవాలి.

మొత్తం మీద సమాజంలోని అన్ని రంగాలలోనూ పొడసూపుతున్న ఈ రకమైన వికృతులకు ఎవరిని నిందిద్దాం? మరీ ముఖ్యంగా పత్రికలు, ప్రసార మాధ్యమాలలో వాంఛితంగానో, అవాంఛితంగానో వ్యక్తమవుతున్న భాషా భేషజాలను ఇంకెన్నాళ్లు భరిద్దాం? మనకు అధికార భాషా సంఘాలు, ఇతరేతర సాంస్కృతిక సంస్థలూ ఉన్నాయి. అయినా, ఒకవైపు ఆంగ్లభాషపట్ల చూపించే అలవికాని మోజు, మరోవైపు మన భాషపట్ల ప్రదర్శించే అలసత్వం అలా 'జీవనది' లా కొనసాగుతూనే ఉంది. ఇప్పటి కొత్త ప్రభుత్వాలైనా రెండు రాష్ట్రాలలోని మాతృభాష పరిరక్షణ, అభివృద్ధికి ఉద్యమించాలి. మన భాషపట్ల ప్రేమ, గౌరవ మర్యాదలు ప్రజలలో నాటుకునేలా అందరం కృషి చేయవలసిందే!

వ్యాసకర్త – ***సీనియర్ జర్నలిస్టు, రచయిత***

# తెలుగు న్యూస్ ఛానళ్ళ భాష మెరుగుపడాలి

**- తోట భావనారాయణ**

మాట్లాడటానికి అప్పజెప్పటానికి తేడా ఉందన్నది ఛానల్స్ వాళ్ళకు తప్ప అందరికి తెలుసు. ఈ మాట వినగానే టివీ వాళ్ళకు ఎక్కడలేని కోపం వస్తుంది. తెలిసినదాన్ని తెలియదంటే ఆ మాత్రం కోపం రావటం సహజం. తెలిస్తే టివీలో మాట్లాడుతున్నట్టు కాకుండా అప్పజెప్పుతున్నట్టు వార్తలుంటాయెందుకు? పత్రికలలో రాసినట్టే టివీ వార్తలూ రాసి ఎందుకు చదువుతున్నారు ? మీరు వార్తలు చదివిస్తున్నారా. చెప్పిస్తున్నారా? పోనీ, రాసిన వార్తలే అలా వుంటున్నాయా? లేదే. ప్రత్యక్షప్రసారం పేరుతో ఘటనాస్థలం నుంచి రిపోర్టర్ మాట్లాడే భాష కూడా చెబుతున్నట్టు కాకుండా చదువుతున్నట్టుండడానికి కారణమేంటి? ఈ ప్రశ్నలకు సూటిగా సమాధానాలు రావు. కారణం ప్రధానంగా పత్రికలనే ప్రామాణికంగా తీసుకొని అలాగే చెప్పాలనుకోవటం. అది మామూలు ప్రేక్షకులకు అర్థం అవుతున్నదా లేదా అనే కనీస స్పృహ లేకపోవటం.

ఈ రోజు టీవి వార్తలు జనం మాట్లాడే భాషకు దూరంగా ఉండటానికి ముఖ్యమైన కారణం పత్రికలు. అవి జనం భాషకు ఇప్పటికి చాలా దూరంగా ఉన్నాయి. అయినా సరే, ఆ విషయాన్ని గమనించకుండా టివీ వార్తలు కూడా అదే

మూస పద్ధతిలో నడుస్తున్నాయి. అందుకే, టివీ వార్తలు రాసేవాళ్ళు రోజు పత్రికలలో కనబడే పడికట్టు పదాలనే వాడటానికి మొగ్గు చూపిస్తున్నారు తప్ప ఆ మాట సామాన్యుడికి అర్థమవుతుందా లేదా అనే సంగతి పట్టించుకున్న పాపాన పోవటం లేదు. జనం మాట్లాడుకునేటప్పుడు ఎలాంటి మాటలు వాడతారో ఒక్క క్షణం కూడా ఆలోచించటానికి తీరికలేని దౌర్భాగ్యం మనది. అందుకే మనం జనం భాషకు దూరంగా, పత్రికలభాషకు కొనసాగింపుగా టివీ వార్తలు రాసి, మరికొన్ని అవలక్షణాలు సైతం జోడించి దాన్ని టివీ భాషగా జనం మీదికి వదులుతున్నాం. టివీ యాంకర్ల భాష మీద వస్తున్న జోక్స్ కేవలం వాళ్ళ మీదనే అనుకోవటం పొరపాటు. వాళ్ళకు స్క్రిప్ట్ రాసిచ్చే వాళ్ళూ అందుకు బాధ్యులే.

వాడుక భాష (పత్రికలవాళ్ళు దీన్ని వ్యావహారిక భాష అనటానికే ఇష్టపడతారు!) అంటే పత్రికల దృష్టిలో ఒక మోస్తరుగానైనా చదువుకున్న వాళ్ళకు అర్థమయ్యే భాష. అందువలన చదువుకోని వాళ్ళ గురించి వాళ్ళెప్పుడూ ఆలోచించాల్సిన అవసరం రాలేదు. పైగా. జనం మాట్లాడే మాటలనుంచి తీసుకోవాలనే స్పృహతో కాకుండా, జనానికి నేర్పాలన్న దృష్టితో కొన్ని పదాలు ప్రయోగిస్తుంటారు. అవసరమైతే బ్రాకెట్లో దాని మరో రూపం కూడా ఇచ్చి అలవాటు చేద్దామనుకునేంత విశాల దృక్పథం పత్రికలది. అలాంటి పత్రికలను గుడ్డిగా అనుసరిస్తూ రావటం టివీలు చేస్తున్న అతి పెద్ద తప్పు. ఎందుకంటే, పత్రికల లక్ష్యం చదువుకున్న వాళ్ళకు అర్థం కావటం. కానీ టివీల లక్ష్యం అది కాదు. టివీ ప్రేక్షకులలో చాలా మంది నిరక్షరాస్యులూ, కొద్దిగా చదువుకున్న వాళ్ళూ ఉంటారు. అందువలన వాళ్ళ కోసం రాయాలన్న స్పృహతో రాయాలి.

పత్రికలు ఇప్పటికి జనం భాషలో రాయటానికి ఇష్టపడటం లేదు. అయితే, ఈ మాట ఒప్పుకోవటానికి కూడా పత్రికలకు ధైర్యం లేదు. బహుశా సామాన్యులు వాడే పదాలు వాడితే గంభీరత్వం తగ్గుతుందనో, భాష స్థాయి దిగజారుతుందనో అపోహలున్నట్టు కనిపిస్తుంది. మనం రోజూ పత్రికలలో చూసే కొన్ని పదాలు గమనిస్తే పత్రికల ధోరణి అర్థమవుతుంది. అంగీకరించారు– మీద ఉన్న ప్రేమాభిమానాలు పత్రికలకు– ఒప్పుకున్నారు మీద ఉండవు. గృహనిర్మాణ వ్యయం నచ్చినట్టుగా ఇంటి కట్టుబడి ఖర్చు నచ్చదు. ఆగ్రహం వ్యక్తం చేశారు అంటేనే

పత్రికలకు నచ్చుతుంది. కోప్పడ్డారు అంటే నామోషీగా ఉంటుంది. అనంతరం వాడినంత సునాయాసంగా తరువాత అని రాయటానికి చేతులు రావు.

జనం మాట్లాడే మాటలనూ, పత్రికలలో వాడుతున్న మాటలనూ గమనిస్తే పత్రికలు ఏపాటి జనం భాష వాడుతున్నాయో సులభంగా అర్థమవుతుంది. గెలిచారు (విజయం సాధించారు). అమ్మకం (విక్రయం), ఒప్పుకున్న (ఆమోదించిన), ఓడినవాళ్ళు (పరాజితులు), మెచ్చుకున్నారు (అభినందించారు), ఎగతాళి (అపహాస్యం), పుకార్లు (వదంతులు), పైన, మీద (పై) చనిపోయారు (మరణించారు, మృతిచెందారు), కొత్తగా కట్టిన ఇళ్లు (నూతనంగా నిర్మించిన గృహాలు), ఏర్పాట్లు (సన్నాహాలు), అప్పు (రుణం), తగలబెట్టారు (దగ్ధం చేశారు), గాయపడ్డవారు (క్షతగాత్రులు), మొదలు పెట్టారు (ఆరంభించారు), గుడి (ఆలయం), కొత్త (నూతన), చీకటి (అంధకారం), వెండి (రజతం), దొరికింది (లభ్యమైంది), చెప్పుకోదగినంతగా (గణనీయంగా), లెక్కలేనన్నీ (అసంఖ్యాకంగా), పై చదువుల కోసం (ఉన్నత విద్యాభ్యాసానికి) లాంటి ఉదాహరణలు కోకొల్లాలు.

కొత్త ఇంగ్లీషు పదమేదైనా వస్తే ఒక సంస్కృత పదబంధం చెప్పి తెలుగులోకి మార్చేశామని చంకలు గుద్దుకునే తీరు ముదిరిపోవటం ఇప్పుడు చూస్తున్నాం. ఫ్లై ఓవర్ ని పైదారి అనే ధైర్యం లేదు గాని ఇప్పటికిప్పుడు అర్జెంట్ గా మొబైల్ ఫోన్ ను చరవాణి అనాల్సిందేనన్న చాదస్తం పెరిగిపోయింది. పైగా అదే తెలుగు భాషకు చేస్తున్న సేవగా చెలామణి అవుతోంది. సమాజంలో ఉన్న పదాలను వాడుకోకుండా సంస్కృత పదాలను జనం మీద రుద్దుతున్న పత్రికలే దురదృష్టం కొద్దీ టీవీలకు ఆదర్శమవుతున్నాయి. నిరుడు లాంటి అచ్చ తెలుగు పదాన్ని పక్కనబెట్టి గత సంవత్సరం అని, కొత్త బదులు నూతన లాంటి సంస్కృత పదాలు వాడటం రోజూ చూస్తున్నాం. ఇదంతా చెప్పడమెందుకంటే టీవీల భాష చెడిపోవటంలో పత్రికల పాత్ర చాలా ఎక్కువగా ఉన్నదని వివరించటానికి. న్యూస్ యాంకర్లు కూడా చెప్పటానికి బదులు చదువుతున్నారు. ఫలానా వాడిపై కేసు పెట్టారు అని పత్రికలో రాస్తారు. కానీ టీవీకొచ్చే సరికి ఫలానా వాడి మీద పెట్టారు అనాలి. మనం మాట్లాడేటప్పుడు మీద అంటాం గాని పై అనం. ఆ తేడా టీవీ వాళ్ళకి అర్థం కావాలంటే పత్రికలకూ, టీవీకి తేడా ఉందని గుర్తిస్తే చాలు.

పత్రికలు జనం భాషలో రాయకపోవటమన్నది వాటి సమస్య అని కాసేపు వదిలేద్దాం. తప్పనిసరిగా ప్రజలు మాట్లాడుకునే భాషలో వార్తలందించాల్సిన టీవీల సంగతేంటి? ఎందుకిలా టీవీలకోసం ప్రత్యేకమైన భాష ఏర్పడలేదు? పత్రికల నుంచి టీవీలలోకి మారిన పత్రికా రచయితలు ఈ రెండు మాధ్యమాలకూ ఉన్న తేడా గమనించకపోవటం అందుకు ప్రధాన కారణం. పత్రికలు పూర్తిగా వాడుక భాషలోకి రాలేదని గాని, టీవీ కచ్చితంగా వచ్చి తీరాలని గాని వాళ్ళు అనుకోలేదు. పశ్చిమ దేశాల్లో పత్రికల తరువాత రేడియో, ఆ తరువాత టీవీ వచ్చాయి. భాషలో కూడా అదే క్రమంలో వాటికి తగినట్టుగా మార్పులు వచ్చాయి. భారతదేశంలో కూడా పత్రికల తరువాత రేడియా వచ్చినా అది కేవలం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండటం వలన రేడియో వార్తారచన కూడా పరిమితంగా ఉండిపోయింది. అందువల్లనే పశ్చిమదేశాల తరహాలో రేడియో సిబ్బంది టీవీకి వలస రావటం కనబడదు. నిజానికి ఇక్కడ పత్రికల యజమానులు టీవీ రంగంలోకి రావటం కంటే ఎక్కువగా రేడియో స్టేషన్ల వారే టీవీ స్టేషన్లు మొదలుపెట్టటం వాస్తవం.

పత్రికల అవలక్షణాలు మరికొన్ని టీవీకి వచ్చాయి. పత్రికలలో దొర్లే తప్పులను టీవీలు కొనసాగిస్తున్నాయి. ఒకప్పుడు న్యూస్ ఏజెన్సీలు అందించే బ్రేకింగ్ న్యూస్ మీద ఆధారపడే పత్రికలు ఇప్పుడు టీవీలమీద ఆధారపడుతుంటే ఉదయాన్నే పత్రికలలో వచ్చే వార్తల కోసం టీవీలు ఎదురుచూస్తున్నాయి. పత్రికల కథనాలకు వీడియోలు జోడించి వార్తలు అందించటం ఒక అలవాటుగా మారింది. ఆ క్రమంలో తిరగరాసుకునే ఓపిక, సమయం లేదనే నెపంతో అపభ్రంశాలు యథాతథంగా ప్రసారం చేస్తున్నారు. మౌలిక అనే పదాన్ని పత్రికలలో మౌళిక అని యథేచ్ఛగా వాడుతున్నారు. అలాంటివే సులువు (సుళువు), మెలకువలు (మెళకువలు) కూడా, పత్రికలు కొన్ని పదాలను ఎంతగా అలవాటు చేశాయంటే ఇప్పుడెవరైనా సరిగా రాసినా అదే తప్పేమో అనుకునేట్టు తయారైంది. బహుశా గంభీరంగా ఉండాలన్న అభిప్రాయమేమోగాని దీటుగా అని కాకేండా ధీటుగా, తుపాను ను తుఫానుగా, డీ కొట్టటాన్ని ఢీ కొట్టటం గా మార్చేశాయి.

అసలు అర్థమేమిటో తెలియకుండానే వాడుతున్న సందర్భాలు తక్కువేమీ కాదు. 'ఆపాతమధురం' అనే పదబంధం ఇప్పుడు పాత జ్ఞాపకాలు

గుర్తుచేసుకోవటమనే అర్థంలో వాడుతున్నారు. పగలు జరిగినా సరే దాన్ని 'సంగీత విభావరి' గానే రాస్తున్నారు. పదాల సంగతలా ఉంచితే సామెతలూ, జాతీయాలు సైతం అర్థం తెలుసుకోకుండా, సందర్భ శుద్ధి లేకుండా వాడుతున్నారు. అందని ద్రాక్ష పుల్లన, అందని మానుపండు అనేవి రెండూ వేరు వేరు సందర్భాలకు సంబంధించినవి. అయితే ఆ రెండింటినీ కలిపి అందని మానుపండు అని వాడాల్సిన చోట అందని ద్రాక్ష అని రాస్తున్నారు. 'పేదలకు కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది' లాంటి వాక్యాలు ప్రతిరోజూ పత్రికలలో చూస్తున్నవే. వాటినే టీవీలు ఇప్పుడు ఇంకా ఎక్కువగా వాడుతూ ప్రచారం చేస్తున్నాయి.

పత్రికలలో వస్తున్న అపభ్రంశపు ప్రయోగాలను టీవీ జర్నలిస్టులు అలవోకగా అనుకరిస్తున్నారు. పన్నేతర ఆదాయం, గతేడాది, విష్ణాలయం లాంటి పదాలు తరచూ పత్రికలలో చూస్తున్నాం. టీవీలలో వింటున్నాం. ఎక్కడ సంది ఉంటుందో తెలియదు. ఏది దుష్ట సమాసమో తెలియదు. ఆరోగ్యవంతమైన అని ఎప్పుడు అనాలో అరోగ్యకరమైన అని ఎప్పుడు వాడాలో తేడా తెలియదు, రామారావు, వెంకటేశ్ అని రాయాల్సి వస్తే రామారావు, వెంటేశ్ లు అని ఎందుకు రాస్తారో వాళ్ళకే తెలియదు. ద్వంద్వ సమాసం గురించి తెలియాలనుకోవటం అత్యాస కావచ్చునేమోగాని మనం మాట్లాడుకునేటప్పుడు అలా 'లు' చేర్చమన్న విషయం తెలుసు కదా! మాట్లాడేవిధంగా రాయకూడదేమోనన్న అభిప్రాయమే టీవీ జర్నటిస్టులను తప్పుదారి పట్టిస్తున్నదనుకోవాలి. పత్రికలలో అయితే ఒకటి రెండు దశల్లో ఆ రాతల తనిఖీ జరుగుతుంది. టీవీలో ఆ అవకాశమూ ఉండదు. క్షణాల్లో ఆ స్క్రిప్ట్ మాటల రూపంలో ప్రసారమైపోతుంది. అందుకే టీవీలు మరింత బాధ్యతగా ఉండాల్సిన అవసరముంది.

టీవీ భాష సినిమాల ప్రభావాన్ని కూడా తక్కువగా అంచనా వేయటానికి వీల్లేదు. విచిత్రమైన ప్రయోగాలు సినిమాలకే పరిమితమనుకుంటే క్రమంగా టీవీకీ విస్తరించాయి. అర్థం పర్థం లేని ఎంకమ్మ లాంటి పదాలు జనంలోకి వెళ్ళిపోయాయి. అదే పద్ధతిలో ఇరగదీయటం లాంటి పదాలకు టీవీలు ప్రాచుర్యం కల్పిస్తున్నాయి. ఆ మాటకొస్తే సినిమాను మించిపోయి మరీ టీవీలు రకరకాల పదప్రయోగాలతో భాషను ఎగతాళి చేస్తున్నాయి. సినిమా వార్తలకు ఒక ప్రత్యేకమైన, ప్రమాదకరమైన

చిత్రవిచిత్రమైన భాష తయారవటం గమనించవచ్చు. పట్టించుకోకు అర్థంలో లైట్ గా తీసుకో అనాలనుకొని లైట్ తీసుకో అంటున్నారు.

టీవీల మీద ఉన్న మరొక ప్రధానమైన విమర్శ విచ్చలవిడిగా ఇంగ్లీషు పదాలు వాడుతున్నాయని, పత్రికలు ఇప్పటికీ ఎంతగా సంస్కృత పదబంధాలనుంచి బయట పడలేదో టీవీలు అలాగే ఇంగ్లీషు చట్రంలో బిగుసుకుపోయాయి. ఆ మాటకొస్తే తమను తామే బిగించుకుంటున్నాయి. పత్రికలు కనీసం కాలక్రమంలో తగ్గించుకునే అవకాశాలేమైనా ఉన్నాయేమో గాని టీవీలు రోజు రోజుకూ ఇంగ్లీషు వాడకం మీద మోజుపడుతున్నాయి. ఒకరిని చూసి ఇంకొకరన్నట్టు ఉద్దేశపూర్వకంగా ఇంగ్లీషు మాటల వాడకం ఈ మధ్య కాలంలో బాగా పెరిగిపోయింది. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ లో 9 ఫీట్ల ఎన్టీఆర్ స్టాచ్యూ ఏర్పాటుకు స్పీకర్ అంగీకారం; కో-ఆపరేటీవ్ సొసైటీల ఎలక్షన్ కు షెడ్యూల్ ప్రకటన లాంటి వార్తల్లో ఎక్కడా తెలుగులో రాయాలనే స్పృహ కనబడదు. సాంకేతిక పదాల సంగతి వదిలేసినా, సులభమైన తెలుగు పదాలు ఉన్నప్పటికీ రాయకపోవటం కేవలం టీవీల నిర్లక్ష్యమే. ప్రేక్షకుడి పట్ల టీవీల బాధ్యతారాహిత్యానికి అది నిదర్శనం.

అయితే, ఇక్కడ గమనించాల్సిన మరొక ముఖ్యమైన విషయముంది. సులభంగా అర్థమయ్యే ఇంగ్లీషు పదాలు అప్పటికే జనం నోళ్ళలో నానుతూ ఉన్నప్పుడు, తెలుగు పదం కంటే ఇంగ్లీషు పదమే అర్థమవుతుందని అనుకున్నప్పుడు ఆ ఇంగ్లీషు పదం వాడటమే టీవీ ప్రేక్షకులకు కావాల్సింది. జనానికి అర్థమయ్యే ఇంగ్లీషు వేరు.. అర్థమయ్యే తెలుగు వేరు. అర్థం కాని తెలుగు వేరు. అందుకే అర్థమయ్యే తెలుగు, అర్థమయ్యే ఇంగ్లీషు వాడటం టీవీ ప్రేక్షకులకు మేలు. పత్రికలలో కొన్ని పదాలు తెలుగులో (నిజానికి సంస్కృతంలో) వాడినా అర్థమవుతాయి. దానికి కారణం పత్రికల పాఠకుల స్థాయి అలాంటిది. కానీ. టీవీ చూసేవాళ్ళందరికీ అవి అర్థం కాకపోవచ్చు. అందువలన అలాంటి ఇంగ్లీషు పదాలు వాడటం టీవీలకు తప్పనిసరా. కాలేజ్ అంటే చదువుకోని వాళ్ళకూ అర్థమవుతుంది, కళాశాల అంటే అర్థం కానివాళ్ళు చాలా మంది ఉంటారు. అలాంటప్పుడు కళాశాల అని వాడటం లేదని టీవీల మీద దుమ్మెత్తిపోయటం మంచిది కాదు. రోడ్డు కాకుండా రహదారి వాడాలని నిరేశించటం కంటే ఏది సులభంగా అర్థమవుతుందన్నది ఆలోచించటం

ముఖ్యం. పత్రికలే చాలా కాలంగా ప్రచారం చేసి వాడుకలో పెట్టిన పదాలను ఇప్పుడు మార్చాలని ప్రయత్నించటం వలన ఇలాంటి ఇబ్బంది వచ్చింది.

స్కూల్ ని 'బడి' అని రాయటానికి ఇబ్బందిపడిన పత్రికలకు సైతం ఈ రోజు ఒక్కసారిగా తెలుగు గుర్తుకొచ్చి తెలుగు ముసుగులో 'పాఠశాల' అనే సంస్కృత పదాన్ని రుద్దాలనుకుంటే, దాన్నే తెలుగు భాషకు సేవగా పొగుడుతూ కొంతమంది భాషోద్ధారకులు సమర్థించటం విచిత్రం. అన్నీ తెలుగులోనే చెప్పాలనటం, ఇంగ్లీషు పేర్ల స్థానంలో తెలుగు పేర్లు సృష్టించి జనం వాడేలా చేయాలనటం ఆచరణలో కుదరని విషయాలే. పత్రికలో అయితే అలా పరిచయం చేసే కాలంలో బ్రాకెట్లో ఇంగ్లీషు మాట రాపి అలవాటు చేయవచ్చు. టీవీలలో అలాంటి బ్రాకెట్ సౌకర్యం ఉండదు. అందువల్ల కంప్యూటర్, ఈ మెయిల్, మొబైల్ ఫోన్ లాంటి ఇంగ్లీషు మాటలను కూడా తెలుగు పదాలు గానే భావించి స్వీకరించటమే ఉత్తమం. కనీసం టీవీ వరకైనా అలాంటి పద్ధతినే సమర్థించాలి. అయితే, అదే సమయంలో అప్పటికే బాగా వాడుకలో ఉన్న పదం స్థానంలో పనిగట్టుకొని ఇంగ్లీషు పదాలు వాడటాన్ని మాత్రం కచ్చితంగా వ్యతిరేకించాల్సిందే.

ఇంగ్లీషు వాడకం విషయంలో న్యూస్ చానల్స్ ఒక విచిత్రమైన వాదన వినిపిస్తున్నాయి. టీవీ రేటింగ్స్‌ని ప్రభావితం చేసే యువత ఎక్కువగా ఇంగ్లీషు మాటలు వాడుతున్నారు కాబట్టి వాళ్ళకోసం ఇంగ్లీషు మాటలే వాడి ఆకట్టుకుంటునామని, అది వ్యాపారంలో భాగమని చెప్పుకుంటూ వచ్చాయి. అంటే గ్రామీణ ప్రేక్షకులనూ, వాళ్ళకు అర్థం కావలసిన అవసరాన్నీ ఎంతమాత్రము పట్టించుకోవటం లేదని ఒప్పుకున్నాయి. మరి అదే నిజమైతే, ఇప్పుడు టామ్ రేటింగ్స్ స్థానంలో బార్క్ రేటింగ్స్ వచ్చిన తరువాత గ్రామీణ ప్రేక్షకులనూ రేటింగ్స్‌లో చేర్చారు కాబట్టి భాష మారాలికదా? మారలేదు. అంటే ఇప్పటిదాకా చెప్పింది కేవలం బుకాయింపేనన్నమాట. కేవలం ఒక సాకు వెతుక్కొని చెప్పుకున్నారే తప్ప వ్యాపార ప్రయోజనమే అయినా ఇప్పుడు జనం భాష వాడి తీరాలి. కానీ అలా జరిగే అవకాశం కనబడటం లేదు. రోజురోజుకూ పరిస్థితి ఎంతగా దిగజారిపోతున్నదంటే న్యూస్ ఛానల్స్ నిర్వాహకులు ఇప్పుడు వాడుకభాష రాయిద్దామనుకున్నా రాయగలిగేవారే దొరకరనిపిస్తుంది.

ఇంగ్లీషు సంగతలా ఉంచినా, టీవీల కోసం రాయటంలో పత్రికలకు భిన్నంగా కొన్ని ప్రత్యేకమైన జాగ్రత్తలు అవసరం. వినేవాళ్ళకోసం రాస్తున్నప్పుడు అందుకు తగినట్టుగా ఉండాలి. చదివే వాళ్ళకోసం రాసే పత్రికలలో ఎన్నో మూస ధోరణులు సాగుతున్నాయి. అవే పద్ధతులను గుడ్డిగా అనుకరించటం పనికిరాదు. పత్రికలు 1.27 కోట్లు అని రాస్తాయి. చదివేవాళ్ళకు అది అర్థం కావచ్చు. కానీ టీవీ ప్రేక్షకులకు మాత్రం కోటి 27 లక్షలు అని చెబితే సులభంగా అర్థమవుతుంది. 10 మిలియన్లు అని కాకుండా కోటి అని రాయటం వలన వెంటనే అర్థమవుతుందని రాసే క్షణంలో గుర్తుకు రాకపోవటం సమంజసం కాదు. సామాన్యులకు ఎలా అర్థమవుతుందో గ్రహిస్తే పొలం విస్తీర్ణాన్ని హెక్టార్లలో కాకుండా ఎకరాల్లో చెబుతారు. ప్రేక్షకులకు ఎలా చెప్పాలో ఆలోచించకుండా తాము చెప్పిందే వినాలనుకునే ధోరణి వల్లనే టీవీ భాష విమర్శలపాలవుతోంది.

భాష టీవీ వార్తలు రాసేవాళ్ల నిర్లక్ష్యం ఒక వంతయితే, యాంకర్ల నిర్లక్ష్యం మరోవంతు. రాసిన భాష చెప్పినట్టుగా కాకుండా చదవటానికి మాత్రమే పనికొచ్చేలా ఉండటం వలన అలాగే చదువుతున్నామని చెప్పుకోవచ్చు. రాసిన వాళ్ళమీదనే తప్పు నెట్టేయవచ్చు. కానీ వాళ్ళ ఉచ్చారణతో న్యూస్ ఛానల్స్ అభాసుపాలవుతున్నాయి. అందానికి మాత్రమే ప్రాధాన్యమిచ్చి డొక్క శుద్ధి లేనివాళ్ళను కూర్చోబెట్టటం వలన వస్తున్న సమస్యలివి. అరకొర తెలుగు చదువుకొని ప్రపంచానికి వార్తలు చదివి వినిపించాలనుకునే వారు పెరిగారు. అందువలన వాళ్ళు వార్తలు 'చెబుతారని' ఆశించటం సాధ్యం కాదు. కనీసం రాసింది రాసినట్టు చదువుతారా అంటే అదీ లేదు. వ్యాపార అవసరాలను దృష్టిలో పెట్టుకొని అందాన్నే అర్హతగా తీసుకున్నప్పటికీ కనీస శిక్షణ లేకపోవటం వలన దారుణమైన ఉచ్చారణ వింటూనే ఉన్నాం. తెలుగు వాళ్ళే అయినా మాట్లాడటం ద్వారా వచ్చిన తెలుగు కాకుండా చదువుకోవటం ద్వారా వచ్చిన అరకొర తెలుగు కావటం వలన పలకటంలో తీసుకోవల్సిన కనీస జాగ్రత్తలు కూడా అర్థం కావటం లేదు. జలగ అయినా, జారుడు అయినా ఒకటే జ. చాప లోనూ చాలా లోనూ ఒకటే చ. చేసారు, రాశారు లాంటివీ మామూలైపోయాయి. అప్పారావు పలకడంలో, చెప్పారు పలకటంలో తేడా ఉండటం లేదు. చుట్టాలు ఎలా పలుకుతున్నారో కొట్టాడు అలాగే పలుకుతున్నారు.

అక్షరాలు పలకటంలో ఎక్కువగా జరిగే పొరపాటు శ, ష, స విషయంలోనూ కనిపిస్తుంది. వీటి ఉచ్చారణ విషయంలో చాటువుగా ప్రచారం పొందిన చమత్కారపు శ్లోకం ఒకటుంది. స్పష్టమైన ఉచ్చారణ ప్రాధాన్యాన్ని ఒక తండ్రి తన కొడుకుతో ఇలా వివరించాడట.

*యద్యపి బహునాధీషే తథాపి పఠపుత్ర వ్యాకరణం*
*స్వజనః శ్వజనః మాభూత్ సకలం శకలం సకృత్ శకృత్*

"కుమారా, నువ్వు వేదశాస్త్రాలు నేర్చుకోకపోయినా ఫరవాలేదు గాని వ్యాకరణం వరకైనా తెలుసుకో. ఎందుకంటే, స్వజన: (మనవారు) అనటానికి బదులు శ్వజన: (కుక్కలు) అని, సకలం (అన్నీ) అనటానికి బదులు శకలం (ముక్క) అని, సకృత్ (మంచిపని) అనటానికి బదులు శకృత్ (మలం) అనీ అనకుండా ఉంటావు" అని అర్థం. అందువలన ఉచ్చారణ పరంగా అక్షరదోషాలు ఎంతటి విపరీతార్థాలకు దారితీసే ప్రమాదముందో టీవీల వాళ్ళు గుర్తించాల్సి ఉంది. ఉచ్చారణపరంగా అక్షరదోషాలు ఎంతటి విపరీతార్థాలకు దారితీసే ప్రమాదముందో టీవీల వాళ్ళు గుర్తించాల్సి ఉంది. ఉచ్చారణ దోషాలకు ఒక కారణం వాళ్లు చందమామ కథలు చదువుకుంటూ కాకుండా ట్వింకిల్ ట్వింకిల్ వల్లెవేస్తూ పెరిగినవాళ్ళు కావటం. రెండో కారణం టీవీ ఛానల్స్ తగిన శిక్షణ ఇవ్వకపోవటం. ఆ భాషే బాగుందని అనుకోవటం. ఇక మూడో కారణం మేకప్ మీదనో, డ్రెస్‌మీదనో చూపినంత శ్రద్ధ తమ ఉచ్చారణమీద పెట్టాలని యాంకర్లు అనుకోకపోవటం. మంచి విషయాలు నేర్చుకోకపోగా తప్పులు నేర్చుకోవటం కూడా పరిపాటి అయింది. ఎవరో ఒక యాంకర్ నోరు తిరగక నిర్ణయం అనే పదాన్ని 'నిరణయం'అని పలకటంతో అలాగే పలకాలేమో అనుకొని ఇప్పుడు న్యూస్ ఛానల్స్ లో కనీసం సగం మంది అలాగే పలుకుతున్నారు. ఈ అనుకరణ ఏ స్థాయికి వచ్చిందంటే, చర్చాకార్యక్రమాలు నిర్వహించే ఒక ప్రముఖ జర్నలిస్టు కూడా నిరణయం అని అంటున్నారు. ప్రస్తుతానికి నిర్ణయం వరకే పరిమితమైంది గాని అదే పద్ధతిలో రేపు కరణం, కర్ణం ఒకేలా పలికినా ఆశ్చర్యం లేదు.

టీవీ వార్తలు రాసేవాళ్ళు రాసింది చదివేవాళ్ళవలన మాత్రమే వాడుక భాష దెబ్బతింటున్నదనుకోవటం పొరపాటే. మాట్లాడేవాళ్ళు సైతం అదే పత్రికాభాష మాట్లాడుతున్నారు. అందువలన మనం ప్రత్యక్ష ప్రసారాలలో రిపోర్టర్లు మాట్లాడే భాష చాలా కృత్రిమంగా ఉండటం గమనిస్తున్నాం. దానికితోడు కొన్ని అర్థం లేని పడికట్టు పదాలు కూడా వాడుతూ ఉంటారు. "ఈ యొక్క... రోడ్డు సమస్య ఏదైతో ఉందో .. దాన్ని పరిష్కరించటానికి ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే చెబుతున్నారు." అనే వాక్యంలో యొక్క, ఏదైతో ఉందో దాన్ని.. అనేవి వ్యర్థపదాలు. అదే ధోరణిలో చెప్పటం జరిగింది, చేయటం జరిగింది అంటూ జరుగుడు వాక్యాలు మాట్లాడటం కూడా చూస్తున్నాం. చెప్పారు, చేశారు అంటే సరిపోయేదానికి ఇలాంటి అనవసర పదాలతో సాగదీయటం టీవీ రిపోర్టర్‌కి భాషమీద కనీస అవగాహన లేదనటానికి నిదర్శనంగా మారింది. ప్రత్యక్ష ప్రసారాలలో రిపోర్టర్లు మాట్లాడే పడికట్టు పదాల్లో అనవసరంగా వాడే 'గతం' కూడా ఒకటి. గత సంవత్సరం అనటానికి బదులు పోయినేడాది లేదా ఇంకా స్వచ్ఛంగా నిరుడు అనవచ్చు. జనం మాట్లాడే భాషలో గత సంవత్సరం అనే మాట వినం. గతంలో అనే అర్థంలో వాడాల్సి వస్తే లోగడ, మునుపు, ఇంతకుముందు లాంటి పదాలే సామాన్యులు వాడతారు. అవసరం లేకపోయినా గత రెండేళ్ళుగా, గత కొంతకాలంగా అని టీవీ జర్నలిస్టులు గత అనే ప్రయోగం చేయటం చూస్తున్నాం.

దీని వలన ప్రేక్షకులకు విసుగు పుట్టటం సంగతలా ఉంచితే, ఈ భాషనే సమాజం కూడా ప్రామాణికంగా తీసుకోవటం చాలా ప్రమాదకరమైన ధోరణి. టీవీ వలన భాష సహజత్వం పోతున్నది. అది ఎంత తీవ్రస్థాయికి చేరిందంటే చోటా నాయకులు సైతం మాట్లాడటానికి మైక్ పెట్టగానే అప్పటి దాకా మాట్లాడుతున్న సహజమైన మాటల్ని పక్కనబెట్టి అసహజమైన పత్రికల భాష మాట్లాడుతున్నారు. అలాగే మాట్లాడాలేమో అనే అభిప్రాయం కలిగించింది టీవీలే. సహజంగా పత్రికల కంటే టీవీల ప్రభావమే వాళ్ళమీద ఎక్కువగా కనబడుతోంది. అసెంబ్లీలో మాట్లాడుతున్న ధోరణి చూసినా వాళ్ళ మాట తీరు మీద టీవీల భాష ప్రభావం ఎంత ఎక్కువగా ఉన్నదో అర్థమవుతుంది. సమాజం నుంచి తీసుకున్న భాషను సుసంపన్నం చేయాల్సిన టీవీ ఆ భాషకు ద్రోహం చేస్తూ సమాజానికి చెడు చేస్తున్నది.

ఈ సమస్యలకు పరిష్కారమేంటి? జర్నలిజం చదువులు బాగుంటే ఇలాంటి సమస్య ఉండకపోవచ్చునని చాలా మంది అనుకుంటారు. జర్నలిజం చదువుకుంటే జర్నలిస్టు అయిపోతాడని పరిశ్రమలో లేని చాలా మంది అనుకుంటారు. నిజానికి జర్నలిజం చదువుకూ, ఆచరణకూ చాలా దూరముంది. జర్నలిజం చదువులు చెప్పే విశ్వవిద్యాలయాల్లో తెలుగులో వార్తారచన మీద శిక్షణకు అవకాశం లేదు. రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి మొత్తం 13 యూనివర్శిటీల్లో జర్నలిజం కోర్సు ఉన్నా, కేవలం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోనే తెలుగులో రాసే వీలుంది. మిగిలిన చోట్ల చదివేవాళ్ళకు ఇంగ్లీషు వార్తారచన ఒక సబ్జెక్ట్. సమాధానపత్రాలు ఇంగ్లీషులో రాయటానికే నానా ఇబ్బందులు పడుతూ, తెలుగులో రాసే అవకాశమివ్వాలని డిమాండ్ చేస్తున్న పిజి విద్యార్థులు ఇంగ్లీషు వార్తారచనలో శిక్షణ తీసుకుంటారనుకోవటం అత్యాశే. ఆ విధంగా వాళ్ళు ఎటూ కాకుండా తయారవుతున్నారు. ఇక్కడ ఉద్యోగావకాశాలు తెలుగులో రాయటం తెలిసినవాళ్ళకు ఎక్కువగా ఉన్నాయి. యూనివర్శిటీల జర్నలిజం చదువులు మాత్రం తెలుగు రాయటం నేర్పటం లేదు. తెలుగు నుంచి దూరం చేయటానికి ఇంటర్మీడియట్, డిగ్రీల్లో ఎలాగూ మార్కులకోసం సంస్కృతం, ఫ్రెంచ్ లాంటివి ఉండనే ఉన్నాయి. ఇక తెలుగు వచ్చే అవకాశమే లేదు. అలాంటప్పుడు వాళ్ళు మీడియాలో చేరితే తెలుగులో వార్తారచన ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఇక్కడ అన్నిటికంటే ముఖ్యమైన విషయమేమిటంటే టీవీల భాష గురించి బయటివాళ్ళు ఎన్ని రకాలుగా మాట్లాడినా ఉపయోగమే లేదు. ఛానల్స్ నిజంగా భాష విషయంలో తమ ధోరణి మారాలని ఒప్పుకుంటేనే మారటానికి ప్రయత్నిస్తాయి తప్ప వాటిని ఎవరో మార్చాలని అనుకుంటే అది కుదిరే పని కాదు. తనకు తెలియదని ఒప్పుకోనివారు నేర్చుకోవటానికి సిద్ధమయ్యే అవకాశం లేదు. జనం భాషలోనే ప్రసారాలు అందిస్తున్నామా అనే ఆత్మ విమర్శ చేసుకుంటే అప్పుడు దిద్దుబాటు మొదలవుతుంది. భాషమీద కనీస స్థాయిలోనైనా పట్టు ఉన్న వాళ్ళకే జర్నలిస్టులుగా అవకాశమిస్తాయి. అందానికి కొంత ప్రాధాన్యమిచ్చినా ఉచ్చారణ తెలిసి, కాస్త దొక్కశుద్ధి ఉన్నవాళ్ళనే యాంకర్లుగా నియమించుకుంటాయి.

ఇంకాస్త దృష్టి పెట్టదలచుకుంటే సిబ్బందికి భాష విషయంలో తగిన శిక్షణ ఇస్తూ, ఎప్పటికప్పుడు తప్పొప్పులు సమీక్షించుకుంటాయి. తమ సిబ్బంది అందరికీ ఉపయోగపడేలా ఒక శైలీ పత్రం తయారు చేసేకోవటం ద్వారా భాషకు తగిన గౌరవమిస్తాయి. అయితే, ఎప్పుడూ హడావిడిగా ఉంటూ బ్రేకింగ్ న్యూస్ మీద బతికెయ్యాలనుకునే ఛానల్స్ అంత ఓపికగా తయారు చేసుకుంటాయని అనుకోవటం అత్యాశే అవుతుంది. ప్రెస్ అకాడెమీ, తెలుగు అకాడెమీ, తెలుగు విశ్వవిద్యాలయం లాంటి సంస్థలు పూనుకొని టీవీలో వాడుతున్న భాష సరళంగా ఉండేలా తెలుగు పండితులతో, టీవీ ఛానల్స్ సంపాదకులతో సమావేశాల పరంపర సాగేట్టు చూసి ఒక ప్రామాణికమైన శైలీ పత్రం తయారుచేయటం వలన కొంతయినా ఫలితం ఉండవచ్చు. లేదా, ఎప్పటికప్పుడు వార్తాలేఖల రూపంలో సూచనలు పంపుతూ ఉండవచ్చు. ఏమైనప్పటికీ, ఆయా ఛానల్స్ లో పనిచేసే సిబ్బందికి, ముఖ్యంగా యాంకర్లకు, ఉన్నత స్థానాల్లో ఉన్న వాళ్ళకు ఈ విషయంలో ఉండే శ్రద్ధ మాత్రమే ఉత్తమ ఫలితాలకు దారి తీస్తుందనేమాట నిజం.

వ్యాసకర్త – ***టి.వి. జర్నలిస్టు***

# భాషాభివృద్ధిలో ప్రసారమాధ్యమాలది కీలక పాత్ర

*- ఆర్.దిలీప్‌రెడ్డి*

వెయ్యేళ్లకు పైగా పరిపుష్ట చరిత్ర కలిగి, "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని ప్రశంసలందుకున్న తెలుగు భాషకు ఇప్పుడు తెగుళ్లు పట్టుకున్నాయి. పాలకుల నిర్లక్ష్యం, ప్రపంచీకరణ ప్రభావం, ఇంగ్లీషు పట్ల తగని వ్యామోహం, విద్యా సంస్థలో పెరిగిపోయిన వ్యాపార దృష్టి, కొత్తతరం నిరాదరణ, ప్రసార మాధ్యమాల అశ్రద్ధ... వెరసి తెలుగు భాష మనుగడ ఆందోళన కలిగించే స్థితికి చేరుతోంది. ఇప్పటికిప్పుడు భాష కనుమరుగయ్యే ప్రమాదం లేకపోయినా, ఇదే ఒరవడి కొనసాగితే భవిష్యత్తులో తెలుగు భాష మనుగడ ప్రశ్నార్థకమయ్యే వాతావరణం బలపడుతోంది. మరీ ముఖ్యంగా ఇటీవలి కాలంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ – రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వ పాఠశాలల్ని మూసివేస్తున్న తీరు తెలుగు భాష భవితవ్యాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతోంది. ఈ తాజా పరాణామం వల్ల సర్కారు బడుల స్థానే గ్రామీణ ప్రాంతాల్లో సహితం ప్రయివేటు బడులు, అంటే దాదాపు అన్నీ ఆంగ్ల మాధ్యమబడులే వెలుస్తున్న క్రమంలో ఒక తరం తెలుగుకు దూరమయ్యే విపరిణామపు జాడలు విస్పష్టంగా కనిపిస్తున్నాయి. సరైన మాతృభాషా

భూమిక లేకుండా అన్యభాషల్లో చదివి పట్టాలు పొందుతున్న మన కొత్త తరం... ఉపాధికి, ఉద్యోగాలకవసరమైన ప్రతిభ సంపాదిస్తున్నారేమో! కానీ, సహజసిద్ధమైన సృజన, నైపుణ్యాలు వారిలో కొరవడుతున్నాయి. దీన్నెవరూ తీవ్రంగా పరిగణించడం లేదు. జన మాధ్యమాలైన సమకాలీన మీడియా, ముఖ్యంగా టెలివిజన్, వెబ్, బ్లాగ్స్ వంటి వాటి వల్ల మెరుగుపడాల్సిన తెలుగు భాష సంకరమై, కలుషితమై, అల్పపుద్రై, అవసానం దిశగా అడుగులేస్తోంది. భాషాభివృద్ధిలో వేగం పెంచింది నిస్సందేహంగా మీడియానే! వందేళ్లకు పైబడ్డ చరిత్రలో మీడియా, ముఖ్యంగా పత్రికలు తెలుగు వికాసానికి చేసిన కృషి ఎనలేనిది. భాష విషయంలో మీడియా తొలినాళ్లలో చూపిన శ్రద్ధాసక్తులు ఇప్పుడు సన్నగిల్లినాయి. భాషను పరిరక్షించుకునే పరిశోధనలు జరగటం లేదు. అపశబ్దాలు, అర్థబేదాలు, అన్యదేశాలు, అన్వయదోషాలు.... ఇలా ఏం జరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రధానంగా తెలుగు వాక్యాల్లో అడ్డదిడ్డంగా ఆంగ్ల పదాల్ని వాడే 'ఇంగ్లీషీకరణ' అభ్యంతరకర స్థాయికి పెరిగింది. ప్రసార మాధ్యమాల విస్తృతి పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో భాష సుసంపన్నం కావాల్సివుంది. దానికి బదులుగా బలహీనపడుతోంది. ఇది ప్రమాద సంకేతం ! భాష మనుగడకు హాని చేస్తున్న సమస్యల్ని గుర్తించడం, మూలాల్లోకి వెళ్లటం, పరిష్కరించే ఆలోచనలు చేయడం వంటివేవీ ప్రస్తుతం జరగటం లేదు. ఇదిలాగే సాగితే తెలుగుకు గడ్డుకాలం దాపురిస్తోందేమో అనిపిస్తోంది. ఇలా మాట్లాడటం అతిశయోక్తి మాత్రమే అనుకునే భాషా ఉదారవాదులూ కొందరుంటారు. "భాష ఎలా చస్తుంది ? మరీ చోద్యం కాకపోతే....?!" అని వారు విస్మయం ప్రకటించినా ఆశ్చర్యం లేదు. ప్రపంచంలోని ఏడువేల భాషల్లో దాదాపు 65 శాతం భాషలు కాలక్రమంలో మృతభాషలయినట్టు ఐక్యరాజ్య సమితి గుర్తించింది. "ఒక భాషకు చెందినవారు ఆ భాషను వాడుకలో పెట్టుకోనప్పుడు, సంభాషణల్లో, తమ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాల్లో (కమ్యూనికేటివ్‌డొమైన్స్) తల్లి భాషను వాడే వారి సంఖ్య తగ్గిపోతున్నప్పుడు, ఒక తరం తమ భాషను తర్వాతి తరానికి వారసత్వంగా అందించే స్థితిలో లేనప్పుడు ఆ భాష తీవ్ర ప్రమాదంలో పడినట్టే" అని ఐక్యరాజ్యసమితి విద్య-శాస్త్ర-సాంస్కృతిక సంస్థ 'యునెస్కో' నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణల తర్వాత సుమారు 40 నుంచి 50 శాతం మంది తెలుగు పిల్లలు తల్లిభాషకు దూరమైనట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. మాట్లాడుతారేమో గానీ, వారిలో

అత్యధికులకు తెలుగు- చదవడం- రాయడం రానే రాదు. తెలుగు తెలుసని చెప్పే వారిలోనూ అరకొరగా చదవడం, అంతకన్నా అధ్వాన్నంగా రాయడం మాత్రమే వచ్చిన వారి శాతం ఎక్కువే. ఐ.టి, ఇతర సాంకేతిక వృత్తి విద్యా కోర్సుల్లో చేరుతున్న మెజారిటీ విద్యార్థులకు తెలుగు మొత్తానికే రాదు. లేదా వచ్చేది అంతంతే! ఒక భాష వాడుక నుంచి క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితుల్లో ఆ భాష/జాతి తాలూకు సాంస్కృతిక, చారిత్రక, వారసత్వ, పర్యావరణ సంబంధిత విలక్షణమైన ప్రత్యేక పరిజ్ఞానాన్ని ఆ జాతి శాశ్వతంగా కోల్పోతుంది. క్రమ క్రమంగా ఆ దుస్థితి తెలుగుజాతికి పడుతోంది.

## భాష అంటే మాటలు కాదు!

భాషకు మనిషికి ఉన్న సంబంధం మానవ సమాజం పుట్టినప్పట్నుంచీ ఉంది. తల్లీ-పిల్లల సంబంధం నుంచి మొదలై మానవ సంబంధాలన్నింటినీ సూత్రబద్ధం చేసేది భాష మాత్రమే! భాష పరమ ప్రయోజనం మానవుల మధ్య భావప్రసరణలకు ఒక వాహకంగా ఉపయోడపడటం. ఇక నాగరికతా వికాసం, మానవాభ్యుదయం, సంస్కృతీ-సంప్రదాయాల కొనసాగింపు, కళల సంరక్షణ-వృద్ధి, మనిషికి మానసికోల్లాసం కలిగించడం వంటివన్నీ భాష వల్ల సాధ్యపడుతున్నవే! ఈ ప్రపంచంలో నిర్ణీత ప్రదేశము, ఓ ప్రత్యేక భాష, సంస్కృతి, చరిత్ర కలిగిన జన సముదాయాల్ని జాతిగా పరిగణిస్తారు. నిర్ణీత ప్రదేశమనే పరిధి- పరిమితి గతంలో ఉండేది. కానీ, ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఈ భౌగోళిక సరిహద్దులూ చెరిగిపోయాయి. ప్రాంతంతో నిమిత్తం లేకుండా ఒక భాష మాట్లాడేవారు ప్రపంచంలోఎక్కడ, ఏ మూలన ఉన్నా ఒక జాతిగా గుర్తింపు పొందుతున్నారు. అందుకే, భాష ఇంకా జన సమూహాల్ని జాతులుగా కట్టి ఉంచుతోంది. తమలో తమ భావ వినిమయానికి అవసరమైన తల్లి భాషతో పాటు ఇతర జన సముదాయాలతో సంబంధాలకు అన్య భాషలు, ముఖ్యంగా జాతీయ, అంతర్జాతీయ అనుసంధాన భాషలు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి.మన దేశంలో జాతీయ స్థాయిలో అనుసంధాన భాషగా హిందీ, అంతర్జాతీయ అనుసంధాన భాషగా ఇంగ్లీషు అత్యధికులకు నేడు అవసర భాషలై కూర్చున్నాయి. విదేశాలకు వెళ్లేటప్పటి అవసరాలకు కాకుండా, ఉన్నచోటే ప్రపంచ పరిణామాలతో సంబంధం కలిగి

ఉండాలన్నా, విషయ పరిజ్ఞానం పెంచుకోవాలన్నా... ఇంగ్లీషు వంటి అన్య భాషలు తెలిసి ఉండటం అవసరమైంది. తల్లిభాష గొప్పతనం గురించి అత్యధికులకు సంపూర్ణ అవగాహన లేదు. రోజువారీ సంభాషణల్లో ఉన్నట్టు మాత్రమే పైకి కనిపించినా, తల్లిభాషలో అనేకానేకాంశాలు ఇమిడి ఉంటాయి. తల్లిభాష ఆలంబనగానే ప్రపంచ వ్యాప్తంగా సాహితీ-సాంస్కృతిక విప్లవాలు సాధ్యమయ్యాయంటే అతిశయోక్తి కాదు. అభివృద్ధి చెందిన దాదాపు అన్ని సమాజాలు, దేశాల్లోనూ తల్లి భాషతోనే విద్యా వికాసము, పరస్పర భావప్రసరణ జరిగాయి, జరగుతున్నాయి. ప్రజల అనుభూతులు, ఆలోచనలు, జీవన విధానానికి సంబంధించిన సమస్త విషయాలు తల్లిభాషలో గాఢంగా ప్రతిబింబిస్తాయి. మనిషికి అసాధారణ సుఖదఃఖాలు కలిగినపుడు భావాలు శక్తిమంతంగా తల్లిభాషలోనే వ్యక్తమవుతాయి. తల్లిభాషకు తోడు అన్య భాషలు తెలిసి ఉండటం వల్ల ప్రయోజనమే ! ఇతరులపై ఆధారపడనవసరం లేకుండా ఆయా సందర్భాల్లో కమ్యూనికేషన్ పరమైన అవసరాలను అది తీరుస్తుంది ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు ప్రపంచ పౌరులుగా ప్రయోజనాలు పొందడానికి ఇతర ప్రధాన భాషలు తెలిసి ఉండాల్సిన అవసరం కలుగుతోంది. ఇంగ్లీషు వంటి అంతర్జాతీయ భాష తగినంత లోతుపాతులతో తెలిసి ఉండడం తప్పనిసరి అదనపు ప్రయోజనాన్ని కలిగిస్తుంది కనుక అదొక అవసరంగా మారింది. అదేదైనా, తల్లిభాష అబ్బినంత తేలికగా, సులభంగా అన్యభాష రాదు. నేర్చుకోవడం అసాధ్యం కాకపోయినా అది మాతృభాష తర్వాతిదే అవుతుంది. పట్టుదలగా అభ్యసిస్తే అన్యభాషలపై మనకు ఆసక్తి, మోజు వంటివి తల్లిభాష ప్రయోజనాల్ని ఫణంగా పెట్టి పెరక్కూడదు. ఆంగ్ల భాషా వ్యామోహం తెలుగు వికాసానికి అడ్డంకిగా మారింది. ఈ వ్యామోహం మరిన్ని కొత్తపుంతలు తొక్కి ఇంకా అడ్డు తగులుతూనే ఉంది.

## తల్లి భాష ప్రధాన్యత రుజువైన సత్యం

పాఠశాల విద్యా బోధన ఏ భాషలో జరగాలనే దానిపై సందేహాలకతీతంగా స్పష్టత ఉంది. తల్లి భాషలోనే జరగాలన్నది విశ్వసమాజం అంగీకరించి, అనుసరిస్తున్న సత్యం. ప్రపంచమంతటా ఇదే ఆచరణలో ఉంది. తల్లి భాషలో విద్యాబోధన వల్ల పిల్లల్లో సహజ సృజన వికసిస్తూనే, విషయ పరిజ్ఞానం వారికి బాగా అబ్బుతుందనేది శాస్త్రీయంగా రుజువైంది. 1959 ఆగస్టు 11 న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో

జరిగిన 'అంగ్రేజీ హటావో' సదస్సులో డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా మాట్లాడుతూ ఓ గొప్ప మాట చెప్పారు. "విషయపరిజ్ఞానం లోతుల్లోకి వెళ్లి వాటిని అవగాహన చేసుకోవడానికి ఎంత సమయం, శ్రద్ధ అవసరమవుతాయో, అదంతా మన పిల్లలు పరాయి భాష అయిన ఆంగ్ల పరిజ్ఞానాన్ని సంపాదించడానికే వెచ్చించాల్సి వస్తోంది. అయినా పలువురు విద్యార్థులు విషయ పరిజ్ఞానంలో ఉత్తీర్ణులౌతూ కేవలం ఇంగ్లీషు భాషలో విఫలమైనందువల్ల మొత్తం పరిక్షల్లోతప్పడమో, అవకాశాలు కోల్పోవడమో జరగుతోంది" అన్నారు. తల్లిభాషలో పాఠశాల విద్యాబోధన జరగాలన్న సిద్ధాంతం ఈ అంశం ఆధారంగా బలపడ్డదే! ప్రాథమిక స్థాయి విద్యాబోధన తల్లిభాషలోనే జరగాలని మన అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు1993 లోనే స్పష్టమైన తీర్పిచ్చింది. రాజ్యాంగం 350 అధికరణం కూడా ఇదే నిర్దేశిస్తోంది. అయినా పాలకులు పట్టించుకోవడం లేదు. పాఠశాల స్థాయిలోనూ ఇంగ్లీషు మాధ్యమ విద్యాబోధనకే వారు దోహదపడుతున్నారు.ఏ స్థాయిలో కూడా తెలుగును నిర్బంధంగా నేర్పించే విధానాలే మన రాష్ట్రంలో లేవు. తెలుగును పరిరక్షించే ఎటువంటి చర్యలూ లేవు. తల్లిభాషను కాపాడుకొని వృద్ధి పరచుకునే విషయంలో పొరుగునున్న మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులో ఉన్నపాటి శ్రద్ధ కూడా మనవాళ్లకు లేదు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడ్డ తొలి రాష్ట్రమే అయినా తెలుగువారికి భాషపైన పెద్దగా శ్రద్ధ లేదని ఎన్నోమార్లు, ఎన్నో స్థాయిల్లో రుజువైంది. అదే పంథా ఇంకా కొనసాగుతున్నది. క్రీ.శ.625 నుంచి నన్నూరేండ్లకు పైబడి ఈ నేలనేలిన తూర్పు చాళుక్యరాజులు తెలుగును అధికార భాషగా ప్రకటించి పట్టం కట్టారు. ఈ పద్నాలుగువందల యేళ్లలో భాష పలు మార్పులకు గురవుతూ వచ్చింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ 1966 లో తెలుగును అధికార భాషగా ప్రకటిస్తూ ప్రత్యేక చట్టం తెచ్చింది. అప్పట్నుంచి చాలా సందర్భాల్లో ప్రభుత్వాలు రకరకాల ఉత్తర్వులు, ఆదేశాలు, పాలనా ఉత్తర్వులు ఇస్తున్నప్పటికీ తెలుగును పరిరక్షించడంలో, వృద్ధి చేయడంలో ఆశించిన ఫలితాలు రాలేదు. కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు తమ స్థాయిలో కృషి చేస్తున్నా అది సమగ్రంగా జరగట్లేదు. ప్రాథమిక విద్య తప్పనిసరిగా తెలుగు మాధ్యమంగానే జరగాలన్న డిమాండ్ ఆచరణకు నోచుకోలేదు. 2003 లో ప్రభుత్వ విద్యాశాఖ ఒక ఉత్తర్వు (జీవో ఎమ్మెస్ నం:86) జారీ చేసింది. పాఠశాలల్లో తప్పనిసరిగా తెలుగును ఒక (ప్రథమ/ ద్వితీయ/ తృతీయ) భాషగా నేర్పాలనేది

సదరు ఉత్తర్వు ఉద్దేశం. కానీ, కడకు దాని అమలు కూడా నీరు కారింది. ఆధునిక తరం యువత ప్రపంచస్థాయి, జాతీయ స్థాయి ఉద్యోగావకాశాలకు ఇంగ్లీషే అవసరమని భావించడం, పిల్లల తల్లిదండ్రులూ అదే భావనతో ఉండటం కూడా తెలుగు భాష నిర్లక్ష్యానికి గురవుతన్న ప్రస్తుత పరిస్థితికి కారణమౌతోంది.

## ప్రసార మాధ్యమాల పూనిక అవసరం

భాషను కాపాడటం, వృద్ధి చేయటంలో ప్రసారమాధ్యమాలు కీలకపాత్ర పోషిస్తాయి. తెలుగునాట స్వతంత్ర్యోద్యమకాలంలో, స్వాతంత్ర్యం తర్వాత తెలుగు భాషాభివృద్ధికి పత్రికలు, రేడియో, టీవీ ఎంతగానో కృషి చేశాయి. విద్యార్థి, భారతి, యువ, విజయ, స్వాతి, గోలకొండ, కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ వంటి మాస, వార, దిన పత్రికల కృషి ఎన్నదగింది. 'ఈనాడు' దినపత్రిక వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి భాష వినియోగం వల్ల కమ్యూనికేషన్ లోపరహితంగా, ప్రభావవంతంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ఈ దిశలో కొంచెం కృషి సల్పింది. ఆ మేరకు కొంత ఏకరూపత సాధించినా, ఈ ప్రయోగ ఫలితంగా మాండలిక పదాల వినియోగం దినపత్రికల్లో తగ్గిపోవడం కూడా భాషకు నష్టం కలిగించింది. ఒక ప్రాంతంలో బాగా వినియోగంలో ఉన్న పదాలే అయినా మరో ప్రాంతం వారికి అర్థం కావని, కాకపోవచ్చనే భావనతో వాటిని వినియోగించడం లేదు. గ్రాంథిక ప్రత్యామ్నాయ తెలుగు పదాలనో, అన్యభాషా పదాలనో వాడుతున్నారు. దీర్ఘకాలంలో ఇది భాషకు జరుగుతున్న అనర్థమే! గ్రామ్యం చచ్చిపోతున్న క్రమంలో ఇదొకచెడ్డ పెడ ధోరణే అయి కూర్చుంది. అందుకే, ఎక్కడ అయినా 'ప్రామాణిక భాష' అంటూ ఏమీ ఉండదు. ప్రజల అవసరాలు, సౌలభ్యం, వినియోగం వంటి అంశాల్ని బట్టి కాలక్రమంలో మారుతూ ఉంటుంది. 23 జిల్లాలున్న తెలుగునేలకు రెండున్నర జిల్లాల్లోని వారు మాట్లాడేదే ప్రామాణిక భాష అనే ఓ బలమైన భావన కొన్నాళ్లు సాగింది. దాన్నే ఇతరులపై రుద్దే ప్రయత్నంలో కూడా తెలుగుకు కొంత అన్యాయం జరిగింది. ఉత్తర కోస్తా, దక్షిణకోస్తా, రాయలసీమ, తెలంగాణ ఇలా దేనికదిగా ఆయా ప్రాంతాల్లోని తెలుగు వేర్వేరు పదసంపద, యాస, స్వరూప-స్వభావాలతో తరాల తరబడి కొనసాగుతూ వస్తోంది. దీన్ని గౌరవించాల్సిందే! రాను రాను ప్రసారమాధ్యమాల్లో వేగం, అనారోగ్యకరమైన పోటీ వాతావరణం పెరిగి విలువలు,

నిబద్ధత, సత్యసంధత తదితర విషయాల్లో జరిగినట్టుగానే భాష విషయంలోనూ నష్టం జరుగుతుంది. యువత, కొత్త తరాన్ని ఆకట్టుకోవడమనే సాకుతో అసాధారణ స్థాయిలో ఆంగ్ల పదాల్ని తెలుగులోకి జొప్పిస్తున్నారు. తేలికయిన, అత్యధికులకు తెలిసిన ప్రత్యామ్నాయ తెలుగు పదాలున్న చోట కూడా వాటిని కాదని ఇంగ్లీషు పదాల్ని నిరభ్యంతరంగా వాడేస్తున్నారు. ఒక తెలుగు దినపత్రికలో "అగ్రికాలేజ్ అడ్మిషన్లకు గ్రీన్‌సిగ్నల్" అన్నది శీర్షిక! ఇందులో తెలుగెంతో లెక్కతీయండి. 'వ్యవసాయ కళాశాల ప్రవేశాలకు పచ్చజెండా' అంటే వచ్చే నష్టమేంటి? అక్షరాల సంఖ్య కూడా దాదాపు అంతే! ప్రాస కోసం ప్రయాసలో కూడా కొన్ని మార్లు ఎక్కువ ఆంగ్ల పదాల్నో, ఆంగ్లంతో సంకరపరచి అర్థం సృష్టించిన అర్థం లేని కొత్త తెలుగు పదాల్నో వాడుతున్నారు.భాషను ఓ రకంగా ఖూనీ చేస్తున్నారు. జర్నలిజంలోకి వస్తున్న వారికి పుస్తకాలు చదివిన అనుభవం, భాషపై పట్టు అంతంతే! వృత్తిలోకి వచ్చిన తర్వాతైనా నేర్చుకోవాలన్న తపన అంత బలంగా ఉండట్లేదు. కొత్త తరం జర్నలిస్టులు, పత్రికల పీఠాధిపతులు, అందరూ అలాగే తయారయ్యారు. సరైన అర్థమిచ్చే, అందుబాటులోని తెలుగు పదాన్ని వెతికి పట్టుకోరు. సమానార్థకాలుగా కొత్తవి సృష్టించే యత్నమూ చేయరు. పదసంపద పెంచుకునే యావే ఉండదు. శ్రమ లేకుండా సమయానికి గుర్తొచ్చిన ఏదో అంగ్ల పదాన్ని వాడేసి పబ్బం గడిపేస్తారు. ప్రస్తుతం ప్రసార మాధ్యమాల్లో పత్రికలతో పాటు ముఖ్యంగా టెలివిజన్, వెబ్, బ్లాగ్ వంటి వాటిలో తెలుగు భాషా పరిరక్షణ, వృద్ధికి ఎటువంటి ప్రత్యేక చర్యలూ లేవు. పైగా భాషను సంకర పరచడం వంటి చర్యలతో వారే దెబ్బతీస్తున్నారు. మూఢంగా, ఎక్కడా అన్యభాషా పదాల్ని వినియోగించ కూడదని కాదు. ఇతర భాషా పదాల ఆదాన ప్రదానాలతో భాష పరిపుష్టమైన సందర్భాలెన్నోఉంటాయి. అంతిమంగా ప్రజలు మాట్లాడే భాషే ప్రామాణికం అవుతుంది.లోపాలు, కొరతలు లేకుండా విషయం వారికి అర్థం అవడమే భాష అంతిమ లక్ష్యం కావాలి. తేలికైన, ప్రజలకు పరిచయమున్న తెలుగు ప్రత్యామ్నాయ పదాలున్నా వాట్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా, ఉదాసీనంగా ఆంగ్లపదాల్ని వాడటం, వాటినే ప్రోత్సహించడం తెలుగుకు నష్టం కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాల వారికి తేలిగ్గా అర్థమయ్యే సూటి పదాలెన్నో కాలగర్భంలో కలిసిపోతున్నాయి. చక్కని పదాలు ఒక్క తరం మార్పుతోనే కనుమరుగవుతున్నాయి. 'నడువ' అన్న చక్కని పదం వందల సంవత్సరాల నుంచీ

వాడుకలో ఉన్నప్పటికీ, 'క్యారిడార్' అనే ఆంగ్ల పదాన్నే విరివిగా వాడుతున్నారు. 'వైద్యశాల' అనే పదానికి బదులు అస్పత్రి అనో, ఆసుపత్రి అనో, హాస్పిటల్ అనో, దావఖానా అనో వాడుతున్నారు. పాఠశాల, కళాశాల, మూత్రశాల వంటి పదాలు చక్కగా వాడుతున్నపుడు వైద్యశాల వాడకానికొచ్చిన ఇబ్బందేమిటో, నష్టమేంటో అర్థం కాదు. అట్లాగే, 'కూతురు' 'కొడుకు' అన్న పదాలేవో నిషేధాలయినట్టు పనిగట్టుకొని పరిహరిస్తున్నారు. వాడటం లేదు. ఒకోసారి వాడడంలో వివక్ష చూపుతున్నారు. సాధారణ ప్రజానీకానికి సంబంధించిన సందర్భమైతే నిరభ్యంతరంగా వాడుతూ, సంపన్నులు, పెద్ద పెద్ద హోదాలు కలిగిన వారి పిల్లల ప్రస్తావనయితే, ఈ పదాలు వాడకుండా తప్పని సరిగా తనయ, తనయుడు వంటి ప్రత్యామ్నాయ పదాల్ని మాత్రమే వాడి వివక్ష చూపుతున్నారు. ఐ.టి., సైబర్ ఫీల్డ్ వంటి కొత్త కొత్త రంగాలు పుట్టుకు వస్తున్నప్పుడు, అందులోని పారిభాషిక పదాలకు సమానార్థకాలైన తెలుగు పదాల సృష్టి జరగాలి. ఈ విషయాల్లో కొంత లోతైన, నిలకడైన పరిశోధన జరగాలి. భాషా పరిరక్షణకు నిర్దిష్టమైన చర్యలుండాలి. విస్తారంగా వాడకంలో ఉన్న వైవిధ్యభరిత మాండలిక పదాల్ని పలుకుబడిలో ఉంచాలి. వాటితో పదకోశాలు, నిఘంటువులు తయారు చేసుకోవాలి. వీటన్నింటినీ వ్యాప్తిలోకి తీసుకురావాలి. ఈ భాషా కృషిలో ప్రభుత్వం, విద్యావేత్తలు, కవులు – రచయితలు, విద్యాసంస్థలు, యువతరం, వారి తల్లిదండ్రులు, ప్రసారమాధ్యమాలు, తెలుగు జర్నలిస్టులు ఇలా... అందరూ శ్రద్ధ తీసుకోవాలి. నిబద్ధతతో బాధ్యతను నెత్తినెత్తుకోవాలి. అప్పుడే మన తెలుగు భాష నాలుగు కాలాలు మనగలుగుతుంది.

వ్యాసకర్త – **సాక్షి కార్యనిర్వహణ సంపాదకులు**

# భాషను పెంచుతున్నామా? తుంచుతున్నామా?

**- *డాక్టర్ రెంటాల జయదేవ***

నలుగురు ఒకరితో ఒకరు స్నేహం పెంచుకోవడానికో, విషయం పంచుకోవడానికో, భావాలు చెప్పుకోవడానికో మాటల్ని వినియోగిస్తాం. అలా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి పోయినవి పోగా, ఒక్క మన దేశంలోనే కొన్ని వందల భాషలున్నాయి. తెలుగు, తమిళం, హిందీ - ఇలా చాలా భాషల పేర్లు విన్నాం. మరి, ఈ పత్రికా భాష అంటూ కొత్త భాషేంటి? అవును. నిజంగానే ఇది కొత్త భాష. మనది తెలుగు భాష అయినా, మనవి తెలుగు పత్రికలే అయినా, ఆ పత్రికల్లో వాడే భాషను 'పత్రికా భాష' అంటూ ప్రత్యేకించి చెప్పడంలోనే అసలు మర్మం ఉంది. అది మామూలుగా మాట్లాడే, రాసే భాషకు భిన్నమైనదని చెబుతున్నట్లయింది. నిజానికి, పత్రికల్లో రాసే వార్తలు పాఠకుడికి సులువుగా, స్పష్టంగా అర్థం కావడం ముఖ్యం. ఆ రాసేది తెలుగు భాషలోనే అయినా, అందరూ అర్థం చేసుకోగలిగిన భాషలో పత్రికల్లో రాయడం పత్రికా భాష!

స్థూలంగా... వార్తాప్రసారానికి పత్రికల్లో వాడే భాషను పత్రికా భాషగా చెప్పుకుంటే, ఇవాళ పత్రికలతో పాటు రేడియో, టీవీ లాంటి ప్రసార మాధ్యమాలను

కూడా దాటేసి, సరికొత్తగా ఫేస్‌బుక్, వాట్సప్ లాంటి సోషల్ మీడియా – ఇవన్నీ వచ్చేశాక పత్రికా భాష కూడా అనేక శాఖలుగా విస్తరించినట్లు అనుకోవచ్చు. పత్రికా భాష, ప్రసారభాష, ఫేస్‌బుక్ భాష – ఇలా అన్న మాట!

## నేటి పత్రికాభాషలో కృతకత్వం

పత్రికలు మొదలైన తొలిరోజుల్లో వీర గ్రాంథికంగా విద్యావంతులైన చదువరులనే దృష్టిలో పెట్టుకొని సాగిన భాష. ఆ తరువాత క్రమంగా ఎన్ని మార్పులకు లోనైందో అందరికీ తెలుసు. గ్రాంథికం నుంచి సరళ గ్రాంథికం, శిష్ట వ్యావహారికం మీదుగా వ్యావహారికంలోకి వచ్చి, మాండలికాలు, యాసలను కూడా కలుపుకొని, ఇప్పుడు కొన్ని సందర్భాల్లో ఫలానా హీరో 'హిట్టు కొట్టాడు' అనే సంకర భాషలోకి, 'పేపరు కాగితం' తరహా అర్థరహితమైన పదప్రయోగాలలోకి పత్రికలు ప్రయాణించాయి.

ఇంగ్లీషు జాతీయాలు, పదబంధాల అనువాదం తాలూకు ప్రభావం కూడా తెలుగులో పత్రికా భాషపై స్పష్టంగా కనిపిస్తుంది. 'ఈ నేపథ్యంలో...' ('ఇన్ వ్యూ ఆఫ్ ఇట్'), 'ఆ దిశగా...ఆలోచించాలి' ('ఇన్ దట్ డైరెక్షన్'), 'మిలియన్ డాలర్ల ప్రశ్న' ('మిలియన్ డాలర్ క్వశ్చన్') లాంటి పదబంధాలు అలా వచ్చినవే! ఒక రకంగా ఇవి మన భాషకూ, నుడికారానికీ తగినవి కాకపోయినా, ఒకింత ఎబ్బెట్టుగా అనిపించినా, పత్రికల పుణ్యమా అని ఇవన్నీ రాతలో వాడుకలోకి వచ్చేశాయి. అలా చదివీ, చదివీ జనం మాటల్లో, ముఖ్యంగా రాజకీయవాదుల ప్రసంగాల్లో నిత్య వ్యవహారమైపోయాయి.

## భాషకు పత్రికలు సేవ చేయలేదంటారా?

అలాగని, పత్రికలు భాషకు ఎలాంటి దోహదం చేయలేదా అంటే, చేయలేదని ఎవరూ చెప్పలేరు. నిజానికి, ఇవాళ పత్రికల్లో, తద్వారా ప్రజల్లో కలగలిసిపోయిన అనేక పదాలకు సృష్టికర్తలు పత్రికలు, పత్రికలవాళ్ళే! పత్రికల్లో పనిచేసే ఉప సంపాదకులే వార్తలను ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువాదం చేస్తూ, ఆ క్షణంలో అప్పటికప్పుడు పదాలు సృష్టించడం ఆనవాయితీ. అప్పట్లో ఎన్నో సమకాలీన రాజకీయ, సాంఘిక పరిణామాలకు సాక్షిగా నిలిచి, తక్షణ పత్రిక

అవసరాలకు తగ్గట్లు దినపత్రికలు చేసిన అనువాదాలు, సృష్టించిన కొత్త పదాలు కొల్లలు. అలాగే, అప్పటికే ఉన్న మాటలను విస్తృత ప్రచారంలోకి తెచ్చారు. వాటిలో అనేకం ఇప్పటికీ వాడుకలోనే ఉన్నాయి. 'అసెంబ్లీ'కి 'శాసనసభ', 'ఇన్‌ఫ్లేషన్'కు 'ద్రవ్యోల్బణం', 'రిజల్యూషన్'కి 'తీర్మానం' లాంటి ఎన్నో పదాలు వాడుకలోకి వచ్చాయి.

ఆ తరం ప్రముఖ పత్రికా సంపాదకుడు నార్ల వెంకటేశ్వరరావు కూడా చాలా పదాలను తెలుగు పత్రికలకూ, తద్వారా ఇవాల్టి తెలుగు వ్యవహార భాషకు అందించారు. 'కాందిశీకులు', 'శిఖరాగ్ర చర్చలు', 'ఐక్యరాజ్య సమితి' లాంటివి నార్ల వారి సృష్టే! అలాగే, భాషనూ, పదాల వాడుకనూ స్థిరీకరించడానికి కూడా కృషి చేశారు. అప్పట్లో 'నాన్ ఎలైన్‌మెంట్' అనే మాటకు కొందరు 'తటస్థ' అనీ, మరికొందరు 'విబంధ' అనీ వాడుతుంటే, నార్ల వారు 'అలీన' అనే కొత్త పదాన్ని వాడుకలోకి తెచ్చారు. పైగా, 'అలీన' అనే ఆ పదం ఆ ఇంగ్లీషు మాటకు ఎందుకు సరైనదో వివరిస్తూ ఏకంగా ఒక సంపాదకీయమే రాశారు.

ఆ తరువాత ఎంతోమంది జర్నలిస్టు భీష్ములు ఆ కృషిని కొనసాగించారు. ఇక, గడచిన పాతికేళ్ళ కాలంలో 'ఇండియా టుడే' మ్యాగజైన్ తెలుగు సంచిక లాంటి పత్రికలు గహనమైన ఇంగ్లీషు పదాలనూ, భావనలనూ అచ్చ తెలుగు అనువాద రూపంలో అందించేందుకు చాలానే కృషి చేశాయి. విమర్శలు ఎన్ని ఉన్నా, ఆ క్రమంలో అవి తెలుగు భాషకు ఎంతో కొంత మేర చేసిన దోహదం, కొత్తగా చేసిన పదప్రయోగాలు తక్కువేమీ కావు. 'సిక్స్ ప్యాక్ బాడీ'కి 'ఆరు పలకల దేహం', 'బాడీ లాంగ్వేజ్'కు 'శారీరక భాష' లేదా 'దైహిక భాష', అనేక సినిమాలకు అసలు టైటిల్ కింద చిన్న అక్షరాల్లో ఇచ్చే 'ట్యాగ్‌లైన్'కు 'ఉప శీర్షిక' అనీ, 'డ్రిప్ ఇరిగేషన్'కు 'బిందు సేద్యం' లేదా 'నీటి తుంపరల సేద్యం', 'స్టెమ్‌సెల్ థెరపీ'కి 'మూలకణ చికిత్స', 'హోలిస్టిక్ థెరపీ'కి 'సమగ్ర వైద్యవిధానం' లాంటి ఇలా అనేక మాటల్ని 'ఇండియా టుడే' పత్రికా భాషలోకీ, తద్వారా జన ప్రాచుర్యంలోకీ తెచ్చింది. 'క్రీమీ లేయర్'కు 'మీగడ తరక' లాంటి మాటలూ అక్కడే పుట్టాయి.

తెలుగు భాష తెలియకపోతే, తెలుగు చదివేవాళ్ళే లేకపోతే రాగల రోజుల్లో పత్రిక మనుగడకే ముప్పు అన్న విషయాన్ని 'ఈనాడు' దినపత్రిక ముందుగానే

గుర్తించింది. అందుకే, భాషాభివృద్ధి పేరుతో భావి తరాల పాఠకుల్ని తనకు తానే తయారు చేసుకొనే వ్యూహాన్నీ చేపట్టింది. కొన్నేళ్ళుగా కొత్త తెలుగు మాటల సృష్టికీ, వాడకానికీ, తమ పత్రిక ద్వారా ఆ పదాల ప్రాచుర్యానికీ 'ఈనాడు' పత్రిక పడుతున్న శ్రమను విస్మరించలేం. 'కాంట్రాక్టర్లు'కు 'గుత్తేదార్లు' లాంటి పదాలెన్నో ఇప్పుడు 'ఈనాడు' పత్రిక, 'ఈ' టీవీ ప్రసారాల ద్వారా జనానికి బాగా అలవాటు అయ్యాయనడంలో సందేహం లేదు. అదే సమయంలో ప్రతి ఇంగ్లీషు పదానికీ, ఒక తెలుగు మాటను జనంలోకి తీసుకురావాలనే ప్రయత్నంలో 'ఎయిర్‌హోస్టెస్'కు 'గగనసఖి' అనీ, దినచర్య రాసే 'డైరీ'కి 'దైనందిని' అనీ, 'ఔటర్ రింగ్ రోడ్'కు 'బాహ్య వలయ రహదారి' అనీ, స్కూల్ 'యూనిఫామ్'కు 'ఏక రూప దుస్తులు' అనీ చిత్ర విచిత్రమైన పదాలు పత్రికలో వాడుతున్నారు. తెలుగును వ్యాప్తిలోకి తేవాలనే ప్రయత్నం మంచిదే అయినా, ఈ వేలంవెర్రి చివరకు పాతకాలం నాటి 'మేడ్ ఈజీ' గైడ్లు కాస్తా 'కుప్పుస్వామి అయ్యర్ మేడ్ డిఫికల్ట్'గా తయారైన పద్ధతిలోకి వెళ్ళకూడదని ప్రార్థించాలి. అలవాటైన ఇంగ్లీషు పదాల్ని వదిలేసి, తెలుగు పేరిట సంస్కృతాన్ని పత్రికల ద్వారా మనం అరువు తెచ్చుకొని నెత్తికెక్కించుకుంటున్నామేమో కూడా ఆలోచించాలి.

## పత్రికలపై ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం

ఇరవై నాలుగు గంటల టీవీ ఛానళ్ళు, అనుక్షణం న్యూస్‌ను అరచేతిలోనే అందించే స్మార్ట్‌ఫోన్ యాప్‌లు (అప్లికేషన్లు) వచ్చేశాక వార్తాపత్రికల స్వభావం మారింది. దానికి తగ్గట్లు భాషా స్వరూపమూ మారాల్సి వచ్చింది. ఒకప్పుడు మరునాడు ఉదయం పత్రిక చదివితే కానీ తెలియని తాజా వార్తలన్నీ ఇప్పుడు అర్ధరాత్రీ, అపరాత్రీ అనే తేడా లేకుండా టీవీ న్యూస్ ఛానళ్ళలో వచ్చేస్తున్నాయి. అలా 'ఇప్పుడే అందిన వార్త' అంటూ న్యూస్‌ను బ్రేక్ చేసే పనిని పత్రికల నుంచి ఎలక్ట్రానిక్ మీడియా తీసేసుకుంది. దాంతో, ఆ మరునాడు ఉదయం వచ్చే పత్రిక అప్పటికే టీవీల ద్వారా, ఇతరత్రా ప్రజలకు తెలిసిన వార్తను వివరించి, విశ్లేషించి, అవసరమైతే వ్యాఖ్యానించే కొత్త పనిని తలకెత్తుకోవాల్సి వచ్చింది. ఈ రకంగా టీవీ, ఇంటర్నెట్ ప్రభావం పత్రికలపై పడింది. వెరసి, కొన్నేళ్ళ క్రితం దాకా పత్రికలకున్న ప్రాథమిక స్వభావం, కర్తవ్యమే మారిపోయాయి.

ఇవాళ వార్తలోనే వ్యాఖ్య, విశ్లేషణ – అన్నీ వచ్చి చేరడం మొదలుపెట్టేసరికి, అచ్చమైన వార్తను కాకుండా, అన్నీ కలగలిసిన ఫీచర్ పద్ధతిలో వండి వడ్డించడం అలవాటవుతోంది. ఈ క్రమంలో వార్తకూ – వ్యాఖ్యకూ, ప్యూర్ న్యూస్‌కూ – ఫీచర్‌కూ మధ్య గీతలు తరచూ చెరిగిపోతున్నాయి. ఇది కూడా పత్రికా భాష మీద, టీవీ – ఇంటర్నెట్‌లలోని ప్రసార భాష మీద ప్రభావం చూపింది. ఇలా వార్తను కేవలం వార్తగా కాకుండా, ఫీచర్ పద్ధతిలో రాయడం మొదలయ్యాక, వార్తకు పెట్టే శీర్షిక (హెడ్‌లైన్) భాష, స్వభావమూ మారాయి. ఒకప్పుడు నేరుగా, సూటిగా, వార్తను వార్తగా చెప్పేసే హెడ్‌లైన్స్ పెడుతూ వచ్చిన పత్రికలు కొత్త బాధ్యతతో తమ భాషనూ మార్చుకోక తప్పింది కాదు. అదే సమయంలో తెల్లవార్లూ కళ్ళెదుట కనిపిస్తున్న, వినిపిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా భాష, ఆ మీడియాలో వార్తలకు పెట్టే శీర్షికల (హెడ్‌లైన్‌ల) భాష ప్రభావం కూడా మళ్ళీ పత్రికలపై పడింది. అప్పటికే తెలిసిన వార్తకూ, విషయానికీ – అందంగానో, కవితాత్మకంగానో, భావస్ఫోరకంగానో, ఆపి చదివించే విధంగానో హెడ్‌లైన్ పెట్టడమనే పద్ధతి వచ్చింది.

అలా వార్తాపత్రిక కూడా చాలా సందర్భాల్లో ఫీచర్ మ్యాగజైన్ల స్వభావాన్నీ, భాషనూ అలవాటు చేసుకుంది. ఉదాహరణకు, బ్రెజిల్ రాజధాని రియో డి జెనీరోలో తాజాగా ఒలింపిక్స్ మొదలైతే, 'రియోత్సవం' లాంటి శీర్షికలు ప్రధాన తెలుగు పత్రికల్లో కనిపించాయి. 'రియో' అనే మాటకూ, 'ఉత్సవం' అనే పదానికీ భాషా స్వరూప స్వభావాలతో సంబంధం లేకుండానే సంధి చేసి, కొత్త పదబంధాన్ని తెలుగు పత్రికలు కనిపెట్టాయి. వినడానికీ, చదవడానికీ బాగుండాలన్న ప్రాధాన్యం మినహా ఇక్కడ వ్యాకరణ నియమాలకూ, భాషా సూత్రాలకూ చోటు లేదనే సంగతి మరోసారి చెప్పకనే చెప్పేశాయి.

## పత్రికా వాసనల్ని వదిలించుకోని ఎలక్ట్రానిక్ మీడియా

టీవీ మీడియా మన దేశంలో, మరీ ముఖ్యంగా తెలుగు నాట ఇంకా రెండు దశాబ్దాలైనా పూర్తి చేసుకోకుండా టీనేజ్‌లోనే ఉంది కాబట్టి, పత్రికా వాసనలు మన టీవీ మీడియాలోనూ ఉన్నాయి. పత్రికల ప్రభావంతో ఆ రకమైన పత్రికా పదప్రయోగాలు ప్రసారభాషలోకి వచ్చి చేరాయి.

ఎవర్ని ఉద్దేశిస్తున్నామో ఆ పాఠకులకు తగ్గట్లు పత్రికాభాష, అలాగే ఆ శ్రోతలు - వీక్షకులకు తగ్గట్లు ప్రసార భాష ఉండడం అభిలషణీయమే కాదు అవసరం కూడా! కానీ, ఆ యా రంగాలకు తగ్గట్లు ప్రత్యేక నిపుణులు కొత్తగా తయారుకాకపోవడం, ఒక మీడియా నుంచి మరో మీడియాకు వలస వచ్చిన తొలి తరం ప్రభావంతో రెండు భాషలూ కలగలిసిపోయాయి. నిజం చెప్పాలంటే, కలగాపులగం కూడా అయిపోయాయి. సహజంగా మాట్లాడుకున్నట్లు కాకుండా టీవీల్లో చాలాసార్లు వినిపించే కృతకమైన భాష, కొన్నిసార్లు పుస్తకాల్లోని భాష (బుక్కిష్ లాంగ్వేజ్) ఎబ్బెట్టుగా అనిపిస్తున్నాయి. ఆ యా మీడియాకు తగ్గట్లు మన భాష మారాలనే ప్రాథమిక విషయం మర్చిపోవడంతో వస్తున్న తంటా ఇది. అనుకరణ వల్ల, అనువాదం వల్ల కూడా తలెత్తుతున్న సమస్య ఇది. ఉదాహరణకు, 'దీన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి?' అంటూ టీవీ యాంకర్ పదే పదే తమ రిపోర్టర్‌నో, చర్చలో పాల్గొన్నవాళ్ళనో ప్రశ్నించడం నిత్యం చూస్తూనే ఉంటాం. ఒక వార్తా పరిణామంపై స్పందన కోరడానికి ఈ రకమైన ప్రయోగం ఏమిటో, నిజంగా దీన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలో తెలియదు! అలాగే, టీవీ వార్తల్లో న్యూస్ ప్రెజెంటర్లు చదివే వాక్యాల్లో ఒత్తులు, పొల్లుల లాంటి అక్షరదోషాలే కాదు, చివరకు అతి భయంకరమైన అన్వయ దోషాలు, తలా తోకా లేని వాక్యాలు రోజూ వినిపిస్తూనే ఉన్నాయి. స్క్రోలింగుల్లో, ఫ్లాష్ న్యూస్ లాంటి తెరపై వచ్చే ఏకవాక్య రచనలైన 'సూపర్స్'లో ఇవి ఎక్కువగా కనిపిస్తూ ఉన్నాయి.

## జనం నోట... నేటి పత్రికల వినూత్న పదప్రయోగాలు

ఎంత గొంగట్లో అన్నం తింటున్నా, తెలుగు పత్రికలు, మీడియా ఇటీవలి కాలంలో చేసిన వినూత్న పదప్రయోగాలు చాలానే ఉన్నాయి. కామాంధుల్ని అభినవ కీచకులుగా ప్రస్తావించడం చాలాకాలంగా వస్తున్నదే! కానీ, గౌరవనీయమైన స్థానంలో ఉన్న టీచర్లలో కొందరు, విద్యార్థినులపై అకృత్యం జరిపినప్పుడు వారిని 'టీచకులు'గా ప్రస్తావించడం ఇటీవలి పత్రికాభాషలో భాగం. అలా 'టీచర్' అనే పదానికీ, 'కీచకుడు' అనే పదానికీ అంటు కట్టి, 'టీచకుడు' అని ప్రస్తావించడం పత్రికల పుణ్యమే. అలాగే, ఆడవారిపై మృగంలా ప్రవర్తించిన మగాడిని ప్రస్తావిస్తూ, 'మృగం'కీ, 'మగాడు'కీ అంటు కట్టి, 'మృగాడు' అనే కొత్త పదం సృష్టించారు మన పత్రికా

రచయితలు. ఇవన్నీ వ్యాకరణ రీత్యా సాధ్యమయ్యే పదబంధాలూ కావు, సాధురూపాలూ కావు. అయితే, వినూత్నంగా ధ్వనించడం, పదే పదే వాడకం ద్వారా జనసామాన్యంలో ఆమోదం పొందడం – ఈ కొత్త మాటలకు కలిసొచ్చిన అంశం. ఈ పదాలన్నీ ఇప్పటికే పత్రికలు, టీవీల నుంచి జనం భాషలోకి వచ్చేశాయన్నది నిష్ఠురసత్యం. 'వ్యవహార శరణం... వ్యాకరణం' అని పెద్దల మాట కాబట్టి, వ్యవహారంలో ఉన్న ఈ పత్రికా భాషా రూపాలే రేపు వ్యాకరణంగా పరిణమిస్తాయి.

ఇక, అచ్చంగా ఫీచర్ల విషయానికి వస్తే, శీర్షికల్లో భాషా ప్రయోగాలు మరింత ఎక్కువయ్యాయి. ఇటీవలే ఒక పత్రిక 'ఫ్యాషన్' పేజీలో స్త్రీలు ధరించే రకరకాల 'జాకెట్ కట్స్'కు సంబంధించిన కథనానికి 'జాకట్టు' అని ప్రయోగాత్మక శీర్షిక పెట్టింది. అలాగే, హీరోయిన్ పాత్రలు ప్రధానంగా వస్తున్న లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో హీరోయిన్‌లే హీరోలుగా చలామణీ అవుతుండడాన్ని ప్రస్తావిస్తున్న కథనానికి 'హీరో ఇన్' అని హెడ్‌లైన్ పెట్టింది. ఈ రకమైన కొత్త ప్రయోగం చేసింది. ఈ మొత్తం వ్యవహారం చూసినప్పుడు మళ్ళీ మనకు విజయా వారి పాత 'మాయాబజార్' (1957) సినిమాలో ఘటోత్కచుడి అనుచరులు, గురువు చిన్నమయ దగ్గర విద్య నేర్చుకుంటూ 'అస్మదీయులు' (మనవారు) అనే మాటకు వ్యతిరేకపదంగా 'తస్మదీయులు' (పగవారు) అనే పదం సొంతంగా వాడేసే ఘట్టం తప్పకుండా గుర్తుకొస్తుంది. ఇవాళ ఆ రెండు పదాలూ పత్రికల్లోని రాజకీయ వార్తల్లో, తద్వారా జన వ్యవహారంలో పాతుకుపోయాయి. ఒకరకంగా ఆ సినిమాలోనే 'ఎవరూ పుట్టించకపోతే, మాటలెలా పుడతాయి' అంటూ ఘటోత్కచుడి పాత్ర నోట రచయిత పింగళి నాగేంద్రరావు పలికించిన మాటలు ఇప్పుడు పత్రికల వారికి స్మరణీయాలు, అనుసరణీయాలయ్యాయి. అలాగే, 'పాండిత్యం కన్నా జ్ఞానం గొప్పది' అనే ఘటోత్కచుడి డైలాగ్ కూడా ఆలోచనలో పడేస్తుంది. మాట అర్థస్ఫోరకంగా, భావం స్పష్టంగా తెలియజెప్పేలా ఉంటే – మిగతా వ్యాకరణ విషయాలు పట్టించుకోనక్కర లేదనే ధీమా కలిగిస్తుంది. అయితే, పదస్వరూపంలో ఉన్న సామ్యాన్ని బట్టి తప్పుడు పదాలు సృష్టించి, తప్పుగా రాయడం కరెక్ట్ కాదేమో అన్నదే భాషా శిష్టులు, పత్రికా వశిష్టుల బోధ! బాధ!!

## భాషపై శైలీపత్రాలు ఉన్నట్టా? లేనట్టా?

ఒకప్పటి మాట ఎలా ఉన్నా, గడచిన రెండు దశాబ్దాలుగా తెలుగు పత్రికలు ఉన్నంతలో శైలీపత్రాలు (స్టయిల్ షీట్‌లు) రూపొందించుకొనే పనిలో పడ్డాయి. కొత్తగా ఏర్పాటు చేసుకున్న జర్నలిజమ్ శిక్షణ సంస్థల్లో చేరిన శిక్షణార్థులకు కొన్ని ప్రాథమిక అంశాలు నేర్పడానికి అవి కొంత మేర ఉపకరిస్తున్నాయి. వాటికి తోడు ఎప్పటికప్పుడు పత్రికల్లో వస్తున్న తప్పొప్పులతో ప్రతి నెలా సంస్థలో అంతర్గతంగా ఉద్యోగులకు పంపిణీ చేసేందుకు 'ఈనాడు', 'సాక్షి' లాంటి పెద్ద పత్రికలు ప్రచురిస్తూ వచ్చిన 'సమీక్ష' బులెటిన్లు కూడా కొంత ప్రయోజనకరంగానే ఉన్నాయి. అయితే, ఆర్థిక, మానవ వనరుల లేమి లాంటి అనేక కారణాల వల్ల అన్ని పత్రికలూ ఈ పని చేయడం లేదు. చేస్తున్న పత్రికలు కూడా ఎంత శ్రద్ధగా, ఎంత క్రమం తప్పకుండా చేస్తున్నాయి, కొత్త అంశాల్ని చేర్చి ఎప్పటికప్పుడు శైలీపత్రాన్ని నవీకరిస్తున్నాయా అంటే అదీ లేదు. దాంతో, ఇంగ్లీషు పత్రికలు, టీవీ ఛానళ్ళలో లాగా భాషాపరంగా నిర్దిష్టత, నిర్దుష్టత తెలుగు పత్రికల్లో సాధించలేకపోతున్నాం. ఒకే పదం ఒక్కో పత్రికలో ఒక్కొక్కలా కనిపిస్తూ, తప్పేదో ఒప్పేదో తెలియని గందరగోళాన్ని పాఠకుడికి సృష్టిస్తుంటే, చూస్తూ ఊరుకుంటున్నాం.

కానీ, ఒకప్పుడు నార్ల వెంకటేశ్వరరావు, ఆ తరువాతి తరంలో నండూరి రామమోహనరావు లాంటి సంపాదకులు, అటుపైన 'ఈనాడు' పత్రికలో జర్నలిజమ్ స్టూడెంట్లకు శిక్షణనిచ్చిన బూదరాజు రాధాకృష్ణ లాంటి కొందరు వార్తారచనలో ఒకే విధమైన శైలి ఉండేలా నిర్బంధించేవారు. వార్తలు ఎవరు రాసినా, పత్రిక అంతా ఒకరే రాసినట్లుగా ఉండేలా శైలిని ప్రమాణీకరించడానికి ప్రయత్నించారు. ఆ యా తరాల్లో తమ పరిధిలో వాళ్ళు కొంతమేర విజయం కూడా సాధించారు. కానీ, ఇప్పుడు చెప్పేవారే అరుదు! చెబితే... వినేవారు మరీ అరుదు!!

## మొన్న ఉద్యమం... నిన్న వృత్తి... ఇవాళ కేవలం ఉపాధి!

కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది కానీ... వాస్తవం ఏమిటంటే, పత్రికా రచన ఒకప్పుడు ఉద్యమం. ఆ తరువాత కొన్నేళ్ళ క్రితం వరకు వృత్తి. పవిత్రమైన, బాధ్యతాయుతమైన వృత్తి. ఇప్పుడేమో చాలామందికి కేవలం ఒక

ఉద్యోగం. మీడియా బాగా పెరిగాక, మన కాలేజీలు ఏటా ఉత్పత్తి చేస్తున్న వేలకొద్దీ ఇంజనీర్లు, మేనేజ్‌మెంట్ పట్టభద్రుల్లో పలువురికి ఉపాధి. పత్రికా యాజమాన్యాలకు కూడా ఇది దేశ స్వాతంత్ర్యం ముందు నాటి ఉద్యమ స్థాయి నుంచి ఆధునిక సరళీకరణ యుగం నాటి వ్యాపారంగా మారిపోయింది. అందుకే, ఈ ఇంగ్లీషు మీడియమ్ చదువుల రోజుల్లో తెలుగు జర్నలిస్టులుగా ఉద్యోగాల్లోకి వస్తున్న కొత్త తరంలో ఇప్పుడు భాష మీద పట్టు అరుదే! తెలుగు సరిగ్గా పలకడమే రాని వారు, ఇక పత్రికా రచన రంగంలో ఏ మాత్రం రాయగలరో ఊహించుకోవచ్చు. పదాల్లో ఒత్తులు, పొల్లులు, 'ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ' లాంటి మహాప్రాణాల్లో కనీసం సగం రావు. తెలియవు. ఇది వర్తమాన తెలుగు పత్రికా ప్రపంచంలో అధిక శాతం కనిపించే అనివార్యమైన పరిస్థితి. గొంగట్లో అన్నం తింటూ, వెంట్రుకలు ఏరుకోవడం ఎందుకు? కాబట్టి, దీని గురించి దిగులు పడే కన్నా, ఈ కొత్త తరానికి వీలైనంత శిక్షణనిచ్చి, బాధ్యతల్లో కూర్చోబెట్టడం తప్పదు.

## శిక్షణ సంస్థలు సవాలక్ష

ఒకప్పుడు తెలుగునేలపై ఉస్మానియా విశ్వవిద్యాలయం లాంటి ఒకటి రెండింటికే పరిమితమైన మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ శాఖలు ఇప్పుడు చాలా విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో వచ్చాయి... వస్తున్నాయి. కావాల్సిన సిబ్బంది కోసం కొత్తవాళ్ళను తయారు చేసుకోవడానికి ఇప్పుడు ప్రతి మీడియా సంస్థా ఒక జర్నలిజమ్ స్కూలో, కాలేజో పెట్టి నడుపుతోంది. జర్నలిజమ్‌ను వృత్తిగా కాకపోయినా, ఉద్యోగంగా అయినా వస్తున్న నవ తరానికి శిక్షణ ఇస్తోంది. కానీ, చిక్కల్లా ఇక్కడే వస్తోంది. ఒకప్పుడు "ఏ ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నాడు. మా వాణ్ణి సినిమాల్లో చేర్చుకోండి" అంటూ దర్శకత్వ శాఖలో చేర్పించేవారు. ఇప్పుడు జర్నలిజమ్ ఆ పరిస్థితిలోకే వచ్చిందనే అనుమానం కలుగుతోంది.

పట్టభద్రులైన ఉద్యోగార్థులు తమ శాస్త్ర సాంకేతిక విద్యకూ, ఈ సమాచార ప్రసార ప్రక్రియకూ సంబంధం లేకపోయినా పోటీపరీక్షలకు చదువుకొంటూనే జీవనం కోసమో, మరొకందుకో జర్నలిజమ్‌ను తక్షణ, తాత్కాలిక ఉపాధిగా ఎంచుకుంటున్నారు. దాంతో, భాష, భావప్రకటన, సాహిత్య పరిజ్ఞానం లాంటివి అంతంత మాత్రమే అయినా, అభిరుచి అంతంత మాత్రమే అయినా పత్రికల్లో,

మీడియాలో చేరుతున్నారు. భాగవతంలోని పాత్ర పూతన, ఆ రచన చేసిన బమ్మెర పోతనలే కాదు... ఇటీవలి తెలుగు సాహిత్యంలోని విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, ఆరుద్ర ఎవరో, ఏమిటో, ఏం రాశారో తెలియకుండానే తెలుగు ఎం.ఏలు, ఎం.ఇడీలు పూర్తి అవుతున్న రోజుల్లో, జర్నలిజమ్‌లోకీ అలాంటివాళ్ళు రావడం పెద్ద వింతేమీ కాదు. అలా అనుకోకుండా ఈ రంగంలోకి వచ్చిన ఈ సరికొత్త ఇంగ్లీష్ మీడియమ్ చదువుల విద్యార్థికి జర్నలిజమ్ శిక్షణలో భాషే నేర్పాలా? భావప్రకటనలో మెలకువలు చెప్పాలా? సమాచార ప్రసారంలో నైపుణ్యం రావాలంటే, సాహిత్యాభిరుచి తప్పనిసరి అని పుస్తకాలు చదవడం మప్పాలా? ఏం చేయాలి? ఎంతని చేయాలి? ఎంతకు ఎంత రుద్దితే, ఆ నవతరం ప్రతినిధిని రాబోయే వార్తా యుగంలో కాబోయే నార్లనో, నండూరినో, చేయగలం! దీనికి జవాబు అంత తేలికా కాదు. ఆరు నెలల శిక్షణలో అన్ని విషయాలూ నూరి నోట్లో పోయడమూ మానవమాత్రులకు సాధ్యము కాదు. ఈ పరిమితుల మధ్యనే కొత్త తరం కలం వదిలేసి, కంప్యూటర్ కీ బోర్డ్‌పై జర్నలిజమ్‌లో అ...ఆ...లు దిద్దుతోందన్న విషయం గ్రహించాలి. ఆ అనివార్యతల్ని సహించాలి. ఎప్పటికప్పుడు పత్రికల్లో భరించాలి.

## కొత్త మీడియా... కొత్త సాంకేతిక పరిజ్ఞానం... సరికొత్త తంటాలు!

కొత్త మీడియా పత్రికా రచనా వృత్తికి చేసిన మంచి సంగతి అటుంచితే, చెరుపు కూడా చాలానే ఉంది. 1995 తరువాత ఈ ఇరవయ్యేళ్ళ కాలంలో వెల్లువెత్తిన శాటిలైట్ టీవీ ఛానళ్ళు చాలామందికి బుల్లితెరపై కనిపించే, పాపులర్‌గా వినిపించే అవకాశం తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా గడచిన పదేళ్ళ కాలంలో పుట్టగొడుగుల్లా వచ్చిన టీవీ న్యూస్ ఛానళ్ళ సంగతైతే చెప్పనే అక్కర్లేదు. చాలాభాగం న్యూస్ ఛానళ్ళలో యాంకర్లు, న్యూస్ ప్రెజెంటర్లకూ కనుముక్కు తీరు బాగుండడమే ప్రధాన అర్హతగా మారింది తప్ప, వారి కరెంట్ ఎఫైర్స్ విజ్ఞానం, స్పష్టంగా, స్వచ్ఛంగా మాట్లాడగల భాషా పరిజ్ఞానం గురించి పట్టింపు తక్కువైంది. దానికి తోడు తెరపై కనిపించాలనే కోరికతోనే తప్ప, జర్నలిజమ్ మీద అవగాహనతో, ప్రేమతో వస్తున్నవారు కొద్దిమందే అయిపోయారు. అందుకే, ఇవాళ నూటికి తొంభై తొమ్మిది తెలుగు టీవీ న్యూస్ ఛానళ్ళలో యాంకర్లు మాట్లాడే మాటల్లో, టీవీ తెరపై కిందభాగంలో కదులుతూ పోయే ముఖ్యవార్తల స్క్రోలింగ్‌లలో అక్షర దోషాలు, అన్వయదోషాలు కుప్పలుతెప్పలు.

ఇక, అప్పటికప్పుడు వచ్చే 'బ్రేకింగ్ న్యూస్'లలో భాషా దోషాలు సరేసరి!

మరోపక్క ఎఫ్.ఎం. రేడియోల ప్రభంజనం మొదలయ్యాక, తెలుగు – ఇంగ్లీషుల కలిపికొట్టుడు 'తెంగ్లీషు'లో మాట్లాడడం పెద్ద ఫ్యాషన్‌గా మారింది. అదేమంటే, "శ్రోతల్ని రేడియో ఛానల్ మార్చనివ్వకుండా గడగడా మాట్లాడేయడం (గిట్టనివాళ్ళు కొందరు దీన్ని 'వాగడం' అంటున్నారు) ముఖ్యం కానీ, భాషలో, భావప్రకటనలో తప్పులుంటే ఎవరికి కావాలి" అని వాదిస్తున్నారు. అలా అక్కడా తెలుగు భాషకు తీరని అన్యాయమే జరుగుతోంది.

ఇక, ఇంటర్నెట్ వ్యాప్తి పెరిగాక, 2013 నుంచి గడచిన మూడు నాలుగేళ్ళలో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ వచ్చాక పరిస్థితి మారింది. విశ్వవ్యాప్త వేదిక అనుకొనే 'వరల్డ్ వైడ్ వెబ్' అరచేతిలో ఇమిడిపోవడంతో 'దునియా ఆప్‌కీ ముఠ్ఠీ మే' అన్నట్లు తయారైంది పరిస్థితి. వ్యక్తిగత ఇ–మెయిల్స్ కన్నా ఫేస్‌బుక్‌లు, ట్విట్టర్లు, మూడేళ్ళుగా తెలుగు సమాజం చర్చించే విషయాల్నే మార్చేసిన వాట్సప్‌లలో సామూహిక పోస్ట్‌లు పెరిగిపోయాయి. సమాచార ప్రసారాన్ని ఇవి ఎంత వేగం చేశాయో, భాషను అంతకు అంత పలచన చేసిన మాట వాస్తవం. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఇవాళ ఒక జర్నలిస్టే. సమాచారంతో పాటు ఫోటోలు, వీడియోలు కూడా పంపే ఈ ధోరణికి పాజిటివ్ పార్శ్వం 'సిటిజన్ జర్నలిజమ్' అయితే, ఇక నెగటివ్ పార్శ్వం – భాష, సమాచారంలోని నిర్దుష్టతకు ఎవరూ పూచీ కాకపోవడం! తప్పుడు సమాచారం, వ్యక్తిగత అభిప్రాయాలు కూడా నిజాలుగా భ్రమింపజేస్తూ, ఒకరి నుంచి మరొకరికి 'షేర్' అయిపోవడం! సినిమా చూస్తూనే తెరపై జరుగుతున్న దానిపై పూర్తి శ్రద్ధ, ఏకాగ్రత లేకుండా హాలులో నుంచి చేసే 'సినిమా మొదలైన పావు గంట తర్వాత ఇప్పుడే హీరో ఎంట్రీ. అదిరిపోయింది' లాంటి 'మినిట్ టు మినిట్' సోషల్ మీడియా మెసేజ్‌లు కూడా సినిమా సమీక్షలుగా, విశ్లేషణలుగా చలామణీ అయిపోతున్నాయి.

ఇలా... మారిన సాంకేతిక పరిజ్ఞానం సమాచార ప్రసార ప్రక్రియలో వాడాల్సిన నిర్దుష్టమైన భాషకు పెను సవాలు విసురుతోంది. వెరసి విషయం తెలుసుకోవడానికి యువతరం ఆశ్రయిస్తున్న ఈ 'న్యూ మీడియా' అప్రయత్నంగానే వారి భాషపై అనివార్యమైన ప్రభావం చూపిస్తోంది. అదే ఇవాళ్టి స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్

తరానికి వ్యవహార భాషగా మారుతోంది. చివరకు ఇలా వాడుకలోకి వచ్చిన, వస్తున్న పదబంధాలు, ప్రయోగాలు అనేకం. వీటి ప్రభావం అనివార్యంగా సమకాలీన తరం తెలుగు రాతలో, మాటలో ఉంది. ఇకపైనా... ఉంటుంది. ఉండి తీరుతుంది. అందుకే, ఇప్పుడు వింతగా అనిపిస్తున్న ఈ విచిత్ర ప్రయోగాలన్నీ కాలగతిలో సాధురూపాలుగా, సామాన్య వ్యవహారంగా మారిపోతే మరీ ఆశ్చర్యపోనక్కర్లేదు. అప్పుడు భాష ప్రవాహశీలి అని సరిపెట్టుకోవలసిందే! పత్రికాభాష ఆ ప్రవాహానికి వేగం పెంచి, ప్రజల్ని అందులో కొట్టుకుపోయేలా చేసిందని ఈ పరిణామానికి ముడిపెట్టుకోవలసిందే!!

వ్యాసకర్త - **పరిశోధకుడు, జర్నలిస్టు**

# వార్తాపత్రికల్లో తెలుగు భాష -
# కొన్ని ఆహ్వానించదగిన మార్పులు

*- టి.చంద్రశేఖర రెడ్డి*

ఒకప్పుడు తెలుగు వార్తా పత్రికల్లో వార్తలు - వాటితో పాటు, వాటి మాతృసంస్థల నుంచి వెలువడే ఆంగ్ల దినపత్రికలలో వార్తలకు తెలుగు అనువాదాలుగా అనిపించేవి. అందుకే అవి కొంత కృతంగా కనిపించేవి. క్రమేణా ఈ పద్ధతి మారింది. సముచితమైన తెలుగు పదాలు లేని అనివార్య సరిస్థితుల్లో తప్ప, ఇపుడు తెలుగు వార్తాపత్రికల్లో ఇంగ్లీషు పదాల వాడకం గణనీయంగా తగ్గిపోయింది. ఈ మార్పుకు ఎవరు శ్రీకారం చుట్టారు అన్నది అప్రస్తుతం. ఇది ఆహ్వానించదగిన పరిణామం అనేది మాత్రం అత్యంతసమ్మతం.

ఈ నేపథ్యంలో, ఇప్పుడొస్తున్న తెలుగు వార్తాపత్రికలని కొంత నిశితంగా పరిశీలిస్తే కొన్ని కొత్త పోకడలు విస్పష్టంగా కనిపిస్తాయి. ఈ పోకడలు - ముఖ్యంగా వార్తలకు పెట్టిన శీర్షికల్లో ప్రస్ఫుటమవుతాయి. అలాంటి పోకడలకి కరదీపమే ఈ వ్యాసం.

ఏ వార్తకి పెట్టిన శీర్షికయినా అయస్కాంతంలా పాఠకుడిని ఆ వార్త వైపు లాక్కునేలా ఉండాలి. వార్తని మొత్తం సారాంశాన్ని ప్రతిఫలించేలా ఆ శీర్షిక ఉండాలి. ఈ లక్ష్యం సాధించటానికి ఇప్పుడు పత్రికలు రకరకాల పద్ధతులు అవలంబిస్తున్నాయి. వాటిల్లో కొన్ని...

## 1. ప్రాచుర్యంలో ఉన్న కొన్ని పదాలకి కొత్త అర్థం వచ్చేలా ఒక మార్పు చేయటం :

మగాళ్లు అనే పదం అందరికీ తెలిసిందే. ఇక్కడ వార్తల్లోకి ఎక్కిన మగాళ్లు ఒక అబల పట్ల మృగాల్లా ప్రవర్తించారు. ఇదంతా ఒక ముక్కలో చెప్పటానికి వాళ్ళు వార్తల్లో 'మృగాళ్లు' అయ్యారు.

కీచకుడికి స్త్రీవ్యామోహం ఉందనీ, అది సైరంధ్రిని బలంగా అనుభవించాలనే కోరికకి దారి తీసిందని అందరికీ తెలిసిందే. కానీ, ఒక సంఘటనలో పిల్లలకి ఆదర్శప్రాయంగా నిలవాల్సిన టీచరే, తాను చదువు చెప్పవలసిన విద్యార్థిని మీద అఘాయిత్యానికి తలపడ్డాడు. దాంతో, టీచరూ కీచకుడూ, కలగలిసి 'టీచకుడి' గా పత్రికల్లో అభివర్ణించబడ్డాడు.

రూసా అనేది, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ అనే పదబంధాన్ని ఇంగ్లీషు లిపిలో వ్రాయటంలో నుంచి వచ్చిన సంక్షిప్త రూపం. దీని మీద ప్రభుత్వం పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. దాంతో 'భరోసా' కాస్తా భ 'రూసా' దక్కలేదుగా రూపు దిద్దుకుంది.

మచిలీపట్నం అమ్మాయి అనూహ్య, అత్యాచారానికి గురై హత్య చేయబడింది. అందుకే అది 'హత్యాచారం' గా కొత్త రూపం సంతరించుకుంది.

వరంగల్ పూర్వనామం ఓరుగల్లు. ఇప్పుడు అందరి దృష్టి వరంగల్ ఉప ఎన్నికపైనే. అక్కడ గెలుపు కోసం రకరకాల పార్టీల అభ్యర్థుల మధ్య హోరాహోరి పోరు జరగబోతుంది. అందుకని ఓరుగల్లు కాస్తా ఎన్నికల వార్తల్లో 'పోరు' గల్లుగా నూతన అవతారం ఎత్తింది.

అలాగే చదువుకు బంధనాలుగా మారిన నిబంధనలు నిబంధనాలుగా; జారీ అయిన ఉత్తర్వులు దానికి సంబంధించిన కసరత్తు పూర్తి కాకపోవడంతో

అమలు కానందున 'ఉత్త'ర్వులుగా, ప్రత్తి పంటకు నీరు అందకపోవటంతో ఏర్పడిన విపత్తు కాస్తా వి'పత్తి'గా పదచిత్రాలు అయ్యాయి.

## 2. ఉన్న పదాలలో అక్షరాలని అవసరమైన చోట విడదీసి కొత్త అర్థం కల్పించటం:

వ్యవసాయదారులు బ్యాంకుల దగ్గర కొంత 'రుణం' తీసుకున్నారు. కరువు పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రైతుల పట్ల 'కరుణ'తో అలాంటి 'రుణా'లని మాఫీ చేయాలని తలపెట్టింది. కాని, అది ఇంకా కార్యరూపం ధరించలేదు. ఎప్పుడు జరుగుతందో ఇతమిద్ధంగా తెలియదు. దాంతో కొంత అయోమయం అస్పష్టత. అందుకే ఆ వార్తకు శీర్షిక క'రుణ' చూపేనా ? అయింది.

వర్షాభావ పరిస్థితుల వలన వరి పంట చేతికి చిక్కేలా లేదు. కొద్దిగా నీళ్లు అందితే బాగుండని రైతు కోరిక. కాని ఆ ఆశ నెరవేరలేదు దానితో వార్తాపత్రికల ద్వారా అవి అడుగంటిన చి'వరి' ఆశలు అయ్యాయి.

సైదులు అనే ఆయన ఒకేసారి వంద మోటరు సైకిళ్లను నిర్భయంగా శరీరం మీదకి ఎక్కించుకోగలడు. మరో ఆలోచన లేకుండా ఎక్కడైనా ఈ సాహసకృత్యం చేయటానికి ఆయన ఎప్పుడైనా 'సై' అందుకే అతడు పత్రికల దృష్టిలో సాహసాల 'సై'దులు అయ్యాడు.

ఒక అక్రమం హద్దు మించింది. మన రాష్ట్ర సరిహద్దులని కూడా అది చెరిపేసి ఇతర రాష్ట్రాలకు కూడా వ్యాపిస్తోంది. దాంతో అది పత్రిక దృష్టిలో సరి'హద్దులు' దాటిన అక్రమంగా మనకు తెలపబడింది.

దీపసుమమై విరిసి తక్కువ ఖర్చుతో జనజీవితాల్లో వెలుగుల పరిమళాలు చిమ్ముతుందనుకున్న సౌరశక్తి పథకం ఆచరణపరమైన ఇబ్బందులతో సమగ్రరూపం ధరించలేదు. ఫలితంగా ఆ పథకం మసకబారిన 'సౌర'భంగా పడకేసింది.

## 3. రెండు పదాలు కలిసి - ఒక కొత్త పదం తయారు కావటం:

పట్టాదారు పాసు పుస్తకాలు చేయాల్సింది రెవెన్యూశాఖ. కాని, కొన్ని చోట్ల నకిలీ పాసు పుస్తకాలు జారీ అయ్యాయి. అసలు –నిజం, నకిలీ – మాయ, మాయ

సామాన్యంగా మనకి అర్థం కాని లీల. అందుకే రెండు దృక్పథాలు మిళితమై పత్రికా కథనంలో, 'నకిలీలల'య్యాయి.

జంతు మాంసం తింటే 'క్యాన్సర్' వ్యాధి వస్తుందని శాస్త్రజ్ఞులు చెపుతున్నారు. దీంతో, ఇన్నాళ్లూ ఇష్టంగా ఏ అనుమానమూ లేకుండా తిన్న మంసాన్ని ఇప్పుడు తినాలా వద్దా అనే ఒక కొత్త మీమాంస ఏర్పడింది. అందుకే అది వార్తా పత్రికల్లో మన ముందు మీ'మాంసం'గా ప్రత్యక్షమైంది.

రాజ్యం మనందరిదీ. సారా మాత్రం కొంతమంది జనానిది. ఆ మత్తులో ఉన్న వాళ్లకు కళ్ల ముందు ఉన్న అసలు రాజ్యం కనపడదు. ఒక కొత్త రాజ్యం కనపడుతుంది. చిత్రంగా వాళ్ల రాజ్యంలో వాళ్లే ప్రజలు, పరిపాలకులు. అందుకే అది ఒక కొత్తరూపం తెచ్చుకుని 'సారా'జ్యం అయింది.

సైకతం అంటే ఇసుక. ఇసుక రవాణా ఇవ్వాళా రేపూ ప్రతి వార్తా పత్రికలో నిత్యం ప్రత్యక్షమవుతున్న కథ. దాని వల్ల దీనికి సంబంధించిన కథనం సై 'కథ'గా చెప్పబడింది.

పంట ఇబ్బడి ముబ్బడిగా చేతికి రావాలని తొందరపడి అంటే 'హ(ర్రీ'గా ఏవో పురుగుల మందులు ఒక రైతు తన పొలంలో వాడాడు. అవి సరిగా పని చేయక పంట మొత్తం నాశనం అయింది. అది అతడి జీవితంలో విషాదానికి అంటే 'వ(ర్రీ'కి దారి తీసింది. అందుకే ఆ రైతు 'వహ(ర్రీ'లో మిగిలాడు.

## 4. ఉన్న పదాల నిడివి తగ్గించి వాటి అర్థం వచ్చేలా కొత్త పదాలని సృష్టించటం:

క్రమం కానిది అక్రమం. అలాంటి వాటిని సరి చేయాలంటే వాటిని క్రమబద్ధం చేయాలి. ఈ ప్రక్రియని వార్తగా చెప్పాలంటే మనకి ఉన్న తెలుగు ప్రకారం 'క్రమబద్ధం చేయటమే' మార్గం. ఇది మరీ పొడుగ్గా లేదూ? రెండు పదాలని కలిపి ఒక పదంగా చెప్పలేమా? ఎందుకు చెప్పలేం అన్న ఆలోచనలో నుంచి వచ్చి ఇప్పుడు వాడుకలో ఉన్న కొత్త పదమే 'క్రమబద్ధీకరణ'.

## 5. రెండు విభిన్న భావాలని ఒకే వాక్యంగా చెప్పటం:

చేపలు నీళ్లలో స్వేచ్ఛగా సులభంగా ఈదుతాయి. ఒడ్డున పడేస్తే గిలగిలా కొట్టుకుంటాయి. అక్రమ సంపాదనకు అలవాటుపడిన ఉద్యోగస్థులు అవినీతి నీళ్లలో ఈదే చేపలే. ఆ నీళ్లలో నుంచి బయటికొస్తే వాళ్లకు దిక్కు తోచదు, ఊపిరాడదు. అవినీతి నీళ్లకి అలవాటునడిన వాటిని/వారిని సజీవంగా పట్టుకోవాలంటే వల విసరటమే మార్గం. ఈ వల విసరాల్సింది, వాటిని పట్టుకునే కర్తవ్యం నిర్వర్తించాల్సిన అవినీతి నిరోధక శాఖ అధికారులే. చేపలా, ఆ వలలో ఒక ఉద్యోగస్థుడు చిక్కుకున్నాడు. అందుకనే ఒక దినపత్రికలో 'అనిశా వలలో అవినీతి చేప' అనే వార్త మనకు కనపడింది.

అవసరమైనపుడు రాకుండా, అది చాలదన్నట్లు పడకూడని సమయంలో వచ్చి పడిన అకాల వర్షాలు ఇక నేడో రేపో 'కోత'కి వస్తుందనుకున్న వరి పంటని నాశనం చేశాయి. ధాన్యరాశులు ఇంటికి వచ్చి ధనరాశులుగా మారతాయనుకున్న రైతుకు అఖరుకు గుండె 'కోత'ని మిగిల్చాయి. ఒక కోత బదులు మరో కోతని అందించిన ఈ సంఘటనాక్రమం అంతా, అందుకే చి'వరి'కి మిగిలిన గుండె 'కోత'గా అక్షరరూపం సంతరించుకుంది.

## 6. అదీ, అంతంతో సంబంధం లేకుండా ప్రాసలతో క్రీడించటం:

ప్రాస– వాక్యాలకి ఒక ఊగూ తూగూ తెచ్చి, కవితాత్మకతని ఇస్తుందన్న విషయం మనకందరికీ తెలిసిందే. ఈ సౌలభ్యాన్ని వార్తా పత్రికలు ఎంత ప్రతిభావంతంగా, ప్రభావవంతంగా వాడుకుంటున్నాయో, ఇప్పుడొస్తున్న శీర్షికలు వివరణ అవసరం లేకుండానే వివరిస్తాయి. పాఠకుడి మనోగతాన్ని అలరిస్తాయి. ఈ ఉదాహరణలు చూడండి. లబ్ధప్రతిష్ఠులైన కవుల రాతలను గుర్తు తెచ్చేలా లేవూ?

### అంత్య ప్రాసలు :

నిండా నిర్లక్ష్యం పూడికే సాక్ష్యం, ఈ మలుపులు ప్రమాదాలకు పిలుపులు, కష్టాలు తీరి కొలువులు దీరి, ఉసిరి కొసరి కొసరి, ప్రజాధనం ఏదీ ప్రయోజనం, కల్తీ మత్తు మహా విపత్తు, ఆసరా అంతటితో సరా!

**ఆది ప్రాసలు :**

పప్పుకు ముప్పొచ్చింది, విధి లేక విధులకు, గిరి మురిసేలా శబరి ఉత్సవం.

చివరి మాట:

18 ఏక వాక్య సమూహాలతో కలిపి 98 వాక్య సమూహాలున్న, ఒక తెలుగు కథలో 411 ఇంగ్లీషు పదాలు చవి చూసిన నాకు, పైన చెప్పిన పోకడలన్నీ మన తెలుగు భాషా దాహం తీరుస్తున్న జలవీచికలే. మీరు కూడా కాదనరని నేననుకుంటాను.

వ్యాసకర్త - **పరిశోధకులు**

# తెలుగు వార్తాపత్రికల్లోని భాష తీరుతెన్నులు - పదసృజన

*- రాంభట్ల పార్వతీశ్వరశర్మ*

మాతృభాషను జీవనదిగా కాపాడుతున్న ఘనత పత్రికలదే. తెలుగు భాషా పరివ్యాప్తిలో, ప్రయోగాల్లో ప్రసారమాధ్యమాల భాష విశిష్టతను సంతరించుకుంది. అక్షరదోషాలు, ఇతర భాషాపదజాలాన్ని ఎక్కువ వాడడంవల్లే తెలుగుభాషకు ప్రమాదస్థితి వస్తోందేమో అన్నది విశ్లేషించాల్సిన అంశం. కొత్తపోకడలు పత్రికల్లో ప్రతిబింబించాలని పాకులాడడంవల్ల పత్రికలభాష 'రెంటికి చెడ్డ రేవడి'గా మారింది. నిన్న మొన్నటి వరకు ప్రసారమాధ్యమాల భాష ప్రజలకు ప్రమాణం. కానీ ప్రస్తుతం నడుస్తున్న నవీకరణోద్యమంలో వాడుకభాషనే పత్రికలకు ప్రాణమని నిర్వాహకులు భావిస్తున్నారు. ఇది ప్రామాణికతకు నిలువుటద్దమయిన ప్రసారమాధ్యమాల భాషను నీరుకార్చడమే. "అసలిప్పుడు మనం చదువుతున్న పత్రికల్లో, మనం వింటున్న, చూస్తున్న 'రేడియో', 'టెలివిజన్', 'సినిమా' వంటి 'మాస్ మీడియా'లో వాడుతున్న భాషకు నిర్దిష్ట స్వరూపస్వభావాలే లేవు, ఈ భాషకు ఏ నీతీలేదు, ఏ నియమమూ లేదు, ఇది అన్ని విధాలా అపసవ్యమైన అవాంఛనీయమైన భాష" అన్న విమర్శ

కూడా ఇటీవలికాలంలో ప్రబలంగా వినిపిస్తోంది. ఇది అంత తేలికగా కొట్టి పారేయాల్సింది కాదు.

భాషకు పదజాలమే అభివ్యక్తిసాధనం. ప్రతిభాషలోను అన్ని అంశాలనూ వ్యక్తీకరించడానికి సరిపడే పదసంపద ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలో విస్తరిస్తున్న శాస్త్ర, సాంకేతిక రంగాల పారిభాషికపదజాలాన్ని యథానువాదం చేయడానికి కొన్ని పత్రికలు స్వతంత్రిస్తున్నాయి. ఈ నవీనపదాన్వేషణ ఆహ్వానింపదగిందే కానీ ఈ ప్రయోగాలు పాఠకులకు ఎంతవరకు అవగమవుతాయనే విషయాన్ని పాత్రికేయులు ఆలోచించాలి. బాహ్యవలయరహదారి (ఔటర్ రింగ్‌రోడ్), శిరస్త్రాణం (హెల్మెట్), స్థిరాస్తి (రియల్ ఎస్టేట్), బుట్టబంతి ఆట (బాస్కెట్‌బాల్) గోడపత్రిక (వాల్‌పోస్టర్), ఏకరూపదుస్తులు (యూనిఫాం) లాంటి పదజాలం ఈ కోవకు చెందుతుంది.

## 1. అక్షరదోషాలు:

పత్రికాభాష చాలా సూటిగా, సరళంగా ఉండాలన్నది అందరికీ తెలిసిన విషయమే. 'శిష్టవ్యావహారికభాష'ను ప్రామాణికభాషగా నిర్ధారించి పత్రికారచన కొనసాగించడం ఏళ్ళతరబడి వస్తున్న ఆచారం. భాషలో ఉన్న 'ప్రవాహశీలత'ను ఆసరాచేసుకుని నేటి వార్తాపత్రికలు భాషాకాలుష్యానికి పాల్పడుతున్నాయని నిస్సంకోచంగా చెప్పవచ్చు. సాంకేతికత ఇంతగా అభివృద్ధిచెందినా పత్రికల్లో విస్తృతంగా అక్షరదోషాలు దొర్లుతుండడం శోచనీయం. ముద్రణామాధ్యమాల్లో భాషాపరమైన దోషాలుండడానికి ఎన్నో వ్యవస్థాగత కారణాలుండొచ్చు. ఈ దోషాలను ఎత్తిచూపి, ఆయా మాధ్యమాల నిర్వాహకుల, అధినేతల దృష్టికి తీసుకువెళ్ళే అవకాశం పాఠకుడికి అధికం. ఇలాంటి పాఠకుల స్పందన మాధ్యమాలకూ ఎంతో అవసరం. వీటిని ఎంత వరకు నిర్వాహకులు సహృదయంతో స్వీకరించి, విశ్లేషిస్తారన్నది ప్రశ్నార్థకమే.

మహాప్రాణాక్షరాలు, 'శ,ష, స' ల వినియోగంలో సాధారణంగా ఈ అక్షరదోషాలు కనిపిస్తుంటాయి. 'ళ' కార ద్విత్వం (ళ్ళ) వాడుకలోకూడా ళ్ల గా రాస్తున్నారు. వాళ్లు, కళ్లు, జోళ్లు, వెళ్లు అన్న రూపాలు విరివిగా కన్పిస్తున్నాయి. ఈ పద్ధతి మారాలి. దీనికి విలేఖరి నుండి సంపాదకుల వరకు ఉన్న అవగాహనాలోపం

ఒక కారణమయితే – సాంకేతిక కారణాల వల్ల కూడా కొన్ని సార్లు ఈ 'ముద్రారాక్షసాలు' దొర్లుతుంటాయి. దినపత్రికల్లో రాతప్రతిలోని అక్షరస్ఖాలిత్యాలను పరిశీలించే 'ప్రూఫ్ రీడింగ్'కు ముఖ్యపాత్ర ఉండేది. ఉపసంపాదకుడు రాసిన, అనువదించిన సమాచారాన్ని 'కంపోజిటర్లు' కంపోజ్ చేసి 'గ్యాలీలు' తీసేవారు. ఆ గ్యాలీల్లో 'ప్రూఫ్ రీడర్లు' తప్పులుంటే దిద్దేవారు. ప్రస్తుతం 'కంప్యూటర్'లు వచ్చాక ఈ పద్ధతి పూర్తిగా పోయి, చాలా పత్రికల్లో 'ప్రూఫ్ రీడర్' ఉద్యోగం అవసరంలేకుండా పోయింది. సమాచారాన్ని 'కంప్యూటర్'లో పొందుపరిచే విలేఖరి లేదా ఉపసంపాదకులే ఈ దోష పరిహారకులుగా వ్యవహరిస్తున్నారు. ఉపసంపాదకులకిది అదనపు బాధ్యత కావడంతో తప్పనిసరిగా చేయవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో పత్రికల్లో అక్షర దోషాలశాతం పెరుగుతూ వస్తోంది.

**'అనుమానాస్పద స్థితి మహిళమృతి'** : ఆంధ్రజ్యోతి దినపత్రిక (17 ఫిబ్రవరి 2014 సోమవారం విశాఖస్థానికం పుట. 6) లో ఈ శీర్షికన నేరవార్త కనిపిస్తోంది. ఇక్కడ అనుమానాస్పదస్థితి 'లో' మహిళమృతి అని ఉండాలి. 'లో' అన్న విభక్తిప్రత్యయం లోపించడం వల్ల అర్థం సమగ్రంగా బోధపడదు.

**భక్తులకు ఆకర్షిస్తున్న సాయినాథుడి విగ్రహం:** ఈ పత్రికలోనే పుట. 8లో ఏదో ఉత్సవం గూర్చిన వార్తలో 'భక్తులకు ఆకర్షిస్తున్న సాయినాథుడి విగ్రహం' అన్న శీర్షిక కనిపిస్తుంది. ఇక్కడ 'భక్తులను' అని ద్వితీయా విభక్తిప్రత్యయం ఉండాలి. 'కు' అనే షష్ఠీప్రత్యయం వాడడంవల్ల అర్థమే మారిపోయింది. ఈ వార్తలోనే షిర్డీ 'నాయిసాథుడు' అన్న దోషం కనిపిస్తోంది. **సాయినాథుడు** అనడానికి బదులు ఇలా వర్ణవ్యత్యయం జరిగింది. ఇది కేవలం నిర్లక్ష్యమే. 'పురాణాంతర్గ(త)', 'అనే(క)'..... ఇలాంటి వర్ణలోపాలు, ముద్రారాక్షసాలు ఉత్తమస్థాయిపరిశీలనా లోపం వల్ల దొర్లుతున్నాయన్నది తేటతెల్లమవుతోంది.

**అరాచకశక్తులు వస్తున్నారా?:** ఇది కూడా ఆంధ్రజ్యోతిపత్రిక (17 ఫిబ్రవరి 2014 సోమవారం పుట. 9)లో కన్పిస్తున్న శీర్షిక. శక్తులు అన్నప్పుడు తదనుగుణంగా 'వస్తున్నాయా?' అని శిష్టవ్యావహారికంలో వస్తుంది.. ఇక్కడ బహువచనం వాడకంలో అవగాహనాలోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి అక్షరదోషాలు ఈనాటి పత్రికల్లో సర్వసాధారణం. ఎవ్వరికీపట్టదు, ఏమవుతుందిలే అనో,అవే సరైనవన్న భావనో

తెలియదు కానీ శుద్ధమయిన భాషావినియోగానికి దోషరహితమయిన పత్రికల ప్రస్థానం అవసరం.

**2. శీర్షికల్లో అనౌచిత్యాడంబరం :** విషయస్ఫురణకు వీలుగా అనుకరణ చిహ్నాల (" ") మధ్య విశేషంగా ఒక పదాన్ని ఉంచి 'బ్యానర్ హెడ్‌లైన్'లో భాగంగా వైవిధ్యభరితమయిన శీర్షికలు పత్రికల్లో విరివిగా దర్శనమిస్తున్నాయి. ఇది జనాకర్షణకోసం చేస్తున్న లిపివిన్యాసమవుతుంది తప్ప అర్థ సుబోధకమయిన పద్ధతికాదు. ఆకట్టుకునే శీర్షికల నిర్ణయవ్యవసాయంలో ప్రాసకోసం పాకులాడుతూ , అపార్థానికి, అనర్థానికి దారితీసే విరుపులతో పత్రికలు తెలుగు భాషకు తెగులుపట్టిస్తున్నాయి.

**2.1 గ్రామ్యపదజాలం:** లక్షణవిరుద్ధమయింది గ్రామ్యం. ఇది గ్రామీణులు, నిరక్షరాస్యులు మాట్లాడేభాష. మౌఖికమయిన వ్యవహారానికేతప్ప లిఖితవాఙ్మయంలో కనపడదు. కానీ ప్రామాణికతలేని గ్రామ్యపదాలు కూడా పత్రికల్లో, అదీ కూడా ప్రధానశీర్షికల్లో ఎలా చోటుసంపాదించుకున్నాయో మచ్చుకు కొన్ని చూడండి:

**మనోళ్ళు మెరిసారు... (సాక్షి : 16-01-2014 ఆదివారం)**
**ఉచితమేగా.. కోతేద్దాం. (సాక్షి : 12-01-2014 ఆదివారం)**
**విభజన తీరు బాగోలేదు (ఈనాడు : 19 - 02- 2014 బుధవారం)**

ఇలాంటి పదాలవాడకం వల్ల భాషాపరంగా పత్రికలకున్న విలువ సన్నగిల్లుతుంది.

**2.2 నిందార్థాలు:** వైయక్తికవిషయాలు, ఆరోపణలు, బెదిరింపులు, నిందావాక్యాలు సరాసరి పత్రికల్లో ప్రచురించడం అంత హర్షణీయం కాదు. కొన్ని ఉదాహరణలను పరిశీలిస్తే...

**కేంద్రమా... కాస్కో: (ఈనాడు : 30 - 01- 2014 గురువారం)**
**బాబును నమ్మొద్దు: (ఆంధ్రజ్యోతి : 17 - 02- 2014 సోమవారం పుట. 8)**
**ఏ బాబు అడ్డుకున్నా .. విభజన ఆగదు: (ఆంధ్రజ్యోతి:17-02-2014 సోమవారం పుట.8)**
**నరికి.. నరికి మీ తాత ఏమయ్యాడు?: (ఈనాడు : 23 -02- 2014 ఆదివారం పుట.9)**
**కణతకు తుపాకి పెట్టారు: (ఈనాడు : 10 - 02- 2014 సోమవారం)**

ఇలాంటి వాటిని పత్రికాముఖంగా ప్రస్తావించడమనేది కేవలం జనాకర్షణకోసం, పాఠకులను రెచ్చగొట్టడం కోసం చేసే ప్రయత్నమే తప్ప వేరే సమర్థవంతమయిన ప్రయోజనమేమీ ఉండదు. సమాజంలో వివిధ మనస్తత్వాలున్న వ్యక్తులు సందర్భాన్నిబట్టి రాగద్వేషాలతో ఎన్నెన్నో పదాలుపయోగిస్తుంటారు. పత్రికల్లో విలేఖరులు సేకరించిన వార్తలనే ఉన్నవి ఉన్నట్లుగా రాస్తే ఇక సంపాదకులెందుకు?

**2.3. పదాల విరుపు:** పదాలను ఖండఖండాలు చేసి ఎటూ అర్థంకాకుండా శీర్షికలుగా పొందుపరిచే చెడు సంప్రదాయం ఎప్పుడు, ఎవరు ప్రారంభించారో కానీ అదే ఆనవాయితీగా అన్ని పత్రికలూ అనుసరిస్తున్నాయి.

**దిగ్వి–జైపాల్‌భేటి:** దిగ్విజయ్ సింగ్, జైపాల్‌రెడ్డి సమావేశానికి సంబంధించిన వార్తాశీర్షిక ఇది. ముక్కచెక్కలు చేసిన పదాలతో ఏదో విధంగా వైవిధ్యభరితంగా ఉండాలనే తాపత్రయంతో చేసే ప్రయత్నాలు ఇలాంటి శీర్షికలకి ఊపిరిపోస్తాయి. – (ఈనాడు: 16–07–2013 మంగళవారం)

**గ'ఘన'విజయం:** అంతరిక్షప్రయోగంలో భారతదేశం సాధించిన ఘనవిజయాన్ని ప్రస్తావించే వార్త ఇది. గగనవిజయం అని వాడవలసి ఉండగా ప్రత్యేకతను కనపరచడానికే కక్కుర్తిపడినప్పుడు ఇలాంటి శీర్షికలు పుట్టుకొస్తుంటాయి. – (సాక్షి : 06–01–2014 సోమవారం)

**నేడే పార్ల'మెట్టు'కు:** తెలంగాణా ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడడానికి అధికారపత్రాలు పార్లమెంటులో ప్రవేశపెట్టే తరుణంలో ఈ శీర్షిక కనిపిస్తోంది. పార్లమెంటుకు అన్న పదానికి బదులుగా 'మెట్టు'కు అన్న పదం వాడారు. ఇక్కడ అసలు పదం స్ఫురించడం లేదు. – (ఈనాడు : 13 – 02 – 2013 మంగళవారం)

**'హస్త'వ్యస్తం:** అస్తవ్యస్తం అన్న పదానికి రూపాంతరమిది. కాంగ్రెసుపార్టీలోని మంత్రులు, మిగిలిన పాలకులు వేరే పార్టీల్లోకి చేరే విషయాన్ని ప్రస్తావించే వార్త ఇది. – (ఈనాడు : 19 – 02 – 2014 విశాఖపట్నం– బుధవారం)

**తలవంపు స్వామ్యం:** ఈ ప్రధానశీర్షిక లోక్‌సభలో అస్వస్థతకు గురయిన మంత్రుల అవస్థను తెలియజేసే వార్తలో కనిపిస్తుంది. స్వామ్యం అంటే సొంతం అన్న అర్థం. ప్రజాస్వామ్యం అన్నట్లుగా 'తలవంపుస్వామ్యం' అన్న శీర్షికను

నిర్ణయించారు. ఈ శీర్షికకు అర్థం ఏమిటో రాసినవాళ్ళకే తెలియాలి. (ఈనాడు: 14-02-2014 శుక్రవారం)

**కాంగ్‌రేసులోలేదు:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెసుపార్టీ అత్యంతఘోరంగా ఓడిపోతుందన్న 'అద్వాని' అభిప్రాయాన్ని ఇంత అపభ్రంశంగా రాశారు. 'కాంగ్రెసు' లో 'రేసు' అన్న పదానికి ఎలాగయినా ప్రాతినిధ్యాన్ని కల్పించాలని చేసే కృతకప్రయత్నాలివి.

**3. వెగటయిన సంక్షేప / సంకేతాక్షర పదాలు :**

విస్తారంగా ఉన్న పదాలలోని మొదటి అక్షరాలను మాత్రమే గ్రహించి నిర్దేశితార్థాన్నిచ్చే పదాలు సంకేతాక్షరరూపాలు. ఈ సంక్షిప్తపదాలు పాఠకుడికి పరిచయంలేకపోతే పూర్తిగా విషయం అవగతమవదు. అస్పష్టతకు, అయోమయావస్థకు ఇలాంటి సంకేతాక్షరపదజాలం ఆలవాలం. రాజకీయపక్షాల ప్రస్తావనలో 'తె.దే.పా', 'తె.రా.స.' 'ప్ర.రా.ప', 'వై.కా.ప.', 'భా.జ.పా.', వైఎస్సార్సీపీ', లాంటి సంక్షేపపదజాలం పదేపదే నేటి పత్రికల్లో దర్శనమిస్తోంది. ఆంగ్లభాషాప్రభావం ఈ విషయంలో సుస్పష్టం. ఈ విధంగా పదాలను సంక్షేపించి వాడుకలోకి తీసుకువస్తే వాటి మూలరూపాలకు విఘాతం కలగడం తథ్యం. ఉదాహరణకు 'వైఎస్సార్సీపీ' అన్న సంకేతాక్షరపదాన్ని సామాన్యపాఠకుడు 'ఎడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌పార్టీ' అని. 'యువజన శ్రామిక రైతు కాంగ్రెస్‌పార్టీ' అన్నా అర్థం చేసుకోవలసింది. మూలరూపం మరుగునపడే ప్రమాదం లేకపోలేదు. ఇదే కోవలో 'ఐ.రా.స.', 'ఐ.కా.స', లాంటి ఎన్నో సంకేతాక్షరపదాలు తెలుగు వార్తాపత్రికల్లో వీరవిహారం చేస్తూ పాఠకుడికి, భాషాప్రియులకు వెగటును కలిగిస్తున్నాయి.

**4. ఎవ్వరికీ పట్టని సమాసదోషాలు :** వ్యావహారికభాష మార్పులు చెందడం సర్వసాధారణమయిన విషయం. కాలంతో పాటు భాష రకరకాలయిన పరిణామాలకు లోనవుతుంది. ఇందుకు కారణాలు కూడా విభిన్నంగా ఉంటాయి. మన ముఖయంత్రంలోని స్వభావం, ఇతర భాషల ప్రజల సాంగత్యం, సౌలభ్యాపేక్ష, పదస్వరూపజ్ఞానం, ఉచ్చారణలోని తొందరపాటు, వినడంలో అస్పష్టత, నోటిలోని వర్ణోత్పత్తి స్థానాల్లో ఉండే లోపాలు, దేశంలోని శీతోష్ణస్థితిభేదాలు మొదలయినవి

ఒక భాషాపరిణామానికి హేతువులని చెప్పవచ్చు. భాష వ్యావహారికమయినా గ్రాంథికమయినా నియమం అత్యావశ్యకం. నియమరహితమయిన భాషలో విలువలు శూన్యం. భాషావిలువలను కాపాడే నియమావళి వ్యాకరణం. ఒకప్పటి ప్రయోగాలనుండి వ్యాకరణం నిర్మితమయింది. పత్రికలభాష వ్యాకరణాన్ని ఏమాత్రం పట్టించుకోవడంలేదనడానికి సమాసాలే తార్కాణం. వైర, దుష్టసమాసాలెన్నో పత్రికల్లో జోరుగా వ్యవహారంలోకివస్తున్నాయి. నేటి పత్రికల్లో ఈ తరహా పొరపాటు అలవాటుగా మారింది. సంస్కృతపదాల తర్వాత తెలుగు పదాలను వాడడం, ఇతర భాషాపదాల తర్వాత సంస్కృతపదం వాడడం, సరాసరి ఆంగ్లంతో తెలుగును మేళవించడం ఇప్పటి పత్రికలకు సాధారణమైన విషయం.

**విద్యుత్ కోత:** అందరికీ నిత్యం పత్రికల్లో కనిపించే పదమిది. విద్యుత్తు పంపిణీని నిర్దిష్టమయిన కాలపరిమితిలో నిలిపివేయడం అన్న అర్థంలో ఈ పదం వాడుతున్నారు. విద్యుత్ సంస్కృతసమశబ్దం. కోత అన్నది దేశ్యం (అచ్ఛికం). సంస్కృతపదాల తరువాత వికృతపదాలు, దేశ్యపదాలు వ్యాకరణనియమం ప్రకారం ఉండవు. ఆంధ్రజ్యోతి దినపత్రిక (17-02-2014 విశాఖస్థానికం. పుట.12) లో 'వీధిలైట్లకు విద్యుత్ కోత ఉండదా!' అన్న శీర్షిక కనిపిస్తుంది. ఇది సమాసదోషం.

**ప్రత్యేక వేడి:** బీహార్‌లో 'ప్రత్యేక'వేడి అన్న శీర్షిక (ఈనాడు:23-02-2014 ఆదివారం పుట.12)) దర్శనమిచ్చింది. ప్రత్యేక ప్రతిపత్తికోసం బీహార్ రాష్ట్రంలో ఆందోళనలు ఊపందుకున్నాయని చెప్పడం ఈ వార్త ఉద్దేశం. అయితే ప్రతి+ఏక= యణాదేశసంధిరూపం తో 'ప్రత్యేక' అన్న పదం సిద్ధిస్తోంది. ఇది తత్సమశబ్దం. ఉష్ణం అన్న పదానికి సమానార్థం తెలుగులో వేడి. ఈ రెండింటినీ కలిపి ప్రత్యేకవేడి అనడం అవగాహనాలోపం. కాబట్టి ఇది కూడా పొసగని సమాసమే.

**ఉగ్రదాడి:** 'సోమాలియా అధ్యక్షభవనం పై ఉగ్రదాడి' (ఈనాడు:23-02-2014 ఆదివారం పుట.12) అని సోమాలియా రాజధానిలో అధ్యక్షభవనం మీద జరిగిన ఉగ్రవాదుల దాడిని పేర్కొన్న వార్త ఇది. ఇక్కడ ఉగ్ర తత్సమ పదం. దాడి వికృతపదం. రెండింటికి సమాసం కుదరదు. 'ఉగ్రవాదుల దాడి' అని ఉండాలి.

**సమైక్యపరుగు:** 'విశాఖసమైక్యపరుగుకు పోటెత్తినజనం' (ఈనాడు: 10-

02-2014 సోమవారం) అని ఆంధ్రరాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా చేసిన 'పరుగు' కార్యక్రమానికి సంబంధించిన వార్త ఇది. 'సమైక్య' అన్న సంస్కృతపదం మీద 'పరుగు' అన్న దేశ్యపదం ఒదగదు. ఇదికూడా దుష్టసమాసమే. 'సమైక్యంగా పరుగు' అని ఉండాలి.

**సముద్రతాబేళ్ళ మృత్యువాత:** (ఈనాడు: 24-02-2014 సోమవారం పుట. 3) సముద్రమనేది సంస్కృతం. తాబేలు అన్నది దేశ్యం. సముద్రకూర్మాలు అనాలి. లేదా 'సముద్రపు తాబేళ్ళ'అని వాడాలి. కాబట్టి ఈ ప్రయోగం కూడా వైరిసమాసమే.

**5. అందలమెక్కుతున్న అపశబ్దప్రయోగాలు :**

వార్తారచనకు ప్రాథమికార్హత శబ్దజ్ఞానం. పత్రికలు తెలియకుండానే కొన్ని అపశబ్దాలను వార్తాల్లో ప్రయోగిస్తూ పాఠకులను తప్పుతోవ పట్టిస్తున్నాయి. ఎక్కడైనా విద్యుత్తుకు సంబంధించిన ప్రమాదం జరిగితే వెంటనే మనకు కనిపించే శీర్షిక 'విద్యుదాఘాతం'. కాని 'విద్యుద్ఘాతం' అన్నది సరైన వాడుక. 'ఘాతం' అంటే దెబ్బ అని, 'ఆఘాతం' అంటే వధ్యస్థానం, చంపేగట్టు అని అర్థాలున్నాయి. 'విద్యుదాఘాతం' అని వాడితే విద్యుత్తు చేత చంపేగట్టు అనే అర్థం వస్తోంది. కాబట్టి 'విద్యుద్ఘాతం' అన్నదే పొసగే పదం.

ఈ మధ్య ఈనాడు దినపత్రిక 'నిర్ధరణ' 'నిర్ధరించు' అన్న పదాలను విరివిగా ప్రయోగించింది. ఇది 'నిర్ధారణ' అన్న అర్థానిచ్చే పదస్థానంలో వాడారు. 'నిర్-ధరణ' 'నిర్-ధారణ' పదాలకు చాలా వ్యత్యాసం ఉంది.

**ఐక్యత:** 'హోరెత్తిన ఐక్యతానాదం' (ఈనాడు: 10-02-2014 సోమవారం) అన్న శీర్షికతో విభజనకు వ్యతిరేకంగా స్ఫూర్తిదాయకమయిన పరుగును విశాఖలో నిర్వహించిన విషయాన్ని తెలియజేసే వార్త ఇది. ఏక అన్న సంఖ్యావాచకం నుండి ఏకత అన్న పదం పుడుతోంది. ఐక్యం దీని తద్ధితరూపం. అంతేకానీ 'ఐక్యత' అన్న రూపముండదు. ఇది అసాధుప్రయోగం.

**విలేకరి:** వార్తారచనకు మూలస్తంభం విలేఖరి. లేఖకుడు అంటే వ్రా(రా)యసకాడు అని అర్థం. 'విలేఖరి' అన్న పదానికి సరాసరి పత్రికారచన

చేసేవాడు అన్న అర్థం మనకు కనిపిస్తోంది. లేఖరి అన్నపదానికి 'వి' అనే ఉపసర్గ చేరడం వల్ల విలేఖరి అన్న పదం ఏర్పడుతోంది. ఈనాటి పత్రికల్లో 'విలేకరి' అన్న పదమే బహుళప్రచారంలో ఉంది. 'లేకరి', 'వి-లేకరి' అన్న పదాలకు రాసేవాడు అని మాత్రమే (నిఘంటువులో) రూఢార్థముంది. అందువల్ల పత్రికల్లో వార్తరచన చేసే వ్యక్తులను 'విలేఖరులు' అనడమే సమంజసం.

మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే... వైనతేయులు, కాద్రవేయులు, గాంధారేయులు, కౌంతేయులు, రాధేయుడు మొదలైన పదాలలో 'ఏయ' అనే ప్రత్యయం (అపత్యార్థంలో వచ్చే తద్ధితప్రత్యయం) 'సంతానం' అనే అర్థంలో వాడుకలో ఉంది. అలాగే 'తదీయ, మదీయ, అస్మదీయ, భవదీయ, వాక్యపదీయ, శ్రీకృష్ణపాండవీయ, రాఘవపాండవీయ, వేంకటీయ, భారతీయ' మొదలయిన చోట్ల 'ఈయ' అనే ప్రత్యయం (సర్వనామాల్లో మత్వర్థీయ ప్రత్యయం) 'దానికి సంబంధించిన' అనే అర్థాన్నిస్తోంది. 'పాత్రికేయులు' అంటే 'పత్రికకు పుట్టినవాళ్ళు' అవుతారు. కాబట్టి 'పాత్రికీయులు' అనే పదం వినడానికి కొత్తగా ఉన్నా పత్రికకు సంబంధించిన వాళ్ళు అనే అర్థాన్నిస్తూ సరైన రూపంగా స్ఫురిస్తోంది. కానీ కుమారవ్యాకరణంలో ఈయ, ఏయ ప్రత్యయాలు రెండూ కూడా సంబంధార్థంలో ఉంటాయని చెప్పడం గమనార్హం. అలాగే అష్టాధ్యాయిలో ఉన్న సూత్రావళిని బట్టి 'పాత్రికేయ' అన్న రూపం కూడా సాధువుగానే తోచుతోంది. దీనిబట్టి చూస్తే పత్రికలకు వ్యాకరణం కూడా ముఖ్యమని తెలియవస్తోంది.

**హంతకుడు:** 'రాజీవ్ హంతకుల విడుదలపై పునరాలోచించండి: కేంద్రం' అన్న శీర్షిక ఈ మధ్య తళుక్కుమంది. (ఈనాడు: 24-02-2014 సోమవారం పుట.2) నేరవార్తల్లో హంతకుడు, హంతకురాలు అన్న పదాలు విరివిగా కనిపిస్తున్నాయి. 'హంత' సరైన రూపం. హంతకుడు, హంతకురాలు అన్నపదాలు వాడుకలో ఉన్నాయి కాబట్టి చెలామణీ అయిపోతున్నాయి కానీ ప్రామాణిక నిఘంటువులు ఈ పదాలను అంగీకరించలేదు.

**6. సారూప్యతకు దూరమవుతున్న నామవాచకాలు:**

వ్యక్తులపేర్లు, స్థలాలపేర్లు, సంస్థలపేర్లు ఇలా నామవాచకాల ప్రస్తావనలో ఏ రెండు పత్రికలమధ్య పొందిక లేదు.

**అద్వాని, అడ్వాని, అడ్వాణీ...**
**మోది, మోడి..- కేజ్రీవాల్, కేసరీవాల్...**
**ప్రకాశ్ కరత్, ప్రకాశ్ కారత్...**
**పురంధేశ్వరి, పురందరేశ్వరి, పురంధ్రీశ్వరి... ఇలా ఎన్నో వ్యత్యాసాలు కన్పిస్తున్నాయి. ఇవన్నీ ఒకే విధంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.**

నల్లారి, నారా, కోళ్ళ, పొన్నాల, గంటా మొదలయిన ఇంటి పేర్లను వ్యక్తులకు సంబోధనా వాచకాలుగా ఉపయోగిస్తూ అసందిగ్ధంగా, అసంపూర్ణంగా రాయడం పాత్రికేయుల శైలిగా మారింది.

ముఖ్యంగా చలనచిత్రపరిశ్రమలోని నటీనటులను, క్రీడారంగప్రముఖులను, పౌరాణిక పాత్రలను ప్రస్తావించేటప్పుడు ఏకవచనప్రయోగమే పత్రికల్లో కన్పిస్తోంది. తమన్నా అంది..., మహేష్ దూసుకొచ్చాడు.., రాముడు యుద్ధం చేశాడు.. ధోనీ దంచేశాడు.. ఇది ఇలా ఉండగా రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తల గూర్చి రాసే వార్తల్లో మాత్రం అన్నారు.. చెప్పారు.. అభిప్రాయపడ్డారు... అని పేర్కొనడం పత్రికల్లో నిత్యం కనిపిస్తోంది. అభిమాన, గౌరవాలో లేదా పక్షపాతమో ఈనాటి పాత్రికేయులకే తెలియాలి. వైవిధ్యం భాషలో కాదు.. భావంలో చూపించగలగాలి.

**7. విషమ వాక్యనిర్మాణం:**

వాక్యంలో వాక్యాంశాల క్రమం తప్పకుండా చూసుకోవడం ముఖ్యం. కర్త, కర్మ, క్రియలు వాక్యాంశాలు. వీటి క్రమం సందర్భానుసారంగా మాత్రమే మారుతుంది తప్ప అక్కరలేని చోట వ్యత్యయమైతే వాక్యం అపార్థానికి దారితీస్తుంది. ఉదాహరణకు:

ఇది నా కొత్త చొక్కా.. నా కొత్త చొక్కా ఇది.. ఇలా చేస్తే బాగానే ఉంటుంది. అయితే **కొత్త నా చొక్కా ఇది... నా కొత్త ఇది చొక్కా...** ఇలా వాక్యాంశ క్రమం మారితే వాక్యార్థం అభాసమవుతుంది. 'అర్థవంతం కాకపోతే వాక్యమే కాద'న్నారు ప్రౌఢవ్యాకర్త. అందుకే వాక్యనిర్మాణంలో అప్రమత్తత అవసరం. మచ్చుకు కొన్ని వాక్యాలు చూద్దాం-

**కిరణ్ పార్టీనే మింగేయాలనుకున్నారు: డొక్కా:** (ఈనాడు: 23-02-2014 పుట. 9) ఈ వాక్యంలో కర్త 'కిరణ్'. ఆయన పార్టీనే మింగేయాలనుకున్నారు అని

చెప్పడం ఈ శీర్షికకున్న అర్థం. అయితే కిరణ్ పార్టీనే - మింగేయాలనుకున్నారు అని కూడా అర్థం చెప్పుకోవచ్చు. అంటే వేరే వ్యక్తి ఎవరో కిరణ్ పార్టీని మింగేయాలనుకున్నారన్న అర్థం వస్తుంది. అందుచేత ఈ శీర్షిక 'పార్టీనే మింగేయాలనుకున్నారు కిరణ్' అని ఉండాలి.

**మధ్యాహ్నభోజనం తిని విద్యార్థులకు అస్వస్థత:** (సాక్షి: 19-02-2014 విశాఖస్థానికం పుట. 7) రాష్ట్రంలో మధ్యాహ్నభోజనపథకం అమలులో ఉంది. ఈ పథకంలో భాగంగా వండిన ఆహారాన్ని విద్యార్థులు తినడంవల్ల అస్వస్థతకు గురయ్యారని చెప్పడం ఈ వాక్యోద్దేశం. అయితే 'మధ్యాహ్నభోజనం తిని' అంటే మధ్యాహ్నం, రాత్రి అన్న సమయానుకూల భోజనవిషయ సామాన్యార్థం స్ఫురించి పేలవంగా ఉంది. మధ్యాహ్నం భోజనంచేసిన తరువాత విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్న అపార్థమే కనిపిస్తుంది. మధ్యాహ్నం భోజనం చేసి నిద్రించారు, బయలుదేరారు.. అన్నట్లుగాఉందిగానీ మధ్యాహ్న భోజనపథకంలోభాగంగా వండిన ఆహారంలో దోషముండడం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారన్నభావం స్ఫుటంగా తెలియడంలేదు.

**బాలబాలికలు 'రన్' చేసారు:** (సాక్షి: 19-02-2014 విశాఖస్థానికం పుట. 16) విశాఖ ఉక్కుకర్మాగారంలో నిర్వహించిన పరుగు కార్యక్రమాన్ని వివరిస్తూ బాలబాలికలు కూడా ఈ పరుగులో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పవలసి ఉంటే 'రన్ చేసారు' అన్న విచిత్ర పదజాలాన్ని ఈ పత్రిక వెలువరించింది. ఇది చాలా శోచనీయం. నామవాచకాలు అన్యభాషలనుండి యథాతథంగా స్వీకరించవచ్చు కానీ క్రియాపదాలతో తెలుగును సంకరం చేయడం చాలా దయనీయం. 'సందేశం సెండ్ చెయ్యండి'.. 'మీరు ఆహారం ఈట్ చేయండి' అంటే ఎంత హాస్యాస్పదమో... 'రన్‌చేశారు' అన్న ప్రయోగం కూడా అలాగే ఉంది.

## 8. అనవసరమైన ఇతరభాషాపదాల (అన్యదేశ్యాలు) వినియోగం:

ప్రాచీనతెలుగు భాషను సంస్కృతాన్ని వేరు చేసి చూడలేం. ఆధునిక పత్రికల తెలుగును ఆంగ్లభాషను వేరుగా చూడలేం. లెక్కకు మించిన ఆంగ్లపరిచ్ఛేదాలు తెలుగుదినపత్రికల్లో కనిపిస్తున్నాయి. వీటితోపాటు ధర్నా, హర్తాళ్, బంద్, రాస్తారోకో,

ఘెరావ్, హంగామా, గందరగోళం, సర్కారు, జిల్లా, గోరీ, ఖాళీ, సమన్లు, అసలు... ఇలా ఎన్నో అన్యభాషాపదాలు తెలుగు వార్తాపత్రికల్లో నిత్యం పలకరిస్తూనే ఉంటాయి. 'ప్రత్యామ్నాయ సర్కారు' (ఈనాడు 22-2-14), 'జస్ట్... అభిప్రాయాలే' (సాక్షి 11-01-2014) 'బిఏసీ.. బేఖాతర్' (సాక్షి 7-1-2014) 'వట్టి చేతులతో కోకోనట్... ఫటాఫట్' (ఈనాడు 24-2-14) లాంటి అనవసరంగా అన్యభాషాదరణతో శీర్షికలు పెట్టడం, వార్తలు వివరించే పద్ధతిని తగ్గించుకోవాలి.

"భాషావ్యవహర్తలు తమతమ నిత్యజీవిత వ్యవహార భాషల్లో ఉన్న భేదాలకు అతీతంగా అందరికీ అవసరమయ్యే వ్యవహారంకోసం వాడే భాషాభేదం ప్రామాణికభాష" అని భాషాశాస్త్రవేత్తల నిర్వచనం. పదజాలంలో ఈ ప్రామాణికత తేటతెల్లమవుతుంది. ఇన్ని దోషాలతో ఉన్న పత్రికలకు ఇక ప్రామాణికత ఎక్కడినుండి వస్తుంది. ఇవన్నీ మచ్చుకు ఉటంకించిన భాషావైరుధ్యాలు. పరిశీలించే కొద్దీ ఇలాంటి లోపాలు ఎన్నో కనిపిస్తూనే ఉంటాయి. వార్తాపత్రికలన్నీ తెలుగును రక్షించడానికి, నిలబెట్టడానికి, ఉపయోగపడే ప్రసారమాధ్యమాలో, లేదా తెలుగు ద్వారా ఇతరభాషల్ని నేర్చుకోవడానికి అనుసంధాన వారధులో అర్థంకాదు. ఇప్పటికయినా తెలుగువార్తాపత్రికలు వ్యాకరణదోషాలను పరిహరించి, వాక్యనిర్మాణసామర్థ్యాన్ని సంతరించుకుంటే తెలుగుభాషకు మేలు చేసినవారవుతారు.

పరస్పరభావవినిమయం ప్రధానలక్ష్యంగా ఏర్పడినభాష నానాటికీ పదునుదేరుతూ వచ్చింది. అవసరమయినప్పుడు, ఆసక్తి పెంపొందినప్పుడు, మానవవిజ్ఞానం వికసించినప్పుడు, మనసూ మేధ ఏకమయినప్పుడు భాషలో మార్పులూ చేర్పులూ కూర్పులు అనంతంగా వర్థిల్లాయి. మనిషి తన మనోభావాల్ని తోటివారితో పంచుకోవడం కోసం సహజంగానో, ప్రయత్నపూర్వకంగానో ఎంతో కొంత కృషి చేయడంతో ఒకనాటికంటే ఇప్పటికి భాషలో కొత్తమాటలు, క్రొంగొత్త భావచ్ఛాయలూ ఏర్పడ్డాయి. విడివిడిగా పొడి మాటలుగా ఉన్నవే అపూర్వసమ్మేళనంతో అనూహ్య భావవ్యక్తీకరణను చేకూరుస్తూ విశిష్ట పదబంధాలుగా భాషలో నిలిచిపోతూ వచ్చాయి. అంటే ఏదో ఒక తీవ్రమయిన భావాన్ని వినిపించడానికి, ఎదుటివారి మనసులో సూటిగా నాటుకునేటట్లు చేసే ప్రయత్నంలో ఇలాంటి విలక్షణపదబంధాలు పుట్టాయి. దైనందినజీవితంలో సామాన్యుడి నుండి

విద్వాంసుల వరకు భిన్నస్థాయిల్లో జనం సృజించిన ఈ పదాలన్నీ క్రమంగా వ్యాప్తి చెంది భాషలో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నాయి.

"వర్తమాన నాగరికావర్త చరిత్రలో వ్రాత సర్వసామాన్యంకావడం, ఇటీవల అభివృద్ధి చెందినదనడం నిస్సందేహం. వ్రాత సర్వసామాన్యంకాకుండా అవరోధాలు ఏర్పడడానికిగల కారణాలు రెండు. మొదటిది సరళమైన, సులభమైన లేఖనపద్ధతి లేకపోవడం; తర్వాతిది – సులభంగాను అందరికి అందుబాటుగాను, చాలాకాలం మనగలిగేదిగాను వుండే లేఖనసామగ్రి లేకపోవడం. ఈ అవరోధాలను గట్టెక్కనిదే వ్రాత దైనందిన వ్యవహారాలకు, సామాన్య వ్యవహారాలకు వినియోగపడివుండడం కష్టం" అని ఒకప్పటి భాషనుగూర్చి ప్రముఖ భాషాశాస్త్రవేత్త తిరుమల రామచంద్ర ఆవేదనవ్యక్తం చేశారు. అయితే సమాచార వినిమయానికి పదజాలం ద్వారా లేదా సంకేతాల ద్వారా ఉపయోగపడే భాషలో, వేగంగా మారుతున్న సమాజంలో క్రొత్త అవసరాలు విషయ వైవిధ్యానికి ద్వారాలు తెరిచాయి. ప్రస్తుతం లేఖన సామగ్రికి ఎలాంటిలోటూ లేదు. లేఖన పద్ధతిలో ఏకరూపత, సారళ్యం, సౌలభ్యం లోపిస్తోందన్నది విమర్శకులమాట. భాష – జీవభాషగా ప్రవహిస్తూ, ప్రసరిస్తూ ఉండాలంటే పదజాలంలో పరిపుష్టి, నిత్యాభివృద్ధి అవసరం. ఇందుకు ప్రధానసాధనాలు ప్రసారమాధ్యమాలు. ఈ పరిణామశీలత ఎక్కువగా పత్రికారంగాన్ని ప్రభావితంచేసి భాష, భావ, రూప వికాసాలకు దోహదపడింది. ఈ ప్రభావం పత్రికారంగంపై నవీన బాధ్యతల వృష్టిని కురిపించింది.

ఇరవయ్యోశతాబ్దపు తొలినాళ్ళలో కృష్ణాపత్రిక, స్వరాజ్య, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ మొదలయిన పత్రికలావిర్భవించాయి. తెలుగు పత్రికారంగచరిత్రలో 1941 నుంచి ఒక సంచలనాత్మకమైన మార్పు వచ్చింది. అంతకుముందు ఈ పత్రికలన్నీ గ్రాంథికభాషలో ఉన్నా, నార్ల వేంకటేశ్వరరావు పత్రికాభాషలో జనభాషను ఒక పద్ధతిలో చొప్పించడంతో వాడుకభాషలోనే వార్తలనురాసే ఆధునిక సంప్రదాయం వేళ్ళూనుకుంది. 'గిడుగు' వారి వ్యావహారికభాషోద్యమం, 'తాపీ'వారి వాడుకభాషాప్రయోగాలు ఇందుకు మార్గదర్శకాలయ్యాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక సమాచార, సాంకేతికరంగాలు ప్రాంతీయభాషలకు కొత్త సవాళ్ళు విసురుతున్నాయి. తెలుగు దినపత్రికలు వీటిని

ఎదుర్కోవడానికి నిత్యం ఓ యుద్ధమే చేస్తున్నాయి. ఇంటర్నెట్, ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి అనేక ఆవిష్కరణలను తెలుగులో అందించడానికి, వాటికి తెలుగు రూపాలు ఏర్పరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొత్త పదజాలం సృష్టించుకోవాల్సిన అనివార్యత ఏర్పడింది. 'ఇంటర్నెట్'ను అంతర్జాలం అని, 'ఫేస్‌బుక్' ను ముఖపుస్తకం, గ్రంథముఖి అని అనువదించి పాఠకులకు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఇప్పటి వరకు వాటికి ఆదరణ లభించిన సూచనలు కనిపించడం లేదు.

ప్రతి వ్యక్తికీ తనదైన వ్యక్తీకరణ విధానం లేదా భాషా శైలి ఉంటాయి. పత్రికలో ఏకరూపత కలిగిన భాషను, వ్యక్తీకరణ విధానాన్ని పాటించాల్సి ఉంటుంది. దీన్నే పత్రికకు సంబంధించి భాషా శైలి (స్టయిల్ షీట్) అంటారు. "దినపత్రికభాష ప్రజలకు సంపూర్ణంగా అర్థం కావడంలేదు. కాబట్టి సాధ్యమయినంత వరుకు దేశ్యపదాలనే వాడాలి. తత్సమ, ఆంగ్లపద ప్రయోగం తగ్గాలి. గత్యంతరంలేని స్థితిలో తప్పదు" అన్న ప్రసిద్ధ సంపాదకుల విమర్శలు తెలుగు దినపత్రికలకు సవాళ్ళుగా మారాయి. ఈ క్రమంలో శైలిలో నిపుణతను సాధించడానకి సరళీకరణ, ఆధునికీకరణ, సామాన్యీకరణ మొదలయిన పదసృజన విధానాలను ఈనాటి దినపత్రికలు అవలంబిస్తున్నాయి. నార్ల వేంకటేశ్వరరావు ఆనాడే **Dredger** అన్న పదాన్ని తవ్వోడ(డు) గా వ్యాప్తిలోకి తీసుకువచ్చారు. పత్రికారచనలో నిపుణులెందరో ఇలాంటి విశిష్టపదాలను సృజించి మార్గదర్శకులుగా నిలిచారు. ఈ పదసృజన కూడా ఒక రకంగా అనువాదమనే చెప్పాలి. స్వతంత్ర, భావ అనువాదాలకంటే భిన్నంగా పదసృజనలో సృజనాత్మకశక్తి చాలా అవసరం. ఇతర భాషల్లోని సాంకేతిక పదాలను తెలుగులోకి తేవడం, పాశ్చాత్యభాషాపదాలకు సమానార్థకాలను సాధించడం ఎంతో క్లిష్టమైన పని. వాటిని తెలుగులో అర్థస్ఫురణ చెడకుండా, వెంటనే అర్థమయ్యే విధంగా మలుచుకోవడం వెనుక ఉండే కృషి వర్ణనాతీతం. అయితే, నిరంతరం ఆ ప్రయత్నం, ప్రయోగం జరుగుతూనే ఉంటుంది. కొత్తపదాల సృష్టిలో పదాలను ఎరవు తెచ్చుకోవడం, పదాలను సృష్టించుకోవడం, తప్పనిసరి పరిస్థితుల్లో యథాతథంగా ఉపయోగించడం లాంటి విధానాలు ఈనాటి దినపత్రికల్లో మనం గమనించవచ్చు.

**సంస్కృతీకరణ:** అనేకభాషల్లోని పదజాలానికి సమానార్థకాలను అన్వేషించి పత్రికల్లో విస్తృతంగా వాడడం కనిపిస్తోంది. ఈ ప్రయత్నంలో పదాలను ఎక్కువగా సంస్కృతీకరిస్తున్నారు.

**Shake hand** అన్నపదానికి 'కరచాలనం' అన్న పదం బహుళప్రచారంలో ఉంది. ఎట్టకేలకు మోదీ, షరీఫ్ కరచాలనం (ఆంధ్రజ్యోతి - 28.11.2014 - మెయిన్, మొదటి పేజి) అన్నశీర్షికలో అనేక అంశాలకు సంబంధిచి రెండు దేశాల సారథుల సమ్మతాన్ని వ్యక్తికరించడానికి ఈ పదం చక్కగా చేయిచేయికలపడం అన్న పదబంధార్థంలో ఇమిడిపోయింది. ఈ ఆంగ్లపదాన్ని దేశ్యపదమయిన 'చేతులుకలపడం' గా ప్రయోగించవచ్చు. కాని పాఠకుడిని సరాసరి హత్తుకునేలా లేదు. కొన్ని సందర్భాలో ఈ పదప్రయోగం కనిపిస్తున్నా శీర్షికల్లో చేరేంత ప్రాముఖ్యం ఈ పదానికి విలేఖర్లు, పత్రికారంగ ప్రముఖులు ఇచ్చినట్లు కనిపించడం లేదు. అందుకే కరచాలనం అన్న పదమే ఎక్కువగా వాడుతున్నారు.

Drinking Water అన్నపదానికి 'రక్షిత తాగునీరు' ప్రయోగం (సాక్షి - 28.11.2014 - మెయిన్, 10వ పేజి) కనిపిస్తోంది. Ground Water, Distilled Water, Water Fall, అన్న పదాల్లో భూగర్భజలం, స్వేదన/స్వచ్ఛ జలం, జలపాతం అన్న సంస్కృతీకరణలు పత్రికల్లో కనిపిస్తున్నాయి. కానీ తాగునీరు అన్న దేశ్యపదమే ఎంతో వాడుకలో ఉంది. శుద్ధజలం, పేయజలం అన్న మాటలు అర్థదూరాలవుతాయి. కనుక ఇక్కడ ఒక్కచోట 'జల' శబ్దానికి బదులు నీరు అన్న పదం వాడుకలోకి వచ్చింది. 'మంచినీరు' అని కూడా వాడవచ్చు కానీ తాగునీరు అన్న మాట ఇప్పటికే జనాదరణ పొందింది కాబట్టి ఈ పదాన్నే విరివిరిగా వాడుతున్నారు.

After - Sales Service అన్న పదానికి 'విక్రయానంతర సేవ' (సాక్షి - 28.11.2014 - మెయిన్, 7వ పేజి) అన్న పదం ఇటీవల దర్శనమిస్తోంది. కొలుగోలు చేసిన వస్తువులకు ఆ తర్వాత విక్రేత అందించే సేవను ఇది సూచిస్తుంది. ఇది ఆహ్వానింపదగిన పదసృజన.

**Blood Transfusion** అన్నపదానికి 'రక్తమార్పిడి' అని ఎక్కువగా వాడుక కనిపిస్తోంది. ఇది దుష్టసమాసం. సంస్కృతపదంతో తెలుగు సరాసరి ముడిపడదు.

దీనిబదులు 'నెత్తురు మార్పిడి' అన్న పదాన్ని పదకోశాలు సూచిస్తున్నాయి. అయినా 'బ్లడ్' కు సమానార్థకంగా రక్తం అన్న పదమే ఎక్కువ ఆదరణ పొందింది కాబట్టి పత్రికలు వ్యాకరణ విరుద్ధమయినా సరే ఇలాంటి ప్రయోగాల్ని వ్యాప్తిలోకి తీసుకురావడానికి వెనుకాడడం లేదు. 'బ్లడ్‌బ్యాంక్' అన్న పదానికి 'రక్తనిధి' అన్న సంస్కృతీకరణ వ్యాప్తిలో ఉంది.

ఈ కోవలోనే **Beneficiary** - లబ్ధిదారు, **Advisor** - సలహాదారు అన్న పదాలను సృజించారు. కానీ **Investors** అన్న చోట పెట్టుబడిదారులు అంటే అర్థం చెడుతోంది. కాబట్టి దేశ్యపదమయిన 'మదుపరులు' (ఈనాడు - 30.11.2014 - విశాఖపట్నం జిల్లా ఎడిషన్, మొదటి పేజి) అన్న అద్భుతమయిన పదసృజన కనిపిస్తోంది. ఇది అత్యంత రమణీయం. అందుకనే అన్ని చోట్ల సంస్కృతీకరణకు పాకులాడకుండా అచ్చతెలుగును కూడా వాడుకోవడం ఒక పద్ధతిగా పెట్టుకోవాలి. లేదంటే ఎన్నో వ్యాకరణ, ప్రకరణపరమైన ఇబ్బందులు వస్తాయి. మచ్చుకు – 'నల్లధనం' (నల్లధన ఖాతాలన్నీ గుర్తిస్తాం – ఈనాడు. 27.11. 2014 మెయిన్, మొదటి పేజి) అన్న పదాన్నిచూస్తే వ్యాకరణజ్ఞానమున్న వాళ్ళకు హాస్యాస్పదంగా కనిపిస్తుంది. **Black Money** - 'నల్లని ధనం' అవుతుంది తప్ప నల్లధనం అన్న వైరిసమాసం కుదరదు. పదానువాదానికొచ్చినపాట్లు ఇలాగే ఉంటాయి. హాయిగా 'దొంగసొమ్ము' అన్న భావానువాదాన్ని ఇక్కడ వాడుకుంటే ఎలాంటి వైరుధ్యం ఉండదు.

**Air Chief Marshal** – 'వాయుసేనాధిపతి' (ఈనాడు. 30.11. 2014 మెయిన్, 14వ పేజి) అన్న పదం కనిపిస్తోంది. వైమానికదళాధ్యక్షుడు అన్న పదానికి కొంత మార్పుచేసి పత్రికలో ఇలా ప్రయోగించారు. ఇదే పంథాలో **Real Estate** – 'స్థిరాస్తి' (ఈనాడు. 30.11. 2014 మెయిన్, 14వ పేజి) అన్న మాట పలుచోట్ల కనిపిస్తోంది. **Municipality** - అన్న పదాన్ని పురపాలక సంఘంగా వ్యవహరిస్తున్నారు. గోడపత్రిక, బుట్టబంతి ఆట, ఏకరూపదుస్తులు, చరవాణి, బాహ్యవలయరహదారి, తూటారక్షణవాహనం, రాతపుస్తకాలు, అచ్చుపుస్తకాలు, శ్వేతపత్రం మొదలయిన ఎన్నో పదాలు రానురాను జనబాహుళ్యంలోకి వెళుతున్నాయి.

తరచిచూస్తే రాయబారి/దౌత్యవేత్త, శస్త్రచికిత్స, నిషేధిత ఔషధాలు, వీధిదీపాలు, ప్రవేశపరీక్ష మొదలయిన పదాలు ఆంగ్లపదాలకు సమానార్థకాలుగా సంస్కృతీకరణ ద్వారా తెలుగు పత్రికల్లో వీరవిహారం చేస్తున్నాయి.

**లిప్యంతరీకరణ (ప్రతిలేఖనం) :**

పదసృజనలో లిప్యంతరీకరణ ఎంతో ఎక్కువస్థాయిలో జరుగుతోంది. దాదాపు 60శాతం కన్నా ఎక్కువగా పదాలు యధాతథంగానో, అజంతంగానో తెలుగులోకి వాడుకలోకి వచ్చాయి. ఇది అనువాదం చేయడం కన్నా శ్రేష్ఠమయిన పద్ధతిగా పూర్వులనుండి ఆచరణలో ఉంది.

న్యాయశాస్త్రపరమయిన పారిభాషికపదాలకు ఏకంగా ఒక పదకోశమే ఉంది. అయినప్పటికి జనాదరణకు నోచుకోని ఆ పదాలను వాడడం ఈ తరం పత్రికలకూ ఏమాత్రం ఇష్టం లేనట్లుగా కనిపిస్తోంది. **Bill, Affidavit, Tribunal, Schedule, Custody** మొదలయిన పదాలు ఉన్నవి ఉన్నట్లుగా తెలుగు లిపిలో చివర అచ్చు చేర్చి వాడుతున్నారు. లభించే తెలుగుపదజాలంతో సంతృప్తి చెందకపోవడంతోనో, లేదా ఆ పదాలకు ఆదరణ తక్కువనో వీటినే సరాసరి ఉపయోగిస్తున్నారు. శాసనసభలో ప్రవేశపెట్టిన 'ముసాయిదా', 'రశీదు', 'కరపత్రం' అని బిల్లుకు సమానార్థకాలు. అఫిడవిట్‌ను 'వాఙ్మూలం'గా ప్రస్తావించవచ్చు. 'ట్రిబ్యునల్'కు 'ప్రత్యేకన్యాయస్థానం' అని వాడుక ఉంది. కొన్ని పత్రికలు ఈ పదాన్ని ఉపయోగిస్తున్నాయి. అలాగే 'షెడ్యూలు' అన్న పదానికి 'జాబితా' అన్న పదం వాడవచ్చు. అయితే ఇది మూలపద అర్థాన్ని స్ఫురింప జేయడంలేదు. వివిధ సందర్భాల్లో వేరువేరు అర్థాలనిస్తుంది. కాబట్టి ఆ పదాన్ని అలాగే వాడుతున్నాం. అదుపు, నిర్బంధం అన్న పదాలు 'కస్టడీ' అన్న మాటకు సమానార్థకాలుగా ఉన్నాయి. కానీ వీటి వినియోగం ప్రశ్నార్థకం.

వాహనాలకు సంబంధించిన పదాలయిన బస్సు, కారు, ఆటో, లారీ, రైలు మొదలయిన పదాలు అలాగే వాడుతున్నారు. సీనియర్, జూనియర్, లీక్, లీకేజి, ప్రయివేటు, పాస్‌పోర్ట్, వీసా, హెల్త్‌కార్డు, కమిషనర్, ఓటు, ఓటరు, ఛైర్మన్ మొదలయిన పదజాలానికి సమానార్థకాలు మృగ్యం. వీటికి తగిన పదసృజన

జరగాల్సి ఉంది. కంప్యూటర్‌కు సంబంధిచిన సాఫ్ట్‌వేర్, నెట్‌వర్కింగ్, మెగాబైట్, గిగాబైట్, ర్యాం, రోమ్ లాంటి పదాలకు సమానార్థకాలను వెతకడానికి, వాటికి జనాదరణ కల్పించడానికి కూడా ప్రయత్నాలు జరగాలి. ఇది కష్టసాధ్యమనే చెప్పాలి. **Bank** అన్న పదానికి లిప్యంతరీకరణతో వచ్చిన 'బ్యాంకు' అన్న మాట వాడుకలో ఉంది. ఎ.టి.యం.లలో డబ్బునింపే ఒక వాహనాన్ని ఈనాడు దినపత్రిక 'నగదువాహనం' గా అభివర్ణించింది. ఇది జనాదరణకు ఎంతవరకు నోచుకుంటుందో వేచిచూడాలి. **Air Hostess** అనే పదాన్ని 'గగనసఖి' గా ప్రయోగించి ఈ మధ్య ఓ పత్రిక కలంజారింది. 'సఖి' అన్న పదానికి ప్రేయసి అన్న ర్థం ప్రసిద్ధంగా ఉంది. అందుకని ఇది అపార్థానికి దారితీస్తుందని గమనించుకోవాలి.

**అన్యదేశ్యాలు:**

అన్యదేశ్యాల ఉపయోగం విస్తృతంగా కనిపిస్తోంది. హిందుస్థానీ భాషాపదాలతో పాటు ఇతర భాషాపదాలు కూడా నిత్యం పత్రికల్లో దర్శనమిస్తున్నాయి.

కబ్జా, – ఆక్రమణ అన్న అర్థంలో తరచూ కనిపిస్తోంది. దివాలా – వ్యవహారం చెడి కలిగే నష్టం; ఖజానా – ధనాగారం; ఖాతా, ఖాతాదారు – లెక్క, పద్దు; ఖైదీ – చెరసాలలో బందీగా ఉన్న వాడు; జిల్లా– కలెక్టరు వంటి గొప్ప ఉద్యోగస్థుని అధీనంలో ఉండే ప్రదేశం; ఠాణా – కావలి దండు, కావలి స్థలం; తనిఖీ, సోదా – పరీక్ష, విచారణ; తుఫాన్/తుపాను – గాలివాన; దరఖాస్తు – విన్నపం; దర్యాప్తు – పరిశీలన, విచారణ; ఫిర్యాదు – విన్నపము, మొఱ; బీమా – ఇన్స్యురెన్సు – కొంత డబ్బు ఇవ్వడానికి ఒడంబడిక; భారీ – గొప్ప, ఘనమైన; వాయిదా – గడువు; సవాల్ – ప్రశ్న, విచారణ; హుషారు/హుసారు – జాగ్రత్త; మొదలైనవన్నీ హిందూస్థానీ భాషాపదాలు.

ఇంకా ఇతర భాషాపదజాలం విషయానికొస్తే గంగాళం,చాడీ, చావడి, పాగా, దేశాయి, పటేలు, రావు, కాగడా, కొరడా, గమ్మత్తు ఇవన్నీ మరాఠీ పదాలు; అరంగేట్రం, ఇడ్లీ, మాళిగ, వడ, సాంబారు మొదలయినవి తమిళ పదాలు; మజ్జిగ, హంగు – కన్నడ పదజాలం; పన్నె, బుగత, భోగట్టా, రేక, కంబారీ – ఒరియా మాటలు; తరాజు (త్రాసు), రోజు, బజారు, సర్దారు, ఫిరంగి, ఫకీర్,

సుల్తాన్, మస్జిద్ – పారశీ భాష నుండి వచ్చినవి; బొత్తాం, కాజా, అల్పీ, మేజా, అనాస, ఇస్త్రీ, బిస్కట్టు(త్తు) కోస్తా, తువా(వ్వా)లు, బాల్చీ – మొదలయిన పదాలన్నీ పోర్చుగీసు భాషాపదాలు. ఇలాంటి పదాలెన్నో నిత్యం మన తెలుగుదినపత్రికల్లో చూస్తున్నాం.వీటి వాడుకలో జోరు తగ్గితే గానీ ఆయా స్థానాల్లో నవ్యపదకల్పన జరగదు.

**"దినపత్రిక లైవ్‌వైర్ వంటిది. అది సరళంగా స్పష్టంగా సూటిగా ఉండాలి. నుడికారపు సొంపులతో అలరారుతుండాలి. ఇటీవలపత్రికారచనలో నుడికారంలోపిస్తోందన్న మాట వాస్తవమే"** అని సుప్రసిద్ధ పాత్రికేయులు 'ఏ.బి.కె.' అభిప్రాయం. అందుకే నుడికారం ఉట్టిపడేలా పదసృజన ఇతోధికంగా జరగాలని, ఆదరణ పొందాలని ఆకాంక్షిద్దాం.

**ఉపయుక్త గ్రంథాలు:**


1. పదబంధ పారిజాతం – నార్లవేంకటేశ్వరరావు
2. ఆంధ్రభాషావికాసం – గంటిజోగి సోమయాజి
3. మనలిపి పుట్టుపూర్వోత్తరాలు – డా. తిరుమల రామచంద్ర
4. పత్రికా పదకోశం – చేకూరి రామారావు
5. తెలుగు దినపత్రికలు – భాషాసాహిత్యస్వరూపం – డా. జె చెన్నయ్య.
6. తెలుగుసాహిత్య చరిత్ర – వెలమల సిమ్మన్న.


**వ్యాసం:**


1. తెలుగు పత్రికలు భాషాస్వరూపం – కాసుల ప్రతాపరెడ్డి, రాష్ట్రస్థాయిసదస్సులో సమర్పించిన పరిశోధన పత్రం.


వ్యాసకర్త – **శతావధాని, పరిశోధకుడు**

# రేడియో కబుర్లు

- *భండారు శ్రీనివాసరావు*

(నిజానికి ఇక్కడ రేడియో రోజులు అంటే నేను రేడియోలో పనిచేసిన రోజులనే కాదు. ఆ రోజుల్లో రేడియో అని కవి హృదయం. నాకన్నా ముందు పనిచేసిన వారి జ్ఞాపకాలు మరింత ఆసక్తిగా వుంటాయని, కొందరితో ముచ్చటించినప్పుడు తెలిసింది. వాళ్లు వయస్సులో చాలా పెద్దవాళ్ళు కావడం మూలాన పేర్లు, తారీఖులూ సరిగా గుర్తురావడం లేదని వారే చెప్పారు. అంటే ఏదన్నా విషయం గురించి చెప్పినప్పుడు దాని స్థూల భావాన్ని మాత్రం తీసుకుని, మూలాల్లోకి, చర్చల్లోకి పోకుండా స్వీకరించగలిగితే నాటి స్మృతులను ఆస్వాదించడానికి ఆస్కారం వుంటుంది.)

## డెక్కన్ రేడియో

దేశానికి స్వాతంత్ర్య రావడానికి ఓ పుష్కర కాలం కంటే చాలా ముందుగానే, అప్పటి నిజాం సంస్థానంలో రేడియో ప్రసారాలు మొదలయ్యాయి. 1933 లో రెండువందల వాట్ల ట్రాన్స్మిషన్‌శక్తితో 'డెక్కన్ రేడియో' అనే పేరుతో ఒక ప్రైవేటు రేడియో స్టేషన్‌ను హైదరాబాదులో ఏర్పాటు చేశారు. ఆ రేడియో ట్రాన్స్‌మీటర్‌ను

స్థానికంగా రూపొందించడం విశేషం. వాస్తవానికి ఈ రేడియో స్టేషన్‌ను హైదరాబాదులో ఏర్పాటు చేశారు. ఆ రేడియో ట్రాన్స్‌మీటర్‌ను స్థానికంగా రూపొందించడం విశేషం. వాస్తవానికి ఈ రేడియో కేంద్రం ఒక కుటుంబం ఆధ్వర్యంలో ఏర్పాటయింది. ఆ కుటుంబ సభ్యులే కేంద్రం నిర్వహణ బాధ్యత చూసుకునేవారు. చిరాగ్ ఆలీ లేన్ లోని ఆజం మంజిల్ భవనంలో ఈ రేడియోకేంద్రం పనిచేసేది.

ఉర్దూలో వార్తలతో పాటు గజల్స్, ఖవ్వాలీలు, పాటలు ప్రసారం అయ్యేవి. ఆ రోజుల్లో సినిమా పాటల రికార్డులు అంత సులభంగా దొరికేవి కావు. దానితో స్థానిక సంగీత కళాకారులు రేడియో కేంద్రానికి వచ్చి తమ కార్యక్రమాలను రికార్డు చేసేవారు. ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు రోషన్ ఆలీ డెక్కన్ రేడియోలో మొదటి మ్యూజిక్ డైరెక్టర్ గా పనిచేశారు. ఆతరువాత ఎం ఏ రవూఫ్ డెక్కన్ రేడియోలో స్టూడియో ఎగ్జిక్యూటివ్‌గా చేరారు. ఆయన పేరు పొందిన గజల్ గాయకుడు. తదనంతర కాలం లో రవూఫ్ ఈ కేంద్రానికి డైరెక్టర్ అయ్యారు.

మొహరం మాసంలో రేడియో కేంద్రానికి సెలవు ప్రకటించేవారు. ప్రసారాలు వుండేవి కావు.

ఆ తరువాత కొన్ని మార్పులు చేశారు. మొదటి పదమూడు రోజులు ప్రసారాలు నిలిపివేసేవాళ్ళు. మిగిలిన రోజుల్లో కూడా సంగీత కార్యక్రమాలు వుండేవి కావు. స్థానిక వార్తాపత్రికల్లో వెలువడిన వార్తల ఆధారంగా న్యూస్ బులెటిన్లు తయారయ్యేవి. రాష్ట్రానికి సంబంధించిన సమాచారమే వార్తల్లో చోటుచేసుకునేది.

విషాద సంగీతం

తోకచుక్క రాలినప్పుడు ఎవరో పెద్దవారికి కాలం మూడిందని నా చిన్నతనంలో చెప్పుకునేవారు. అలాగే తుమ్మెదలు వున్నటుండి గుంపులు గుంపులుగా కానరావడం.

కప్పలు సంగీతం మొదలు పెట్టడం వాన రాకడకు సూచనలుగా పేర్కొనేవారు.

ఈ సందర్భంలో చెప్పుకోవలసిన విషయం మరొకటి వుంది. రేడియోలో మామూలు కార్యక్రమాలు నిలిపేసి విషాద సంగీతం ప్రసారం చేస్తున్నారంటే ఎవరో జాతీయ నాయకుడు కన్ను మూశారని జనాలకు అర్థం అయ్యేది. మరణ వార్తను ప్రసారం చేసేముందు రేడియో అధికారులు అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. విషయం తెలిసినా, అధికారికంగా నిర్ధారణ చేసుకోకుండా మరణ వార్తలను ప్రసారం చేయరు. అధికారిక నిర్ధారణ జరగడానికి జరిగే కాలయాపన కారణంగా అనేకసార్లు ఆ నిందను ఆకాశవాణి వారే మోసేవారు.

## ఇంతకీ విషయానికివస్తే

ఆ రోజు నిజాం నవాబు మరణించారు. ఆ వార్తను ధ్రువీకరించడానికి నిజాం కులుంబీకులే చాలా సమయం తీసుకున్నారు. కానీ చావు కబురు ఆగదు కదా! ఆనోటా ఈ నోటా పడి కొందరికి తెలిసిపోయింది. ధ్రువీకరణతో నిమిత్తం లేకుండానే యు.ఎన్.ఐ వార్తా సంస్థ ఆ సమాచారాన్ని ప్రపంచానికి తెలిపింది. ప్రపంచం అంటే ఇక్కడ పత్రికలు. వార్తా సంస్థ పంపిన వార్త రాష్ట్రం వెలుపలి ప్రాంతాల్లోని పత్రికలకు తెలిసిపోయింది.

అయితే, ఇప్పట్లా త్వరితగతిన సమాచారం చేరవేతకు అవకాశం లేకపోవడం వల్ల దాని ప్రభావం హైదరాబాదులో అంతంత మాత్రమే అని చెప్పాలి. కానీ వార్త తెలిసిన రేడియో అధికారులు అప్రమత్తం అయ్యారు. రేడియో ట్రాన్స్‌మిషన్ వ్యవధి పెంచడానికి నిర్ణయం తీసుకున్నారు. కానీ అధికారిక సమాచారం అందే దాకా విషాద సంగీతం ప్రసారం విషయం పక్కనబెట్టారు. ఈ లోగా ఉన్నతాధికారి ఒకరు రేడియో ప్రసార వ్యవధి పొడిగిస్తున్నట్టు సిబ్బందికి తెలియచెయ్యడానికి స్టూడియోలోకి వెళ్లారు. గుమ్మం దగ్గర నిలబడి తలుపు వోరగా తెరిచి సిబ్బందితో మాట్లాడుతున్నప్పుడు బయట నడవాలో వున్న ఇతర సిబ్బంది నిజాం మరణంపై వినవస్తున్న వదంతుల గురించి పెద్దగా మాట్లాడుకోవడం కూడా రేడియోలో ప్రసారం అయిపోయింది. అప్పటి హడావిడిలో దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. కాని హైదరాబాదు నుంచి వెలువడే ఒకచిన్న పత్రికలో ఆ విషయం ప్రచురించారు. ఆ తర్వాత కూడా జనంలో ఈ విషయం చర్చకు రాలేదు కాని

పత్రికా వార్తపై మాత్రం రేడియో అధికారులు స్పందించి విచారణ జరిపారు. సంబంధం వున్న వారికి సంజాయిషీ నోటీసులు ఇచ్చారు.

ఆర్టిస్టులు అంటే అంతటి గౌరవం

ఇప్పటి సంగతి కాదు. ఆరోజుల్లో రేడియో స్టేషన్ మొత్తంలో డైరెక్ట్ టెలిఫోన్ వుండేది డైరెక్టర్ తరవాత మా న్యూస్ రూంలోనే. మిగిలిన వాళ్ళను కాంటాక్ట్ చేయాలంటే ఎక్స్‌టెన్షన్ నంబరుకు డయల్ చేయాల్సి వచ్చేది. అందువల్ల ఎవరెవరి ఫోన్లో మాకు వస్తుండేవి.

ఒకరోజు ఆర్టీసీ ఆఫీసు నుంచి ఫోన్. ఛైర్మెన్ లైన్లోకి వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం భోజనానికి ఆహ్వానించారు. ఆయనతో వున్న పరిచయంతో– 'ఇంకా ఎవరెవరు వస్తున్నారని'ని మాటవరసకు అడిగాను. "ఎవరూ లేరు, మీరూ, మీతో పాటు మీ దగ్గర రైతుల ప్రోగ్రాములు అవీ చూస్తూవుంటారే అదే– నిర్మలా వసంత్, విజయకుమార్–వాళ్లో ఎవరినయినా ఒక్కసారి ఫోను దగ్గరికి పిలిస్తే వాళ్ళకు కూడా చెబుతాను." అన్నారాయన. అప్పుడు లైటు వెలిగింది. ఆయన ఫోను చేసింది వాళ్లకోసం. భోజనానికి పిలుద్దామని అనుకుంది కూడా వాళ్లనే. ముందు ఫోన్ రిసీవ్ చేసుకున్నాను కనుక, విలేకరిగా తెలిసినవాడిని కనుక– మర్యాదకోసం నన్ను కూడా పిలిచివుంటారు. ఆయన ఎవరో కాదు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇందిరాగాంధీ హయంలోనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఎం.సత్యనారాయణరావు గారు. ఈ ప్రస్తావన అంతా ఎందుకంటే– రేడియోలో పనిచేసే కళాకారులు ఎవరో బయటకు తెలియకపోయినా, వారి స్వరాలే వారిని నలుగురికీ సుపరిచితుల్ని చేస్తాయని చెప్పడానికి. ఆ తరవాత కాలంలో సత్యనారాయణరావు గారిని నేను కలిసిన ప్రతి సందర్భంలోనూ, వాళ్ళిద్దరినీ మెచ్చుకుంటూ మాట్లాడేవారు.ఒకసారి ఢిల్లీలో సత్యనారాయణరావు రావు గారిని వారి ఇంట్లోనే కలిశాను. ఆయన పక్కనే చిన్న ట్రాన్సిస్టర్ రేడియో తన దారిన తాను ప్రోగ్రాములు వినిపిస్తోంది. అది చూసి ఒక రేడియో మనిషిగా ఎంతో సంతోషం అనిపించింది. 'రేడియో పెడితే చాలు, పాలూ పేడా తప్ప ఇంకేముంటాయి' అని హేళనగా మాట్లాడుకునే రోజుల్లో– ఇలాంటి వారు చెప్పే మాటలే ఆ కళాకారులకు నూతన జవసత్వాలను ఇచ్చేవని అనుకుంటాను.

ప్రతిరోజు మధ్యాహ్నం హైదరాబాదు కేంద్రం నుంచి వెలువడే ప్రాంతీయవార్తలు ముగియగానే వ్యవసాయదారుల కార్యక్రమం మొదలయ్యేది. రైతులకు సంబంధించిన అనేక అంశాలను వారికి పరిచితమయిన యాసలో వారిద్దరూ వివరించే తీరు జనరంజకంగా వుండేది. ఏదో సర్కారు ఉద్యోగము కదా అనుకుంటే వారలా ఆ కార్యక్రమానికి అంతగా కష్టపడి జీవం పోయాల్సిన అవసరం వుండేది కాదు. సత్యనారాయణరావు గారి వంటి వారే కాదు, వారి కార్యక్రమం అంటే చెవికోసుకుని వినేవారెందరో వుండేవారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ప్రస్తుత తమిళనాడు గవర్నర్, కే.రోశయ్య, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోడ్డు ప్రయాణాల్లో వున్నప్పుడు కూడా రేడియో వార్తలు వినడం నాకు తెలుసు.

## రేడియో అనుభవం

రేడియోలో పనిచేసేవారు ఉద్యోగ రీత్యా దేశంలోని వివిధ ప్రాంతాలలో పనిచేయాల్సి వస్తుంది. హైదరాబాదు ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన వీ.వీ.శాస్త్రి (వేమూరి విశ్వనాథ శాస్త్రి) చెప్పిన ఆసక్తికర ఉదంతం ఇది.

ఆయన భోపాల్‌లో పనిచేసేటప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ దగ్గర కార్యదర్శిగా పనిచేసిన ఐ.పి.ఎస్ అధికారి కె.పి.ఎస్. మీనన్ ఏదో కార్యక్రమంలో పాల్గొనడం కోసం ఆ నగరానికి రావడం జరిగింది. ఆయన వద్ద గతంలో పనిచేసిన సంగ్లా అనే అధికారి అప్పుడు భోపాల్ రేడియో కేంద్రంలో పనిచేస్తున్నారు. ఆయన పూనికపై వీ.వీ.శాస్త్రి వెళ్లి మీనన్‌ను కలుసుకుని రేడియో కేంద్రానికి ఆహ్వానించారు. నిజానికి ఆయన మరునాడు విదేశీ ప్రయాణం పెట్టుకున్నారు. అయినా, రేడియో మీది గౌరవంతో, సంగ్లా మీది అభిమానంతో తన ప్రయాణం వాయిదా వేసుకున్నారు. ఆరోజు రేడియోస్టేషన్‌కు వచ్చిన మీనన్, మాటల సందర్భంలో తన అనుభవాలు కొన్ని చెప్పారు.

మీనన్ గారు ఆరోజు చెప్పిన విషయాల్లో ఒకటి మన రాష్ట్రానికి సంబంధించింది కావడం వల్ల శాస్త్రి గారికి బాగా గుర్తుండిపోయింది.

"భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అనేక సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. నిజాం నవాబు ఈ చర్యను తీవ్రంగా ప్రతిఘటించడంతో ఎలాంటి చర్య తీసుకోవాలనే విషయంలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఒక ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. హోంమంత్రి సర్దార్ వల్లబాయ్‌పటేల్, హోం మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు పాల్గొన్న ఆ సమావేశం గంటల తరబడి కొనసాగింది. అర్ధరాత్రి కావొస్తోంది. సర్దార్ పటేల్ మగత నిద్రలోకి జారిపోయినట్టు కళ్ళుమూసుకుని వున్నారు. భారత సైన్యాలను హైదరాబాదు పంపే విషయంలో సుదీర్ఘంగా చర్చ సాగుతోంది. కళ్ళు మూసుకుని అంతా వింటున్న సర్దార్ పటేల్ లేచి ఒక్కసారిగా ఇలా అన్నారు:

'ఇండియన్ ఆర్మీ ఇప్పటికే హైదరాబాదు చేరిపోయింది. మేజర్ జనరల్ చౌదరి అక్కడే వున్నాడు'. పటేల్ మాటలు విని అక్కడివారంతా ప్రాన్పడిపోయారు.

నెహ్రూ సంగతి చెప్పక్కర లేదు.

వ్యాసకర్త – **రేడియో జర్నలిస్టు**

# టీవీ మాధ్యమం - భాష

**- అమిర్నేని హరికృష్ణ**

భావాన్ని చేరవేసే వాహిక భాష. ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి సమాచారాన్ని భాష ద్వారానే అందించగలం. భాషకు లిపి శాశ్వత రూపాన్ని ఇవ్వడంతోపాటు, కాలం, ప్రాంతం అనే పరిధులను అధిగమించేలా చేస్తుంది. సమాజం ఆధునికంగా, వైజ్ఞానికంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో సమాచార వ్యవస్థలో ఎన్నో ఆవిష్కరణలు జరిగాయి. మనిషి మనుగడను మరింత సుఖవంతం, వేగవంతం చేశాయి. ఒకరి ఆలోచనలను, భావాలను, సమాచారాన్ని ఒక స్థలంనుంచి, ఒక నిర్ధుష్ట కాలం నుంచి మరో స్థలానికి, మరో కాలానికి చేరవేయడానికి ఉపయోగపడుతున్నాయి. అలాంటి వైజ్ఞానిక ప్రగతికి దృశ్య శ్రవ్య రూపమైన టీవి ప్రత్యక్ష ఉదాహరణ.

నేడు టీవీ లేని ఇంటిని కాని, సెల్‌ఫోన్ లేని మనిషిని కానీ చూడలేం. వివిధ భాషలు, విభిన్న నేపథ్యాలు, భిన్న సందర్భాలు, పలు దేశాలు అన్నింటిని టీవీ మాధ్యమం ఒక సాంకేతిక సమాచార వ్యవస్థగా కలుపుతున్నది. అయితే అభివృద్ధిలో భాగంగా ప్రాంతీయ భాషల్లోనూ ఛానళ్లు వచ్చేశాయి. ముఖ్యంగా తెలుగు భాషలో వార్తలు, వినోదం, భక్తి వంటి భిన్న నేపథ్యాలతో సుమారు 30 కి పైగా

ఛానళ్లు ఉన్నాయి. ఇవన్నీ తెలుగు భాషలో, తెలుగు ప్రజలకు సమాచారాన్ని, వినోదాన్ని పంచుతున్నాయి.

ముందే చెప్పుకున్నట్లు భాషే భావాన్ని చేరవేసే ప్రధాన వాహిక కనుక, తెలుగు ఛానళ్లు అన్నీ తెలుగు మాధ్యమంలోనే ప్రసారాలను అందిస్తున్నాయి. అయితే భాష అనేది ముఖ్యంగా రెండు రకాలు.

1. లిఖిత భాష

2. మౌఖిక భాష

ప్రసార మాధ్యమాల దృష్టితో చూసినట్లైతే పత్రికల భాష లిఖిత భాష. టీవీ భాష మౌఖిక భాష. అంటే మాట్లాడే భాష. లిఖిత భాషకు, మౌఖిక భాషకు స్పష్టమైన తేడా ఉంది.

పత్రికల భాష అక్షరాస్యుల కోసం. చదవడం వచ్చిన వాళ్లకోసం. టీవీల భాషను నిరక్షరాస్యులు సైతం అర్థం చేసుకోవాలి. చదవడం రాకపోయినా విని పట్టుకోగలగాలి. అందుకే టీవీల భాషను సూటిగా, స్పష్టంగా, సులభంగా ఎదుటి వారితో మాట్లాడినట్లు ఉండాలి. సులభశైలిలో చూసే ప్రేక్షకుడు వినగానే అందులోని భావాన్ని పట్టుకొనేటట్టు ఉండాలి. పైగా టీవీలో కనిపించే దృశ్యానికి అనుగుణంగా భాష ఉండాలి. అదే పత్రికాభాషలో శైలి కష్టంగా ఉన్నా, భావాన్ని లోతుగా చెప్పడానికి బరువైన పదాలు వాడినా పర్వాలేదు. ఆయా సందర్భాలు, సమయాలు, చెప్పే విషయాన్ని బట్టి పదాలు ఉంటాయి. ఉదాహరణకు భక్తి గురించి చెప్పేటప్పుడు, ఏదైనా దుర్ఘటనను వర్ణించేటప్పుడు, వాతావరణాన్ని వివరించేటప్పుడు వాడే పదజాలం వేరువేరుగా ఉంటుంది. మాట్లాడే భాషకు, రాసే భాషకు మధ్య పదాలలో వైవిధ్యం ప్రత్యేకంగా కనిపిస్తుంది. టీవీలు మాట్లాడే భాషకు ప్రాతినిధ్యం వహిస్తాయి.

ఉదాహరణకు:

కుమారుడు అని పత్రికల్లో రాస్తే కొడుకు అని టీవీ భాషలో ఉంటుంది.

| | | |
|---|---|---|
| విచ్చేశారు | – | వచ్చారు |
| గతవారం | – | పోయినవారం |

ప్రారంభోత్సవం చేశారు - ప్రారంభించారు

పర్యటించనున్నారు - పర్యటిస్తారు

ఇలాంటి ఉదాహరణలు చాలానే కనిపిస్తాయి.

టీవీ భాషలో గుర్తించాల్సిన మరో విషయం ఏమిటంటే – వాక్యాన్ని లేదా పదాన్ని వీలైనంతవరకు తగ్గించాలి. భావం ప్రేక్షకులకు అర్థమయ్యేలా ఎంత తక్కువ పదాలతో చెప్పగలిగితే అంత మంచిది. అనవసర పదాలతో విషయాన్ని మితిమీరి వర్ణించడం తగదు. క్లుప్తత అనేది ముఖ్యం.

## టీవీలలో భాష గురించి సిఎన్ఎన్ కొన్ని సూచనలు చేసింది.

1. వార్తా కథానానికి, చూసే ప్రేక్షకుడికి సంబంధం ఉండాలి.
2. భాష వాస్తవాన్ని ప్రతిబింబించాలి. అక్షరదోషాలు లేకుండా పేర్లు, ప్రదేశాలను సరైన విధంగా చెప్పాలి.
3. వాక్యాలు చిన్నవిగా ఉంటూ, మాట్లాడే భాషలో సాగాలి.
4. చూపించే దృశ్యానికి, చెప్పే భాషకు మధ్య సంబంధం ఉండాలి.
5. ప్రారంభం నుంచి చివరి వరకు ఒకే విధమైన శైలిలో భాష ఉండాలి.

ఇలాంటి ఎన్నో సూచనలు సిఎన్ఎన్ చేసినా అవి ఆచరణలో ఎంతవరకు ఛానళ్లు పాటిస్తున్నాయో చెప్పడం కష్టం.

నేడు తెలుగు ఛానళ్లలోని భాషపై విమర్శలు లేకపోలేదు. అవసరానికి మించి పరభాషా పదాలు వాడుతున్నారని, వాక్యం మాత్రమే తెలుగులో ఉండి పదాలు ఆంగ్లంలో ఉంటున్నాయని అంటున్నారు. ఇక ఉచ్చారణ దోషాలైతే మితిమీరిపోతున్నాయన్న వాదనల్లో ఎంతో వాస్తవముంది. తెలుగును అంగ్లంలో ముంచి టింగ్లిష చేసి మాట్లాడుతున్న తీరు కొందరికి బాగుండవచ్చేమో కానీ భాషాభిమానులు మాత్రం బాధపడిపోవలసి వస్తోంది. కనీసం చాలా మంది యాంకర్లు మాతృభాషా పదాలను కూడా సక్రమంగా పలుకలేకపోతున్నారు. భాషను బాస గా వెల్లి ని వెల్లి అని., పెల్లి ని పెల్లి అని మారిస్తే ఎలా ఉంటుందో ఊహించండి.

ఇంతకు మించిన విధంగానే నేడు యాంకర్లు భాషను ఖూనీ చేస్తున్నారు. తెలుగును ఆంగ్లంతో కలిపి రుబ్బేయడం వల్ల ఏర్పడిన సమస్య ఇది. ఈ టింగ్లీషు మాయాజాలంలో పడి అధిక శాతం ఛానళ్లు కొట్టుకుపోతుండటం బాధాకరం.

నేడు టీవీ ఛానళ్లలో ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు ఆంగ్లమాధ్యమంలో చదవడం, ఛానళ్ళ యాజమాన్యాలు కూడా స్వభాషా ప్రాధాన్యత గురించి పట్టించుకోకపోవడం ఇందుకు కారణాలుగా చెప్పవచ్చు.

యాంకర్లు, ఆయా ఛానళ్ల యాజమాన్యాలు భాష విషయంలో తగు శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. అన్యపదాల వాడకం తగ్గించుకోవడం, అవసరమైతేనే పరభాషను వాడాలి. ముఖ్యంగా ఈ రంగంలోకి వచ్చే వాళ్లకు తెలుగుభాషపై ప్రత్యేకమైన శిక్షణ ఇప్పించాలి. నేడు టీవీ అనేది బలమైన ప్రసార మాధ్యమం. కనుక భాష విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఈ దిశగా మాతృభాష కోసం "ఈనాడు", "ఈటీవీ" చేస్తున్న కృషి అభినందనీయం. భాషాభివృద్ధికి లాభాపేక్ష లేకుండా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు వాడుకలో వస్తున్న ఆంగ్ల పదాలకు తెలుగులో సమనార్థకాలను రూపొందించి పాఠకులకు అలవాటు చేయడం ఒక నిరంతర క్రతువులా కొనసాగుతోంది. ఇలా పుట్టినవే బిందు, తుంపర సేద్యం, గుత్తేదార్లు, చరవాణి, అంతర్జాలం వగైరా పదాలు. నేడు వాడుకలో ఎంతో ప్రాచుర్యం పొందాయి. వాడుక భాషలో మమేకం అయిపోయాయి. ఈనాడు–ఈటీవీ చేస్తున్న కృషి తరహాలో అందరూ తమ వంతుగా మాతృభాషకు టీవీ మాధ్యమంలో పెద్దపీట వేయాల్సిన అవసరం నేడెంతో ఉంది.

వ్యాసకర్త – **ఈటీవిలో ఫీచర్స్ ఎడిటర్**

# టీవీ భాషలో విచిత్రాలు

- జి.బుచ్చన్న

ఒక అభిప్రాయాన్ని, ఓ భావాన్ని ఇతరులతో పంచుకునేందుకు భాషది ప్రధాన పాత్ర, సందర్భాన్ని బట్టి భాష వాడకం ఉంటుంది. మరీ ముఖ్యంగా మాస్ కమ్యూనికేషన్ మీడియంలో ఈ భాషది ప్రధాన పాత్రే. టివీలో అయితే దీని పాత్ర దృశ్య ప్రదానంగా ఎక్కువగా ఉంటుంది. కానీ అవసరం ఉన్నప్పుడైనా ఎట్లా వాడుతున్నామనేది కీలకం. పత్రిక, రేడియో, టివిల్లో భాష వాడకం గురించి చర్చ కొత్తది కాకపోయినా ఈ చర్చ మళ్లీ మళ్లీ జరుగుతూనే ఉంది.

పత్రికల్లో వాడుతున్న భాష చాలా ఏళ్లుగా మారుతూ వచ్చి జనం నిత్యవ్యవహారాలకు కాస్త దగ్గరగా వచ్చింది. ఆ మధ్య ఎఫ్ఎం రేడియోలు వచ్చినపప్పుడు భాష వినియోగంపై పెద్ద దుమారం రేగింది. ఏం భాష వీళ్లు మాట్లాడుతున్నది? దానికో అర్థం, పర్థం ఉందా అనే విమర్శతో పాటు నవ్వుకునే వారు. ఆ తరువాత టీవి భాషపై చర్చ షురూ అయింది. 2004 సంవత్సరం తరువాత తెలుగు నాట టీవి, ఎఫ్ ఎం రేడియోల విస్తరణ పెరిగింది. అప్పటి వరకు లేని కొత్త పదాలు, ఉన్న ముక్కు ముఖం మార్చుకుని వాడబడుతున్నవి.

రేడియో ఒకప్పుటి మాట. అది జనాలకు దగ్గరైన తీరు అదంతా గతం. వినండి...వినండి... ఉల్లాసంగా ఉత్సాహంగా .. ఇంత వరకు బాగానే ఉన్నా ఆ తరువాత తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు కలిపిన కొత్త భాష ప్రవాహంలా రేడియో జాకీ వెంట జాలు వారుతుంది. ఆ రేడియోలు విన్న తరువాత నిత్య సంభాషణల్లో విరివిగా వారి భాష లేక పోయినా జనాలు కూడా హైదరాబాద్ వంటి నగరాల్లో ఏదో తోచిన భాష కాలమానం తో  సంబంధం లేకుండా మాట్లాడుతున్నారు.

అసలే ఆయనకు టెంపర్. జంపర్ మే బంపర్ అన్నట్లు సొంత పార్టీలోనే ట్రబుల్స్. ఇది చాలదన్నట్టు బాస్ నుండి ప్రెజర్స్. సో ఇంత చేసినా లాభం లేదనుకుని పార్టీకి గుడ్ బయ్ చెప్పి మరో పార్టీలోకి జంప్ అవ్వాలని చూస్తున్నారీ సీనియర్ మోస్ట్ లీడర్స్...దీనికి సంబంధించినవివరాలు స్మాల్ బ్రేక్ తరువాత చుద్దాం... చూస్తూనే ఉండండి....టీవి? ఇది టీవిలకు సంబంధించిన భాష వినియోగం. టీవి భాష వినియోగం . టీవి భాష ఇట్లాగే ఉంటుందా.? లేక ఉండాలా? భాష వినియోగంపై సూచనలైనా ఉన్నాయా? వీటికి సమాధానం ఎవ్వరికీ తోచింది వారు చెప్పుకోవడమే.

మన దగ్గర 24 గంటల ఛానెళ్లు మొదలైన దగ్గర నుండి పరిస్థితి ఇట్లాగే ఉంది. దీనికి ఎవ్వర్నీ తప్పు పట్టాల్సిన పని లేదు. రేడియోలో బొమ్మ కన్పించదు. మాట విన్పిస్తుంది. సొంపుగా ఉంటే చాలు అనుకోవచ్చు. కానీ టీవిలో విజువల్స్ ఉంటాయి. కాబట్టి చెవికింపైన పదాలతో కవితాత్మకంగా, లయబద్ధంగా ఉండేలా చూసుకుంటున్నారు. ఇది బాగానే ఉంది కదా ఉండనీయండి అనే ధోరణి అంతటా ఉన్నట్లుంది.

ఎంత అర్థం కాని భాష వాడితే అంత ప్రభావవంతంగా ఉంటుందనే అభిప్రాయం బలపడింది. ఈ మధ్య సింగపూర్‌లో సైమా అవార్డుల పంక్షన్ జరిగింది. దాంట్లో ఓ రిపోర్టర్ హీరోయిన్‌ను ఇంటర్వ్యూ చేస్తున్నారు. చూడండి...ఎంత షైగా ఫీల్ అవుతున్నారో అని నవ్వుతూ చెప్పారు. దానికి బదులుగా ఎంత సిగ్గుపడుతున్నారో అంటే సరిపోతుంది. మరో టీవి ఛానెల్లో నటుడు రావు రమేష్  తో ముఖాముఖి పెట్టారు. దాంట్లో నిమిషానికో సారి సో అనే మాట. దాంతో పాటు మీరు స్మాల్ స్క్రీన్ నుండి బిగ్ స్క్రీన్ కు వచ్చిన తరువాత వాట్ ఈజ్ ది డిఫరెన్స్ అని అడిగారు.

దానికి బదులుగా టీవి నుండి సినిమాకు మారిన తరువాత ఎట్లా ఉంది అంటే సరిపోతుంది. ఇవన్నీ రోజూ మాట్లాడుకునే మాటలతో కూడా చాలా సూటిగా ఎఫెక్టివ్‌గా చెప్పొచ్చు.

కొన్ని ఛానెళ్లలో లైవ్ లు ఇస్తున్నప్పుడు వారు చెప్తున్న విషయంపై వారికి ఎంత అవగాహన ఉండదనేది వేరే విషయం. చెప్తున్న మాటల తూకం ఎంత. ఎట్లా వాడాలో కూడా తెలియడం లేదు. ఓ టివి ఛానెల్లో రిపోర్టర్ ఇట్లా చెప్తున్నారు. పేపర్ లీకేజీపై అధికారులు రీసెర్చ్ చేస్తున్నారు. దీనిపైనే వారు సమావేశం అయ్యారు. అంటే సరిపోతుంది. చాలా కష్టపడి పదాలు వెతుక్కుని మరీ చెప్పాల్సి వస్తున్నది. ఇక్కడ రిపోర్టర్లదీ తప్పు కాదు. వాళ్లకు సరిగా నేర్పకపోవడం, ఆ నేర్పే వాళ్లకూ ఏం నేర్పాలో నిర్దిష్టంగా, నిర్దుష్టంగా తెలియక పోవడం సమస్య.

ఇక వినోదాన్ని పంచే టివీల భాష గురించి చెప్తే దుంఖం తప్ప మరోటి రాదు. ఒకే ఒక్క మాటను నాలుగురు టీవి యాంకర్లు పద్నాల్గు రకాలుగా పలుకుతున్నారు. హాయ్ అండీ.. గిడ్ మార్నింగ్.. హలో అండీ గౌడ్ మార్నింగ్... నమస్తే అండీ గూడ్ మర్నింగ్...ఆహా...హాయ్...హల్లో ఇట్లా చెప్తారు. వాళ్ల భాష కంటే భాష ఉచ్చారణలో ఉండాల్సిన సొంపులు, సోయగాల కంటే వారు మెలికలు తిరుగుతూ చెప్పటంలోనే ఇంపుగా, సొంపుగా ఉందని అనుకుంటున్నారు.

ఒకటి అరా ఛానెళ్లు పూర్తి తెలుగు లాంటి తెలుగును వాడుతున్నారు. అదే ప్రమాణికం కూడా కాదు. మరి టీవి భాష ఎట్లా ఉండాలి. ఎట్లా ఉంటే బావుంటుంది. దీనిపైన కచ్చితమైన, నిర్దిష్టమైన నిఘంటువులు అయితే లేవు. భాష వినియోగాన్ని బిబిసి నుండి ఇంగ్లీషు, హిందీ ఛానెళ్లు తీసుకున్నాయి. వాటి నుండి మన తెలుగు ఛానళ్లు తీసుకున్నాయి. ఇంగ్లీషు చానెళ్లకు ఎటు తిప్పినా ఏదో ఒక ఇంగ్లీషే ఉంటుంది. హిందీ ఛానెళ్లది అదో కథ.మన తెలుగే ఈ అన్ని రకాల భాషలతో పాటు ఏభాషో కూడా తెలియని పదాలు దొర్లిస్తున్నారు.

టీవిని మన దగ్గర సమాచార ప్రసార సాధనంగా కంటే దాన్నో వినోదాత్మక సాధనంగా చూడటమే అలవాటు అయింది. టివీలో ముందు ప్రయోజిత కార్యక్రమాలు, ఏళ్ల తరబడి సాగే సీరియళ్లు, ఆ తరువాత సినిమాలు ఇట్లా వరుస

పెట్టి జనాలకు వినోదాన్ని, విషాదాన్ని అందిస్తున్నాయి. ఈ 24 గంటల వార్తల ఛానెళ్లు కూడా అదే కోవలోకి చేరిపోయాయి. లేదంటే చేరేలా చేయబడ్డాయి కావొచ్చు.

అందుకే దాని వినియోగ తీవ్రత తెల్సి ఉంటే దాంట్లో ఉండే భాష వినియోగంపై కూడా చర్చ జరిగి ఉండేది. దాని ప్రభావ, పరిణమాలపై అనుకుంత స్థాయి అవగాహన టీవిలు నడిపే వారికి లేదు. చూసే వారి సంగతి అట్లా ఉంచితే దీన్ని పట్టించుకుని, ఇట్లా కాదు, ఇట్లా ఉంటే బావుంటుందనే సూచన కూడా ఎట్లా చేయాలో ఇప్పటికైతే ఎవ్వరూ చేయనట్లే ఉంది.

యూనివర్శిటిల్లో జర్నలిజం కోర్సులున్నాయి. అవి ఇంగ్లీషులో ఉన్నాయి. తెలుగు విభాగాలున్న వాటిలో కూడా పత్రికా రంగానికి సంబంధించిన భాషతోనే బోధన జరుగుతున్నది. టీవి మీడియం భాష ఫలానా విధంగా ఉండాలని దానికో సిలబస్ కూడా తయారు చేయలేదు. పదేళ్లు కావొస్తుంది 24 గంటల తెలుగు ఛానెళ్లు తెలుగు నేలపైకి వచ్చి. ఇప్పటి వరకు దీనిపై నిర్థిష్ట కార్యాచరణ లేదు.

మన దేశంలోనే టీవి మాధ్యమాన్ని జనాలను సమ్మోహితులను చేసుకునేందుకు ప్రభుత్వాలు, పార్టీలు వాడుకుంటున్నాయి తప్ప దీని వినియోగంపై కచ్చిత మార్గదర్శకాలు ఏమీ చేయలేదు. అందులోనూ భాష విషయంలో నైతే మరీ అధ్వాన్నం. అంటే జనాలకు అర్థం అవుతుంది కదా ఇంకా సమస్య ఏం ఉంది అనవచ్చు. ఇప్పటికైతే సమస్య లేదు. దానికో నిర్దిష్ట భాష లేదు కదా. అడ్డదిడ్డంగా, ఒంకరటింకరగా మాట్లాడి ఇదే సరైన భాష అనుకుని ముందు తరాలు భ్రమపడే ప్రమాదం ఉంది.

ఇదే కాకుండా టీవి ఛానెళ్లు నడుపుతున్న సంస్థలకు కూడా భాష విషయంలో ఓ స్టైల్ అంటూ ఏమీ లేదు. అప్పటికప్పుడు ఏదో శిక్షణ ఇచ్చేస్తున్నాయి. కెమెరా ముందు నిలబడి నాలుగు మాటలు చెప్తే చాలు. అంతకంటే ఏం కావాలనే ధోరణే ఇందుకు కారణం. ఒక వేళ అద్భుతమైన భాష వినియోగిస్తే అదనంగా వచ్చే రేటింగ్ కూడా ఏమీ ఉండదనే ఆలోచనా కావచ్చు. అన్నింటికీ ఇక్కడ ఎంత ఎఫెక్ట్ గా చూపుతున్నాం, చెప్తున్నాం అనేది ముఖ్యం కానీ ఎట్లా చెప్తున్నాం, ఏ భాష వాడుతున్నామనేది చూసే వాళ్లకు కానీ, చెప్పే, చెప్పించే వాళ్లకు కానీ ప్రధానం కానట్లుంది. అందుకే దీనిపై అభ్యంతరాలు తీవ్ర స్థాయిలో లేవు కావొచ్చు.

టీవి భాష వినియోగం పరిస్థితి అట్లా ఉంటే ఇంకో ముప్పై నలభై ఏళ్లల్లో తెలుగు భాష ఏ రూపంలో ఉంటుందో కూడా తెలియడం లేదు. ఈ పాటికే ప్రయివేట్, కార్పోరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఇంగ్లీషు వచ్చేసింది. తాజాగా ప్రభుత్వ బడుల్లో కూడా ఇంగ్లీషు వస్తున్నది. మొత్తంగా చూస్తే తెలుగు భాష బడి నుండి, మీడియా నుండి క్రమంగా పక్కకు జరుగుతున్నది. మొత్తంగానే పోతుందా అంటే పోకపోవచ్చు. కానీ దాని ప్లేస్ అయితే మారుతుంది కదా!

ప్రసార సాధనాల వినియోగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. దాని వినియోగాల గురించిన పట్టింపు లేదు. అస్సలు అవగాహన లేదు. జనాలకు ఏదో విషయం చేరుతుందా లేదా. తాము చెప్తున్న ముచ్చట జనం చెవిన పడితే చాలు అన్నట్లుంది వ్యవహారం. భారత ప్రసార మంత్రిత్వశాఖ కూడా అధికార పార్టీపైనా, ప్రభుత్వ పని తీరుపైనా విమర్శలు చేస్తే తోలు తీస్తామనే సంకేతాలు ఇస్తుంది తప్ప, మనకో భాష ఉంది, దానికో ఉనికి ఉంది, దాన్ని కాపాడుకోవాలి. భద్రంగా వాడాలనే ఆలోచన లేదు.

ఇంగ్లీషు భాషలో చెప్పాలనుకుంటే వార్తలు ఇంగ్లీషులో చెప్పడం మంచిది. అదీ కాదంటే హిందీ ఉర్దూలో చెప్తారా మంచిదే. కానీ ఈ సంకర, ఒంకర, టింకర భాషనే ప్రమాదం. ఇందులో ఇంకో సమస్య కూడా ఉంది. మన దేశంలో ఇన్ని రకాల భాషలుండటం వల్ల కూడా ఎవ్వరి పంచాయితీ వాళ్లకున్నట్లుంది. అందుకే వినియోగానికి టీవి మీడియంలో ఓ విధానం అంటూ లేకుండా పోయింది.

కమ్యూనికేషన్ టెక్నాలజీ పెరిగిన తరువాత కొత్త పదాలు తెలుగులోకి విరివిగా వచ్చాయి. దాన్ని ఎవ్వరమూ ఆపలేం. కానీ ఒకానొక సందర్భంలో పి.వి.నరసింహారావు చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకోవాలి. కంప్యూటర్ ను తెలుగులో ఏమనాలి అంటే దాన్ని ఏదైనా బజార్లో పెడితే జనాలే దానికో పేరు పెడ్తారు అని చెప్పారు. అంటే మరీ కృతక తెలుగును జనం నెత్తిన రుద్దాలని కాదు. సందర్భానుసారంగా ఇంగ్లీషును, హిందీ పదాలను వాడాల్సిందే తప్పదు. తప్పేం కాదు. ఈ అర్థం పర్థం లేని భాషనే తేవొద్దు.

జనం మాట్లాడుకునే నిత్య వ్యవహార భాషలో కూడా వార్తలు చాలా బాగా చెప్పొచ్చు. చెప్పాల్సింది కూడా అట్లాగే. కొన్ని కొన్ని పదాలు పరిహరిస్తే జనం భాషకు మించిన భాష మరోటి లేదు. ప్రాంతాలను బట్టి మాట తీరు మారుతుంది కావొచ్చు. భావం చెడకుండా జనం మాటలని పెడితే ఈ సంకర భాష కంటే కొన్ని రెట్లు మేలు కదా. తెలంగాణ మాండలికం, లేదా తెలంగాణ భాషలో వార్తలు ఇస్తున్న ఛానెళ్లు అద్భుతంగా ఆదరణకు నోచుకుంటున్నాయి కదా!

ఏదైనా ఒక భాష వాడితే మంచిదే. సందర్భానుసారంగా అన్యభాష వాడినా మంచిదే కానీ అన్ని రకాల భాషలు ఏకకాలంలో పలికితే ఏ భాషో అర్థం కాదు. దీనికి యూనివర్శిటీల వైపు నుండి, ప్రభుత్వం నుండి, మీడియా సంస్థల నుండి ఓ ప్రయత్నం అయితే జరిగి తీరాల్సిందే. మన భాషలో మనదైన ముద్రతో జనాలకు సమాచారం అందిస్తే ఇంకా బావుంటుంది. ఆ ప్రయత్నం జరగాలని కోరుకుందాం.

వ్యాసకర్త – **టీవి జర్నలిస్టు**

# మీడియా భాష - ఆధునికత

- *పొద్నాల చంద్రమౌళి*

భాష ప్రయోజనం భావ ప్రసరణం. మన భావాలను ఎదుటివారికి తెలియజేయడానికి, ఇతరుల భావాలను మనం అర్థం చేసుకోవడానికి భాష ఉపకరిస్తుంది. మనిషిని ఇతర జంతుజాలం నుంచి వేరు చేసి ఉన్నతుడిగా నిలబెట్టిన అంశాల్లో భాష ప్రధానమైంది. భాషను బట్టి భావాలకు అర్థం, ఆర్ద్రత చేకూరుతాయి, ఎదుటివారితో అనుబంధం పెరుగుతుంది. ఈవిధంగా మానవ జాతి మనుగడకు, వికాసానికి, సంస్కృతి రక్షణకు భాష కీలకంగా మారింది.

ప్రజలకు సమాచారాన్ని అందించడంతో పాటు భాషను పరిపుష్టం చేయడంలో ప్రధానపాత్ర పోషిస్తున్నాయి వార్తా పత్రికలు, న్యూస్ ఛానళ్లు. మనదేశంలో పత్రికా రంగానికి 180 సంవత్సరాల చరిత్ర ఉంటే న్యూస్ ఛానళ్లకు మాత్రం ఇంకా పాతికేళ్లు కూడా నిండలేదు. 1990వ దశకంలో తెలుగు ఛానల్స్‌లో న్యూస్ బులిటెన్స్ మొదలు కాగా 2000 సంవత్సరం నాటికి వార్తలు ప్రసారం చేసే ఛానల్స్ సంఖ్య పెరిగింది. ఒక 2003 లో పూర్తిగా వార్తలకే అంకితమైన 24X4 న్యూస్ ఛానల్స్ ఆవిర్భావం మొదలైంది. ఇప్పుడు మరే భారతీయ భాషలో లేనన్ని వార్తా ఛానళ్లు తెలుగులో ఉన్నాయి.

పత్రికలకైనా, ఎలక్ట్రానిక్ మీడియాకైనా ప్రజలకు సులువుగా అర్థమయ్యేలా వార్తలు రాసి పాఠకుల, ప్రేక్షకుల ఆదరణ పొందడమే పరమావధి. అందుకు ప్రేక్షకులను అకట్టుకునే విధంగా వార్త రచనా శైలిని అభివృద్ధి పరిచాయి న్యూస్ ఛానళ్లు. మీడియాలో భాష విషయంలో వ్యాకరణ నియమాలను కాకుండా ప్రజల అభిరుచిని కొలమానంగా తీసుకుంటున్నారు. వీక్షకులను ఆకట్టుకునేలా పదాలు, పదబంధాలు, పదాల విరుపు, వాక్యాల నిర్మాణం, సమాసాల కూర్పు ఉంటుంది.

ఎలక్ట్రానిక్ మీడియాలో ఉపయోగించే భాష, రచనాశైలి పత్రికలతో పోల్చినపుడు విభిన్నంగా ఉంటుంది. వార్తా పత్రికలను చదవుతాం. న్యూస్ ఛానళ్లను చూస్తాం. వింటాం. పుస్తకాల్లో వాడే భాషను పత్రికల్లో ఉపయోగిస్తే ఛానళ్లలో జనం మాట్లాడే భాషను వాడుతున్నారు. మీడియాలో దృశ్యాలు మాట్లాడుతుంటాయి. అందువల్ల వార్తా రచనలో పదాలు దృశ్యాలకు అనుగుణంగా ఉండాలి. జఠిలమైన విషయాన్ని కూడా సామాన్యులకు అర్థమయ్యేలా సులభ శైలిలో రాయాలి. వార్తా రచన ఉచ్చారణకు అనుగుణంగా ఉండాలి. కాబట్టి లిఖిత సంప్రదాయాన్ని కాకుండా మౌఖిక భాషనే ఉపయోగించాలి.

పత్రికల్లో అచ్చయిన వార్తను మళ్లీ మళ్లీ చదువుకునే అవకాశం ఉంటుంది. కాని మీడియా వార్త ఆయువు క్షణభంగురమే. అందువల్ల ఒక్క క్షణంలోనే వార్త ప్రేక్షకుడికి అర్థమయ్యేలా రచన ఉండాలి. ఇందుకోసం వార్త రాసే రిపోర్టర్‌కు, ఆ వార్తకు మెరుగులు దిద్ది ప్రసారం చేసే ప్రోడ్యూసర్‌కు ప్రత్యేక నైపుణ్యం ఉండాలి. మీడియా వార్త సూటిగా, సరళంగా ఉండాలి. జరిగిన సంఘటనలను వార్తలుగా అందిస్తున్నప్పుడు భాషలో కవితాత్మకత, అలంకార శైలి ఉండకూడదు. వాక్యాలు చిన్నవిగా ఉండి వార్తలో స్పష్టత ఉండాలి. సుదీర్ఘమైన, సమాసభూయిష్టమైన వాక్యాలు అసలు రాయకూడదు. వాక్యాలు ఎంత చిన్నగా ఉంటే అంత ఆకట్టుకుంటాయి. వార్తలు రాసే రచయిత మాటలను పొదుపుగా వాడుతూ దృశ్యాలతో భావప్రసారం జరిగేలా చూడాలి. దృశ్యాన్ని, పదాన్ని ఒకదానితో ఒకటి సమన్వయం చేస్తూ వార్తను ముందుకు నడిపించే నేర్పును కలిగి ఉండాలి. పదాల ద్వారా తెరకెక్కించబోయే దృశ్యాలను ముందుగా మనసులో చిత్రీకరించుకోవాలి.

పదాలను క్లుప్తంగా **(ABBREVIATION)** రాసే ముందు విస్తృత రూపంలో రాయాలి. అంకెలను అక్షరాల్లో రాయాలి. లేదంటే వార్తను చదవడంలో ఇబ్బందిపడతారు. ఉదా: **10,29,70,310** అని రాసినపుడు ఆ నంబర్ విలువెంతో చదివి అర్థం చేసుకోవడానికి చాలా సమయం పడుతుంది. ఒక్కోసారి తప్పుగా చదివే ప్రమాదం ఉంది. దాన్ని పదికోట్ల ఇరవై తొమ్మిది లక్షల డెబ్బయి వేల మూడు వందల పది అని వివరంగా రాయాలి.

సంక్షిప్త పదాలను ఇంగ్లీషులో రాయడం మంచిది. ఉదాః ఎఐటియుసి అని రాయడం వలన యాంకర్ చదవడంలో ఇబ్బందులు పడతారు. దానికన్నా ఇంగ్లీషులో **AITUC** అని రాయడం వల్ల తప్పులు దొర్లకుండా నివారించవచ్చు.

ప్రజా క్షేత్రంలో బాగా ఉపయోగంలో ఉండి రూఢి అయిన పదాలను యథాతథంగా ఉపయోగించడం వలన ప్రేక్షకులకు సలువుగా అర్థమవుతుంది. వాటిని విపులంగా రాయడానికి ప్రయత్నిస్తే ప్రేక్షకులు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఉదా॥ నాసా, ఇస్రో, ఎటిఎం. అయితే కొత్త పదాలు రాస్తున్నప్పుడు మాత్రం పూర్తి పేరు వివరణతో సహా రాయాలి.

ఇక తెలుగులో క్రియాంతరూపాలు ఎక్కువగా 'ర' కారంతో ఉంటాయి. ఉదా॥ చేశారు, చెప్పారు, వచ్చారు, తెచ్చారు. టీవీలో ప్రతి వాక్యాన్ని రు కారంతో ముగిస్తే వాక్యం తద్వారా వార్త విసుగెత్తిస్తుంది. అందుకే వాక్య నిర్మాణన్ని మౌఖిక శైలిలోకి మార్చాలి. ఉదా॥ "చేపమందుతో కొత్త రోగాలు వస్తాయంటున్నారు డాక్టర్లు". "సుజనా చౌదరికి మరోసారి అవకాశం దక్కింది." అని రాయవచ్చు.

సగటు మనిషి నిత్య జీవితంలో వాడని మాటలు, కేవలం పత్రికల్లో మాత్రమే ఉపయోగించే పదాలు ఎలక్ట్రానిక్ మీడియాలో వాడకూడదు. ఉదా॥ స్పష్టం చేశారు, అభిప్రాయపడ్డారు, వ్యాఖ్యానించారు, వ్యక్తీకరించారు. ఇవి గ్రాంధిక లేఖన పద్ధతులు. మనం ఎదుటివారితో మాట్లాడుతున్నప్పుడు ఈ పదాలు ఉపయోగించడంలేదని గ్రహించాలి. చెప్పారు, అన్నారు అనే వాడుతుంటాం.

వార్తలు రాసేటప్పుడు బాగా వ్యాప్తిలో ఉన్న పరభాషా పదాలను వాక్యాల్లో వాడుకోవచ్చు. ఉదా॥ జూ,పార్క్, అయితే సీరియస్, ఫైర్ వంటి విభిన్న అర్థాలనిచ్చే

పదాలను వాడకపోవడం మంచిది. ఎందుకంటే సందర్భాన్ని బట్టి వాటి అర్థం మారుతుంది. వాక్యాలు ఎప్పుడూ డైరెక్టు స్పీచ్‌లో రాయకూడదు. సైన్స్, టెక్నాలజీకి సంబంధించి ప్రత్యేకమైన పరిభాషను అభివృద్ధి చేయాలి.

అయితే మీడియా రచనా ఏకశిల సాదృశ్యం కాదు. మీడియాలో ఆయా సంఘటనల ఆధారంగా రూపొందించి జనానికి అందించే వార్తలు మాత్రమే కాకుండా ప్రత్యేక కథనాలు, విశ్లేషణాత్మక కథనాలు, క్రైమ్ స్టోరీలు, వినోదాత్మక కథనాలు కూడా ప్రసారం చేస్తుంటాయి. సాధారణంగా వార్తారచనకు ఈ ప్రత్యేక కథనాలకు రచనా శైలిలో స్పష్టమైన తేడాలు ఉంటాయి. ప్రత్యేక కథనాలు విశ్లేషణాత్మకంగా ఉంటాయి. ఇందులో అవసరాన్ని బట్టి ఆలంకారిక శైలి వాడాలి. ఒక అందమైన ప్రకృతి దృశ్యాన్ని వివరిస్తున్నప్పుడు కవితాత్మక శైలి వాడితేనే ఆ కథనం ప్రజలను ఆకట్టుకుంటుంది.

భాష విషయంలో ఛానళ్లు వినూత్న ప్రయోగాలు చేస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. ప్రతి ఛానల్ తమ ప్రేక్షకుల అవసరాల మేరకు, వారిని అకట్టుకునే విధంగా భాషా ప్రయోగాలు చేస్తున్నాయి. ఛానళ్ల భాష ఆ ఛానల్ టార్గెట్ ప్రేక్షకులను బట్టి ఉంటుంది. తెలుగులో తొలి 24 గంటల ఛానల్, నెంబర్ వన్ స్థానంలో ఉన్న **tv9** తెలుగు భాషలో అనేక ప్రయోగాలు చేస్తోంది. "ట్రెండ్ మారింది, కింగ్‌లు పోయి క్వీన్‌లు వచ్చారు. కళావర్ రాణులదే కీ రోల్" ఇలా తెలుగు–ఇంగ్లీషుతో మిక్స్ చేసి వినూత్న పదబంధాలతో ఆకట్టుకునేలా ఉంటుంది. **tv9** ఉపయోగించే భాష.

ఈ భాష ప్రయోగాలు మధ్య తరగతి, ఉన్నత మధ్య తరగతిని ఆకట్టుకునేలా ఉన్నాయి. మధ్య ఉన్నత తరగతికి చెందిన పట్టణ, విద్యావంతులైన యువత **tv9** టార్గెట్ గ్రూప్ కావడం వల్ల వారి అభిరుచికి అనుగుణంగా ఆధునిక వ్యక్తీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ ఛానల్‌లో రాసే స్క్రిప్ట్ తెలుగు సినిమా డైలాగులు, సినిమా టైటిల్స్‌తో సినిమా భాష కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఉదా॥ దూకుడు పెంచిన కేసీఆర్, ఉడ్తా హైదరాబాద్, అదిరిందయ్యా ఆనందం, 'తొక్కలోది' 'చూం మంతర్' వంటి తెలుగు భాషలో లేని, కేవలం జనం వాడుకలో ఉన్న పదాలు కూడా వాడుతుంటారు.

ఇక **"Yes, All right, Thank you, Thanks for the information, Keep watching tv9"** అంటూ పూర్తి ఇంగ్లీషు వ్యాక్యాలు కూడా విరివిగా వాడుతుంటారు. ఈ ఛానల్‌లో ప్రసారమయ్యే కార్యక్రమాల శీర్షికలు గమనించినపుడు భాష విషయంలో వారి ప్రయోగం అర్థమవుతుంది, కొన్ని శీర్షికలు చూద్దాం - 30 మినిట్స్, వీకెండ్, మస్తీ, వీకెండ్ సినిమా, జబ్ వి నెట్, ఎన్‌కౌంటర్ విత్ మురళీ కృష్ణ, గాడ్జెట్ గురు, లైఫ్ లైన్, ఫేస్ టు ఫేస్, కెరీర్ ప్లస్ రీజినల్ న్యూస్, మార్నింగ్ న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ టు నైట్ అంటూ తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-హిందీ పదాలను కలిపేసి కొత్త పదాలను సృష్టించి ప్రేక్షకులను ఆకట్టుకునేలా తయారు చేశారు. ఇందులో వ్యాకరణ నియమాలకు ఏ మాత్రం ప్రాధాన్యం లేదు. టైటిల్స్ ప్రజలను ఆకట్టుకుంటున్నాయా?లేదా? అనేదే ముఖ్యం.

**Tv9** తర్వాత **Ntv, Tv5, ABN, 10tv** ఛానళ్లు కూడా ఆధునిక భాషా ప్రయోగాలకే పట్టంగట్టాయి. ప్రయోగం సక్సెస్ కావడంతో అదే ధోరణిని అవలంబిస్తున్నాయి. శీర్షికల్లో, వాక్య నిర్మాణంలో చిన్న చిన్న మార్పులు చేసినా స్థూలంగా అదే పార్మూలాను ఫాలో అవుతున్నాయి. ఉదాహరణకు కొన్ని టైటిల్స్ చూద్దాం. "బిగ్ ఫైట్, వైడ్ యాంగిల్, ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే, మామా మియా , 30ః60, వీకెండ్ కామెంట్, తీన్మార్, ధూమ్ ధాం"

అయితే మరికొన్ని ఛానళ్లు మాత్రం భాష విషయంలో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సినవి **HMTV, TNews, V6. Etv,** ఎక్కువగా సంప్రదాయ, గ్రామీణ ప్రజలను ఆకట్టుకునేలా శీర్షికలు, వాక్యనిర్మాణాన్ని కొనసాగిస్తున్నాయి. వారు దిగువ మధ్య తరగతి, గ్రామీణ, సంప్రదాయ ప్రేక్షకులను టార్గెట్ చేసినట్టు కనిపిస్తోంది. జనం వాడుకలో రూఢి అయిన పదాలను కాదని **Etv** లో పూర్తి సంప్రదాయ తెలుగులో కార్యక్రమాలు, కథనాలు రూపొందిస్తున్నారు. అందరికి బాగా అర్థమయ్యే ఆర్టీసిని రహదారి రవాణ సంస్థగా, సీఐని వృత్తులాకార రక్షణాధికారిగా రాస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. Etv లో కార్యక్రమాల శీర్షికలను 'నారీ-భేరీ'. 'ఇదీ సంగతి', 'ఘంటారావం' వంటి సంప్రదాయ తెలుగులో రూపొందిస్తే **HMTV** లో శిఖర వార్త, ఉదయం వార్తలంటూ అంతే సంప్రదాయంగా తీర్చిదిద్దుతున్నారు. అన్ని

ఛానళ్లలో బ్రేకింగ్ న్యూస్‌గా ప్రసారం చేసే వార్తలను కూడా **Etv** లో 'తాజా' వార్తల పేరుతో ప్రేక్షకులకు అందిస్తున్నారు. ప్రశ్నోత్తరాల సమయం, విపక్షాలు, అధికార వర్గాలు, సమావేశాలు వంటి పూర్తి స్థాయి తెలుగు భాషను వినియోగిస్తున్నారు.

ఇక తెలంగాణ ఉద్యమంతో మమేకమైన **TNews, V6** వంటి ఛానల్స్ తెలంగాణ యాసకు, పదబంధాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 'తీన్మార్ వార్తలు', 'బిత్తిరి సత్తి', 'చేను చెలక', 'మట్టి మనిషి', 'సింగిడి', 'ధూం ధాం ముచ్చట', 'ఇచ్చంత్రం' వంటి శీర్షికలు చూస్తే ఛానల్స్ స్థానికతకు ఇస్తున్న ప్రధాన్యం అర్థమవుతుంది. **TNews** లో పదాలకు చివరలో దీర్ఘాలు తొలగించి హ్రస్వాలతో వాక్యాలు రాస్తూ తెలంగాణ జన భాషకు పట్టం కట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉదాహరణకు. చేసినం, అందిస్తం, ప్రయత్నిస్తున్నరు. చెపింద్రు, చేసింద్రు వంటి పూర్తి తెలంగాణ గ్రామీణ భాషను కూడా వాడుతూ జనం ఆదరణ పొందే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా స్థానిక సంఘటనలు, జిల్లా, మండల స్థాయి నాయకుల వార్తలను వారి యాస, భాషలలోనే ప్రసారం చేస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు.

తొలితరం సమాచార మాధ్యమైన పత్రికా భాషను, శైలిని ఆ తర్వాత వచ్చిన రేడియో, టీవీలు స్వీకరించాయి. తొలితరం ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరూ పత్రికా రంగం నుంచే రావడం వలన రచనా శైలిలో పత్రికలకు, ఛానల్స్‌కు తేడా ఉండేది కాదు. అయితే ఇపుడు కేవలం మీడియాలోనే అనుభవం గడించిన వారి సంఖ్య బాగా పెరిగింది. అందుకే మీడియా రచన ఇపుడు ప్రత్యేకతను సంతరించుకుంది. తమ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా రచనా విధానాన్ని అభివృద్ధి చేసుకుంది ఎలక్ట్రానిక్ మీడియా. అందుకే ఇపుడు పత్రికా రచన, మీడియా రచన రెండు ప్రవాహాలుగా సాగుతున్నాయి.

వ్యాసకర్త – ***టీవీ9 లో సీనియర్ ఔట్‌పుట్ ఎడిటర్***

# తెలుగు దినపత్రికల్లో ఆదాన పదాలు - పరిశీలన

- డా. కొమాండూరి విజయభాను

పత్రికలు సమాచారాన్ని అందించటంలో ప్రధానపాత్ర పోషిస్తాయనటంలో ఎటువంటి సందేహం లేదు. ఇవి నేడు మానవుని జీవితంలో ఒక భాగంగా మారాయి. పత్రికలు ప్రపంచంలోని సంఘటనలను, సమాచారాలను పాఠకులకు తెలియజేస్తాయి. కేవలం వార్తలనేకాక విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసిక వికాసానికి కావలసిన ఎన్నో అంశాలను పత్రికలు అందిస్తున్నాయి.

సమాజంపై అమితమైన ప్రభావాన్ని చూపుతున్న పత్రికలకు విస్తృత వ్యాప్తి అనేది ప్రధానం. దీనికోసం పత్రికలు వివిధ రకాల కొత్తకొత్త ప్రయోగాలు చేసి, మరింత అందంగా, ఆకర్షణీయంగా తయారవుతున్నాయి, అధిక సమాచారాన్ని అందించడానికి ఎప్పుడూ ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. దీనిలో భాగంగానే పత్రికలు ప్రయత్నపూర్వకంగానో, అప్రయత్నంగానో ఆదానపదాలను చాలా విస్తృతంగా వాడటం కనిపిస్తుంది. ఆదానపదాల తీరు ఏవిధంగా ఉంది? అవి భాషపై ఎంతటి ప్రభావాన్ని చూపుతున్నాయి? అని వివరించటమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

## ఆదానం-పరిచయం

సాధారణంగా ప్రతిభాష మీద పరభాషా ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. ఆంగ్లంపై లాటిన్ ప్రభావం, హిందీపై ఉర్దూ ప్రభావం ఉన్నట్లుగానే తెలుగుభాష మీద కూడా ఇతర భాషల ప్రభావం ఉండటంవల్ల అన్యభాషా పదాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి.

పత్రికలు పాఠకునికి దగ్గరగా ఉండి, వారిపై అధికమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయని చెప్పుకున్నాం. అలాగే అన్యభాషా పదాల వాడుక పత్రికల్లో ఎక్కువగా కనిపిస్తున్నందువల్ల పాఠకులు ఆ పదాలనే వాడటం జరుగుతోంది. ఉదాహరణకు– ఖరీద్, జప్తు వంటి పర్షియన్ భాషాపదాలు; హుషారు, దర్యాప్తు వంటి ఉర్దూ భాషాపదాలు; ఇస్త్రీ, మేస్త్రీ వంటి పోర్చుగీసు భాషాపదాలు; అధికంగా కనిపించే డైరెక్టర్, సీఎం, అంబులెన్స్, హెల్త్, స్వైన్ ఫ్లూ వంటి ఎన్నో ఆంగ్ల భాషాపదాలు నిత్యం దినపత్రికల్లో కనిపిస్తున్నాయి. కాబట్టి ఏ భాషకైనా ఇతర భాషాపదాలు చేరటం సహజం.

ఈ విధంగా ఒక భాషలో నుంచి పదాలు మరొక భాషలోకి చేరటాన్ని 'ఆదానం' అని, అలా చేరే పదాలను 'ఆదానపదాలు' అని అంటాం.

## 2.1 ఆదానం-నిర్వచనం

ఆంగ్లంలోని 'borrowing' అనే పదానికి తెలుగులో 'ఆదానం' అనే పదాన్ని సమానార్థకంగా వాడుతున్నాం. 'ఆదానం' అనే పదానికి బ్రౌణ్య ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులో బదులు తెచ్చుకొను, అప్పుచేయు, ఎరువు తెచ్చుకొను, మరొకరి నుండి తీసుకొను, తనది కానిదాన్ని సొంతంగా వాడుకొను, గ్రంథ చౌర్యం చేయు అనే సమానార్థకాలు ఉన్నాయి.

"భాషలో కొత్తపదాలు చేరడానికి ముఖ్యమైన కారణం ఆదానం (borrowing)." (స్వరాజ్యలక్ష్మి 2004:326)

"ఒక భాషలోని పదాలు, నిర్మాణాలు మరొక భాషలోకి ఎరవు తెచ్చుకోవడాన్నే 'ఆదానం' (borrowing) అంటారు." (సుబ్రహ్మణ్యం,పి.యస్. 1997:283)

"The adoption of features which differ from those of the main tradition is linguistic borrowing. (Bloomfield 1933:444)

## 2.2 తెలుగుభాషలో ఆదానం

తెలుగులో ఆదానం ఎప్పటినుండి ప్రారంభమైందని ఖచ్చితంగా చెప్పలేం. కానీ లిఖిత రూపంలో శాసనాలు, గ్రంథాల ఆధారంగా తిక్కన భారతంలో కనిపించే 'త్రాసు' పదం (క్రీ.శ.13వ శతాబ్ది) నుంచి తెలుగులో ఆదానం ప్రారంభమైందని "తెలుగులో అన్యదేశ్యాలు" వ్యాసం ఆధారంగా చెప్పచ్చు.

తెలుగుపై ప్రాచీనకాలంలో సంస్కృతం మధ్యయుగం నుంచి పర్షియన్, అరబిక్, హిందుస్థానీ, పోర్చుగీసు, డచ్, ఫ్రెంచి ఆధునిక కాలంలో ఆంగ్లం బాగా ప్రభావాన్ని చూపాయి.

## ఆదానరూపాలు - భాషాపరమైన మార్పులు

సాధారణంగా ఏ భాషకైనా కొన్ని నిర్దిష్టమైన లక్షణాలు ఉంటాయి. తెలుగుభాషకు కూడా అంతే. అయితే తెలుగుకు సంబంధించి కొంత భిన్నమైన మార్పులు కలిగాయని చెప్పచ్చు. తెలుగులో సరిహద్దు ప్రాంతాల కారణంగా వివిధ భాషాపదాలు ఆదానాలుగా చేరాయి. ఎక్కువగా సంస్కృత వాఙ్మయం వాడుకలో ఉండటం చేత తెలుగులో పదసంపద పెరిగి భాషాభివృద్ధికి కారణమైనప్పటికీ, సంస్కృతం వాడటంవల్ల తెలుగు పదాలనే విడిచిపెట్టి ఎరవు తెచ్చుకున్నవాటిపై అధికంగా ఆధారపడటం కనిపిస్తుంది. తమిళ మాతృభాషీయులు తమభాషను అభివృద్ధి చేసుకోడానికి కృషిచేస్తున్నారు. కొత్త భావాలకు, పదాలకు సరిపడే తమిళపదాలను నిర్ధారించి, వాడుతున్నారు. ఆ విధంగా వారు తమ భాషను కాపాడుకుంటున్నారు.

ఈ పరిశోధన పత్రానికి ఒకరోజు ఈనాడు దినపత్రిక (జనవరి 23, 2015) ను తీసుకోటం జరిగింది. ఈ ప్రతిని పరిశీలించగా సుమారు 600పైగా ఆదానపదాలు ఉన్నాయి. వీటిలో అధికంగా ఆంగ్లపదాలు కాగా, మిగిలినవి ఉర్దూ పదాలు. వాటిలో కొన్నింటిని దిగువన చూద్దాం.

ఇంటర్నెట్, ఐఫోన్, కంప్యూటర్, కమిషన్, కలెక్టర్, కీబోర్డ్, క్రికెట్, క్లినికల్, గూగుల్ క్రోమ్, ట్రైప్, డాక్టర్, నర్స్, పబ్లికేషన్, పాస్వర్డ్, పెటెంట్, పేకప్, పోర్ట్, ప్యాకెట్లు, ప్రాజెక్టు, ప్రాసిక్యూషన్, ప్రీమియం కార్లు, ప్రైవేటు ప్రాక్టీసు, ప్లస్, ప్లాంట్లు, ఫేస్బుక్, ఫోన్, ఫ్రాంచైజ్, బెట్టింగ్, మిలియన్ యూనిట్లు, మిస్ ఇండియా, మిస్ బ్యూటిఫుల్ స్మైల్, మిస్ వరల్డ్, మిస్ సోషల్ మీడియా, మిస్టర్ క్లీన్, మెగావాట్లు, మేకప్, మైనార్టీ, మోటర్ సైకిల్, మోడలింగ్, రీయింబర్స్మెంట్, వాచ్మేన్, వాట్సాప్, వార్మర్, వాషింగ్ మెషీన్, వీడియో క్లిప్, వెంటిలేటర్, వెబ్ బ్రౌజర్, వెబ్సైట్లు, షూటింగ్, షెడ్యూల్, సర్క్యులర్, సర్క్యులేట్, సర్టిఫికెట్లు, సస్పెండ్, సూపరింటెండెంట్, హౌసింగ్, హౌసింగ్ సొసైటీ.

## సంక్షిప్త అక్షరాల రూపాలు

దీర్ఘ పదబంధాలను, సమాసాలను పదేపదే వాడాల్సినపుడు వాటిని సంపూర్ణంగా కాకుండా, ఆయా పదాల ప్రథమాక్షరాల సమాహారంతో రాయడాన్ని, ఆ పదాల ప్రథమాక్షరాలను కలిపి పదంగా రాయడాన్ని సంక్షిప్తరూపాలు అని అంటారు. అలాంటి వాటిని పత్రికల్లో వాడటం కనిపిస్తుంది. ఉదాహరణకు కొన్ని చూద్దాం.

ఆర్వోసీ, ఈఎమ్ఐ. ఈఎన్టీ, ఎంబీబీఎస్, ఎమ్మెల్సీ, ఎస్ఎంఎస్, ఎస్మెమ్మెస్, ఐపీఎల్, బీసీసీఐ, ఎసెచ్ఛీ, ఈపీఎఫ్ఓ, సీఎం, ఓఎస్డీ, జీఎస్టీ, పీఎస్

## సంక్షిప్త రూపాలు, సమాసాలు

మెట్రో పాలిటన్ సెషన్స్, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్(ఆర్వోస్), పాన్ సంఖ్య(నెంబరు), మొబైల్ మెసేజింగ్ అప్లికేషన్, ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్డీ), జార్జియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మానవ రహిత లోహ విహంగాలు (యూఏవీ), సరిహద్దు భద్రతా దళం(ఐటీబీపీ), రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్), అస్సామ్ స్టూడెంట్స్ యూనియన్ (ఆసు), జనాభా లెక్కల ప్రాతిపదికన జాతీయ పౌర జాబితా (ఎన్ఆర్సీ), బి కాంప్లెక్స్ విటమిన్లు, బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్), యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, రాష్ట్ర పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), రివల్యూ

షనరీ డెమొక్రటిక్ ఫ్రంట్(ఆర్.డి.ఎఫ్), వాగ్దానపత్రాలు(అఫిడవిట్లు), విండ్ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్.

## పదబంధాలు

పత్రికల్లో ఆదానాలుగా చేరిన రూపాలలో ఎక్కువగా సమాసాలతో కూడిన పదబంధాలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు

ఇంజిన్ చెక్ వార్నింగ్, ఇంటీరియల్ డెకరేషన్, ఈవెంట్ మేనేజ్మెంట్, ఓపెన్ స్కూల్, టౌన్హాల్, డిజిటల్ ఇండియా, ప్రైవేటు ప్రాక్టీసు, మిర్చీ మ్యూజిక్, మిర్రర్ బాల్, మిలియన్ యూనిట్లు, మిస్ ఇండియా, వీడియో కాన్ఫరెన్స్, సెంట్రల్ ల్యాకింగ్,సైక్లింగ్ క్లబ్, స్క్రీన్షెట్ట్ వీడియో కాన్ఫరెన్స్,

## రెండు కంటె ఎక్కువ కలిగిన పదబంధాలు:

అవుటర్ రింగ్ రోడ్డు, డ్రామా స్టూడియో, ప్రీమియం కార్లు, మిస్ బ్యూటిఫుల్ స్మైల్, మిస్ సోషల్ మీడియా, రిటైల్ లోన్ రేట్స్

హ్రస్వాచ్చుగల పదాల తుది వర్ణానికి దిత్వోత్వాలు వస్తాయి:

ఉదా: అరెస్ట్-అరెస్టు, ట్రక్-ట్రక్కు, బస్-బస్సు, నర్స్-నర్సు, సిఫార్స్-సిఫార్సు

పదాది దీర్ఘాచ్చుగల పదాల తుది వర్ణానికి కొన్ని సందర్భాల్లో ద్విత్వోత్వాలు వస్తాయి.

ఉదా: కేన్సర్-కేన్సరు, బోర్డ్-బోర్డు

ఇంగ్లీషు స్పెల్లింగ్ ప్రభావంతో ద్విత్వహల్లులు రాయటం

ట్విట్టర్, బిడ్డింగ్

## బహువచనరూపాలు

ఇన్నింగ్స్, క్లియరెన్స్, ప్లాంట్లు, ప్యాకెట్లు, ఫైర్ఫాక్స్, మెగావాట్లు, యూనిట్లు, రేస్ కార్లు, లైన్మన్లు, స్టోర్స్ ఉర్దూపదాలు ఆదాలుగా చేరిన రూపాలు

తెలుగు దినపత్రికల్లో చేరిన ఆదానాల్లో ఉర్దూ పదాలు కూడా ఎక్కువగా చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు కొన్ని ఉర్దూ పదాలను చూద్దాం. వీటికి తెలుగు

మూలరూపాలను కూడా తెలుగు వ్యుత్పత్తికోశం నుండి తీసుకుని ఇవ్వటం జరిగింది.

తహసిల్దార్, దావఖాన, దస్త్రాలు, ఫిర్యాదు, దాఖలు, దఫా, దస్తావేజు మొదలైనవి

పై విధంగా తెలుగు భాషలో ఆదానం విస్తృతపరిధిని సంతరించుకున్నదని చెప్పచ్చు. భాష నదీ ప్రవాహం లాంటిది. అందువల్ల భాషలో కూడా చాలా పదాలు వస్తుంటాయి, అయితే కొన్ని మరుగున పడిపోతాయి. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ. ఒక కథలో అయినా, నవలలో అయినా లేదా మరే ఇతర ప్రక్రియలో అయినా భాష కీలకపాత్ర పోషిస్తుంది. ఆయా రచనలోని భాషను బట్టి రచయిత, ప్రాంతం, కాలం, భౌగోళిక నేపథ్యం, మొదలైన విషయాలన్నింటిని తెలుసుకోవచ్చు. తెలుగులో ఎన్నో పదాలు ఉన్నప్పటికీ వాటిని వాడటం కనిపించదు. ఉదాహరణకు తాంత్రిక విశ్వవిద్యాలయం (Engineering College), తుషార యంత్రం (Spray), సద్దిపెట్టె (Refrigerator), దాది (Nurse), చరవాణి (Cell Phone), సీసలేఖిని (Pencil), పుట (Page), పీట (Chair), శబ్దగ్రాహకులు (Listeners) మొదలైనవి.

ఆదానపదాలను ప్రయోగించి కథను రాసిన రచయితను ఆధునిక కాలానికి చెందినవాడని గుర్తించవచ్చు. ఎందుకంటే 'ఆదానం' ఆధునిక కాలంలో, అందునా రెండు దశాబ్దాల నుండి అనువాదాల కారణంగా కూడా బాగా పెరిగింది. తెలుగులో నూతనంగా చేరుతున్న ఆదానరూపాలను ఆయా రచనల్లో, ప్రక్రియల్లో రచయితలు వాడి, వాటికి ప్రచారాన్ని, వ్యాప్తిని పెంచాల్సి ఉంది.

కాబట్టి ఆదానం తెలుగు ఆధునిక సాహిత్య ప్రక్రియల ద్వారా ప్రజలను అనునిత్యం ప్రభావితం చేసి, ఆకట్టుకునే పత్రికల్లో ఆదానపదాలను విస్తృత పరచుకోవాల్సిన అవసరం ఉంది. దానితోపాటుగా తెలుగులో ఆ పదాలకు తగిన రూపాలను కూడా ఎంపిక చేసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. ఈ విషయాన్ని గుర్తించి ప్రతి కవి, రచయిత, అనువాదకులు, ముఖ్యంగా వార్తాపత్రికలు, మొదలైన వారంతా దీనికోసం కృషి చేయాల్సి ఉంది.

## ఉపయుక్తగ్రంథసూచి

1. కృష్ణమూర్తి, భద్రిరాజు(సం.). 2004. తెలుగుభాషాచరిత్ర. హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

2. చక్రధరరావు, లకంసాని. 1978. తెలుగు వ్యుత్పత్తి కోశం(ఎనిమిది సంపుటాలు). విశాఖపట్టణం: ఆంధ్ర విశ్వకళాపరిషత్తు.

3. బ్రౌన్, సి.పి. 1983. బ్రౌణ్య ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు. హైదరాబాదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

4. సుబ్రహ్మణ్యం, పి.యస్. 1997. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

5. స్వరాజ్యలక్ష్మి, వి. భద్రిరాజు కృష్ణమూర్తి(సం.) తెలుగు భాషా చరిత్ర. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

6. Bloomfield, L. Language. Newyork: Holt, 1933.

7. ఈనాడు దినపత్రిక.

వ్యాసకర్త - **తెలుగు అధ్యాపకురాలు**

# తెలుగు పత్రికలు - ఇటీవలి భాషా స్వరూపం

- డా॥ వి. వీరాచారి

"ఈ పత్రికా ప్రకటనము నందు నా యుద్దేశములు భాషాభివృద్ధియు, దేశాభివృద్ధియు ముఖ్యముగా రెండు. నేనేర్పఱుచుకొన్న భాషాభివృద్ధి మార్గము తెలుగు భాషలో మృదువైన సులభశైలిని, సులక్షణమైన వచన రచన చేయుట. దేశాభివృద్ధి మార్గము జనులలో గల దురాచార దుర్వర్తనములు బాపియు –" అంటూ కందుకూరి వీరేశలింగం పంతులు గారు 1874లో వివేకవర్ధని మాసపత్రికను వెలువరిస్తూ ప్రారంభ సంచికకు రాశారు. పంతులు గారు తన పత్రికా లక్ష్యాన్ని గురించి చెప్పినా, నాటి, నేటి, ఏనాటి పత్రికలైనా అనుసరించాల్సిన విలువలు ఇవి. ఈనాడు తెలుగులో ప్రచురింపబడుతున్న పత్రికల యాజమాన్యాలు, సంపాదకులు ఈ విలువలను ఎంత మేరకు పాటిస్తున్నారో ఎవరికి వారు గుండెమీద చెయ్యి వేసుకొని ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉంది. కానీ ఈరోజు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పత్రికల్లో చాలా పత్రికలు ఈ విలువలను పాటించటం లేదన్నది జగమెరిగిన సత్యం.

కందుకూరి వీరేశలింగం పంతులు గారు తన పత్రికా లక్ష్యాలను గురించి చెప్పిన రెండు విషయాల్లో ప్రస్తుత సందర్భం దృష్ట్యా పరిశీలించినపుడు "భాషాభివృద్ధి" అనే మాట ఈ వ్యాస పరిధిలోనికి వస్తుంది. అంటే ఏ ప్రాంతపు భాషాపత్రికలైనా,

అవి ఆ ప్రాంతపు భాషాభివృద్ధికి కృషి చేయాలన్నదే ఆయన అభిప్రాయం. అసలు భాషాభివృద్ధి అంటే ఏమిటి? అది ఎలా జరుగుతుంది అన్న విషయాలు ముందుగా మనకు తెలిసినపుడు ఆ దిశగా కృషి చేయడానికి అవకాశం ఉంటుంది. అంటే ఏ భాషకైనా ఒక ప్రత్యేక స్వరూపం, స్వభావం ఉంటాయన్న మాట. అవే యాస - ద్యాస. ఈ దృష్ట్యానే ఆచార్య సి.నారాయణరెడ్డి "తెలుగుజాతి మనది" అన్న పాటలో వచ్చిండన్నా, వచ్చాడన్న వరాల తెలుగు ఒకటేరన్న అన్నారు. నిజానికి ఈ పదాల్లో యాసలో తేడా తప్ప ద్యాసలో ఏ మార్పులేదు. అంటే ఆ క్రియాపదం ద్వారా మనం ఏమి చెప్పదలచుకున్నామో అది అర్థమవుతుంది. అలాంటప్పుడు ఫలానా పదం గౌరవ ప్రదమైనటువంటిది. ఫలానా పదం నీచమైంది అన్న భేదాలు ఎందుకొస్తున్నయన్నదే ఇక్కడ సందేహం. ప్రాంతీయ దురభిమానం వల్ల, ఆర్థిక - రాజకీయ పరమైన స్థితిగతుల వల్లా ఈ తేడాలొస్తున్నాయన్నది సమాధానం.

ప్రపంచంలో ఏ భాషైనా, భావాలను వ్యక్తీకరించడానికి ఉపయోగపడే ఒక సాధనం అన్న వాస్తవాన్ని మనం గుర్తించాలి. అంతే కాదు భావ వినిమయం దాని ప్రాథమిక లక్షణం. ఈ విషయాలను పక్కకు పెట్టి భాషను అమూర్త బ్రహ్మపదార్థంగా భావించడం గానీ, ఏదో ఒక భాషపట్ల దురభిమానాన్ని ప్రకటించడం కానీ, అయ్యో కాలం మారిపోయింది భాష సంకరమైపోతుందని బెంబేలు పడిపోవడం కానీ సరైంది కాదు.

'భాషను' ఒక పంజరంలో బంధించడం కూడా సరికాదు. ప్రజల వాడుక అనేది దాని జీవశక్తిని నిర్ణయిస్తుంది. ప్రవాహమే దాని లక్షణం. కాబట్టి భారతీయులు భాషను సరస్వతిగా భావించారు. గ్రాంథిక భాషావాదులు తెలుగు భాషాప్రవాహానికి అడ్డకట్టలు వేస్తున్నప్పుడు గిడుగు రామమూర్తి పంతులు అన్న మాటలను భాషా ప్రేమికులు మరచిపోరాదు:

"నాసికాత్రయంబకం దగ్గర గోదావరి ప్రవాహం ఒక పిల్ల కాలువలా ఉంటుంది. అదే గోదావరి అనేక వాగులను, వంకలను ఉపనదులను కలుపుకుంటూ, తన ప్రవాహ వేగాన్ని పరిధిని విస్తరించుకుంటూ, రాజమండ్రి దగ్గరకు వచ్చేసరికి ఒక చిన్నపాటి సముద్రంలా మారిపోతుంది. భాష కూడా అంతే". ఏ రచయిత అయినా భావాలను కానీ, పదాలను కానీ సమాజం నుండి తీసుకొని సమాజానికే

అందిస్తాడు. సమాచార వ్యవస్థ అంటే ఇదే. దాని స్వరూపంలో భేదం ఉండవచ్చు. స్వభావం మాత్రం ఒక్కటే. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా మన అభిప్రాయాలను, భావాలను, పదాలను బలవంతంగా సమాజంపై రుద్దడం అనేది సమాచార వ్యవస్థ స్వరూపానికి, స్వభావానికి విరుద్ధమైన ప్రక్రియ. ఈ విషయాన్ని కెవి రెడ్డి మాయాబజార్ చిత్రంలో అద్భుతంగానూ, ఆలోచనాత్మకంగానూ ఒక సన్నివేశంలో చిత్రించారు.

రమణారెడ్డి ఘటోత్కచుని రాజ్యంలో రాక్షస బాలలకు చదువు చెప్పే గురువు. రాజు ఆజ్ఞ మేరకు పాండవులు ఎవరు? కౌరవులు ఎవరు? అనే విషయాన్ని ఆయన ఆ విద్యార్థులకు చెప్పాలి. కాబట్టి అస్మదీయులు తస్మదీయులు అనే పదాలను వల్లె వేయిస్తుంటాడు. ఎంత చెప్పినా, కొట్టినా వారికి ఆ పదాలను అనడానికి నోరు తిరగక అసమదీయులు, తసమదీయులు అంటుంటారు. ఈ లోగా ఘటోత్కచుడు వచ్చి మన బాలల చదువు ఎలా సాగుతుందని సంతోషంగా గురువు గారిని అడుగుతాడు. అప్పుడు రమణారెడ్డి , "ఏమి చెప్పను ప్రభూ ఎంత చెప్పినా, కొట్టినా వీరు అస్మదీయులు పదాన్ని అసమదీయులని, తస్మదీయులు పదాన్ని తసమదీయులు అంటున్నారని వాపోతాడు. యస్వీ రంగారావు (ఘటోత్కచుని పాత్రధారి) ఇంకా సంతోషాన్ని వ్యక్తం చేస్తు ప్రజలు మాట్లాడిందే భాష, వెయ్యి వీరికి వీరతాడు అంటాడు. ఈ సన్నివేశాన్ని రాసింది పింగళి నాగేంద్రరావు. అంటే ఈ సినిమా మాటల పాటల రచయిత. తీసింది కదరి వెంకటరెడ్డి (కె.వి.రెడ్డి) అంటే ఈ సినిమా దర్శకుడు. భాషపట్ల, సమాజం పట్ల, కళల పట్ల ఆనాటి తరానికి ఉండే ప్రేమ, నిబద్ధత అది.

ఈ క్రమ శిక్షణ ఈ తరం వారిలో లోపించడం మూలంగా కర్ణుని చావుకు సవాలక్ష కారణాలు ఉన్నట్లే తెలుగు భాష జీవలక్షణాన్ని కోల్పోవడానికి అనేక కారణాలున్నాయి. ఈ కారణాలన్నింటిని చెప్పడం సాధ్యం కాదు. కానీ ప్రధానంగా మూడంశాలను మీ దృష్టికి తెస్తాను. మొదటి అంశం మనలోని అలసత్వం - నిర్లక్ష్యం. రెండవది మనలో చిత్తశుద్ధి, భాష పట్ల అవ్యాజమైన ప్రేమలేకపోవడం. ఇక మూడో అంశం పరభాష పట్ల విపరీతమైన వ్యామోహం. తల్లిపాలు తల్లిపాలే, పోత పాలు పోతపాలే అన్న వాస్తవాన్ని విస్మరించి 'డాలర్' వ్యామోహంలో ఇంగ్లీషు భాషపట్ల విపరీతమైన ప్రేమను పెంచుకుంటున్నాం.

ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా మనం గమనించాలి. ఈ పాపమంతా పత్రికలదే అంటే అది తప్పు. ప్రాథమిక విద్యా బోధనలోనే దీని పునాదులన్నాయి. పునాదులు గట్టివైతే కదా ! భాష ప్రామాణికంగానూ, భావనలు స్థిరంగానూ ఉండేవి. ఈనాడు దేనికి నియమనిబంధన, నియంత్రణలు లేవు. అంతా ప్రపంచీకరణ ప్రవాహంలో కొట్టుకపోతున్నాం. అంతా స్వేచ్ఛయే. ఎవరు ఎలాగైన మాట్లాడవచ్చు. ప్రైవేట్ రేడియో – టివి ఛానళ్ల వ్యాఖ్యాతల్లాగా! రాయవచ్చు నేటి పత్రికల్లో లాగా ! ఇందులో నాదగుణం – అర్థ గుణంతో కూడిన ఒక కళాత్మకత దాగి ఉందన్న దృష్టి ఎవ్వరిలో లేదు. కాబట్టి భాషాప్రయోగంలో ఈనాడు నైపుణ్యాలు కొరవడుతున్నాయి. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అన్నట్లు "నూతన వస్తుకల్పన జరిగినపుడు నూతన భావ కల్పన జరుగుతుంది. కొత్త వస్తువులను తెలిపే మాటలతో బాటూ, కొత్త భావాలను, తెలిపే మాటలు కూడా భాషలో ప్రవేశిస్తాయన్న" చారిత్రక వాస్తవాన్ని కొందరు భాషా శాస్త్రవేత్తలు విస్మరిస్తున్నారు.

ఇకపోతే ఈనాడు ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి దాక విద్యా ప్రమాణాలు పడిపోయాయి. ఒకప్పుడు "పెద్దబాలశిక్ష" చదివితే చాలు భాషపట్ల పట్టు, సమాజం పట్ల అవగాహన ఉండేవి. ఈనాడు పీజీలు చదివినా, పిహెచ్.డి.లు చేసినా విద్యార్థులు తెలుగులో ఒక్క వాక్యాన్ని అర్థవంతంగా రాయలేకపోతున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో చదువుతున్న యం.ఏ. తెలుగు విద్యార్థి 'సంప్రదాయ కవిత్వం' పేపర్‌లోని ఒక ప్రశ్నకు రాసిన సమాధానం చూడండి.

"ధర్మరాజు పాండవులకు పెద్దవాడు. నన్నయ్య భట్టారకుడు ఈ యొక్క పాత్రను నాటకీయంగా రాశాడు. నన్నయ్య శక్తి సామర్థ్యాల విలువలు అతని విలువలు చాలా రకాలుగా అన్ని చోట్ల విలువలు ఎక్కించిన మహోఘనమూర్తి ఈయన అద్భుత రీతిలో ఆకట్టుకున్న అద్భుతమైన మహ వ్యక్తిగా ఉన్నత శక్తిగా మవా విదాలుగా అద్భుత రీతిలో చాలా కాలముగా చాలా విదాలుగా అన్ని శక్తులతో అన్ని రకాలుగా ఎన్నొ విలువలు బీమ ప్రతిజ్ఞలో నన్నయ అద్భుతంగా ..." ఇలా ఒక విద్యార్థి రెండు పేజీల సమాధానం రాశాడు. ఇందులో ఫుల్‌స్టాపులు, కామాలు, వాక్యాలు, వ్యాకరణ విషయాలు, ఇలా భాష నిర్మాణంలో ఎన్ని అంశాలు ఉంటాయో అన్నింటిని గాలికి వదిలేశాడు. ఇక పదప్రయోగాల తమాషా చూస్తే తల దిమ్మదిరిగిపోతూ

మూరసూరున్ని (మురాసురున్ని) స్త్రీమూర్తురాలు (స్త్రీమూర్తి) పంచపుత్రిక (పంచభర్తృక). ఇక వాక్యం – ఆమె యొక్క వివస్త్రను విప్పలేక పోయాడు – ఇలా ఎన్ని ఉదాహరణలైన చూపవచ్చు.

ఇక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థను గురించి భారతదేశ మొదటి, చివరి గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి (రాజాజి) అన్న మాటలను గుర్తు చేయదలచుకున్నాను. "పిండి బాగున్నప్పుడు రొట్టె బాగుంటుంది. ప్రజలు వివేకవంతులు అయినప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థ ఆరోగ్యవంతంగా ఉంటుంది." ఈ మాటలు పత్రికలకు కూడా వర్తిస్తాయి. విశ్వవిద్యాలయాల నుండి వచ్చే విద్యావంతులు చక్కటి భాషా పరిజ్ఞానం, సామాజిక అవగాహన, స్పృహ ఉన్నప్పుడే పత్రికా రచన ఆరోగ్యవంతంగా ఉంటుంది. ఈ విషయాన్ని విస్మరించి పత్రికా రచనలో భాషా స్వరూపాన్ని, విలువలను గురించి ఆలోచించడం, ఆరోగ్యవంతమైన జర్నలిజాన్ని ఆశించడం కష్టమే. ఈనాటి విద్యావిధానంపై, విద్యావంతుల సామర్థ్యంపై విశ్వాసం లేకనే ప్రతి ప్రతిక వాటికి వున్న వనరుల పరిధిలో జర్నలిజం స్కూల్స్ పెట్టుకొని ప్రత్యేక శిక్షణను ఇచ్చి పత్రికా రచయితలను తయారు చేసుకుంటున్నాయి. అయినా అనుకున్నంత ప్రమాణాలు కనబడటం లేదు. మచ్చుకు స్థలకాలాల పరిధిలో కొన్ని పత్రికల్లోని భాషా స్వరూపాన్ని తెలియజేయడానికి ప్రయత్నిస్తాను.

ఆంధ్రభూమి పత్రికలో 2 నవంబర్ 2016న సాహితి పేజిలో 'పద్యం తెలుగు భాషకు జీవం" అనే వ్యాసం వచ్చింది. ఇందులో మొదటి కాలమ్ పదకొండవ పంక్తిలో "శిష్టమైన పదజాలం మాయంగా వచ్చింది" అనే వాక్యం ఉంది. మాయంగా అంటే ఏమిటో తెలియదు. అది మయంగా కావచ్చు. ఇది పదదోషం. ప్రూఫ్‌రీడర్స్‌కు గానీ, సహాయ సంపాదకులకు గానీ సరైన భాషా పరిజ్ఞానం లేకపోవడం మూలంగా ఇలాంటి దోషాలు జరుగుతుంటాయి.

ఇక వాక్య నిర్మాణాలను గురించి పరిశీలిద్దాం. ఇదే కాలంలో చివరి పేరా మొదట "ఆ రోజులలో కవులింకా పద్యాలు వ్రాసేవారు" అనే వాక్యం ఉంది. ఈ వాక్యంలోని "కవులింకా" మాట బదులు కవులంతా అంటే భావం పొసగుతుంది. ఎందుకంటే భాషలో భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాలుంటాయి. ఈ వాక్యంలో మొదటి చివరి రెండు పదాలు భూతకాలాన్ని సూచిస్తున్నాయి. 'కవులింకా' అనే

మాట ఆ పదాల మధ్య ఇమడ లేదు. అలాగే ఇందులోనే మరో వాక్యం నాల్గో కాలంలో ఉంది. "రాను రాను కొన్ని ప్రౌఢపద్యాలు (తాత్పర్యార్థములు) గూడా చేర్చాలి. ఇవి గాక నేటి కవుల రచనలు కూడా కొన్ని ప్రచురించాలి". ఈ వాక్యంలో కుండలీకరణంలో ఇచ్చిన తాత్పర్యార్థములు అనే పదానికి బదులు అర్థ తాత్పర్యం అంటే సమాసపదం సౌలభ్యంగా ఉంటుంది. "నేటి కవుల రచనలు" అనే దగ్గర పాఠకునికి ఏ రచనలు అనే సందేహం కలుగుతుంది. నేటి కవుల పద్యాలు అంటే అర్థవంతంగా ఉంటుంది.

వరంగల్లు నుండి 'ప్రసారిక' అనే మాసపత్రిక వెలువడుతుంది. 2016 జూన్ సంచికలోని సంపాదకీయ వాక్యాలను ఒక్కసారి పరిశీలిద్దాం. "సమాజానికి కవులు – కవులకు సమాజం కావాలి. సమాజంలోని రుగ్మతలు సమాజానికి పనికి వచ్చే మంచి మార్గాలను, ప్రకృతి పరమైన ప్రతి అంశము పరిపాలనా దక్షత, విధాన విషయాలు, సంస్కరణలు – కవులు రచయితలు వారి వారి సాహిత్య, అక్షరాలపైన అనేక అంశాలను వ్యక్తీకరించి సమాజానికి మేలు చేస్తూ ....' అంటూ చిన్నయ సూరి వచన రచనకు మించిన సుదీర్ఘ వాక్యాలు ఇందులో చోటు చేసుకున్నాయి. ఇంతకు ముందు తెలుగు యం.ఏ. చేసిన విద్యార్థి రాసిన సమాధానం లాగే ఈ సంపాదకీయం ఉంది.

అలాగే జులై 2016 సంచికలోని సంపాదకీయంలో "పరిస్థితులకు రాజీ పడలేరు, పోనీ మనకెందుకు అనుకోలేరు, అన్యాయాలను సహిస్తూ ఇది కాకతీయ వారసులైన ఓరుగల్లు వాసులకు ప్రత్యేకత". ఈ వాక్యంలో ఓరుగల్లు వాసులకు అనే పదంలో "కు" అనే విభక్తి పానకంలో పుడకలా ఉందనిపిస్తుంది. "ఓరుగల్లు వాసుల" అంటే సరిపోతుంది. మహా మహాకవులే వ్యర్థపదాలను ఎన్నింటినో తమ తమ పద్యాల్లో ప్రయోగించారని తాపీ ధర్మారావు ఏకంగా ఒక వ్యాసమే రాశారు. మనమెంత అని సరిపెట్టుకోకుండా "ఎకానమీ ఆఫ్ వర్డ్సు" ఉండాలన్న చలం మాటలను ఈ సందర్భంగా మనం గుర్తుంచుకోవాలి. నిజానికి సంపాదకీయాలు సూటిగా స్పష్టంగా సరళభాషలో ఉండాలి. ఎందుకంటే అది ఆ పత్రిక గుండెకాయ. కానీ ఈ సంపాదకీయంలోని వాక్యాలు ఉత్కంఠతతో సృజనాత్మక సాహిత్యాన్ని మరిపింప చేస్తున్నాయి. రారా (రాచమల్లు రామచంద్రారెడ్డి) 'అనువాద సమస్యలు'

అనే పుస్తకంలో సంపాదకీయాల్లో ఎబికె ప్రసాద్, కవిత్వ విషయంలో శ్రీశ్రీని, ప్రముఖ చిత్రకారుడు బాపును వదలలేదు. "ఆర్య వ్యవహారంబు దుష్టంబు గ్రాహ్యంబు" అనే చిన్నయసూరి వ్యాకరణ సూత్రానికి రారా పట్టుబడరు. పెద్దవారైనా, చిన్నవారైనా, ఎవరు తప్పు చేసినా తప్పే అన్నది రారా సిద్ధాంతం.

పత్రికా రచయితలు నడుస్తున్న నిఘంటువుల్లా ఉన్నప్పుడే పద–అర్థ–వాక్య దోషాలను పసిగట్టగలుగుతారు. ఈ మాత్రం సరిపోతుందా అంటే సరిపోదు. వాళ్లు ఏ ప్రాంతంలో పని చేస్తున్నారో, ఏ పత్రికలో (చిన్న పత్రికలు, ప్రాంతీయ – జాతీయ పత్రికలు) పని చేస్తున్నారో అన్న దాన్ని బట్టి చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, రాజకీయ అంశాలు సమగ్రంగా తెలుసుకొని ఉండాలి. ఇంతకు ముందు ప్రస్తావించిన "ధిక్కారానికి నెలవు – ఓరుగల్లు" ప్రసారిక సంపాదకీయంలోనే "బమ్మెర పోతన స్వయంగా హాలికుడై, రాజాశ్రయాలు – అడంబరాలు ఎదురొచ్చినా కొనగోటితో నెట్టి "రాజుల్ మత్తులు" అనగలిగిన ధీశాలి" అని రాశారు. "రాజుల్ మత్తులు వారి సేవ నరక ప్రాయంబు" అన్నది పోతన కాదు ధూర్జటి. మూడు పేరాల సంపాదకీయంలో వాక్యాలకు వాక్యాలే తప్పులుండటమే కాకుండా "పూర్వంలో", "నిరంకుశత్వానికి కలంతో" వంటి పదాలు కూడా ఉన్నాయి. "పూర్వంలో" అనే పదం వాక్యాల్లో ఇమడదు 'పూర్వం' లేదా 'పూర్వకాలం' అనైనా ఉండాలి. అలాగే నిరంకుశత్వానికి కాలంతో అనే రెండు పదబంధాల్లో రెండు పదాల మధ్య వున్న షష్ఠి విభక్తి "కి" ఇమడదు.

2 నవంబర్ 2015 సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక సాహిత్య పేజి "వివిధ"లో వచ్చిన "కుడల సంగమ దేవసాక్షిగా" అనే వ్యాసాన్ని పరిశీలించినప్పుడు కొన్ని తప్పులు నా దృష్టికి వచ్చాయి. మొదటి కాలం, రెండవ పేరాలోని రెండవ పంక్తిలో క్రీ.శ. 850లో ప్రచురితమైన "కవి మహారాజమార్గ అనే రచనపై ..." అని ఉంది. ఈ వాక్యంలో "ప్రచురితమైన" అనే పదం ఉంది. ప్రచురణ అనగానే మనకు గుర్తుకు వచ్చేది ప్రింటింగ్ మిషన్. మరి అప్పుడు ప్రింటింగ్ మిషన్ ఉందా అన్న సందేహం కలుగుతుంది. అక్కడ ప్రచురితమైన పదానికి బదులు రచింపబడిన అనే మాట ఉంటే సరిపోతుంది.

అలాగే అదే పేరాలోని వాక్యం "బీజాపూర్ ఆదిల్‌షా పేషీలో పనిచేసిన వ్యక్తి పర్షియన్ భాషలో రాసిన ఏడు సంపుటాల గ్రంథాన్ని కన్నడంలోని తర్జుమా చేయించి మధ్య యుగాలనాటి చరిత్ర అందుబాటులోకి తీసుకొని వచ్చారు" అని ఉంది. ఏడు సంపుటాల గ్రంథాన్ని" అనే పద బంధంలో ఏడు సంపుటాలు అనేది సంఖ్య వాచకం. అది బహువచనంలో ఉంది. గ్రంథం ఏకవచనంలో ఉంది. ఇది సరికాదు. "ఏడు సంపుటాల్లో గ్రంథాలను" అంటే సరిపోతుంది. అలాగే కన్నడంలోని అనే పదానికి తర్జుమా అనే పదానికి మధ్య "కి" అనే విభక్తి ప్రత్యయం ఉన్నప్పుడే అది అర్థవంతమవుతుంది. "చరిత్ర" అందుబాటు పదాల మధ్య కూడా 'ను' ప్రత్యయం లోపించింది.

2015 డిసెంబర్ 7వ తేది సోమవారం నాటి 'నమస్తేతెలంగాణ' జిందగి పేజిలో "పొగ రహిత గ్రామం" అనే శీర్షికతో ఒక వార్త వచ్చింది. "కట్టెల పొయ్యిలను వినియోగం లేకుండా" అనే వాక్యం ఆ వార్తలో ఉంది. ఇక్కడ ద్వితీయ విభక్తి ప్రత్యయం "ను" అవసరం లేదు. ఒక వేళ ఆ ప్రత్యయాన్ని అలాగే ఉంచితే "వినియోగం లేకుండా" అనే పదాన్ని "వినియోగించకుండా" అని రాయాలి. ఈ వార్తలోనే మరో వాక్యం "గ్యాసు సిలండర్ల వాడకం వల్ల ఈ గ్రామ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారట" అని ఉంది. ఇందులో గ్రామ ప్రజలు అని రాస్తేనే ఆ వాక్యం అర్థవంతంగా ఉంటుంది. ఇదే పేజీలో "లైంగిక వేధింపుల నేపథ్యంలో" అనే శీర్షికతో ఒక వార్త ఉంది. వేదన అంటే దుఃఖం, బాధ అనే అర్థాలున్నాయి. వేదన నుండే వేదింపు అనే క్రియా పదం పుడుతుంది. ఇక్కడ వేదన నామవాచకం, వేదింపు క్రియాపదం. ఒక భాషా భాగం నుండి మరొక భాషా విభాగం ఏర్పడే విధానాన్ని 'నిష్పన్న రూపాలు' అంటారు. వేధింపు అంటే 'గుచ్చుట' అని నిఘంటువు అర్థం ఉంది. ఇందులోనే 'ఇండియా మొదటి సంఖ్యలో ఉంది' అనే వాక్యం ఉంది. నాకు తెలిసి 'మొదటి స్థానం' అనే పదం వ్యవహారంలో ఉంది.

ఈ మధ్యనే వెలువడిన 'మన తెలంగాణ' పత్రికలో కూడా ముద్రారాక్షసాలు అధికంగానే ఉంటున్నాయి. ఈ పత్రికలో ఒక వ్యాసంలో 'రజాకారు ఉద్యమం' అనే పదాన్ని ప్రయోగించారు. తెలంగాణ ప్రాంతంలో రజాకారులవి మతోన్మాద

అరాచక చర్యలు తప్ప ఉద్యమం కాదు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అనేది ఉద్యమంగా సాగింది. ఇది చారిత్రక సత్యం. చారిత్రక అవగాహన లోపం వల్ల ఇలాంటి తప్పిదాలు జరుగుతుంటాయి. అలాగే ఇదే పత్రికలో 2015 ఆగష్టు 17న వెలువడిన 'కలం' సాహిత్య పేజిలో 'రాజ్యాంగ శిల్పి' రూపకం మీద ఒక సమీక్ష ఉంది. ఈ సమీక్షకుడు అంబేద్కర్‌ను గురించి రాస్తూ రెండవ పేరా మూడవ పంక్తిలో "వారి జీవితం భారత దేశంలో ఒక చారిత్రక చీకటి మహేతిహాసం" అన్న వాక్యం రాశాడు. ఈ వాక్యం సాధారణ పాఠకులకు అర్థం అవుతుందా? దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అనే సందేహాలు కలుగుతాయి. అలాగే చివరి పేరాలో "రాజ్యాంగ శిల్పి పుస్తకం చిన్నదైన, చిన్నారి విద్యార్థుల మస్తకాల్లో, ఎప్పుడూ పదిలంగా ఉండగలిగే పొత్తమిది" అన్న వాక్యం ఉంది. ఇందులో 'మస్తకాల్లో' అనే పదం అర్థమేంటో ! బహుశ మస్తిష్కాల్లో కావచ్చు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఒక పరిశోధన గ్రంథం అవుతుంది. ఈ వ్యాసం కోసం కేవలం దిన పత్రికలను మాత్రమే పరిశీలించడం జరిగింది. అయినా ఇది విహంగ వీక్షణమే కానీ సమగ్ర అధ్యయనం కాదు.

వ్యాసకర్త - **తెలుగు ఆచార్యులు**

# పత్రికాభాష - కాలానుగుణ మార్పులు

- పి.గోపినాథ్ రాథోడ్

భాష జీవనది లాంటిది. నిరంతరం ప్రవాహంలా కొనసాగుతుంది. భాష నిరంతరం - నిత్యం మార్పుకు లోనవుతుంది. కాని దాని ప్రవాహం మాత్రం ఆగదు. ఎప్పుడు కొనసాగుతూనే ఉంటుంది. అలాగే పత్రికా భాష కూడా ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన శైలిని మార్చుకుంటుంది. ప్రజల ఆచార వ్యవహారాల్లో, సంప్రదాయాల్లో కాలానుగుణంగా మార్పులు సంభవిస్తూనే ఉంటాయి. భాషలో వచ్చిన, వస్తున్న మార్పులు ప్రమాణభేదాల్లో ప్రతిఫలిస్తుంటాయి. ఈ మార్పులనే పరిణామం అంటారు. శబ్దాల రూపాల్లో, అర్థాల్లో, పదబంధాల్లో, చివరకు వాక్యరచన పద్ధతిలో కూడా మార్పులు సహజం. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తరువాత ప్రజాస్వామ్యం వివిధ దశలలో సాధించిన అభివృద్ధిలో పత్రికలు పాలుపంచుకున్నాయి.

మార్పుకు అనేక కారణాలు. విభిన్న సమయాలలో సమాజం ఆదర్శాలు, ఆశయాలు మారుతూ ఉంటాయి. విద్యావిధానంలో ఆర్థిక స్థితిగతుల్లో, సాధన సంపత్తిలో, దృక్పథాల్లో, శక్తి సామర్థ్యాల్లో ఇలాంటి అనేక కారణాల వల్ల మార్పు వస్తూనే ఉంటుంది.

పత్రికా భాషలో వచ్చిన మార్పులను కాలానుగుణంగా పరిశీలించినప్పుడు పరిణామ క్రమంలో దశలను కొంతవరకు గుర్తించడానికి అవకాశముంటుంది. తెలుగు భాషా సమాజం అనేక రంగాలలో విభిన్నమైన లక్షణాలను ప్రదర్శించింది. వాటిని స్థూలంగా పరిశీలించి పత్రికా భాషలో వచ్చిన మార్పులు నాలుగు దశల్లో వచ్చిందని చెప్పవచ్చు. 1) స్వాతంత్ర్యోద్యమం రాకముందు పత్రిక భాష, 2) స్వాతంత్ర్యోద్యమ కాలంలో వచ్చిన మార్పులు, 3) స్వాతంత్ర్యానంతరం వచ్చిన మార్పులు, 4). ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన మార్పులు అని నాలుగు రకాలుగా వర్గీకరించి పరిశీలించవచ్చు.

ఆంగ్లేయుల పాలన కాలంలో వారిద్వారా మనకు సంక్రమించిన భావాలు అనేక రకాలుగా చెప్పవచ్చు. సాహిత్య ప్రక్రియల రూపంలో వచ్చిన మార్పుల, రాజకీయ సిద్ధాంతాలే కాక ప్రజాస్వామ్యవాద భావాలు మన సమాజం మీద ప్రభావం చూపాయి.

1. స్వాతంత్ర్యోద్యమానికి ముందు దశలో ప్రాచీన సంప్రదాయాలపై పట్టు ఎక్కువగా ఉండేది. ఆంగ్లవిద్య ద్వారా ప్రపంచ సాహిత్య పరిచయం జరిగింది. తులనాత్మక సాహిత్య పరిశీలనతో మన సమాజంలోని లోపాలు మన సాహిత్య ధోరణుల్లోని లొసుగులు తెలిసి విద్యావంతులు సంఘ సంస్కరణ అత్యవసరమని భావించారు. ఆంగ్ల సాహిత్యంలో ఉన్న సాహిత్య ప్రక్రియలు తెలుగు భాషలో తెచ్చి భాషను పరిపుష్టం చేయాలనేది నాటి ఆదర్శం. తత్ఫలితంగానే పత్రికలు తెలుగులో పుట్టాయి. అనేక గ్రంథాల ముద్రణలో వచ్చాయి. స్త్రీ విద్య ప్రచారానికి, సమాజంలోని లోపాలను తొలగించడానికి పత్రికలు ఉత్తమ సాధనాలని విశ్వసించారు. అనేక వాద ప్రతివాదాలు పత్రికల ద్వారా జరగడానికి అవకాశం ఏర్పడింది. పత్రికలు సాహిత్య ప్రచారంతో పాటు సమాజ అభివృద్ధికి అంతే పాటుపడేవి. అప్పటికి ఆంగ్ల భాషా సాహిత్యాభిమానం ఉంది కాని ఆంగ్లీకరణ దృష్టిలేదు. స్వభాషాభిమానం ఎక్కువ. పాశ్చాత్య భావాలను అనువదించటం ముఖ్య మనుకున్నారు. అప్పటి పత్రికాభాష గ్రాంథికంగా ఉన్నప్పటికి ఆదశలో వెలువడ్డ పత్రికల్లో భాష ప్రామాణికమని పాఠకలోకం గౌరవించింది.

2. స్వాతంత్ర్యోద్యమ కాలంలో పత్రికాభాషలో వచ్చిన మార్పుకు అంతకు ముందున్న పత్రికలు ఇచ్చినంత ప్రాముఖ్యాన్ని ఈ కాలంలో భాషకు, సాహిత్యానికి కల్పించలేదు. పాత్రికేయుల ఆదర్శం కొంత మార్పుకు లోనైంది. స్వాతంత్ర్య సాధనకే అధిక ప్రాధాన్యమిచ్చారు. అందుకే దేశాభిమానాన్ని ప్రజలకు తెలిపే విధంగా జాతీయ పునర్నిర్మాణ అవసరాన్ని అప్పటి పత్రికలు ప్రచారం చేశాయి. కులమత భేదాలకు అతీతంగా సంఘటితమైన రాజకీయ శక్తిపుట్టి అది స్వాతంత్ర్య సాధనకు తోడ్పడాలనే ఆకాంక్ష తీవ్రమైంది. జాతిని ప్రబోధించడమే ఆదర్శమనుకున్నారు. పత్రికా రచన ద్వారా దేశభక్తి పెంపొందించాలనుకున్నారు. తమ భావాలను సమర్థవంతంగా ప్రచారం చేయడానికి సమకాలిక భాషా రూపాలు, ఎక్కువ ఉపయోగకరమని భావించారు. ఆంగ్ల విద్యా ద్వారా సంపాదించిన డిగ్రీల కన్న స్వయం కృషితో సాధించిన భాషా పరిజ్ఞానం మీదనే ఎక్కువగా ఆధారపడ్డారు. పత్రికా రచనను ఒక వృత్తిగా భావించారు.

3. స్వాతంత్ర్యానంతరం విద్యారంగం అనేక మార్పులకు లోనయింది. క్రమంగా రాజకీయ ప్రభావాలకు, కులమతాల ఒత్తిళ్ళకు ప్రభుత్వాధిపత్యానికి లోనైనది. విద్యారంగం సంస్కరణల పేరిట రకరకాల ప్రయోగాలకు గురైంది. బ్రిటీష్ వారు నెలకొల్పిన గుమాస్తా విద్యా విధానాన్ని నిరసించి మూడోదశలోని రాజకీయ వాదుల విద్యా సంస్కారాలు ప్రశ్నార్థకంగా మిగిలాయి. నిర్బంధ, ప్రాథమిక విద్య కాగితాలకే పరిమితమైంది. వయోజన విద్యా ప్రచారం, గ్రంథాలయోద్యమం వంటివి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కర్పూరంలా హరించిపోయాయి. జాతి పునర్నిర్మాణం కన్నా, జాతీయ సంపదను పరిరక్షించడంకన్నా అధికారాన్ని, ధనాన్ని సంపాదించటమే అవసరమనే నూతన ధోరణియే సమాజంలో మార్పు తెచ్చింది. లక్ష్యం ధనార్జన వైపు మళ్ళింది. 'అందరికి విద్య' అనే నినాదం విద్యా ప్రమాణాలను ధ్వంసం చేసే విధానమయింది. స్వాతంత్ర్యం కోసం ఏ లక్ష్యం తో పోరాడారో ఆ లక్ష్యాలను స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత విస్మరించారు.

మొదటి దశలో సంప్రదాయ విద్యను సంపూర్ణంగా విస్మరించారు. రెండోదశలో దాన్ని సరైన ప్రత్యామ్నాయాన్ని చూపలేకపోయారు. ఆంగ్లభాషా సాహిత్య పరిజ్ఞానం క్రమంగా సన్నగిల్లింది. కాని ఆంగ్లీకరణ వ్యామోహం మాత్రం విపరీతంగా

పెరిగింది. అందుకు ప్రధాన కారణం విద్యారంగంలో పెరిగిపోతున్న వ్యాపార దృష్టి. అనంతరం 1913 లో మొదలైన ఆంధ్రోద్యమం 1953 నాటికి ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి దారి తీసింది. 1956లో విశాలాంధ్ర పేరుతో హైదరాబాదు రాష్ట్రాన్ని ఆంధ్రరాష్ట్రంలో భాష పేరుతో కలిపి, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేశారు. భాష పేరుతో రాష్ట్రం ఏర్పడినా1966 దాక తెలుగు అధికార భాషగా చట్టం తేలేకపోయింది. అన్ని రంగాలలో తెలుగు భాష అన్యాయానికి గురైంది. ఈ దశలో పత్రికలు తమ లక్ష్యాలను మార్చుకున్నాయి. భాషలో అనేక కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆంగ్ల పదాలు ఎక్కువ చోటుచేసుకున్నాయి.

విద్యావిధానంలో పూర్తిగా మార్పు వచ్చింది. కాన్వెంట్ చదువులు, రెసిడెన్సియల్ కళాశాలలదాక విస్తరించాయి. ప్రతి విద్యార్థి తన అభిరుచికి తన శక్తి యుక్తులతో సంబంధం లేకుండా ఏదో ఒక సాంకేతిక విద్యలో ప్రావీణ్యం సంపాదించాలనే ఏకైక లక్ష్యం పెట్టుకున్నాడు. ఇది పెనుమార్పుకు దారితీసింది. విషయపరిజ్ఞానం ప్రధానం కాని భాషాపరిజ్ఞానం కాదని మొత్తం సమాజమే నిర్ణయించింది.

4. 1990వ దశకంలో ప్రపంచీకరణ నేపథ్యంలో పత్రికారంగం అనేక మార్పులకు లోనైనది. విద్యారంగంలో ముద్రణా రంగంలో ప్రచార, ప్రసార రంగాల్లో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంలో తీవ్రమైన పరిణామాలు వచ్చాయి. ముద్రణా పద్ధతుల్లో వచ్చిన మార్పులను, అవకాశాలను వినియోగించుకోవాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడి అవసరం. అంత శక్తి వాణిజ్యరంగానికే ఉందికాని సాధారణ వ్యక్తులకు అందుబాటులో లేదు. అనేక టీవి ఛానళ్ళు, ఉపగ్రహ ప్రసారాలు పత్రికలకు పెద్ద పోటీగా పరిణమించాయి. నూతన సాంకేతిక విధానాలు మళ్ళీ గుణాత్మక పరిణామాలకు దారితీశాయి. ప్రజలను విజ్ఞాన వంతులను చేయటం కన్నా వారిని ఆకర్షించి వినోదాన్ని పంచడం వల్ల వాణిజ్య ప్రయోజనాలు నెరవేరుతాయి. భాషా సాహిత్యాలకన్నా వాణిజ్య ప్రకటనలు, వ్యాపార వార్తలు, క్రీడా వినోద వార్తలు ప్రజలకు ఆకర్షణీయంగా ఉన్నాయి కాబట్టి సహజంగానే పత్రికా నిర్వహణ వ్యాపారం వల్లనే సాధ్యమవుతుంది. పత్రికా రచన వృత్తి కర్తవ్య స్థాయి నుంచి ఉద్యోగ బాధ్యతగా మారిపోయింది. భాషకు ప్రాధాన్యం లేకుండా పోయింది. పాత్రికేయ వృత్తిపై

అభద్రతాభావం పెరిగింది. అందుకే భాషపై పట్టున్నవారు అటువైపు వెళ్ళడం లేదు.

పాత్రికేయుడు అనుక్షణం కొత్తగా వస్తున్న సాంకేతిక విధానాల వల్ల నిత్యవిద్యార్థి కావాలి. కానిచో బతకడం కష్టం. సమాజ ధర్మాల్లో, లక్షణాల్లో వచ్చిన ఈ మార్పులే పత్రికాభాషను తలక్రిందులుగా మార్చేశాయి. ఈ నేపథ్యంలో పత్రికా భాషలో వచ్చిన పరిణామాలను స్థూలంగా నిర్దేశించవచ్చు. 1938లో జనవాణి పత్రికా సంపాదకీయాల్లో తాపీ ధర్మారావు వ్యవహార రూపాలను ప్రవేశపెట్టేదాకా కొన్ని సాహిత్య పత్రికలు వీర గ్రాంథిక భాషలోనే నడిచాయి.

భాషా పరిణామక్రమం నిరంతరాయం కాబట్టి సంధి రూపాలు, మాధ్యమిక రూపాలు, ప్రయుక్తం కావడంలో ఆశ్చర్యం లేదు. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక వంటి సాహిత్య పత్రికల్లో కూడా అక్కడక్కడా అపప్రయోగాలుండేవి. కాని మొత్తం మీద తొలితరం పత్రికలు భాష విషయంలో చాలా సంయమనం పాటించాయి. రాజకీయ, సామాజిక, ఆర్థిక విషయాలకు ప్రాముఖ్య మిచ్చిన పత్రికల్లో ఆయా శాస్త్ర సాంకేతిక రంగ పదాలను ఆంగ్లం నుంచి అనువదించే ప్రయత్నాలు జరిగాయి.

ప్రజా జీవనం క్రమంగా ఆదర్శాలకు దూరమైంది. ధనార్జన దృష్టి పెరుగుతూవచ్చింది. గురుశిష్య సంబంధాలు యాంత్రికమయ్యాయి. అందుకే స్వరాజ్య పత్రికలో, భారతిలో, ఆంధ్రపత్రికలో చివరికి ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతిలో సంపాదకులకు వారి తర్వాత వారికి మధ్య గురుశిష్య సంబంధాలు కాని, గౌరవాదరాలు కాని కాలక్రమంలో తగ్గిపోయాయి. అయినప్పటికి భాషను బతికించడంలో నేటికి కొన్ని పత్రికలు కృషి చేస్తున్నాయి. వస్తున్న కొత్త కొత్త పదాలు, పదబంధాలను ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకొని ప్రజలకు అర్థమయ్యే విధంగా వార్తలను అందిస్తున్నాయి.

వ్యాసకర్త – **పరిశోధక విద్యార్థి**

# తెలుగు దినపత్రికలలో భాషాదోషాలు - కారణాలు

- రవిందర్ పారిపెల్లి

గత తరం పాత్రికేయులు, భాషా సంబంధమైన నిబద్ధతను పాటించే పాఠకులు తెలుగు దినపత్రికలలో దోషాలు కనబడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రధానమైన దోషం భాష విషయంలోనే ఏర్పడుతోందని వీరి నిశ్చితాభిప్రాయం. భాషాదోషాలు లేవని నవతరం పాత్రికేయులు కూడా చెప్పడం లేదు. అన్ని రంగాలలో వలెనే భాషాప్రయోగ రంగంలోనూ నాణ్యత తగ్గుతోంది. కనుక, ఈ దోషాలు రావడం సహజమేనని చెబితే చర్చించేందుకు ఏమీ ఉండదు! భాషాదోషాలకు గల కారణాలను అన్వేషించాలి. ఈ దోషాలలో కొంత శాతాన్ని తగ్గించగలమేమో ఆలోచించాలి. భాషాదోషాలు సంపూర్ణ స్థాయిలో కనుమరుగు అవుతాయని అనుకోవడం అత్యాశ. అదేవిధంగా మార్పులు రావడం అసాధ్యం అనుకోవడం నిరాశే! ఈ పత్రంలో తెలుగు దినపత్రికలలో భాషాదోషాలకు గల కారణాలను అన్వేషించడం జరుగుతోంది. వివిధ చారిత్రక పరిస్థితుల మధ్య సమీప చరిత్రలో పత్రికాభాషలో వచ్చిన మార్పులు తీరుతెన్నుల్ని కూడా అంతర్భాగంగా పత్రంలో చర్చించడం జరుగుతోంది.

ఇప్పటి దోషాల గురించి విశ్లేషించే ముందు ఆనాటి గుణాలను గురించి చర్చించడం సముచితం. ఇప్పుడు తెలుగులో కనీసం అరడజను దినపత్రికలు పాఠక లోకానికి సన్నిహితంగా ఉన్నాయి. అయితే 1910వ దశాబ్దంలో ఒకే ఒక్క తెలుగు దినపత్రిక సేవలు అందించింది. అది 'ఆంధ్రపత్రిక'. విశ్వదాత, దేశోద్ధారక అనే బిరుదులున్న కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు తన స్వీయ అభిరుచితో ఆంధ్రపత్రికను ప్రారంభించారు. పత్రిక నిర్వహణలో వ్యాపారపరమైన లాభాలు వచ్చిన దాఖలాలు లేవు. అయితే, ఎటువంటి లాభాపేక్ష లేకుండా కాశీనాథుని 'ఆంధ్రపత్రిక'ను నిలబెట్టారు. పత్రికకు బలమైన పునాదులు ఏర్పడేందుకు సమర్థవంతమైన సంపాదకవర్గం అత్యవసరం. వారు ఈ సత్యాన్ని తెలిసినవారు కనుక నాటి సీమాంధ్ర-మదరాసు మహానగర ప్రాంతాలలోని విద్వాంసులను 'ఆంధ్రపత్రిక' సంపాదకవర్గంలోకి ఆహ్వానించారు. ఆయన పట్ల గౌరవంతో విద్వాంసులు కూడా సంపాదకవర్గంలో చేరిపోయారు. తెలుగు భాషవ్యవహార సరళిలో సంచలనాత్మకమైన మార్పులు వస్తున్న కాలంలో 'ఆంధ్రపత్రిక' ఎదిగింది. అదొక కీలక సమయం. సీమాంధ్రలోని పలు జిల్లాల్లో గ్రాంథిక-వ్యావహారిక వాదాలు రెండువిభిన్న శిబిరాలుగా మారిన కాలంలో 'ఆంధ్రపత్రిక' ఎంతో సంయమన వైఖరిని ప్రదర్శించింది. ఎక్కడా మొగ్గ చూపకుండా పత్రికాభాషలో కించిత్తు దోషం లేకుండా ప్రచురణ సాగించింది. ఏదైనా ఒక పదం పట్ల సందేహం ఏర్పడితే సంపాదక బృందం సుదీర్ఘంగా చర్చించిన సందర్భాలు సైతం ఉన్నాయట. ఈ విషయాన్ని తిరుమల రామచంద్ర వంటి ఆనాటి పాత్రికేయ ప్రముఖుల జ్ఞాపకాలు వెల్లడిస్తున్నాయి. నాటి పత్రికా రంగంలోని పాత్రికేయులకు, బయట నుండి వ్యాసాలు, వ్యాఖ్యలు పంపించే వారికి భాషాసంబంధమైన ఛాందస వైఖరులు ఏవీలేవు. భాష పలుచబడిపోకూడదన్నదే వారి తపన. అందుకే దోషాలు తక్కువగా ఉండేవి. అసలు దోషాలు లేవని చెప్పినా అది దోషమేమీ కాదు. నార్ల వేంకటేశ్వరరావు వంటి నవ్య దృక్పథం కలిగిన పత్రికా సంపాదకులు దోషరహితమైన భాషాప్రయోగం పట్ల నిబద్ధత చూపారు. ఇట్లా 1970ల వరకు తెలుగు దినపత్రికలలో దోషరహితమైన భాషాప్రయోగాలు కనిపించాయి.

ఆ రోజుల్లో భాషాదోషాలు వెలువడితే వాటిని పాఠకులు, భాషాపండితులు కూడా తీవ్రంగానే పరిగణించేవారు. విమర్శలు కూడా వచ్చేవి. "ఇదేమిటి

ఇటువంటి పదం వచ్చింది" అని ఆంతరంగిక స్థాయిలో చర్చలు జరిగేవి. బహుశాః కొంతమంది భాషాభిమానులు పత్రికా కార్యాలయాలకు కూడా లేఖలు రాసేవారేమో! ఇక్కడ రెండు కీలకమైన అంశాలను కూడా గుర్తించాలి. నాడు తెలుగు దినపత్రికల నిడివి తక్కువ. మొత్తం ఆరు పుటలతో పత్రిక వచ్చేది. అందువల్ల సీనియర్ ఉపసంపాదకులు వార్తల్ని తిరగరాసి ఎటువంటి తప్పులు లేకుండా తీర్చిదిద్దే అవకాశం ఉండేది. పత్రికల ప్రచారం కూడా ఈనాటితో పోల్చినప్పుడు ఆరోజుల్లో పరిమితం.

భాషాదోషాలలో ప్రముఖమైన కొన్నింటిని ఇక్కడ సమీక్షిద్దాం. తెలుగులో అక్షరాల సంఖ్య ఎక్కువ, వీటిలో ఒత్తులకు, దీర్ఘాలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. ఇప్పుడు వస్తున్న వార్తల్లో ఈ ఒత్తులు, దీర్ఘాలకు సంబంధించిన లోపాలు కొన్ని ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. ఒత్తులు ఉన్న దగ్గర వాటిని వాడకపోవడం ఒక పెద్ద దోషమే. కొన్ని సందర్భాలలో రెండు ఒత్తులు ఒకే పదంలో ఉంటాయి. ఉదాహరణకు "బాధ్యత" అనే మాట. దీన్ని కొన్ని సందర్భాలలో 'భాద్యత' లేదా 'భాధ్యత' అని వాడడం జరుగుతోంది. 'విధ్యార్థి' అన్న ప్రయోగాలు కూడా అడపాదడప కనిపించాయి. నిజానికి దీన్ని 'విద్యార్థి' అని వాడాలి". దీటుగా అన్నది సరియైన ప్రయోగం. దీన్ని కొన్నిసార్లు "ధీటుగా" అని రాస్తున్నారు. దీర్ఘాల ప్రయోగంలోనూ ఇటువంటివి చూడవచ్చు, కొన్నిసార్లు 'మౌలికం' అన్న మాటను 'మౌళికం' అని రాయడం జరుగుతుంది. 'సలహాదారు' అనేది అసలైన మాట. కొత్తగా "డు" అనే అక్షరాన్ని చేర్చి "సలహాదారుడు" అని రాస్తున్నారు. ఇటువంటివి మరెన్నో ఉదాహరణలు చెప్పవచ్చు.

ఏ భాష అయినా తన ప్రత్యేకమైన పరిధిలో గిరిగీసుకొని ఉండడం కుదరదు. అది తప్పకుండా ఇతర భాషల నుండి అదానప్రదానాల్ని కొనసాగించవలసిందే. ఈ క్రమంలో అన్యదేశ్య పదాలు తప్పకుండా వచ్చి చేరుతాయి. అన్యదేశ్య పదాలు ఒక పరిమితిలో వాడబడితే అది మూలభాషకు అందాన్ని సాధించిపెడుతుంది. అట్లా కాకుండా మూలభాషా పదాల్ని అన్యభాషా పదాలు దాటినట్టయితే భాష అందం తగ్గిపోతుంది. తెలుగు పత్రికాభాషలో ఈ ధోరణి కనపడుతోంది. గతంలో తెలుగు పదాలు లభ్యం కాని సందర్భంలోనే ఆంగ్ల లేదా ఇతర భాష పదాల్ని పత్రికల్లో ఉపయోగించేవారు. ఇప్పుడు యథేచ్ఛగా అన్యదేశ్య పదాల వాడకం

కనబడుతోంది. తెలుగు భాషలో తగిన పదాలు ఉన్నప్పుడే ఈ ప్రయోగాలు జరపడంతో అది నిజంగానే దోషంగా పరిగణిస్తోంది. ఉదాహరణకు "టీం ఇండియా" అనే మాట ఇదివరకు ఈ మాటకు చక్కగా "భారతజట్టు" అని వాడేవారు. క్రికెట్ ఆటను గురించిన వార్తల్లో "భారతజట్టు" అనే పదాన్ని ఇదివరకు మనం చదివాము. ఇప్పుడు దాన్ని "టీం ఇండియా" అంటున్నారు. ఇందువల్ల ప్రయోజనమేమిటి? "కంపల్సరీ" "టెన్షన్" "అటెన్షన్" వంటి మాటలు కూడా పత్రికా భాషలో తరచుగా కనబడుతున్నాయి. ఇక ఉర్దూ పద వినియోగం సంగతి వస్తే – నాటి కుతుబ్‌షాహీల పాలనా కాలం నుండే తెలుగులో ఉర్దూ పదాల చేరిక విరివిగా జరిగింది. ఉర్దూ మాటలు తెలుగులో కలిసిపోయినవీ ఉన్నాయి. వాటిని వాడడం తప్పేమీ కాదు. ఉదాహరణకు "దరఖాస్తు" వంటివి. ఇటువంటి మాటలు వాడినపుడు ఎవరికీ ఆక్షేపణ ఉండదు. "పరేషాన్" వంటి మాటలు మాత్రం వాడవలసిన అవసరం లేదు. దీని బదులు 'ఆందోళన' వంటి పదాల్ని చక్కగా ఉపయోగించవచ్చు.

పత్రికల నిడివి బాగా పెరిగింది. జిల్లా ఎడిషన్ల సంప్రదాయం ఆరంభమైన తరువాత డజన్ల కొద్ది పుటలలో దినపత్రికను వెలువరించవలసి వస్తోంది. పుటలు పెరిగాయి, వార్తలు బాగా పెరిగాయి. సమయం మాత్రం తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో ఉపసంపాదకులు వెనకటివలె ఒకటికి రెండుసార్లు వార్తను తీర్చిదిద్దేందుకు సమయం ఉండడం లేదు. విలేకరులు పంపిన వార్తలను యథావిధిగానూ ప్రచురించవలసి వస్తోంది. గ్రామీణ స్థాయి విలేకరులు అందరూ భాషా సంబంధమైన స్థానాన్ని పొందేందుకు అవకాశాలు లేవు. ఇట్లా కాలక్రమంలో దోషాలు ఆరంభమై అవి అంతకంతకూ పెరుగుతూ వచ్చాయి. ఇదివరకటి వలె దోషాల్ని గురించి పాఠకలోకం పెద్దగా పట్టించుకోవడం లేదు. అందువల్ల భాషాదోషాలపట్ల పునఃసమీక్ష చేసుకునే అవకాశం లేకుండా పోయింది.

ఉపసంపాదకవర్గం ఈరోజు బాగా విస్తరించింది. పత్రికారంగంలో వెనుకటికంటే ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఉపసంపాదకులుగా పాత్రికేయ వృత్తిలో ప్రవేశించేవారి అభ్యసన నేపథ్యం తీరు వేరుగా ఉంటున్నది. వారిలో కొంతమంది సామాజిక శాస్త్రాలు చదివిన వారు, మరికొందరు సాంకేతిక విద్యల్ని

అభ్యసించిన యువకులు. కొద్దిమంది మాత్రం సాహిత్య – భాషా నేపథ్యం నుండి వచ్చినవారు. వీరందరి భాషాస్థాయి ఒకే తీరులో ఉండదు. సామాజిక సాంకేతిక శాస్త్రాభ్యాసం తర్వాత పత్రికారంగంలోకి ప్రవేశించిన వారికి వైవిధ్యభరితమైన అవగాహన ఉంటుంది. ఇది ఎవరూ కాదనలేని వాస్తవం. అయితే వీరికి భాషాసాహిత్యాలలోనూ ఈ స్థాయి అవకాశం ఉంటుందని అంచనా వేయలేము. ఉపసంపాదక వర్గానికి భాషాపరమైన నిశితమైన శిక్షణను కనుక అందించినట్లయితే దోషాలు బాగా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. కొన్ని సంస్థలు ఈ మేరకు చక్కని శిక్షణను అందిస్తున్నాయి. ఇది ఆహ్వానించదగిన పరిణామం.

పత్రికా రంగంలో కొన్నిసార్లు "మౌఖిక ధోరణి" ప్రవేశించడం భాషాదోషాలు పెరగడానికి మరొక కీలక కారణమవుతోంది. పత్రికాభాష ప్రధానంగా లిఖిత సంప్రదాయానికి సంబంధించింది, ఇందులో ఉచ్చారణకు, రాతకూ మధ్య బింబప్రతిబింబ సంబంధం ఉంటుంది. లిఖితసంప్రదాయానికి భిన్నమైనది "మౌఖిక ధోరణి". ఇందులో మాట్లాడే తీరుకే ప్రాధాన్యత. టెలివిజన్ ఛానళ్ళలో మాట్లాడేతీరు. "మౌఖిక ధోరణి" కి మంచి ఉదాహరణ. గత రెండు దశబ్దాల కాలంలో ప్రైవేట్ టెలివిజన్ ఛానళ్ళు బాగా పెరిగాయి. అవి నిత్య జీవనంలో సమాజం మీద బలమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ ప్రభావం పత్రికారంగం మీద కూడా కనబడుతోంది. పత్రికల్లోనూ మౌఖిక ధోరణికి ఇదే కారణం, టెలివిజన్‌లో లిఖిత భాష ఎందుకు పనికిరాదో, పత్రికలలోనూ మౌఖికభాష అందుకే పనికిరాదు. ఏ మాధ్యమంలో ఉపయోగించవలసిన భాషాప్రయోగాలు ఆ మాధ్యమంలోనే వాడుకోవాలి.

ప్రపంచీకరణ కారణంగా ఆర్థిక రంగంలో మంచి మార్పులే వచ్చినా సాంస్కృతిక ప్రపంచంలో మాత్రం అపశ్రుతులు ఏర్పడ్డాయి. ప్రపంచీకరణ ప్రధానంగా ప్రాంతీయభాషల్ని, ప్రాంతీయ సంప్రదాయాల్ని బాగా బలహీనం చేసింది. తెలుగు కూడా ప్రాంతీయభాష. ప్రపంచీకరణ వల్ల ఒక ఇంగ్లీషుకు మాత్రమే ప్రాముఖ్యత పెరిగింది. మిగతా భాషలు అంతగా ఉపయోగపడవనే ఒక దోషముతో కూడిన అవగాహన బలపడింది. ఈ దిశలోనే తెలుగులోనూ ఇంగ్లీష్ పదాలు విరివిగా ఉపయోగించవచ్చుననే అభిప్రాయం నవతరంలో

స్థిరపడింది. దీని తాలూకు ప్రతిస్పందనల్ని మనం దినపత్రికల్లో వార్తలు రాసే తీరులో గుర్తించవచ్చు.

తెలుగు దినపత్రికలలోని భాషాదోషాలనే లెక్కలు వేసుకుంటూ పోతే 'నకారాత్మక ఆలోచన'లే మిగులుతాయి, వాస్తవానికి తెలుగు దినపత్రికలు గతంలో కంటే ఎంతో వైవిధ్యవంతంగా మారాయి. ఇదివరకు తెలుగు దినపత్రికలలో కనిపించని అనేక అంశాలు ఈరోజు ప్రచురణ పొందుతున్నాయి. గతంలో ఏదైనా పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థిని ఇంగ్లీష్ పత్రిక తప్పకుండా చదవవలసినదిగా పెద్దలు సలహా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ అవసరం లేదు. ఆంగ్ల పత్రికల్లో వచ్చే అనేకాంశాలు ఇప్పుడు తెలుగు దినపత్రికల్లోనూ దర్శనమిస్తున్నాయి. అయితే భాషాదోషాలు అడపాదడపా వెలువడడమే చర్చించవలసిన ఒక లోపం. ఇంగ్లీష్ పత్రికలు భాషాప్రయోగాల విషయంలో బాగా జాగ్రత్తలు తీసుకుంటాయి. కొన్ని ఇంగ్లీష్ దిన పత్రికలైతే గతంలో తెలుగు దినపత్రికలలో వలె పదవినియోగంలో ప్రయోగాలలో లోతైన చర్చలు చేశాయి. కొన్ని ఇంగ్లీష్ దినపత్రికలకు భాషావిషయంలో దోషాల నివారణ కోసం "రీడర్స్ ఎడిటర్" వంటి బాధ్యతలూ ఉన్నాయి. "రీడర్స్ ఎడిటర్"ను ఏర్పాటు చేయడం పత్రికలు భాష పట్ల చూపించే నిబద్ధతకు చక్కని నిదర్శనం. తెలుగు దినపత్రికల భాషాదోషాలు తగ్గాలంటే ఇటువంటి ఏర్పాటు వీటిలోనూ అవసరం. తెలుగు భాషా సాహిత్యాలలో లోతైన పరిచయం ఉన్న వ్యక్తిని, ఆధునిక భాషా ప్రయోగాల్ని ఆహ్వానించగలిగే వారిని "రీడర్స్ ఎడిటర్"గా నియమించవచ్చు.

భాషలో ప్రయోగాలు మంచివే. అయితే ప్రయోగాలు దోషరహితంగా ఉండాలి. అవి భాషాంశాన్ని పెంచే క్రమంలో తోడ్పాటునందించాలి. భాష మౌలిక గుణాల్ని ఈ ప్రయోగాలు తగ్గించకూడదు. పత్రికా భాషను సమాజంలోని అనేక వర్గాల వారు తు.చ. తప్పకుండా అనుకరిస్తారనే సార్వకాలిక వాస్తవాన్ని పాత్రికేయులు పరిగణనలోకి తీసుకోవాలి. ఈ దృష్టితోనే ప్రయోగాల వైపు అడుగులు వేయాలి, అప ప్రయోగాలు జరిగినట్లయితే వాటి ప్రభావం తెలుగు భాషా వ్యవహర్తలపై ఉంటుందని గుర్తించాలి. పత్రికారచయితలు చక్కని ప్రయోగాల కోసం సంప్రదాయ – ఆధునిక తెలుగు సాహిత్యాల్ని తీరిక సమయాల్లో అధ్యయనం చేయడం ఉత్తమం.

"సరియైన భాషాప్రయోగాలు– దోషరహితమైన భాషలో పత్రికారచన చేయడం" అనే లక్ష్యాల సాధన కోసం యువపాత్రికేయులు కొన్ని పుస్తకాలను చదవడం మంచిది. ఈ క్రమంలో జి.ఎస్. వరదాచారి రచించిన "దిద్దుబాటు" వ్యాస సంకలనం బాగా ఉపయోగపడుతుంది. ఆచార్య చేకూరి రామారావు, ఆచార్య రవ్వా శ్రీహరి వంటి విద్వాంసులు రచించిన పుస్తకాల్ని కూడా చదవాలి. గతంలో పలువురు సీనియర్ పాత్రికేయులు చేసిన ప్రయోగాలను విమర్శనాత్మకంగా సమీక్షించాలి. పత్రికా సంస్థలు కూడా ఈ అంశంపట్ల ప్రత్యేకమైన ఆసక్తిని ప్రదర్శించవలసిన అవసరం ఉంది.

ఎదుగుతున్న తెలుగు పత్రికారంగం దోషరహితమైన భాష ద్వారా మరింత తేజోవంతమవుతుంది. ఈ క్రమంలో పాత్రికేయులతోపాటు సామాన్యపాఠకులు, విద్వాంసులు తమవంతు బాధ్యతను నిర్వహించడం సముచితం. పత్రికా భాషలో ఏవైనా దోషాలు కనిపించినట్లయితే వాటిని తర్కబద్ధంగా చెబుతూ పత్రికల వారి దృష్టికి తీసుకొని రావాలి. ఇట్లా అయితే ఆయా పత్రికలు తిరిగి అటువంటి దోషాలు చేయకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. తెలుగు దినపత్రికలది ప్రస్తుతం వైభవోపేతమైన స్థితి. అడపాదడపా కన్పించే భాషాదోషాలు నివారించగలిగితే ఈ వెలుగులు మరింత కాంతివంతమవుతాయి.

వ్యాసకర్త – **పరిశోధక విద్యార్థి**

# పత్రికా భాష మూలాలపై శ్రద్ధ చూపాలి

*-టి.వేదాంతసూరి*

భాష ఇరువురు వ్యక్తుల మధ్య ఒక పూల వంతెనలా ఉండాలి. ఒక సారి వింటే వెంటనే అర్థం కావాలి. అదే విధంగా పత్రికల్లో వాడే భాష ఒకసారి చదవగానే పామరుడు, పండితుడు సులభంగా అర్థం చేసుకోగలగాలి. అంతేకాని పాండిత్యం ఉండవలసిన అవసరం లేదు. అలా అని ఆ భాషను వాడే వారికి అపార అనుభవంతోపాటు భాషలోని లోటుపాట్లు క్షుణంగా తెలిసి ఉండాలి. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం భాష ఉపయోగంపై ప్రత్యేక శ్రద్ధ ఉండేది. కానీ రాను రాను ఈ వ్యాపార యుగంలో లోపాలను అంతగా పట్టించుకోవడం లేదు. దాన్ని సరిదిద్దే వారు లేకుండా పోయారు. అయితే పత్రికా భాషను ప్రామాణికంగా తీసుకునేవారు చాలా మంది ఉంటారు. అయితే పత్రికా కార్యాలయాలలో మాత్రం ఈ విషయంలో ఎక్కువగా దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరం. అందుకు కారాణాలు అనేకం.వార్త ఎలా ఉంది అనే కన్నా ఆ వార్త వల్ల ఎంత డబ్బు వస్తుంది, దానివల్ల ఎంత లాభం సమకూరుతుందో అనే ఆలోచన ప్రారంభం కావడం విచారకరం. ఈ వ్యాపారాత్మక ప్రపంచంలో వార్తలే కాదు భాష కూడా వ్యాపారమయమైపోయింది. రెండు దశాబ్దాల క్రితం ప్రతి వార్తా పత్రిక కార్యాలయంలో ఉప సంపాదకులు, ప్రూఫ్ రీడర్లు

ఉండేవారు. వారు విలేకరి నుంచి వచ్చిన వార్లను చదివి అవసరమైనంత పాఠకులకు అందించేవారు. ఆ రోజుల్లో ఉప సంపాదకుడు వార్తను సక్రమమైన రీతిలో పొందుపరిచి అర్థవంతమైన, ఆకర్షణీయమైన శీర్షికను పెట్టి కంపోజింగ్‌కు పంపేవారు. అది వచ్చిన తరువాత ఆర్టిస్టు పేజ్‌నేషన్ చేయగానే ప్రూఫ్‌రీడర్, ఉప సంపాదకుడు, న్యూస్ ఎడిటర్ ఒక సారి అన్ని వార్తలను పరిశీలించేవారు. అప్పుడు దాన్ని అచ్చుకు పంపేవారు, ఇంతమంది చదవడం వల్ల అది తప్పులు లేకుండా ప్రచురితమయ్యేది. కాని సిబ్బందిని తగ్గించాలని, జీతం తగ్గించాలన్న ఉద్దేశ్యం లేదా వ్యాపార కోణం వల్ల ఒక ఉప సంపాదకుడు డిటిపి ఆపరేటర్‌గా, ప్రూఫ్‌రీడర్‌గా, ఆర్టిస్టుగా మారి అవసరమైతే రిపోర్టింగ్ కూడా చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. అంటే ఐదుగురి ఉద్యోగాన్ని ఒక ఉప సంపాదకుడు చేయవలసి వస్తుంది. అయినా అతడికి అంతగా గుర్తింపు ఇవ్వడం లేదు. అందుకు అనేక కారణాలు ఉన్నాయి. విపరీతమైన పని ఒత్తిడి వల్ల ఎంతో మంది ఉప సంపాదకులు అనారోగ్యంతో ప్రాణాలు వదిలారు. ఈ విషయాలను ఎవరూ పట్టించుకోరు. అంటే పత్రికకు గుండెకాయగా ఉండవలసిన ఉప సంపాదకుడికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. యజమాన్యాలు కూడా వారిపై చిన్న చూపుగానే ఉన్నాయి. తెలంగాణ ఆవిర్భావం తరువాత వార్త పత్రికతో సంబంధం ఉండే అందరూ పాత్రికేయులే అని నిర్వచించి అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ అక్కడ కూడా కొన్ని రాజకీయ శక్తులు అడ్డుపడుతున్నాయి. అక్రిడియేషన్ అంటే కేవలం ప్రభుత్వ గుర్తింపు. అది బస్ పాసుకోసమో కాదు. ప్రభుత్వ పథకాలైన ఇల్లు, ఆరోగ్య భీమాతో పాటు సమాజంలో ఒక గౌరవం, గుర్తింపు కోసమే, భవిష్యత్తులో పింఛను ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వానికి వచ్చినా ఈ గుర్తింపు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఒక ఉప సంపాదకుడు ఇన్ని బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో భాషపై ఎలా దృష్టి సారించగలడు. పైగా కేవలం నాలుగు గోడలకే పరిమితం కావడం వల్ల బయటివారితో అంతగా పరిచయాలు కూడా ఉండవు. అయితే సమాజంలో మాత్రం పత్రికల్లోని వార్తలన్నీ విలేకరులే రాస్తున్నారు. అంతా వారి ప్రతిభనే అనే భ్రమలు ఉంటాయి. అయితు ఒక ఉప సంపాదకుడు అలా కాదు. తన నిర్ణయం

సంపాదకుడిది, యాజమాన్యానిది అనే భావంతో ఎంతో జాగ్రత్తగా పనులు చేస్తుంటాడు, కానీ పని ఒత్తిడి ప్రభావం వల్ల ఎలాంటి తప్పులు వచ్చినా, క్షేత్రస్థాయిలో ఏ విలేకరి చేసినా బలి అయ్యేది మాత్రం ఉప సంపాదకులే. ఇక భాష విషయానికి వస్తే ఉప సంపాదకుల్లో ఎందరో ప్రతిభావంతులు ఉన్నారు. వారిని సక్రమంగా ఉపయోగించుకుంటే ఫలితం యాజమాన్యానికి, సంపాదకులకు దక్కుతుంది. డెస్క్ నుంచి సంపాదకులుగా మారిన వారికి ఇవన్నీ బాగా తెలుసు. కానీ విలేకరిగా పనిచేసి సంపాదక బాధ్యతలు స్వీకరించే వారికి ఉప సంపాదకులపై ఒక రకమైన చులకన భావం, కసి కనిపిస్తాయి. సాధారణంగా ఉప సంపాదకులు సున్నిత మనస్కులై ఉంటారు. ఇది అలసుగా తీసుకుని వారిని రక రకాలుగా వేధింపులకు గురి చేయడం వల్ల ఏ పనీ సమంగా చేయలేరు. ఉప సంపాదకుడు పేజీ పూర్తి చేసిన తరువాత అందరూ ఒక సారి చూస్తారు. కానీ అందులో ఏ చిన్న పొరపాటు వచ్చినా ఎవరూ బాధ్యత తీసుకోరు. అదంతా సదరు ఉప సంపాదకుడే అని శిక్ష కూడా అతడికే అని నిర్ధారిస్తారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు ఉప సంపాదకులకు శిక్షణా శిబిరాలు నిర్వహించాలి. భాషపై మరింత అవగాహన పెంచాలి. వారి పనిలో కూడా కొంత సడలింపు ఇవ్వాలి. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం మాట. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో ఉన్న ఆంధ్రమహిళా సభ కళాశాలలో ప్రతి నెల మొదటి ఆదివారం భద్రిరాజు కృష్ణమూర్తి, రాంభట్ల, జి.కృష్ణ, బూదరాజు రాధాకృష్ణ వంటి ఉద్దండులు కలుసుకుని ఆ నెలలో వచ్చిన వార్తలు, పదాలు చదివి మార్పులు చేర్పులపై చర్చించేవారు. అలాంటి చర్చాగోష్ఠులు నిరంతరం జరుగుతుండాలి.

ప్రస్తుతం వార్తలు ప్రజా హితం కోసం కాకుండా యాజమాన్యాలకు, లేదా ఆ వార్త రాసే వ్యక్తులకు లాభం కూర్చే విధంగా ఉంటున్నాయి. ఈ పద్ధతిలో మార్పు రావాలి. అంతే కాకుండా అనుభవం ఉండే సంపాదక వర్గాన్ని తప్పించి తక్కువ వేతనం అందిస్తూ అక్షరజ్ఞానం లేని వారికి ఉద్యోగాలిస్తున్నారు. దీనివల్ల పత్రికకు ఉండే విలువలు కూడా పడిపోతున్నాయి. పత్రిక నాణ్యత పెరగాలంటే

సుశిక్షితులైన సంపాదక వర్గం ఉండాలి. వారి మనుగడకు సరిపడే వేతనం అందించాలి. అప్పుడే సమాజంలో గౌరవం, విలువలు పెరుగుతాయి.

ప్రతియేటా సదస్సులు నిర్వహించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఆ ఫలాలు చేరవలసిన వారికి చేరడం లేదు. మొక్కుబడి వ్యవహారాలను పక్కన పెట్టి నిజాయితీగా పనిచేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఇప్పటికీ వివిధ పత్రికల్లో వ్యాపారం, సాంకేతిక అంశాలు, శాస్త్రీయ, భాషపై మంచి పట్టు అవగాహన ఉన్న ఉప సంపాదకులు, సీనియర్ ఉప సంపాదకులు చాలా మంది ఉన్నారు. ప్రధానంగా తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు కూడా ఎందరో ప్రోత్సాహం లేకుండా ఉన్నారు. వారందరినీ సమీకరించాలి. ఇన్నాళ్లు పనిచేసే వారు తెలంగాణవారు. పనిచేయించేవారు, ఆధిపత్యం కొనసాగించేవారు, భాషను రుద్దేవారు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారు ఉండటం వల్ల ఎదగలేని వారిని ఇప్పుడు అక్కున చేర్చుకోవలసిన అవసరం ఉంది. అందుకోసం సారస్వత పరిషత్తులు, అకాడెమీలు, విశ్వవిద్యాలయాలు ముందుకు రావలసిన అవసరం ఉంది. తెలుగు భాష వాడుక విషయంలో నిరంతరం శిక్షణా కార్యక్రమాలు, కార్యశాలలు నిర్వహించవలసిన అవసరం ఉంది. ఆంగ్లంకంటే తీయనైన నుడికారం, సొగసు తెలుగు భాషకు ఉంటుంది. దాన్ని ఉపయోగించడం అలవాటు చేయాలి.

వ్యాసకర్త – **సీనియర్ జర్నలిస్టు**

# పత్రికా భాష - ఒక పరిశీలన

- డా॥ బడుగుల వనిత

పత్రికలు ప్రజలకు కేవలం సమాచారాన్ని ఇవ్వడమే గాకుండా ఆలోచనలను రేకెత్తిస్తాయి. విజ్ఞానాన్ని అందిస్తాయి. కాబట్టి పత్రికలు ప్రచార సాధనాలుగానే కాక సాంఘిక ప్రయోజనాన్ని కల్గించేవిగా పేర్కొనవచ్చు. పత్రికాభాష సామాన్యులకు కూడా అర్థమయ్యే విధంగా ఉండాలి. కాలానుగుణంగా భాష మారుతుంది. ఈ విధంగా మారుతున్నప్పుడు కొత్త అవసరాలతో కొత్త ధర్మాలతో కొత్త బాధ్యతలతో స్వయం సమృద్ధమవుతుంది. ఇదే భాషాభివృద్ధికి మూలం. దీనిలో భాగంగా నూతన పదకల్పన, నూతనశైలీ విధానం వంటివి ప్రవేశపెట్టవచ్చు. కొత్త అవసరాలు వచ్చినప్పుడు నూతన పదకల్పన అవసరం. ఇందులో భాగంగా పదాల ఆదానం, పదాల సృష్టి జరుగుతుంది. ఆదాన పద్ధతి సులభం. అన్యదేశ్యాలను కొన్ని సర్దుబాట్లతో తెలుగులో చేర్చుకోవడం అనువాదకుడ్ని భాషాపరమైన, సాంస్కృతికపరమైన సవాళ్లకు గురి చేస్తుంది.సృజన శక్తి, విషయ పరిజ్ఞానం కలిగిన పాత్రికేయులు నూతన పదసృష్టి చేస్తారు. నిజానికి గ్రామీణ ప్రజలు మాట్లాడే మాండలిక భాషలో కూడా కొన్ని అపురూపమైన మాటలున్నాయి.వాటిని సందర్భానుసారంగా పదకల్పన సమయంలో పునఃప్రవేశ పెట్టడం ఉత్తమోత్తమం. తెలుగులో సంస్కృత, ఉర్దూ,

హిందీ మొదలైన ఇతర భాషా పదాలు తెలుగు మాటలే అన్నంతగా స్థిరపడ్డాయి. అన్యదేశ్యాలను యథాతథంగా స్వీకరించడంలో తప్పులేదు. ఇది ఆధునీకరణ క్రమం కూడా. తెలుగులో పదాన్ని సృష్టించే కృషి లుప్తం కాకూడదు అనే విషయాన్ని గుర్తించవలసింది.

## పత్రికల్లో విభక్తులు:

విభక్తులు నామపదానికి (శబ్దానికి) ద్వితీయా విభక్తి ప్రత్యయం చేరేటప్పుడు ఆ పదంలో కొంత మార్పు జరుగుతుంది. ఈ విషయాన్ని గుర్తించవలసింది. కానీ కొంత మంది పాత్రికేయులు గుర్తించడం లేదు. కొన్ని చోట్ల ఏకంగా ప్రత్యయాన్నే ఎగరగొట్టేస్తున్నారు. షష్ఠీవిభక్తి స్థానంలో ద్వితీయా విభక్తి ప్రత్యయాన్ని ఉపయోగిస్తున్నారు.

ఉదా. 'స్థలం' అనే నామానికి ద్వితీయావిభక్తి ప్రత్యయం చేరి **"స్థలాన్ని"** అవుతుంది. కానీ **"స్థలంను"** అని రాస్తున్నారు.

"…. ప్రత్యామ్నాయంగా హైదర్‌నగర్ ఫిల్లింగ్ పాయింట్ నుంచి ట్యాంకర్లకు **నీటి** నింపాలని నిర్ణయించారు". 'ట్యాంకర్లకు నీటిని' అని ద్వితీయావిభక్తిలో రాయాలి.

**షష్ఠీవిభక్తి విషయంలో కూడా ఇటువంటి పొరపాట్లను చేస్తున్నారు.**

– శ్రీ రామనవమి సందర్భంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి **"భద్రాచలంకు"** ప్రత్యేక బస్సులను వేశారు. ఇక్కడ **"భద్రాచలానికి"** అని రాయడానికి బదులు **"భద్రాచలంకు "** అని రాశారు.

"… బాధితులు ఖమ్మం జిల్లా **'భద్రాచలం'కు** చెందిన వారని పోలీసులు తెలిపారు. వారు తిరుపతి నుండి **'భద్రాచలం'** వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది". ఇక్కడ **'భద్రాచలము'** కాస్త 'భద్రాచలం' అవుతుంది. అప్పుడు 'భద్రాచలానికి' అని అవుతుంది కానీ 'భద్రాచలంకు' అని మాత్రం కాదు.

గ్రామం – గ్రామానికి, పట్టణం – పట్టణానికి అని రాయవలసి ఉంటుంది. సున్నాతో అంతమయ్యే పదాలకు దాదాపు ఇదే విధంగా వస్తుందని ఒక గుడ్డి గుర్తు పెట్టుకోవచ్చు. పల్లె – పల్లెకు, కౌకుంట్లకు, దేవరకద్ర – దేవరకద్రకు, ఏనుగొండ

– ఏనుగొండకు, కోయిలకొండ – కోయిలకొండకు, ముచ్చింతల – ముచ్చింతలకు, కురుమూర్తి – కురుమూర్తికి , అనేవిధంగా రూపాలు ఉంటాయని గ్రహించాలి.

**'... విభాగం అధిపతిగా** బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు'.

ఇక్కడ **'విభాగాధిపతిగా'** అంటే సరిపోతుంది. ఇది సిద్ధసమాసం (సంస్కృత సమాసం) – **'విభాగస్య అధిపతి'** అని విగ్రహవాక్యం. విభక్తిలోపం జరిగి **'విభాగ అధిపతి'** అని అవుతుంది. ఆ తరువాత సంధి జరిగి **'విభాగాధిపతి'** అనే సమాసపదం ఏర్పడుతుంది.

'.... గతంలో అయన సామాజిక తదితర శాస్త్రాల **పీఠం అధిపతిగా,** దూరవిద్యా కేంద్రం **సంచాలకునిగా** కూడా సేవలందించారు,'

**పీఠం అధిపతిగా'** అనడం కంటే **'పీఠాధిపతిగా'** అంటే ఎటువంటి వ్యాకరణదోషం ఉండదు. పైన చెప్పినట్లే ఇక్కడ కూడా – **'పీఠస్య అధిపతి'** అని ఉండగా విభక్తి లోపం, సంధి జరిగి 'పీఠాధిపతి' అవుతుంది కానీ **'పీఠం అధిపతి'** మాత్రం కాదు.

**'కేంద్రం సంచాలకునిగా'** అనే సమాసంలో కూడా పై విధంగానే వ్యాకరణ కార్యాలు జరిగి **'కేంద్రసంచాలకునిగా'** అనే రూపం ఏర్పడుతుందేగానీ **'కేంద్రం సంచాలకునిగా'** అనే రూపం ఉండదు.

## తృతీయా విభక్తి –

'జిల్లాల **విభజన సహా** పలు కీలక అంశాలపై చర్చ' – తృతీయావిభక్తిలోనే **'సహా'** ప్రయోగం జరుగుతుంది. **'విభజనతో సహా'** అని **'విభజన'** శబ్దానికి **'తో'** అనే తృతీయావిభక్తి ప్రత్యయాన్ని చేర్చాలి.

**'ఐదుగురు పిల్లలు సహా 9 మంది దుర్మరణం'**

ఐదుగురు **పిల్లలతో సహా** 9 మంది దుర్మరణం అంటే వ్యాకరణ దోషం ఉండదు. తద్వారా భావం చెడదు.

'భారత్ లో భవిష్యత్ **కాలుష్యభూతం దృశ్యం** ఇది'

**'కాలుష్యభూతం దృశ్యం'** – ఇది సిద్ధసమాసం (సంస్కృత సమాసం)

**'కాలుష్యభూతస్య దృశ్యం'** అని సంస్కృతంలో (షష్ఠీతత్పురుష సమాస) విగ్రహవాక్యం. దాన్నే సమాసపదంగా రాస్తే – **'కాలుష్యభూతదృశ్యం'** అవుతుంది. కాబట్టి **'కాలుష్యభూతదృశ్యం'** అనే రాయాలి. లేదంటే **'కాలుష్యభూతము'** అని చేసుకొని అప్పుడు **'దృశ్య'** శబ్దంతో సమసింపజేస్తే **'కాలుష్యభూతపు దృశ్యం'** అని సాధ్యసమాసం అవుతుంది. **'కాలుష్యభూతపుదృశ్యం'** అని ఉపయోగించుకోవచ్చు.

## సమాసాలు–

'భద్రాచలంలో మహిళమృతి, 8 మందికి **తీవ్ర గాయాలు'.**

**'తీవ్రగాయాలు'** అనే సమాసంలో 'తీవ్ర' అనే పదం సంస్కృతం, 'గాయం' అనే పదం తెలుగు. సంస్కృత పదాన్ని తెలుగు పదంతో సమసింపజేయడం వ్యాకరణ విరుద్ధమౌతుంది. కాబట్టి **'తీవ్రమైన గాయాలు'** అని గానీ, **'తీవ్రంగా గాయాలయ్యాయి'** అని గానీ లేదా **'చాలా గాయాలు'** అని గానీ అంటే బాగుంటుంది.

'ఏపీలోని 16 వ నంబరు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు **మృత్యువాత** పడ్డారు.

'మృత్యువాత' అనే సమాసంలో 'మృత్యు' అనే పదం సంస్కృతం, 'వాత' అనే పదం తెలుగు కాబట్టి వైరిసమాసం అవుతుంది. దానికి బదులు **'మరణించారు'** అంటే సరిపోతుంది. 'మృత్యు' శబ్దాన్నే ప్రయోగించాలని ఉంటే **'మృత్యుపరిష్వంగం'** అనవచ్చు. అదే విధంగా **'మృత్యుకౌగిలి'** అనే ప్రయోగం కూడా చేస్తున్నారు. **మృత్యుకౌగిలి** కి బదులు 'చావుకౌగిలి' అంటే అందంగా ఉంటుంది.

'.... **తీవ్ర మంచినీటి** ఎద్దడి నేపథ్యంలో నియోజక వర్గానికి రూ.260 కోట్ల భారీ నీటి ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. **'తీవ్రమైన మంచినీటి'** అంటే హాయిగా ఉంటుంది. లేదంటే సంస్కృత పదమైన 'తీవ్ర' కు తెలుగు పదమైన 'మంచి' కి సమాసం చేస్తే మంచిగుండదేమో!

'ప్లాస్టిక్ కవర్ మెడకు చుట్టుకుని ఊపిరాడక బాలుడు మృతి.

ఇటీవలే నాలుగో బర్త్ డే సంబురాలు శోకసముద్రంలో తల్లిదండ్రులు'

**'శోక'** సంస్కృతపదం, **'సంద్రం'** తద్భవం. **'శోకసంద్రం'** (వైరిసమాసం) అనడం కంటే **'శోకసముద్రం'** (సిద్ధసమాసం) అనవచ్చు.

'.... ఉద్యోగులు **తీవ్ర ఇబ్బందులు'** ఎదుర్కొన్నారు.

**'తీవ్ర ఇబ్బందులు'** వైరిసమాసం. తీవ్ర - సంస్కృతం, ఇబ్బందులు - తెలుగు. కాబట్టి **'తీవ్ర కష్టాలు'** లేదా **'తీవ్రమైన ఇబ్బందులు'** అని రాస్తే బాగుంటుంది.

'నిమ్స్ దవాఖానాలో **అతి తక్కువ** వేతనంతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలని డిమాండ్ చేస్తూ.... **'అతి తక్కువ'** కు బదులు - **'అత్యల్ప'** లేదా **'చాలా తక్కువ'** అని రాయవచ్చు.

'.... వరద ఉధృతికి మట్టి కొట్టుకుపోయి **భారీ గుంతలు** ఏర్పడ్డాయి.'

'.... వరద ఉధృతికి మట్టి కొట్టుకుపోయి పెద్ద గుంతలు '(తెలుగు సమాసం) అంటే తెలుగుభాషను గౌరవించిన వాళ్లమౌతాం.

'.... అందువల్లే రైతులకు **ఆర్థిక ఇబ్బందులు'**

**'ఆర్థిక ఇబ్బందులు'** అనడం కంటే **'ఆర్థికమైన ఇబ్బందులు'** లేదా **'ఆర్థిక కష్టాలు'** అంటే హాయిగా ఉంటుంది. **'జాతీయ సెమినార్'** లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ...'

ఇక్కడ **'జాతీయ సెమినార్'** ను 'జాతీయ సదస్సు' అనొచ్చుకదా?

పుంప్వాదేశం ద్వారా వైరిసమాసం లేకుండా చేయవచ్చు. **'నిర్మాణపనులు'** అనే వైరిసమాసాన్ని తీసుకుంటే **'నిర్మాణ'** అనే సంస్కృత పదాన్ని **'నిర్మాణము'** అని తద్భవంగా చేసుకొని - **'నిర్మాణము... పనులు'** అని, ఆ తరువాత **'నిర్మాణపనులు'** అవుతుంది. అంటే పుంప్వాదేశం ద్వారా సాధ్యసమాసంగా మార్చవచ్చు. **'అంతిమ వీడుకోలు'** అన్నప్పుడు 'అంతిమ' అనే పదం సంస్కృతం, 'వీడుకోలు' అనే పదం తెలుగు కాబట్టి **'అంతిమపు వీడుకోలు'** అని పుంప్వాదేశం చేసి సాధ్యసమాసంగా ఉపయోగించుకోవచ్చు లేదా 'చివరి వీడుకోలు అని తెలుగు సమాసం కూడా చేసుకోవచ్చు. ఇటువంటివే మరికొన్ని కింది పట్టికలో చూడవచ్చు.

| | | |
|---|---|---|
| నిర్మాణపనులు | – | నిర్మాణపు పనులు |
| ఆదాయ పన్ను | – | ఆదాయపుపన్ను |
| వినోదపన్ను | – | వినోదపు పన్ను |
| కేంద్రసాయం | – | కేంద్రపుసాయం |

**అనుస్వారం (సున్న) చేర్చి వాడవచ్చు.**

| | | |
|---|---|---|
| మతబిల్లు | – | మతం బిల్లు |
| కులపార్టీలు | – | కులం పార్టీలు |
| అవిశ్వాస తీర్మానం | – | అవిశ్వాస నోటీసు |

వైరిసమాసం అవుతుందనుకున్నప్పుడు 'అయన' చేర్చితే కూడా ఆ దోషం తొలిగిపోతుంది అంటే వ్యాకరణరీత్యా అది తప్పుకాదు. అందుకు కొన్ని ఉదాహరణలను **'కీలక మలుపు'** అన్నప్పుడు **'కీలక'** సంస్కృతం **'మలుపు'** తెలుగు. కాబట్టి **'కీలకము'** అని తద్భవంగా మార్చుకొని **'కీలకము అయిన మలుపు'** ఆ తరువాత 'కీలకమైన మలుపు' అవుతుంది. మరిన్ని ఉదాహరణలు కింది పట్టికలో చూడవచ్చు.

| **ఇలాకాదు** | | **ఇలారాయండి** |
|---|---|---|
| కలుషిత నీరు | – | కలుషితమైన నీరు. |
| అనవసర గొడవ | – | అనవసరమైన గొడవ |
| విప్లవాత్మక మార్పులు | – | విప్లవాత్మకమైన మార్పులు |
| తీవ్ర ఇబ్బందులు | – | తీవ్రమైన ఇబ్బందులు |

## మిశ్రమసమాసాలు

మిశ్రమసమాసంలో పూర్వోత్తర పదాలలో ఒకటి తత్సమం మరొకటి దేశ్యమై ఉంటుంది. (తత్సమాచ్ఛికాలకు సమాసం). మిశ్రమసమాసాలను వ్యాకర్తలు ఒప్పుకున్నారు. మిశ్రమసమాసం తెలుగు విభక్తులతో విగ్రహవాక్యం చెప్పడానికి వీలుంటుంది.

'...... ఈ ప్రాంతాల్లో గోడలు కూలిన పెను ప్రమాదం జరిగే అవకాశముందని భావిస్తున్నారు.'

**'పెనుప్రమాదం** అనే మిశ్రసమాసం కంటే **'పెనుముప్పు'** అనే తెలుగు సమాసం బాగుంటుంది. తెలుగుభాషకు విలువనిచ్చినట్లుంటుంది. కాబట్టి **'పెనుముప్పు'** అని రాద్దాం.

**'నెలాఖరుకల్లా** 10 వర్సిటీల వీసీల ఎంపిక పూర్తి.'

**'నెలాఖరు'** - పదబంధం చాలా తరచుగా కనబడుతుంది. 'నెల' తెలుగు పదం, 'ఆఖరి' అన్యదేశం. 'నెలాఖరి' అంటే తప్పుకాదు. కానీ **'నెలచివర'** అనే అందమైన అచ్చతెనుగు పదబంధాన్ని ఎందుకు విడిచి పెట్టాలి?

'రైలు పట్టాలపై రెండు ముక్కలైన **ఆడ శిశువు.'**

**'ఆడశిశువు'** అనే మిశ్రమసమాసాన్ని చేయడం తప్పేమీ కాదు. కానీ ఇక్కడ మిశ్రమసమాసం కంటే **'ఆడపిల్ల'** లేదా **'ఆడబిడ్డ'** అనే తెలుగు సమాసాలు అందంగా ఉంటాయి.

ఈ కింది మిశ్రమసమాసాలను కొద్దిగా మార్చి రాస్తే బాగుంటుందేమో (సిద్ధ సమాసంగానైనా, ఐచ్ఛిక సమాసంగానైనా.)

| **దీనికి బదులు** | - | **దీన్ని రాయడం** | |
|---|---|---|---|
| కొత్తపద్ధతి | - | నూతనపద్ధతి | (సిద్ధసమాసం) |
| ఆడ శిశువు | - | ఆడ పిల్ల (అచ్ఛిక సమాసం) | |
| మగ శిశువు | - | మగ పిల్ల | (అచ్ఛిక సమాసం) |
| పాతకక్షలు | - | పాతపగలు | (అచ్ఛిక సమాసం) |
| మనోనిబ్బరం | - | గుండెనిబ్బరం | (అచ్ఛిక సమాసం) |
| నూతన పోకడలు | - | కొత్త పోకడలు | (అచ్ఛిక సమాసం) |
| నెలాఖరు | - | నెలచివర | (అచ్ఛిక సమాసం) |

## వాక్యనిర్మాణం -

'జోరుగా వర్షం పడటంతో భవనం, ప్రాంగణం, అక్కడికి దారితీసే దారులు చిత్తడిగా మారాయి. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.'

ఇక్కడ సామాన్య ప్రజలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి, కాబట్టి వీలైనంత వరకు వాక్య నిర్మాణంలో సందిగ్ధత ఉండకపోవడం మంచిది.

**'....అక్కడికి దారితీసే దారులు చిత్తడిగా మారాయి'**

అనే వాక్యం అలంకారికంగా బాగానే ఉంది. కాని సామాన్య పాఠకుడికి కొంత ఇబ్బందిని కలిగించవచ్చని నా అభిప్రాయం. ఎందుకంటే **'దారితీయడం'** అనే పదబంధాన్ని భవిష్యత్పరిస్థితిని చెప్పేటప్పుడు ఎక్కువగా వాడుతాం. దయచేసి గమనించండి.

**'అక్కడికి వెళ్లే దారులు చిత్తడిగా మారాయి'** అంటే సుఖంగా ఉంటుంది.

'.... ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినిర్మించిన ఈ ఇల్లు విలువ దీని విలువ 40 కోట్లకు పైగానే ఉంటుందట! అయిత ఈ ఇంటిని ఒబామా కొనుక్కున్నారని భావించేరు. ఆ ఇంట్లో కిరాయికి మాత్రమే ఉంచారట.

**'ఈ ఇల్లు విలువను'** అని చెప్పాడు. మళ్లీ వెంటనే 'దీని విలువ' అన్నాడు. 'దీని' విలువ అంటే దేని విలువో? ఆలోచించండి.

**'డూప్లికేట్ కీతో పార్కు చేసిన వాహనాలు చోరి'** – ఇది ఒక శీర్షిక. ఇందులో రెండు అంశాలను గూర్చి చెప్పుకోవాలి.

**ఒకటి** – 'డూప్లికేట్ కీతో పార్కు చేసిన వాహనాలు చోరీ' – అంటే – డూప్లికేట్ కీని ఉపయోగించి పార్కు చేస్తే ఈ వాహనాలను చోరి చేస్తున్నారనే అర్థమే నాకు ఝుటితి స్ఫురిస్తుంది. 'పార్కు చేసిన వాహనాలను డూప్లికేట్ కీతో చోరి' అంటే ఎంతో స్పష్టంగా ఉంటుంది.

**రెండవ విషయం** – 'వాహనాలు చోరి' అని ఉండదు. 'వాహనాల చోరి' అని ఉంటుంది. ఎందుకంటే – వాహనం యొక్క చోరి – వాహనచోరి. వాహనాల

యొక్క చోరి - వాహనాల చోరి (సమాసవిభక్తికి లోపంబగు లట్టునకుగాదు). దయచేసి ఆలోచించండి.

**జులై 11 న రైల్వే కార్మికుల దేశవ్యాప్త సమ్మె**

తెలుగు యూనివర్శిటి, జూన్ 17 : రైల్వే కార్మికులకు నష్టం కలిగే విధానాలను వ్యతిరేకిస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే ఉద్యోగుల యూనియన్ జోనల్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ భరణీ భాను ప్రసాద్ ప్రకటించారు. దేశ వ్యాప్తంగా జులై 11 వ తేదీన రైల్వే కార్మికులు చేపట్టిన ఒక రోజు సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ.....

ఇది జూన్ 27 న వచ్చిన వార్త. సమ్మె ఇంకా చేపట్టలేదు. **'చేపట్టిన'** అనడం వల్ల పాఠకుడిని కొంత తికమకకు గురిచేస్తుంది. కాబట్టి **'చేపట్టనున్న'** అంటే సౌలభ్యంగా ఉంటుందేమో?

**'రద్దీ ప్రాంతాల్లో సెల్ ఫోన్ల చోరి చేసే దొంగల అరెస్ట్'.**

పై వాక్యానికి బదులు **'రద్దీ ప్రాంతాల్లో సెల్ ఫోన్ల చోరి చేసే దొంగల అరెస్ట్'** అంటే బాగుంటుందేమో!

'ఈ క్రమంలోనే **గత కొద్దిరోజుల కిందట** అసైన్డ్ భూములవివరాలపై క్షేత్రస్థాయిలో......'

పై వాక్యంలో 'గత' శబ్దం అనవసరం 'కొద్దిరోజుల కిందట....' అంటే సరిపోతుంది.

**ముగింపు -** ఈ పత్రంలో మచ్చుకు కొన్ని మాత్రమే చూపించాను. కానీ ఇటువంటివి ఎన్నో? ప్రతి వార్తాపత్రికలో మనం చూడవచ్చు. పాత్రికేయులు పదాల, పదబంధాల విషయంలో, వాక్యనిర్మాణంలో కూడా కొంత జాగ్రత్త వహించవలసిన అవసరం ఉంది.

సంస్కృత భాషవల్లనే తెలుగుభాషకు నష్టం కలిగిందని మనలో కొంత మందిమి అరోపిస్తున్నాం. కానీ అది తప్పేమోనని నా అభిప్రాయం. ఎందుకంటే సంస్కృత భాషా పదాలను తెలుగు భాషలోకి తెచ్చుకుంటున్నామంటే తెలుగుభాష

విస్తృతమౌతుందని గ్రహించాలి. తెలుగుభాషతో పాటు సంస్కృత భాషను కూడా చదువుకుంటే పైన చెప్పుకున్న చిన్న చిన్న తప్పులు జరగవు. అంతే కాకుండా సంస్కృత భాషా పదాలను ఎంతో నేర్పుతో ఉపయోగించుకోవచ్చు. మనకు సంస్కృతం వద్దనుకుంటే తెలుగు భాషలోనే ఆధునిక అవసరాలకు అనుగుణంగా పదాలను నిర్మించుకునే ప్రయత్నం చేయాలి. పాతబడ్డ అచ్చమైన తెలుగు పదాలను వెలుగులోకి తేవాలి. అది అందరికీ ఆనందమే కదా.

వ్యాసకర్త - **పరిశోధక విద్యార్థి**

# పరిమితుల్లేని వ్యవస్థ మీడియా

**- కోవెల సంతోష్ కుమార్**

"వంద వేల తుపాకుల కంటే మూడు పత్రికలకు నేను భయపడతాను" - నెపోలియన్ బోనాపార్టే..

ప్రపంచ వ్యాప్తంగా మీడియాకు ఉన్న శక్తి అసాధారణమనటానికి నెపోలియన్ అన్న ఈ ఒక్క మాట చాలు. మొదట్లో పత్రికలు మాత్రమే భాగస్వామ్యమైన మీడియాలో ఇప్పుడు టెలివిజన్, మరోవైపు అంతర్జాలం. అంతకు మించి సామాజిక మాధ్యమాలు వేయి రెట్లు బలంగా ప్రజల్ని ప్రభావితం చేస్తున్నాయి. శాసన, న్యాయ, కార్య నిర్వాహక వ్యవస్థలతో పాటు సరి సమానంగా నాలుగో ఎస్టేట్ స్థాయిని మీడియా సంపాదించుకుంది. మిగతా మూడు వ్యవస్థలకు, ప్రజలకు మధ్య ఒక వారధిలా ఒకటైన భావ ప్రకటనా స్వేచ్ఛకు స్పష్టమైన నిర్వచనాన్ని అందించిన వ్యవస్థ మీడియా మాత్రమే. దాదాపు రెండు వందల సంవత్సరాలుగా ప్రజలను చైతన్యవంతులను చేసే దిశలో పత్రికలు, ప్రసార మాధ్యమాలు స్వేచ్ఛగా వ్యవహరిస్తూ సమాజంలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తున్నాయి. భారత స్వాతంత్రోద్యమ కాలంలో పత్రికలు నిర్వహించిన భూమిక జాతి పునర్వికాసానికి దోహదపడింది. ఉద్యమ

నాయకత్వానికి, ప్రజలకు మధ్యన పత్రికలు స్వేచ్ఛావాణిని బలంగా వినిపించాయి. నిర్బంధాలన్నింటినీ అధిగమించి ప్రజల్ని చైతన్యవంతులను చేశాయి. ఆనాడు పత్రికలు అంటే ఒక ఉన్నతమైన అభిప్రాయం ఉండేది. ఆనాటి భాష గ్రాంథికం కావచ్చు. పండిత లోకానికి మాత్రమే పరిమితమైన సుదీర్ఘ సమాసాలతో కూడిన భాష అయి ఉండవచ్చు (ఎందుకంటే ఆనాడు పాఠకులు ఎక్కువగా పండితులే కావటం వల్ల పత్రికల భాష కూడా అలాగే ఉండేదేమో). కానీ పత్రికలు ఎలా వ్యవహరించాలి? సమాజంలో దాని పాత్ర ఏమిటన్న దానిపై నాటికీ నేటికీ భిన్నాభిప్రాయాలు లేవు. పత్రికలు అంటే.. "ప్రజలను నిద్ర పోనీయవు. సంఘములను మరుగు కానీయవు. లోపములను వెల్లడి పరుచును. జనవాక్యమునేకోన్ముఖము చేయును. భౌతిక ప్రపంచమున రైళ్లు, టెలిగ్రాఫులు, ఏమి చేయునో, మానసిక ప్రపంచమున పత్రికలు ఆ కార్యమునే నిర్వహించుచున్నవి. లోకమునంతను ఒక్కమారు బహిరంగపరచి దేశ కాలములను బంధించివైచుతున్నవి. నదులెట్లు కొండలలో బుట్టు ఊటలనేకము చేసి పల్లపు భూముల నింపునో, అట్లే పత్రికలు మేధావంతుల తలలో బుట్టు తలపులను క్రోడీకరించి జనసామాన్యము యొక్క సంకీర్ణ హృదయంపై వెదజల్లును. పత్రికలు, ప్రజలు తమ రక్షణకై ఏర్పరుచుకొనిన వజ్రాయుధములు. వాని ముందు ప్రభుత్వములు, మతములు, పూర్వాచార దుర్గములు, నిరంకుశత్వములు గడగడలాడక తప్పదు. ప్రజ యొక్క మేఘ గంభీర ఘోష పత్రికాద్వారమున బ్రతిధ్వనించి భావి కాలగర్భమునుంచి ప్రసరించుచున్న ప్రజాస్వామికమునకు స్వాగతమొసంగుచుండును. "(ముట్నూరి కృష్ణారావు, వ్యవస్థాపక సంపాదకులు, కృష్ణాపత్రిక) ఆయన భాష కఠినమైనా లక్ష్యం మాత్రం అదే.

మన దేశం బహుళ భాషలున్న దేశం. అన్ని భాషల్లోనూ సంస్కృత శబ్దాలు అనేకం ఒకటి రెండు తేడాలతో కనిపిస్తాయి. "పత్రిక" అన్నది అలాంటి పదాలలో ఒక్కటి. సంస్కృతంలో పత్రిక అంటే లేఖ అని అర్థం. అంటే కమ్యూనికేషన్ అని అర్థం. మన సమాజంలో ఇతరులు ఏం చేస్తున్నారో తెలుసుకోవాలన్న కుతూహలం చాలా ఉంటుంది. పొరుగింటి నుంచి ప్రపంచంలోని ప్రతి ఘటనపైనా ఉత్కంఠ ఉంటుంది. వీటన్నింటి ప్రాతిపదికే పత్రికల ఆవిర్భావానికి మూలం.

ఆనాడు కానీ, నేడు కానీ పత్రికలకు నిర్దిష్టంగా ఒక ప్రత్యేక భాష లేదు. తొలినాళ్లలో పండిత లోకానికి పరిమితమైన సుదీర్ఘ సమాసాలతో కూడుకున్న వాక్యాలతో ప్రారంభమైన తెలుగుపత్రికల భాష.. రోజులు మారుతున్న కాలాన్ని బట్టి ఎప్పటికప్పుడు కొత్త ఒరవడిని సంతరించుకుని సులభశైలిలో మామూలు పాఠకుడికి అర్థమయ్యే విధంగా మారిపోయింది. ఎంతలా మారిపోయిందంటే పత్రికల భాష సృష్టించిన పదజాలం తెలుగులో సొంత పదాలుగా ఇమిడిపోయాయి. కొత్త భావాలకు కొత్త శబ్దజాలం అవసరమవుతుంది. అలా అవసరమైన శబ్దాలను భాష సొంతంగా తనలో సమకూర్చుకుంటూ వెళ్తాయి. కొన్ని భాషల నుంచి సంగ్రహించి వాడుకుంటాయి. కొన్ని పదాలైతే ఇతర భాషా పదాలంటే నమ్మలేనంతగా కలిసిపోతాయి. మనం అత్యంత సాధారణంగా ఇప్పుడు వాడుతున్న "అసలు", "మామూలు"– తెలుగు పదాలు కావంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇలాంటి పదాలు తెలుగులో చాలానే వచ్చి చేరాయంటే అది పత్రికల భాషలో జరిగిన అనేక ప్రయోగాల వల్లనే అనటం అత్యుక్తి కాదు. ఇప్పుడు కూడా ఇంగ్లీషు పదాలు తెలుగులో అతిగా సమ్మిళితమైపోయిన పరిస్థితి. ఈ పరిస్థితిలో మార్పుకోసం మరో ప్రయత్నం పత్రికల ద్వారానే ప్రారంభమైంది. ఇంటర్నెట్‌ను అంతర్జాలం అన్నట్లుగానే అనేక ఆంగ్లపదాలను అచ్చమైన తెలుగులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. అయితే, ఈ పదాలలోనూ తెలుగు అనుకుని సంస్కృత పదాలను సృష్టిస్తున్నవి ఎన్నో ఉన్నాయి. దీనికి కారణం ఈనాటి జర్నలిస్టులకు అచ్చమైన తెలుగు పదాలు ఏమిటన్న దానిపై స్పష్టత లేకపోవటమే. అయినా వాటిలో తెలుగుదనం ఉంది. ఎక్కడో పరాయిభాషనుంచి అరువుతెచ్చుకున్న పదజాలం కంటే మనదైన భాషలో శబ్దజాలాన్ని పెంపొందించే ప్రయత్నం మొదట్లో కాస్త విడ్డూరంగా అనిపించినా, క్రమంగా వాటిని సొంతం చేసుకుంటూ పోతున్నకొద్దీ భాష సుసంపన్నమవుతుంది. అయితే ఇదే సమయంలో మీడియాలో భయంకరమైన మరో పార్శ్వమూ తెలుగు భాషను హననం చేసే వాతావరణం తెలియకుండానే కొనసాగుతోంది. ప్రధానంగా ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికే తెలుగు వర్ణమాలలో 56 అక్షరాల్లో చాలా అక్షరాలు కనుమరుగైపోయాయి. పాఠశాల స్థాయిలోనే తెలుగు నేర్పని పరిస్థితిలో, తెలుగు తెలియని వారు మీడియాలో ప్రవేశిస్తున్న వాతావరణంలో తెలుగు పదాలేమిటి? వాటి అర్థాలేమిటి అన్న అవగాహన ఉండాలని అనుకోవటం

కూడా పొరపాటే అవుతుంది. కాన్వెంట్ల నుంచి పుట్టుకొచ్చిన జర్నలిస్టులు రాస్తున్న వార్తల భాష మీడియాను కలుషితం చేస్తోంది. ఇందుకు రెండే రెండు ఉదాహరణలు చెప్తా. చానళ్లలో వార్తలు రాస్తున్న వారు, చెప్తున్న వాళ్లు చేస్తున్న ప్రయోగాలను అర్థం చేసుకోవచ్చు. పరిణామం తెలుగులో పత్రికల కంటే, మీడియాలోనే ఎక్కువగా కనిపిస్తోంది. 'ఋష్యమూకం' అన్న పదాన్ని నేనొకసారి వాడినప్పుడు నాకు సహచరుడిగా ఉన్న ఓ ఉపసంపాదకుడు(సబ్ ఎడిటర్) ఆ పదాన్ని ఋష్యమూకం అని చదివాడు. అదేమంటే మీరదే రాశారు సర్ అని దబాయించాడు కూడా. కారణం ఏమంటే తెలుగులో 'ఋ' అన్న అక్షరం ఉన్నదన్న విషయం అతనికి తెలియదు. టివిలో వార్తలు చదివే యాంకర్ 'వందిమాగధులు' అని రాసినప్పుడు ఆమె 'వంది మాదిగలు' అని చదివారు. ఇదేమమ్మా ఇలా చదివారు అని ప్రశ్నిస్తే ఆ పదానికి అర్థం ఏమిటని ఎదురు ప్రశ్నవేశారు. ఇదీ మీడియా భాషా పదాడంబరం. దీనికి పరిమితుల్లేవు. నియంత్రణ లేదు. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని "గంటలు" కవితలో కళాయతనం అన్న పదాన్ని టీవీలో ఓ ప్రొమో కోసం వాడినప్పుడు కళాయతనం అంటే కళాసీలు ఉండే ప్రాంతం అని ఓ సీనియర్ పాత్రికేయుడు అర్థం చెప్పారంటే మీడియా భాష ఏవిధంగా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

మీడియా ఇప్పుడు విరివిగా మనం వాడుతున్న పదం. పత్రికల నుంచి టివీలు, వెబ్‌సైట్‌లు, సామాజిక మాధ్యమాల్లో విస్తరిస్తూ వెళ్లిన సమాచార విప్లవానికి పేరు మీడియా. సెటిలైట్ టెలివిజన్ రంగంలోకి ప్రవేశించాక మీడియా విస్తృతి పెరిగిపోయింది. 1997నాటికి ఒకటి రెండు మాత్రమే ప్రయివేటు ఛానళ్లు అందుబాటులో ఉంటే, ఇప్పుడు వాటి సంఖ్యను లెక్కించటం రాత్రివేళ నక్షత్రాలను లెక్కించటం లాంటిదే. ఒక్క తెలుగులోనే అదీ హైదరాబాద్‌లోనే దాదాపు 165 ఛానళ్లు (ప్రాంతాల వారిగా కేబుల్ ఛానళ్లతో కలిపి) రోజూ కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నాయి. ఇవి కాకుండా వెబ్ ఆధారిత ఛానళ్ల సంఖ్య సరేసరి. అంతే కాదు. దిన పత్రికలకు తోడు వెబ్ మీడియా అంతకంటే వేగంగా విస్తరించింది. సాధారణ దినపత్రికలు స్థాపించటం కంటే, వెబ్ పత్రికలు పెట్టడం చాలా సులువైపోయింది. ఇక మొబైల్ యాప్‌లు, ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి సామాజిక మాధ్యమాల రూపంలో మీడియా వేయిపడగల ఆదిశేషువుగా విస్తరించింది. ఇప్పుడు వృత్తిరీత్యా జర్నలిస్టులే

కాదు, ప్రతి పౌరుడూ అవీ, ఇవీ కాదు, అనేకానేక అంశాలపై తమ తమ అభిప్రాయాలను నిష్కర్షగా చెప్పే అవకాశం లభించింది. లైవ్ స్ట్రీమింగ్‌లు, లఘుచిత్రాలు మీడియా విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఇప్పుడు ప్రతి ఒక్కరూ పాత్రికేయులుగా మారిపోయారు. ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ (వీఓఐపి) అన్నది వివిధ దేశాలకు విస్తృతంగా ఉపయోగపడుతున్న మాధ్యమంగా ఉంది.

పత్రికల ప్రారంభం అయిన నాటి నుంచి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి వరకు ఒకరకంగా నిర్వహించారు. వీటిలో లాభాపేక్ష తక్కువ. ఒకరిద్దరు తప్ప చాలా మంది ఆదర్శాలు, విలువలు, సమాజానికి, దేశానికి సేవచేయాలన్న ఉద్దేశంతో పెట్టినవే. 19వ శతాబ్దం తొలినాళ్లలో పత్రికల అమ్మకాలు రెండు వేల నుంచి పదిహేను వేల వరకే ఉండేవి. అందుకే వాటికి ఎక్కువకాలం మనుగడ లేకుండా పోయింది. ఆర్థిక కష్టాలు, నష్టాలు భరించలేక, పత్రికలను నడపలేక కనాకష్టం పడి దయనీయంగా మూతపడ్డ పత్రికలు ఎన్నెన్నో ఉన్నాయి. 1975వరకు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికలు మాత్రమే పెద్ద పత్రికలు. ఆ తరువాతి తరంలో ఆంధ్రభూమి, ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటివి లక్షల సంఖ్యల్లోకి పత్రికల అమ్మకాలను చేర్చాయి. ఇప్పుడు సాక్షి, నమస్తే తెలంగాణ వంటి పత్రికలు పోటీ పడుతున్నాయి.

ఆరోజు పత్రికల యాజమాన్యాలు ఎంత వ్యాపారం చేసుకున్నా, సంపాదక వ్యవహారంలో జోక్యం చేసుకున్న దాఖలాలు తక్కువ. మరి ఈ రోజు...? పాత్రికేయత వ్యాపారంతో ముడిపడుతున్న సంకేతాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. దానికి కారణాలు అనేకం ఉండవచ్చు. రాజకీయ నాయకులు, వివిధ పారిశ్రామిక వేత్తలు మీడియారంగంలోకి ప్రవేశించటం వల్ల కావచ్చు. మీడియా ఒక లాభసాటి వ్యాపారంగా మారి యాజమాన్యాలకు ''ఇతర'' ప్రయోజనాలను తేలిగ్గా సాధించిపెట్టగల వ్యవస్థగా మారటం వల్ల కావచ్చు. పత్రికా స్వేచ్ఛ అన్నది పరివర్తిల్లుతోంది. అటు శాసన వ్యవస్థలో నేరమయ రాజకీయం రాజ్యమేలుతుండటం, దానికి అనుబంధమైన మీడియాలో బహుముఖాల వ్యాపారవేత్తలు రంగంలోకి దిగడం సహజంగానే మీడియా విలువలను దిగజార్చాయి.

ప్రజాస్వామ్యం అంటే ప్రజల భాగస్వామ్యమే. ఆ ప్రజాస్వామ్యంలో అత్యంత కీలక భాగం మీడియా. ప్రజాభిమతాన్ని తెలుసుకోవటంలో తమ విధానాల

లోతుపాతులను బేరీజు వేసుకోవటంలో సర్కారుకు పెట్టనికోట మీడియా. కేవలం ప్రజాస్వామ్య వ్యవస్థల్లోనే కాదు, నియంతృత్వ పాలకులున్న, సైనిక పాలన సాగుతున్న దేశాల్లో సైతం మీడియానే ప్రజాభిప్రాయానికి కరదీపిక. ప్రపంచంలో ప్రజాస్వామ్యం పుట్టిన దగ్గర నుంచి మీడియా నిర్వహిస్తూ వస్తున్న పాత్ర నిజంగా నిరుపమానమైనదే. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో గురించి వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలైన నాలుగు వ్యవస్థల్లో మీడియాను చేర్చటంలోనే లభించిన ప్రాధాన్యత ఏమిటో అవి నిర్వహించాల్సిన గురుతర బాధ్యతలేమిటో అవలోకమవుతాయి. పత్రికాస్వాతంత్ర్యానికి విధినిషేధాలు విధించాలని ఎవరూ భావించలేదు. బాధ్యతాయుతమైన సర్వ స్వతంత్ర వ్యవస్థగా మీడియా పనిచేస్తుందన్న విశ్వాసంతోనే వారు పత్రికాస్వేచ్ఛకు ఎలాంటి నిర్వచనాన్ని చెప్పలేదు. అందరూ చెప్పే నిర్వచనం దాదాపు ఒక్కటే. "ప్రతి మనిషికి అభిప్రాయం ఉండటానికి, దాన్ని వ్యక్తం చేయటానికి హక్కు ఉంది. పత్రికాస్వేచ్ఛ అంటే ఇదే"నంటూ యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ డిక్లరేషన్ చెప్తోంది. ప్రపంచవ్యాప్తంగా విదేశాల్లో పనిచేసే టివి, రేడియో, పత్రికా విలేఖరుల కోసం అంతర్జాతీయంగా కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్(సిపిజె) అన్న సంస్థ ఒకటి కృషి చేస్తోంది. విలేఖరులను హత్య చేసిన సందర్భాల్లో, జైల్లో నిర్బంధించిన సమయాల్లో ఈ కమిటీ పూర్తిస్థాయి విచారణ జరిపి అంతర్జాతీయ న్యాయస్థానం ముందు ఆయా దేశాలను, ప్రభుత్వాలను నిలబెడుతుంది. ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ ఎక్స్ఛేంచి అనే గ్లోబల్ ఇమెయిల్ సంస్థ ఈ కేసుల విచారణల్లో సిపిజెకు సహాయ పడుతుంది. ఇది ప్రతి సంవత్సరం పెన్ ఫ్రీడం ఇండెక్స్‌ను విడుదల చేస్తుంది కూడా. 2007 ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్‌లో మన దేశం 120వ స్థానంలో ఉంది. ఈ ఇండెక్స్ ప్రధానంగా విదేశీ విలేఖరుల పట్ల జరుగుతున్న వేధింపులను దృష్టిలో పెట్టుకొని రూపొందింది. జమ్ము కాశ్మీర్‌లో విదేశీ జర్నలిస్టులకు ప్రవేశాన్ని నిషేధించటం వల్ల భారత్ స్థానం 120లో ఉంది. కానీ మిగతా ప్రాంతాల్లో అంతర్గతంగా ఇక్కడ మీడియాకు ఉన్న స్వేచ్ఛ దాదాపు అపరితమనే చెప్పాలి. ఈ ఇండెక్స్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఏటా దాదాపు 40 మంది విదేశీ విలేఖరులు వివిధ నిర్బంధాలు, దాడుల వల్ల హత్యకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యం లేని దేశాల్లో ఈ నిర్బంధాలు ఎక్కువవుతున్నాయి. చిన్న చిన్న పొరపాట్లకు సైతం ఏళ్ల తరబడి జైల్లో మగ్గిన

విలేఖరులు ఉన్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. నేపాల్, చైనా వంటి దేశాల్లో ఒక చిన్న పదాన్ని తప్పుగా రాసినందుకు, ఒక ఫోటో తప్పుగా ప్రచురించినందుకు విలేఖరులను కొన్ని సంవత్సరాల పాటు జైల్లోనే ఉంచారు. ఈ ఇండెక్స్‌లో చివరి స్థానంలో ఉన్నవి ఉత్తర కొరియా, ఇరాన్, తుర్కమెనిస్తాన్, వంటి దేశాలు. 2007లో ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు విధించటం, యుద్ధానికి సన్నద్ధం కావటంతో ప్రపంచానికి తమ దేశ అంతర్గత సమాచారం అందకుండా చేసేందుకే అక్కడి సుప్రీం నేషనల్ కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకుంది.

1766లో మొట్టమొదటగా స్వీడన్ ఫ్రీడమ్ ఆఫ్ ప్రెస్ చట్టాన్ని చేసింది. 1770 సెప్టెంబర్ 4, 1771 అక్టోబర్ 7 మధ్య కాలంలో డెన్మార్క్ నార్వేలు ఐరోపాలో మరే దేశం ఇవ్వనంత స్వేచ్ఛను పత్రికలకు ఇచ్చాయి. ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో విమర్శించినా, చట్టాలను సమూలంగా మార్చాలని కోరినా పత్రికలను అక్కడి ప్రభుత్వాలు నిర్బంధించలేదు. ఇక భారత దేశం విషయానికి వస్తే మన రాజ్యాంగంలో ప్రెస్ అన్న పదానికి ఎలాంటి నిర్వచనాన్ని రాజ్యంగ నిర్మాతలు ఇవ్వలేదు. ప్రెస్ ఫ్రీడమ్ అన్న మాటకు చోటు లేదు. రాజ్యాంగంలోని 19(1)ఏ అధికరణంలో పేర్కొన్న భావ ప్రకటన, వ్యక్తీకరణ స్వేచ్ఛ హక్కునే పత్రికా స్వేచ్ఛగా పేర్కొంటున్నారు. పక్క ప్రింట్ మీడియా మరో పక్క ఎలక్ట్రానిక్ మీడియా ప్రజాస్వామ్యాన్ని ఒక విధంగా శాసిస్తున్నాయనే చెప్పాలి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి మీడియా కొత్తపుంతలు తొక్కింది. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లోని అవినీతి కుళ్లును వెలికి తీయడంలో ఇవాళ మీడియా నిర్వహిస్తున్న పాత్ర నిరుపమానమైనది. రక్షణ కొనుగోళ్ల విషయంలోనూ, ప్రశ్నోత్తరాలకు ఎంపిల ముడుపుల వ్యవహారం బయటపెట్టడంలోనూ మీడియా రహస్య ఆపరేషన్లే కీలక భూమిక నిర్వహించాయి. ఇవాళ అనేక పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు అవినీతిపై చేస్తున్న సమరం సామాన్యమైనదేమీ కాదు. వీటి వల్ల ప్రజల్లో వచ్చిన చైతన్యమూ, చిన్నదేం కాదు. ఎక్కడ అవినీతి జరుగుతున్నా ప్రజలే మీడియాకు సమాచారం అందిస్తున్నారంటే పత్రికల ప్రభావం ప్రజలపై ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజకీయంగా కూడా దేశంలో మీడియా తీసుకొచ్చిన చైతన్యం తక్కువేమీ కాదు. దేశంలో ఇవాళ రాజకీయం ఒక వృత్తిగా స్వీకరించే పరిస్థితి నెలకొన్నది మీడియా

మారిపోవడం వాస్తవం. ఇప్పుడు మీడియా పరమోద్దేశం లాభార్జన మాత్రమే. పత్రికలపై పత్రికలు, పత్రికలపై చానళ్లు, చానళ్లపై చానళ్లు, ఇలా ఒకదానిపై మరొకటి అనారోగ్యకరమైన పోటీలు పడుతున్నాయి. సంచలనాల కోసం వార్తలను, వార్తాంశాలను చిలువలు, పలువలుగా మార్చి జనం మీదకు వదిలేస్తున్నా వాటిని నిరోధించే నాధుడే లేకుండా పోయాడు. క్షణానికో కొత్తరూపాన్ని ఆవిష్కరిస్తున్న సమాచార పరిజ్ఞానం మీడియానూ ముంచెత్తింది. తొంభయ్యో దశకంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన తరువాత వాటి ప్రభావం మీడియాపైనా తీవ్రంగా చూపించింది. ఒక్కమాటలో చెప్పాలంటే దాని రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. భారతీయ ప్రెస్ పాశ్చాత్య మోడల్‌ను తెచ్చిపెట్టుకుంది.

మన దేశంలో నిరక్షరాస్యులే ఎక్కువ. వ్యవసాయంపై ఆధారపడి ఉన్న ప్రజలు 80శాతం మంది ఉన్నారు. అలాంటి వారందరికీ ఒక పత్రికో, ఒక ఛానల్ వారో చెప్పిందే వేదం అవుతుంది. వీరందరిలోనూ తమ మాధ్యమం ద్వారా చైతన్యం తీసుకురావలసిన బాధ్యత పత్రికలది. ఆ బాధ్యతను ఇవాళ మీడియా పక్కన పెట్టినట్లు స్పష్టంగానే కనిపిస్తుంది. దేశంలో టెర్రరిస్టులు రెచ్చిపోతుంటే, వారి ఆగడాలను అడ్డుకుంటున్న భద్రతాబలగాలపై మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందంటూ రచ్చ చేయడంలో మీడియాలోని ఒక వర్గం క్రియాశీలక పాత్రను తోసిపుచ్చలేం. దేశ సార్వభౌమత్వానికి నిలువుటద్దమైన పార్లమెంటుపై దాడి చేసిన ఉగ్రవాదిని ఉరితీయాలంటూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెప్తే, ఉరి తీయాలా? వద్దా? అంటూ చర్చలు పెట్టి వాయిదా వేయించిన ఘనతా సెక్యులర్ రాజకీయ నాయకులతో పాటు మీడియాకూ దక్కుతుంది. అన్ని విచారణలు జరిపి ఉరిశిక్షను అమలు చేస్తే, దానిపై జాతివ్యతిరేకమూక రాజ్యాంగానికి, దేశానికి, సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా ఉత్సవాలు జరిపితే దానిపై మీడియాలో జరిపిన చర్చ మీడియా ఏ ధోరణిలో ముందుకు వెళ్తున్నదో అర్థం చేసుకోవచ్చు. మనకు వర్గ విభేదాలు ఉండవచ్చు, సిద్ధాంత వైరుధ్యాలు ఉండవచ్చు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చు.

అందరికీ 'దేశం' అన్నది ప్రధానం కావాలి. దాని సార్వభౌమాధికారాన్ని నిలబెట్టడం లక్ష్యం కావాలి. అంతేకానీ, ఒక వ్యక్తి అధికారంలో ఉన్నాడనో, అతన్ని తప్పనిసరిగా వ్యతిరేకించాలనో లక్ష్యం చేసుకుని దేశానికి విద్రోహం చేసే దిశలో దారుణమైన పరిణామాలు జరుగుతున్నా వాటికి అనుకూలంగా మాట్లాడటం, చర్చించటం క్షంతవ్యం కాదు. 2016లో కశ్మీర్‌లోయలో బుర్హాన్ వనీ అనే ఉగ్రవాదిని భద్రతాబలగాలు మట్టుపెట్టిన అనంతర హింసాపరిణామాలపై ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు అనుకూలంగా ఎన్‌డిటివి విలేఖరి బర్ఖాదత్ చేసిన వ్యాఖ్యలు, జమాత్ ఉద్ దవా నేత హఫీజ్ సయీద్‌కు పరమానందం కలిగించాయంటే మీడియా స్వరం దేశ ప్రయోజనాన్ని కూడా పక్కన పెట్టి ఎలా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. పాత్రికేయ వృత్తి పవిత్రమైనది. విలేఖరులు కానీ, పత్రికలు కానీ ఫలానా విధంగానే స్పందించాలని ఎవరూ గీత గీయరు. వారికి వారే తమ పరిమితులను గుర్తెరగాలి.దేశ సర్వోన్నతికి పట్టం కట్టాల్సిన బాధ్యత మీడియాపై ఉంది. దేశ గౌరవానికి, జాతీయ మౌలికతకు భంగం వాటిల్లే పరిస్థితులు ఎదురైనప్పుడు జాతినంతటినీ ఏకం చేయాల్సిన బాధ్యత మీడియాది. జాతీయ దృక్పథాన్ని అయితే ఇప్పటికే కొన్ని పత్రికలు డెవలప్‌మెంట్ జర్నలిజాన్ని అలవరుచుకుంటున్నాయి. కానీ, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం 1995 నుంచి మీడియా నెగెటివిజంను అలవరచుకున్నాయి. ఒక రాజకీయ పార్టీకో, ప్రభుత్వానికో సానుకూలంగానో, వ్యతిరేకంగానో ఏదో ఒకవైపు మాత్రమే నిలబడి వ్యాఖ్యానించటం కేవలం రాజకీయ ప్రయోజనమే పరమావధిగా మారింది. రాజ్యాంగంలోని 19వ అధికరణంలోని భావ ప్రకటనా స్వేచ్ఛనే పత్రికాస్వేచ్ఛగా పేర్కొంటున్న మీడియా, ఆ నిర్దేశిత స్వేచ్ఛను కూడా దుర్వినియోగం చేయటం వల్ల ఎవరికీ మేలుజరగక పోగా ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. కేవలం ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా మీడియా వ్యవహరించాలనే కాలం చెల్లిపోయింది. ఈ నేపథ్యంలో స్వీయ నియంత్రణతో, జాతి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మీడియా నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

"మనం (ప్రజలు) ఒక మందుపాతర మీద కూర్చుని ఉండటం లాంటి పరిస్థితిలో పత్రికలు మరింత వివేకంతో, నిగ్రహంతో వ్యవహరించవలసి ఉంటుంది.

ఏ మాత్రం పొరపాటు జరిగినా ఫలితం అగ్గి అంటుకుని సర్వం విధ్వంసం" - మహాత్మాగాంధీ (1947, సెప్టెంబర్ 10)

"పత్రికలు స్వేచ్ఛ కలిగి ఉండటం అంటే ప్రజల మనస్సును విషకలుషితం చేసే లైసెన్సు ఉన్నదనా?" - మహాత్మాగాంధీ (1947, సెప్టెంబర్ 21)

వ్యాసకర్త - **సీనియర్ జర్నలిస్టు**

# తెలుగు దినపత్రికల శీర్షికల రచన - ఒకపరిశీలన

*- పగడాల చంద్రశేఖర్*

భాషాపరంగా 1942 'ఆంధ్రపత్రిక', 1947 ఆంధ్రప్రభలోని కొన్ని శీర్షికలను పరిశీలిస్తే కొన్ని విషయాలు విశదమవుతాయి. ఆనాడు శీర్షిక రచన శిల్పం బీజప్రాయంగా ఉంది. వాక్యాలే శీర్షికలుగా ప్రవర్తిల్లాయి. వాటిలో కర్త, కర్మ, క్రియా పదాలు క్రమంగా ఉన్నాయి. శీర్షికలు కొన్ని సమాపక క్రియాంతాలుగా ఉన్నాయి. 'స్తంభించినది, రక్షించినది, అణచివేయబడును, పైచేయిగనున్నది, ఏర్పడవలెను, మందగించింది, ప్రతిష్ఠితమైంది, అంగీకరింపవలెను' మొదలయిన సమాపక క్రియలను వాడారు. కాని 1980 నాటి శీర్షికాశిల్పంలో స్తంభన, రక్షణ, అణచివేత, పైచేయి, ఏర్పడాలి (ఏర్పాటు), మందగింపు, ప్రతిష్ఠితం, అంగీకారం(అంగీకరించాలి) మొదలయిన రూపాలు ఉన్నాయి.

నాటి శీర్షికల్లో భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు నిర్దిష్టంగా సూచించబడ్డాయి. కానీ 1980 నాటి శీర్షికల క్రియారూపం తద్ధర్మార్థ బోధకం. కావున క్రియాపదానికి కాలబోధత ఉండదు. క్రియాపదం నామంగా మారడం ద్వారా వాక్యం రెండు నామబంధాలుగా ఏర్పడుతుంది.

నాటి క్రియలు భావార్థ బోధకాలుగా ఉన్నాయి. అంతేకాక అనిశ్చయార్థ బోధకతను గూడ కలిగిస్తున్నాయి. క్రియాంతాలు –అట అంతాలుగా ఉన్నాయి. 'దొరికినవట, లేదట, చేస్తాడట, దారుణమైనవట, చర్చించబడగలదట' మొదలైన వాటిలో క్రియపై '–అట' చేరిన రూపాలెక్కువగా ఉన్నాయి.

'ఆ పత్రిక (1967 పూర్వం)ల్లో ప్రవాహాన్ని పోలిన పతాకశీర్షిక, పంగనామాల వంటి శీర్షిక' అనే అభిప్రాయం కలదు (నరసింహారావు, 1967. పుట 68). అంటే అతిదీర్ఘమైన శీర్షికలున్నాయి అనే మాట నిజమే. క్రమక్రమంగా శిల్పం రూపుదిద్దుకుంది.

ఆధునిక యుగంలో శీర్షిక రచనాశిల్పం, శైలి సంపూర్ణంగా వికసించింది (సమకాలికంగా), ఒక శిల్పాన్ని రూపుదిద్దుకుంది. పరిమాణంలో లఘుత్వం, అర్థంలో గురుత్వాన్ని సంతరించుకుంది. శీర్షికా రచనలో కొన్నిలక్షణాలు ఏర్పడ్డాయి. అందులో క్రియారహితంగా ఉండడమొక లక్షణం. శీర్షిక సంపూర్ణార్థాన్ని తెలపడాన్ని క్రియాకాంక్షితమైనా లోపింపజేయడం మరొక లక్షణం. శీర్షికలను క్రియాజన్య విశేషణాలతో వ్రాయడం ఇంకొక లక్షణం. అంటే నామ్నీకరించడం. నామ్నీకరించినపుడు క్రియాజన్య విశేషణంగా క్రియ పరివర్తన పొందుతుంది. అపుడు నిర్దిష్ట పదాన్ని ఇష్టం వచ్చిన స్థానానికి చేర్చవచ్చు. ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సిన పదాన్ని శీర్షికాదిలోకిగాని, అంతంలోకిగాని మార్చవచ్చు. ఈ విధమైన శీర్షికలు ఎక్కువగా కన్పిస్తాయి. సమీకరణవాక్య శీర్షికలు కన్పిస్తాయి. ఈ విధానంలో క్రియను కృదంతంగా మార్చడమవుతుంది. ఈ కృదంతరూపాలు నామాలుగా వ్యవహరిస్తాయి. తద్వారా క్రియాపదాన్ని లోపింపజేయవచ్చు. ఈ విధానంలో రెండు పద్ధతులు ఉన్నాయి. అవి: 1.ఒక పద్ధతి భావార్థనామ్నీకరణ రూపంగా మార్చడం. క్రియను '–అటం/–అడం' అంతంగా మార్చడం. 2. క్రియారూపాలనుండి నామరూపాలను నిష్పన్నం చేయడం. ఉదా: ఏరివేయు/ ఏరివేత; తీయు/తీత మొదలైనవి.

శీర్షికలు క్రియారహితంగా ఉన్నాయి. అందువల్ల శీర్షికలోని విషయం, చర్య, సంభవించిన కాలం తద్ధర్మార్థకంగా ఉంటుంది. శీర్షికలోని మరొకపద సహాయంతో శీర్షిక కాలాన్ని గుర్తించాల్సి ఉంటుంది. లేకపోతే భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు వర్తింపజేయవచ్చు.

ఆకర్షకమైన శీర్షికలకోసం అనేక మార్గాలను అనుసరించరించడమైంది. కవితా ధోరణి, ప్రసిద్ధమైన కవితా ఖండికలు ఆదానం అవుతున్నాయి. జాతీయం కు రక్షణ కలుగుతున్నది. కొన్నిసార్లు శీర్షికలో అంతర్లయ భాసిస్తుంది. అందులో ఒక తూగు కూడా కన్పిస్తుంది. కొన్ని మాత్రాఛందస్సులోని పద్యపాదంలా కన్పిస్తాయి. ప్రయత్నంగానో, అప్రయత్నంగానో యతుల గతులు కూడా ఉన్నాయి. శీర్షికలు సమకాలికంగా సంపూర్ణంగా ఒక శిల్పాన్ని సంతరించుకొన్నాయి.

## ఆధునిక పత్రికల్లో శీర్షిక-అభివ్యక్తి:

శీర్షికారచన పరిపరివిధాలుగా సాగుతున్నది, వాటిని 15 రకాలుగా విభజింపవచ్చు. అవి- 1.పరికరాలంకారం, 2.శిష్టరూపకం, 3.సమాసోక్తి, 4.వ్యంగం, 5.ప్రతీకార్థకం, 6.అతిశయోక్తి, 7.శ్లేష, 8.యమకం, 9.ముద్రాలంకారం, 10.అనుప్రాస, 11.కుండలీకరణం, 12.గేయకవిత్వం, 13.పేరడీ, 14.సినిమాపాటలు, 15.సంస్కృతవ్యామోహం.

ప్రతి పత్రిక కూడా తన మనుగడకు, పాఠకులను ఆకట్టుకోవడానికి అనేకవిధాలుగా ప్రయత్నిస్తున్నది. అంటే వార్తలను ఎంపికచేసుకోవడంలోనేకాక, దాన్ని రాసే పద్ధతిలో కూడా అనేక వినూత్న పోకడులను పాటించడమవుతున్నది. అందుకు భాషాపరంగా అలంకారం, సుప్రసిద్ధ రచనలకు అనుసరణ, అనుసృజన, మొదలైన విధానాలను ఎన్నుకోవడమైంది.

సాధారణంగా పాఠకులకు బాగా అర్థమయ్యేవి బాగా ప్రచారంలో ఉన్న సామెతలు, అలంకారాలు, నుడికారాలు, పదబంధాలు, సుప్రసిద్ధ రచయితల మాటలు, సినిమాపాటలు, మొదలైనవి. వీటిని కొన్నిసార్లు యథాతథంగనూ, కొన్నిమార్లు అనుకరణ, అనుసరణ, అనుసృజన, మొదలైన రూపాల్లో అందిస్తున్నారు. అవి-

## ప్రసిద్ధ కవితను ఉట్టంకించడం:

'తాను ప్రయాణించే రైలు జీవితకాలం లేటు' అన్నాడు ఆరుద్ర. అయితే శ్రీశైలం పెవిలియన్ మ్యూజియం ప్రారంభానికి జీవితకాలం సరిపోదు. (ఈనాడు హై.జి. 22-11-2007, పుట13.)

## సామెతను ఉట్టంకించడం:

...కర్ర విరగకుండా, కోతి చావకుండా అనే రీతిలో అటవీశాఖ సిద్ధంచేసిన పథకమిదీ.. ఇది "కర్ర విరగకుండా, పాము చావకుండా." అనే సామెతకు అనుకృతి.

అదే విధంగా తీగలాగితే డంప్ దొరికింది. ఇది కూడా "తీగలాగితే డొంక కదిలింది." అనే సామెతకు అనుకృతి.

## ఆలంకారిక రచన

ఇక అలంకారాల విషయానికి వస్తే- ఉపమ, రూపకం వంటి అలంకారాలతోపాటు శ్లేషను కూడా అధికంగా వాడుతున్నారు. అయితే ఇది సాధారణ పాఠకులకు ఎంతవరకు అర్థమవుతుందని సావధానంగా పరిశీలించాల్సి విషయం.

## శ్లేషాలంకారం:

దీన్ని స్థూలంగా అభంగ శ్లేష, సభంగ శ్లేష అని రెండు విధాలుగా విభజించవచ్చు. వీటిని అనేక రకాలుగా విభజిస్తారు. పదానికి అనేకార్థాలు ఉండి, ఒకటి కంటే ఎక్కువ అర్థాలను సాధిస్తే అభంగ శ్లేష, అలా కాకుండా పదాలను విడదీసి అర్థాన్ని సాధిస్తే సభంగ శ్లేష అవుతుంది. పత్రికల్లో ఎక్కువగా సభంగ శ్లేషలే కనిపిస్తాయి. శ్లేషార్థ కల్పనకు ఆయా పదాలను ఒంటి ఉల్లేఖనాల్లో రాయడం జరుగుతున్నది.

బ్యాం'కింగ్'కామత –దీన్ని బ్యాంకింగ్‌లో కామత్ కింగ్ అని అర్థం చేసుకోవాలి.

వ్యవ'సాయం' సగమే –దీన్ని వ్యవసాయానికి సహాయం సగమే అని అర్థం చేసుకోవాలి.

భూసేక'రణం' ... (నవతెలంగాణ, హైదరాబాదు, 3-12-2015). భూసేకరణలో రణం జరుతున్నదని అని అర్థం.

గ'లీజు' ఒప్పందాలు (ఈనాడు, హైదరాబాద్, 7-9-2014,) బాక్సైట్, బీచ్‌శాండ్, గ్రానైట్ అన్నింటిలోను ఉల్లంఘనలే.

వేరుశ'నగ'మెరిసిపోవాలె ... (నవతెలంగాణ, హైదరాబాదు, 3-12-2015). వేరుశనగ పంట బాగా పండి, నగలుకొని, మెరిసిపోవాలి.

'మార్చు'తారా... లేదా..! (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 11-11-2014, పుట15) ఈ మార్చి వరకు మార్కెట్ తరలించకపోతే పరిస్థితి ఏమిటి?

సూర్య'డి'కి వందనం! (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 6-10-2013, జి.పుట4). సూర్యరశ్మి ద్వారా డివిటమిన్ లభిస్తుందని డాక్టర్లు తెలిపారు.

ఇకనుం'చైనా'చేతులు కలపాలి (ప్రధాన మంత్రి నరేంద్రమోడి వెల్లడి, నేడు చైనా అధ్యక్షుడు షి జిన్‌సింగ్ రాక) (ఈనాడు, హైదరాబాదు, 17-09-2014). -ఇకనుంచి అయినా చేతులు కలపాలి. దీన్ని ముద్రాలంకారమనవచ్చు.

కాంగ్రెస్ షి'కారు' (నవతెలంగాణ, హైదరాబాదు, 3-12-2015). టిఆర్ఎస్‌లో చేరేందుకు కాంగ్రెస్ నాయకుల సన్నాహాలు (నాయకుల పేర్లను నేను తెలపడంలేదు) -టిఆర్ఎస్ పార్టీ చిహ్నం కారు, కాబట్టి ఆ పార్టీలో చేరి, వారు షికారు చేయాలనుకుంటున్నారని అర్థం.

**యమకాలంకారం:** సమాన వర్ణాల జంటను అసమానార్థంలో ప్రయోగించడాన్ని యమకం అంటాం. అంటే ఒకే పదాన్ని రెండువేరువేరు అర్థాలు స్ఫురించేట్లుగా ప్రయోగించడం. ఇది ఛేకానుప్రాస కంటే భిన్నమైనది,అమ్మకాని(కి) అమ్మకడుపు (విస్తరిస్తున్న సరోగసీ విధానం), -దీన్ని అమ్మకాని అమ్మకడుపు అని, అమ్మకానికి అమ్మకడుపు అని అర్థంచేసుకోవాలి. సరోగసీ పద్ధతిలో పిల్లలను కని ఇవ్వడం. తమ గర్భాన్ని ఇతరుల పిల్లను పెంచడానికి అద్దెకు ఇవ్వడం. దీన్ని అమ్మకాని అమ్మకడుపు అని, అమ్మకానికి అమ్మకడుపు అని అర్థం చేసుకోవాలి. అమ్మ అనే పదం అమ్మ, అమ్మకం అనే అర్థాన్ని ఇస్తుంది.

**అనుసృజన:** కేవలం అలంకారాలతోనే కాక తరచూ ఇతర మార్గాల్లో కూడా తెలపడమవుతుంది. అది అనుసరణ, అనుకరణ, అనుసృజన రూపంలో ఉంటుంది.

'అయ్యో'ఎస్‌లు (ఐఏయస్‌కు తగ్గిన ఆదరణ). ఐఏయస్‌లకు కలిగిన బాధను తెలపడం.

బందో'మస్తు' (ఈనాడు, హైదరాబాదు, 6-9-2014). బందోబస్తు మస్తుగా ఉందని అర్థం.

'తెల్ల'ముఖం (దరఖాస్తులతో కార్యాలయాల చుట్టూ జనం ప్రదక్షిణలు, స్పష్టతలేక తలలు పట్టుకున్న అధికారులు) (ఈనాడు, హైదరాబాదు, 14-10-2014, పుట6)

కూర'గాయాలు' ఎందుకంటే.... (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 6-10-2013, జి.పుట4) కూరగాయల ధరలు పెరగడం గురించి.

'వీసీ'రోమంటున్న విశ్వవిద్యాలయాలు (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 17-11-2014, పుట12) విశ్వవిద్యాలయాలకు వీసీల నియామకంలో ఆలస్యం.-ఈసురోమంటున్న అనే నుడికారాన్ని ఆధారంగా చేసుకుని, సృజించడమైంది.

## అక్షరాల హరివిల్లు- అర్థం విలవిల

సాధారణంగా మానవుడు రంగుల లోకంలో విహరించాలనుకుంటాడు, విహరిస్తుంటాడు కూడా, అంతేకాక రంగురంగుల కలలను కంటాడు. లలిత కళల్లో చిత్రలేఖనంలో ఒక్కో రంగు ఒక్కో భావాన్ని తెలుపుతుంది. అంటే ఆయా రంగులకు ఆయాభావాలు నిక్షిప్తమై ఉన్నాయి. అయితే పత్రికారంగంలో ఈ వర్ణవిచక్షణను పాటిస్తున్నారో లేదో తెలియదు కానీ అర్థాన్ని స్ఫురింపచేయటానికి మాత్రం విస్తృతంగా వాడుతున్నారు.

## శ్లేషాలంకారం:

కీట'కాలు దువ్వితే'..... (నవతెలంగాణ, హైదరాబాదు, 26-11-2015) - కీటకాలు కాలు దువ్వితే అని దీని అర్థం. ఇది సభంగ శ్లేష. (మొత్తం-ఎరుపురంగు,)

ఉతికి ఆరేసిన కాగ్ (ఈనాడు, హైదరాబాద్, 7-9-2014, పుట1) ప్రభుత్వంలోని ఆరుప్రధానరంగాల్లో జరిగిన అవకతవకలను తూర్పారబట్టింది. (ఆరే ఎరుపురంగు, మిగిలిన భాగం నలుపురంగు)

ఏదైనా పనిచేస్తున్నపుడు, దానికి వ్యతిరేకంగా ప్రతిఘటన కానీ పోరాటం కానీ జరిగినపుడు ఆయా పదాలను బట్టి వ్యక్తీరించడం జరుగుతుంది. ఇది సార్వత్రికంగా విస్తరించింది.

అంగన్‌వా'ఢీ' ఏదైనా పనిచేస్తున్నపుడు, దానికి వ్యతిరేకంగా ప్రతిఘటన కానీ పోరాటం కానీ జరిగినపుడు ఆయా పదాలను బట్టి వ్యక్తీరించడం జరుగుతుంది. అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెను తెలపడమైంది. పదం వాడీ అయినప్పటికీ, ఎదుర్కొనడాని సూచించడానికి 'ఢీ' అని రాయడమైంది. ('ఢీ' ఎరుపురంగు, మిగిలిన భాగం నలుపురంగు)

బెల్జియంతో సెమీస్‌కు రె'ఢీ' (నవతెలంగాణ, హైదరాబాదు, 3-12-2015). సంసిద్ధత అనే అర్థాన్ని ఆంగ్లంలో 'రెడీ' అనే ఆంగ్లపదంతో సూచిస్తాం. కానీ ఇక్కడ పోరాటాన్ని కూడా సూచించడానికి రె'ఢీ' అని తెలపడమైంది.('ఢీ' ఎరుపురంగు, మిగిలిన భాగం నలుపురంగు)

స్వచ్ఛ్ందం (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 7-10-2014, పుట1) -కాలనీవాసులు స్వచ్ఛందంగా స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనడం.(స్వచ్ఛ్ ఎరుపురంగు, మిగిలిన భాగం నలుపురంగు)

అన్నింటికీ ఆధారమే! (ఈనాడు, హైదరాబాద్, 7-9-2014,) సబ్సిడీ పథకాలకు ముడిపెట్టడంపై ప్రధాని అసక్తి. (ఆధార- ఎరుపురంగు, మిగిలిన భాగం నలుపురంగు)

చోదనం అదుపు... ఇం'ధనం' పొదుపు (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 24-9-2013, పుట5) -ధనంపొదుపు, ఇంధనం పొదుపు అని గ్రహించాలి. (ఇం'ధనం' పొదుపు నీలిరంగు, మిగిలిన భాగం నలుపురంగు)

డి'విజన్' మారుతోంది! (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 22-10-2014, పుట1) హైదరాబాదులో డివిజన్ల పునర్విభజన.(మొత్తం ఎరుపురంగు)

**కుండలీకరణం:** సమాసంలోని ఒక అక్షరాన్ని లోపింపచేయటం వల్ల విభిన్నార్థం స్ఫురిస్తుంది. ఆ అక్షరాన్ని కుండలీకరణ చేయడమవుతుంది.

ఎంతక(న)ష్టం (నవతెలంగాణ, హైదరాబాదు, 3-12-2015). ఈ శీర్షికను రెండురకాలుగా అర్థంచేసుకోవాలి,అది ఎంతకష్టం, ఎంతనష్టం అని అర్థంచేసుకోవాలి. కుండలీకరణలోని (న)ను కలుపుకుని ఒక అర్థాన్ని, కలుపుకొనకుండా మరొక అర్థాన్ని గ్రహించాలి. (న) నలుపు, మిగిలిన భాగం ఎరుపురంగు)

**అక్షరాల మార్పు- నిర్దిష్టార్థ కూర్పు :** తాను చెప్పదలచిన అర్థాన్ని స్ఫురింపచేయటానికి, మూలపదంలోని అక్షరాన్ని మార్చడమవుతుంది.

ధ- ద: ధగ'దగా'లతో జాగ్రత్త! బంగారు ఆభరణాల అమ్మకంలో మోసంగురించి (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 22-10-2014, పుట20) -అమ్మకాల్లో దగా దాగిఉందని తెలపడమైంది. ధగధగ నుండి ధగ'దగా..ను సాధించడమైంది.(మొత్తం ఎరుపురంగు)

బీ-ధీ: ఆరోగ్యధీమాకల్పించాలి (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 24-10-2014, పుట8)

-ఆరోగ్యబీమాకు ధీమాకల్పించాలి.ఆరోగ్యబీమా నుండి ఆరోగ్యధీమా ను సృజించడమైంది. (ధీమా నీలం రంగు, మిగిలింది నలుపు)

ద-ధ: సామాన్యుడి బతుకంతా.. చింధరవందర (ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 7-9-2013, పుట2). ధరలు పెరగటంతో సామాన్యుని జీవితం చిందరవందరగా మారింది. చిందరవందర నుండి చింధరవందర ను కల్పించడమైంది.(ధర ఎరుపు, మిగిలింది నలుపు)

**ముద్రాలంకారం:** ప్రస్తుతార్థాన్నిచ్చే పదాలతో సూచనార్థాన్ని తెలిపితే ముద్రాలంకారం అంటాం. సూచించ తలచిన అర్థం తెలిసేట్లు పదాన్ని ప్రయోగించడం ముద్రాలంకారం.

హర్యానా మహామోదీయం (ఈనాడు, ఈపేపర్, ఆంధ్రప్రదేశ్, 20-10-2014, పుట1) -హర్యానా, మహారాష్ట్రలో భాజపా విజయ దుందుభి. మోదీని ఆమోదించారని తెలపడమైంది. మోదీ వచ్చేట్లుగా సభంగాత్మకంగా ప్రయోగించడమైంది.మహా(రాష్ట్ర) ఆమోదీయం. (మోదీ ఎరుపు, మిగిలింది నలుపు) షమిలమిల

(ఈనాడు, ఈపేపర్, హైదరాబాద్, 12-10-2013, పుట1) -యువపేసర్ మహమ్మద్ షమి (4/71) తన టెస్టు ఆరంభాన్ని ఘనంగా చాటుకున్నాడు.(షమి మిలమిల మెరిసిపోయాడని అర్థం).షమి వచ్చేట్లుగా సభంగాత్మకంగా ప్రయోగించడమైంది. (ష నలుపు, మిగిలింది ఎరుపు)

పత్రికలు ప్రజలను అక్షరాస్యులను చేయటంలో, వివిధ సందర్భాల్లో విభిన్న విషయాలపట్ల జాగృత పరచటంలో అగ్రగామిగా ఉన్నాయనడంలో సందేహం లేదు. అయితే కాలగమనంలో పత్రికా రంగం తన అస్తిత్వానికి, మనుగడకు, లాభార్జనకు అనేకపాట్లు పడుతున్నది. పాత్రికేయులు కూడా పత్రికా రచనలో అనేక కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. అయితే అప్పుడప్పుడు ప్రతిభ, వ్యుత్పత్తులు అడవిన కాచిన వెన్నెల్లా ఉంది, సక్రమమార్గంలో ప్రసరించడం లేదు. దీనికి పోటీతత్వం కూడా ప్రధాన కారణం కావచ్చు.

పత్రికలో రంగుల హరివిల్లు చోటుచేసుకున్న తరువాత పత్రికాభాష సాధారణ పాఠకునికి అందనంత ఎత్తులో ఇంద్రధనుస్సులో ఉందనే చెప్పాలి. పత్రికలో జాగా విలువైనదడంలో సందేహం లేదు. పత్రికా భాష పాఠకునికి అర్థంకావడం అనేది అంతకంటే విలువైనదనే విషయాన్ని మరువరాదు. అర్థవివక్ష కోసం ముద్రణలో అక్షరాలను, గుణింతాలను వేరువేరు రంగుల్లో ముద్రించడం, పదాలను విరిచి, వర్ణవివక్షతో ముద్రించడం హర్షణీయం కాదు, సమర్థనీయం కాదు. అర్థవంతమైన నవ్యత కావాలి, అంతేకానీ పనికట్టుకుని చేస్తున్నట్లుగా ఉండకూడదు. పాత్రికేయులు తమ రచనలపై అభిప్రాయాన్ని, కనీసం ఇంట్లోవారిని సాధారణ పాఠకులను అడిగి తెలుసుకుని, నిర్ణయం తీసుకోవాలి. పండితప్రకాండుల ప్రశంసలతోపాటు సాధారణ పాఠకుల మన్నన కూడా ముఖ్యం. ఈ యుగంలో అన్నీ కూడా వినియోగదారుల వద్దకు దిగివస్తున్నాయి. దీనిపై విస్తృతమైన, నిశితమైన పరిశోధన జరగాలి. వాటిని అమలు పరచాలి.

వ్యాసకర్త - **పరిశోధకుడు, రచయిత**

# వ్యాఖ్యాత వ్యాఖ్యానం

*- డా॥ ఎ.రవీంద్రబాబు*

వైజ్ఞానిక, సాంకేతిక రంగాల పుణ్యమా అని సామాన్య మానవునికి కూడా అందుబాటులోకి వచ్చిన మాధ్యమం టీవీ. ఓ వైపు 24 గంటల వార్తలు, మరోవైపు 24 గంటల వినోద కార్యక్రమాలతో ఎన్నో ఛానళ్లు నేటి ఆధునిక మానవుని జీవితంలో ఓ భాగం అయిపోయాయి. ఆయా ఛానళ్ల మధ్య పోటీకి, ప్రజలకు మరింత చేరువ కావాలనే తపన, అన్నిటిని మించి వ్యాపార ప్రకటనల లాభాల కోసం టి.ఆర్.పి.రేటు కోసం ఉచ్చనీచాల మధ్య భేదం పాటించకపోవడం జరుగుతున్నది. ఇలా ఎన్నో వాటి ప్రసారాల వెనుక కథలున్నాయి.

వార్తా ఛానళ్లలో సర్వ సాధారణంగా వాడే కొన్ని పదాలు: బ్రేక్, మార్నింగ్ న్యూస్, ఇంటర్నేషనల్, మినిస్టర్, పిటీషన్, అప్‌డేట్స్, డిమాండ్, రేస్, కరెక్ట్, ఫారెన్, ఫైనల్, రైట్, టైమ్, ఓకెఓకె, లైవ్, వెయిటింగ్, సెంటిమెంట్, హీరోలు, హీరోయిన్‌లు, క్వాలిఫికేషన్, సెక్సెస్, బాడ్‌నేమ్, ఇమేజ్, షూటింగ్, రిలీజ్, అండ్, హిట్, ఇంట్రస్ట్, సూపర్, మీడియా, క్రియేటివ్, గ్రాఫిక్స్, పోస్ట్‌పోన్, న్యూస్ రీడర్, యాంకర్, లైట్‌తీసుకో, వన్‌ఫార్టీఫోర్, సెక్షన్, హైకోర్ట్, టూరిస్టులు, కవర్ చేసి, బ్యానర్స్, హోర్డింగ్స్, టెంపుల్, థ్యాంక్యూ, లాండ్ మార్క్ అపాయింట్‌మెంట్, పబ్లిక్, ఎఫెక్ట్, హోల్‌సేల్, పోర్షన్, మేనిఫెస్టో, వాటర్‌బోర్డ్, పోర్షన్... ఇలా ఎన్నో.

హాయ్, థాంక్స్, ఓకె, సో, హాపీబర్తడే, యాక్చువల్లీ, గిఫ్ట్, సో, డిఫరెంట్, స్లిప్, సెలక్ట్, సౌండ్, స్టార్ట్, రొమాంటిక్ గాళ్, నాచురల్, సమ్‌థింగ్ స్పెషల్, ఇంటర్వ్యూ, ఎనీవే, వెల్, ఫ్రెండ్స్, వ్యూవర్స్,ఫన్నీ, సాంగ్, లక్కీ కాలర్, టైం, నెక్స్ట్, టీవీ వాల్యూమ్, పొల్యూషన్, ఫ్యామిలీ మెంబర్స్, వైడ్, వైఫ్ అండ్ హజ్బెండ్, అటెండ్, కలర్, రెడీ, సిస్టర్, ఫెస్టివల్, మూవీ, విషెస్, రాంగ్ ఆన్సర్, కంగ్రాచ్యులేషన్స్, లేడీస్, గోల్డ్, ప్రాబ్లమ్స్ అంకెల్ని పరభాషలో చెప్పడం. ఇలా ఎన్నో ఎన్నెన్నో. ఒక అరగంట పాటు టీవీ చూస్తు వ్యాఖ్యాతలు వాడిన ఆంగ్ల పదాలు రాసుకుంటేనే ఇన్ని వచ్చాయి.

వీటికి తెలుగు పదాలు లేవా అంటే ఉన్నాయి. సమానార్థకాలే కాదు. నానా అర్థాలూ ఉన్నాయి. వార్తలు కానీ, వినోద కార్యక్రమాలు కానీ ప్రేక్షకులకు చేరవేసేవాళ్లు ప్రధానంగా వ్యాఖ్యాతలు. వారికి తెలుగుపై మంచి అవగాహన, పట్టు ఉంటే టీవీ మాధ్యమంలో తెలుగుకు మంచిరోజులు ఉన్నట్టే. అందుకే వారికి భాషకు సంబంధించిన కొంత ప్రతిభ ఉండాలి.

## భాషపై పట్టు

అన్నిటికంటే యాంకర్‌కు ముఖ్యంగా ఉండాల్సిన లక్షణం భాషపై పట్టు. మాతృభాషతో పాటు ఇంగ్లీషు, హిందీ వచ్చి ఉంటే మరీ మంచిది. యాంకర్‌కు ఎన్ని భాషలు వస్తే అంత మంచిది. అస్పష్టంగా, అనాలోచితంగా, అసందర్భంగా మాట్లాడితే కష్టం. స్వచ్ఛంగా, వ్యావహారిక భాషలో అందరికీ అర్థమయ్యేలా చెప్పగలగాలి. యాంకర్ మాట్లాడే విధానం చేసే కార్యక్రమానికి ఆకర్షణగా ఉండాలి. భాష భావ ప్రసారసాధనం కాబట్టి, భాషలో భావసారూప్యత లోపిస్తే యాంకర్ చెప్పే మాటలు ప్రేక్షకులకు అర్థం కావు.

వాడుక భాషకు ప్రాధాన్యత ఇవ్వాలి. చేసే కార్యక్రమం భాషా ప్రధాన్యతను, ప్రాంతీయ ప్రాధాన్యతను గుర్తించేది అయితే ఆ పదాలతో యాంకర్ మాట్లాడాలి. అనాలోచితంగా, వ్యంగ్యంగా పరభాషా పదాలను యాంకర్ పలకరాదు. నిర్వహించే కార్యక్రమ లక్ష్యం ఎలాంటి ప్రేక్షకులను ఉద్దేశించిందో గమనించి అందుకు తగిన భాషను వాడడం బాగానే ఉంటుంది.

తెలుగు ఛానళ్లలోని యాంకర్ల గురించి వస్తున్న విమర్శ ఏమిటంటే? యాంకర్లు తెలుగు భాషా పదాలను కాకుండా ఆంగ్ల పదాలను ఎక్కువగా వాడుతున్నారని. తెలుగు యాంకర్లు తెలుగుపదాలకన్నా ఆంగ్లపదాలనే ఎక్కువ ప్రయోగిస్తున్నారని. చిన్నప్పటినుంచి ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చదువుకున్న నేటి యువతీ యువకులు యాంకరింగ్ రంగంలోకి అడుగుపెట్టడంతో తెలుగు పదాల స్థానంలో యదేచ్ఛగా ఆంగ్ల పదాలు వాడేస్తున్నారు. తెలుగు పదాలు ఉన్నా వాటి సమానార్థకాలైన ఆంగ్ల పదాలనే పలుకుతున్నారు. వాక్య నిర్మాణం మాత్రం తెలుగులో ఉంటుంది కానీ, పదాలు మాత్రం తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషవై ఉంటున్నాయి. కేవలం 20 శాతం ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి భాషను ఛానళ్లలో వాడటాన్ని భాషావేత్తలు, భాషాభిమానులు విమర్శిస్తూనే ఉన్నారు. రాసే భాషకు, మాట్లాడే భాషకు స్పష్టమైన తేడా ఉంది. వాక్యాలు పెద్దవిగా కాకుండా, చిన్నవిగా ఉండాలి. నాలుగు లేక ఐదు పదాలతో వాక్యం పూర్తికావాలి. టీవీ మాధ్యమం చదువుకున్న వాళ్లకేకాదు నిరక్షరాస్యులకు కూడా అన్న విషయాన్ని మార్చిపోకూడదు.

## ఉచ్చారణ

యాంకర్ మాటతీరు, పదాన్నిపలికే విధానం స్పష్టంగా ఉండాలి. నత్తిగా, నంగిగా మాట్లాడితే కష్టం, ఉచ్చారణ అనేది సరిగా ఉన్నప్పుడే ప్రేక్షకులు యాంకర్ పలికిన పదాన్ని అర్థం చేసుకోగలుగుతారు. లేదంటే గందరగోళానికి గురవుతారు. పలికేటప్పుడు ఒత్తులు, దీర్ఘాలు, సున్నాలు చాలా ముఖ్యం. శ,ష,స లు వంటి అక్షరాల ఉచ్చారణలో తడబాటు పనికిరాదు. అలాగే చాలా మంది "బాధ" ను "భాద" గా పలుకుతుంటారు. ఇంకా "ల"కు "ళ" కు మధ్య భేదం లేకుండా ఉచ్చరిస్తారు. తెలుగు భాష అజంత భాష. అందుకే చాలా మధురంగా ఉంటుంది. యాంకర్ ఆ మాధుర్యాన్ని ఉచ్చారణతో చెడగొట్టకూడదు.

పదాన్ని పట్టి పట్టి పలకకూడదు. అలాగని గడగడా చెప్పకూడదు. వాక్య నిర్మాణాన్ని, పదాలను, కార్యక్రమాన్ని, ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకొని యాంకర్ ఉచ్చారణ ఉండాలి. తెలుగు పదాలను ఆంగ్ల ఉచ్చారణ ధోరణితో పలకకూడదు. దీర్ఘాలను, ఒత్తులను మరీ సాగదీయకూడదు. ఎక్కడ స్వరం పెంచాలో, ఎక్కడ

తగ్గించాలో తెలుసుకోవాలి. అవసరం ఉన్న చోట ఒత్తులు, దీర్ఘాలు తీసివేసి, అనవసరమైన చోట పెట్టి పలకడం వల్ల అర్థం మారిపోయే ప్రమాదం ఉంది.

ఆంగ్లపదాలు చదవాల్సి వచ్చినప్పుడు ఆంగ్ల ఉచ్చారణలోనే చదవాలి. వాటిని తెలుగు ఉచ్చారణతో పలకడం వల్ల తప్పులు చెప్పే అవకాశం ఉంది. ఆంగ్లపదాలలోనే కాదు. తెలుగు పదాలలో కూడా రాయడానికి, చదవడానికి మధ్య చాలా భేదాలు ఉన్నాయి. చాప, తాటాకు, టమాటో, సునామీ, మోడీ/మోదీ ఇలా ఎన్నో పదాల ఉచ్చారణ గురించిన అవగాహన వ్యాఖ్యాతకు ఉండాలి.

## వాక్యంపై అవగాహన

వివిధ పదాల అర్థవంతమైన కలయిక వాక్యం. వాక్యాన్ని సరిగా రాయడం ఎంత ముఖ్యమో సరిగా చెప్పడం కూడా అంతే ముఖ్యం. "రాముడితో కపివరుడిట్లనియే" కాస్త సరిగా చదవకపోతే రామునితోక, పివరుండిట్లనియే అవుతుంది. అందుకే వాక్యంలో ఏఏ పదాల దగ్గర పాజ్ ఇవ్వాలో వ్యాఖ్యాతకు తెలియాలి. వాక్యాన్ని చదివేటప్పుడు ఎలా మొదలు పెట్టాలి? ఎలా ముగించాలి? ఏ పదాన్ని నొక్కి పలికితే వాక్యంలోని భావం ప్రేక్షకులకు భావాత్మకంగా అందుతుంది? వంటి పలు విషయాలు వ్యాఖ్యాతకు తెలిసుండాలి.

అన్ని రకాల వాక్యాలను ఒకేరకంగా చదవకూడదు. వాక్యంలో ఉన్న భావం తెలిసేలా వాక్యాన్ని చెప్పాలి. వాక్యంలో పదాల విభజన విషయంలో ఉండే చిన్న చిన్న చిక్కులను జాగ్రత్తగా పరిశీలించాలి. పదాల మధ్య వ్యాఖ్యాత ఇచ్చే విరామం కచ్చితంగా అర్థవంతంగా ఉండాలి. ప్రశ్నార్థక వాక్యాలు, ఆశ్చర్యంతో నిండిన వాక్యాలు, చమత్కారంతో నిండిన వాక్యాలు, పదాల విరుపులు, జాతీయాలు, నుడికారాలు... మొదలైన వాటిని జాగ్రత్తగా పరిశీలించి చెప్పినప్పుడు భావం ప్రేక్షకులకు స్పష్టంగా చేరుతుంది. ఒక్కోసారి రెండు లేదా మూడు వాక్యాలు కలిపి సంక్లిష్ట వాక్యంగా రాస్తుంటారు స్క్రిప్ట రైటర్. వాటిని గమనించాలి. వాక్యంలో ప్రయోగించే విశేషణాలు, కర్మలు, క్రియలు చాలా ముఖ్యం. తారుమారైతే భావం మారిపోతుంది. అంటే భాషకు వ్యాకరణం చాలా ముఖ్యమన్నమాట. మాట్లాడే భాషలోనే వాక్య నిర్మాణం ఉండాలి. వాక్యంలో ఎన్ని తక్కువ పదాలు ఉంటే అంత బాగుంటుంది. మాట్లాడే వాక్యం సూటిగా, స్పష్టంగా ఉండాలి.

# పదప్రయోగం

కార్యక్రమాన్ని బట్టి, వార్తను బట్టి యాంకర్లు మాట్లాడే పదాలు మారాలి. అది భాష గొప్పతనం. సందర్భాన్ని బట్టి, సమయాన్ని బట్టి పదజాలం వైవిధ్యంగా, భిన్నంగా ఉండాలి. చేప్పే శైలిలో తేడా ఉండాలి. అలాగని పదజాలంపై పట్టు ఉందని యాంకర్ అసందర్భోచితంగా పదాలను వాడి తన ప్రతిభను ప్రదర్శించుకోవాలనుకుంటే కార్యక్రమం చెడిపోతుంది. అలాగే ఊతపదాలు ఎక్కువ వాడకూడదు.

టీవీ అనేది వినోదానికి ప్రధాన వాహిక అయినా, ఇంట్లో కుటుంబ వాతావరణంలో చూడడానికి అనుకూలమైంది. పెద్దలు, పిల్లలు అందరూ కలిసి చూస్తుంటారు. అందుకే పదజాలం ఎప్పుడూ పరిధిలోనే ఉండాలి. యాంకర్ సామాన్య ప్రేక్షకులకు చేరువయ్యే పదజాలన్నే వాడాలి. అవసరం, సందర్భం, కార్యక్రమాన్ని బట్టి మాండలిక పదాలను, ఆయా ప్రాంత ప్రజల వాడుకలోని పదాలను వాడవచ్చు.

కొన్ని ఛానల్స్ ప్రత్యేకంగా ప్రాంతీయభాషను లేదా ఆ రాష్ట్రభాషను ప్రతిబింబించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నప్పుడు తప్పక అలాంటి భాషలోనే యాంకర్ మాట్లాడాలి. కొన్ని ఛానల్స్ ఇలాంటి కారక్రమాలను నిర్వహించడం గమనించవచ్చు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే యాంకర్‌కు ఆ రకమైన భాషపై, పదాలపై అవగాహనే కాదు, పూర్తి పట్టు ఉండాలి. లేదంటే కార్యక్రమం కృతకంగా మారి ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. వాక్యంలో ఎలాంటి పదం ఎక్కడ పొసుగుతుందో యాంకర్‌కు తెలియాలి. పదప్రయోగంపై సరైన అవగాహన ఉండాలి. పదాల ప్రయోగం సహజంగానే మాతృభాషలో అందరికీ అలవడుతుంది.

ఉదాహరణకు పొగిడేటప్పుడు వాడే వీరులు, గొప్పవాళ్లు అనే పదాలను, హేళన చేయడానికి కూడా వాడొచ్చు. అయితే సందర్భం ముఖ్యం. ఎవరిని ఉద్దేశించి వాడుతున్నామో అనేది ముఖ్యం. తనకు అర్థం తెలియని పదాలను యాంకర్ వాడకుండా ఉండడమే మంచిది. ఉద్దేశం అంటే అభిప్రాయం అని, ఉద్దేశం అంటే లక్ష్యం అని అర్థం. ఇలాంటి ఎన్నో పదాలను తెలుసుకొని ప్రయోగించాలి.

ప్రముఖులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు వారిని సంబోధించడానికి మర్యాద పూర్వకమైన పదాలు వాడాలి. వినోద కార్యక్రమాలైన డాన్స్‌లు, హాస్య కార్యక్రమాలు, ఆటలు వంటి వాటిలో సమయోచితంగా పదాలను వాడి అతిథులనే కాదు ప్రేక్షకులను మెప్పించాలి. యాంకర్ ఎప్పటికప్పుడు ప్రతిదాన్ని జాగరూకతతో మాట్లాడాలి. పదప్రయోగం అప్పటి కప్పుడు కొనితెచ్చుకున్నట్లు కాకుండా సహజ ధోరణిలో ఉండాలి.

## చిహ్నాలు, సంఖ్యలు

ప్రతి వార్తకు ఓ శైలి ఉన్నట్లే, వాక్యంలోని విరామ చిహ్నాలకు కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. వాక్యాన్ని ఎక్కడ ఆపాలి. ఎక్కడ పాజు (విరామం) ఇవ్వాలి? ఎంతసేపు ఇవ్వాలి? వాక్యాన్ని ఆశ్చర్యంతో ముగించాలా? ప్రశ్నతో ముగించాలా? కామా(,) వాడినప్పుడు ఎంతసేపు ఆపాలి? పులుస్టాప్(.) వాడి వాక్యాన్ని ముగించినప్పుడు, తర్వాత వాక్యాన్ని అర్థవంతంగా ఎలా మొదలు పెట్టాలి? ఇలాంటివి యాంకర్‌కు తెలియాలి. భావం చెడకుండా ప్రేక్షకులకు వార్తను చేరవేయాలి.

కామాకు(,) బదులు రాసే భాషలో పదంలోని చివరి అక్షరానికి దీర్ఘం ఇస్తారు. "అమ్మాయి, అబ్బాయి కలసి సినిమాకి వెళ్లారు" అనే వాక్యాన్ని "అమ్మాయీ అబ్బాయి సినిమాకు వెళ్లారు" అని రాస్తారు. అలాగే మాట్లాడే భాషలో ఉచ్చారణా సౌలభ్యంకోసం కొన్ని సంధులు చేసేస్తుంటాం. అందుకు అనుగుణంగానే స్క్రిప్టు రాసేవాళ్లు రెండు పదాలను విడిగా రాయాల్సిన చోట కలిపి రాస్తారు. యాంకర్ కూడా గమనించి అలాగే చెప్పాలి. "మనషులు అందరూ తెలివైన వాళ్లు కాకపోవచ్చు" అనే వాక్యాన్ని " మనుషులందరూ తెలివైన వాళ్లు కాకపోవచ్చు" అని రాస్తారు. యాంకర్ కూడా పదాలను విడగొట్టకుండా చెప్పాలి.

స్క్రిప్టులో అశ్చర్యార్థకం (!). ప్రశ్నార్థకం (?) ఉంటే ఆ చిహ్నం తాలూకూ భావాన్ని యాంకర్ పలికించాలి. లేదంటే వార్తలో ఉన్న అర్థం ప్రేక్షకులకు సరిగా చేరదు. ఒక్కోసారి మూడు చుక్కలు(...) పెట్టడం కూడా స్క్రిప్టు రైటర్స్ చేస్తుంటారు. అలా వాక్యాల మధ్య, పదాల మధ్య మూడు చుక్కలు పెడితే అక్కడ చెప్పాల్సిన

పదాలను చెప్పకుండా వదిలేయడమే మంచిదని రచయిత ఉద్దేశ్యం. అందుకు తగిన విధంగా యాంకర్ భావోద్రేకమైన పాజ్ ఇవ్వాలి. అలా ఇవ్వడం వల్లే ఆ వార్త లేదా ఆ మాటల ఒరవడిలోని భావం చూసేవాళ్లకు, వినేవాళ్లకు స్పష్టంగా బోధపడుతుంది.

టీవీలో సంఖ్యలు చదవడం యాంకర్‌కు చాలా సులభం. ఎందుకంటే టీవీ స్క్రిప్టు తెలిసిన రచయిత సంఖ్యలను కేవలం అంకెల ద్వారా సూచించడు. అంకెల తర్వాత ఆ అంకెల స్థానాలను తెలిపే పదాలను రాస్తారు. 4,58,210 ఉంటే దానిని 4 లక్షల 58 వేల 2వందల 10 అని రాస్తారు. అయితే ఒక్కోసారి ఇంత కచ్చితంగా రాయకపోవచ్చు. 4 లక్షలా 58 వేలు అని రాస్తే, యాంకర్ అలాగే చెప్పాలి. ఒకవేళ స్క్రిప్టు రచయిత అలా రాయకపోయినా యాంకర్ అర్థం చేసుకొని 6.58 కోట్లు అని ఉంటే 6 కోట్లా 58 లక్షలు అని చెప్పాలి.

ముఖ్యంగా తెలుగు భాష విషయంలో కొన్ని నిబంధనలు పాటించడం వల్ల యాంకర్లు, ఛానళ్లు భాషను కాపాడవచ్చు. ప్రజలకు చేరువ కావచ్చు.

1. వార్తలు రాసేటప్పుడు, మాట్లాడేటప్పుడు తెలుగు పదాలనే వాడాలి. సమానార్థకాలైన తెలుగు పదాలు లేనప్పుడు మాత్రమే ఆంగ్లాన్ని వినియోగించాలి.
2. వినోదాత్మక ఛానళ్లలో వ్యాఖ్యాతలు తమ మాటల్లో పరభాషా పదాలు దొర్లకుండా చూసుకోవాలి.
3. ఛానళ్ల అధిపతులు భాష విషయంలో నిర్మాణాత్మక నిబంధనలు ఏర్పరుచుకుని పాటించాలి.
4. అధికార భాషా సంఘం ముఖ్యంగా టీవీ మాధ్యమానికి తెలుగు భాష విషయంలో తగిన సూచనలు చేయాలి.
5. ఛానళ్లలోని ప్రతి కార్యక్రమ నిర్మాత, దర్శకులు భాష విషయంలో నిర్మొహమాటంగా వ్యవహరించాలి.
6. కార్యక్రమాలకు విచ్చేసే ప్రముఖులకు, పాల్గొనే వారికి (తెలుగు రానివారికి మినహాయింపు) తెలుగు భాషలోనే మాట్లాడాలి అని ముందే చెప్పాలి.

7. అవసరమైతే వ్యాఖ్యాతలకు భాష విషయంలో పరీక్షలు పెట్టి, ఉద్యోగంలోకి తీసుకోవాలి. లేదా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.

8. వార్తా ఛానళ్ల పేర్లతో సహా కార్యక్రమాలకూ అందమైన, ఆకర్షణీయమైన తెలుగు పేర్లు పెట్టాలి.

వ్యాసకర్త - **టీవి జర్నలిస్టు**

# తెలుగు దినపత్రికలు - తెలంగాణ మాండలిక పదప్రయోగం

- డా॥భీంపల్లి శ్రీకాంత్

ఒక ప్రాంతానికి సంబంధించిన భాషాభేదమే మాండలికం. స్థానిక పదాలతో పలికే పలుకుబడులను మాండలికం అనవచ్చు. వీటిని ఎక్కువగా జానపదులు పలుకుతారు. తెలుగుభాషా రూపభేదాలను కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ అని స్థూలంగా విభజించడం జరిగింది. అయితే పత్రికలలో ఎక్కువగా కోస్తాంధ్ర భాషనే వినియోగిస్తున్నారు. తొలినుండి ఆయా పత్రికలు ఆ భాషకే ప్రాముఖ్యతనిచ్చాయి. తెలంగాణ మాండలికాన్ని చిన్న చూపు చూశారు. అయితే, ప్రస్తుత దిన పత్రికలు తెలంగాణ పలుకుబడులకు ప్రాధాన్యతనిచ్చి ప్రచురిస్తున్నారు. తెలంగాణ మాండలిక పదప్రయోగాలతో శీర్షికలు నిర్వహిస్తున్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. తెలంగాణ భాష వాడుకలో యాస ప్రముఖ స్థానం పోషిస్తున్నది. దీర్ఘాలు లేకుండా పదాలుంటాయి. అన్నడు, చెప్పిండు, వచ్చిండు మొదలైన పలుకుబడులు తెలంగాణ మాండలిక సొబగులు. ఇలాంటి వెన్నింటినో మన పత్రికల్లో ప్రస్తుతం వాడుతున్నారు. అంతేకాదు ఇవి జనాలకు బాగా హత్తుకుపోతాయి. ఆత్మీయతను పంచుతాయి. తెలంగాణ మాండలిక భాష

అందమైనదే కాదు, అర్థవంతమైనది. ఇది ఒక అస్తిత్వానికి ప్రతీక. తెలంగాణ జాతి ఆత్మగౌరవ నినాదం. అయితే మన భాషను మనం సంరక్షించకపోతే తెలంగాణ భాష కాలగర్భంలో కలగలిసే ప్రమాదం సంభవించవచ్చు. తెలంగాణ భాష అంతరిస్తే తెలంగాణ జాతి కూడా అంతరించినట్లే.

అయితే, తెలంగాణ ఉద్యమం అనంతరం తెలంగాణ భాషకు పూర్వ వైభవం వచ్చిందని చెప్పవచ్చు. కనుమరుగైపోతున్న మన తెలంగాణ భాషా సంపద జీవద్భాషగా వెలుగొందేందుకు ఈ ఉద్యమం తోడ్పడిందని చెప్పవచ్చు. తెలంగాణ అస్తిత్వ సాహిత్యాన్ని ముందుకు తీసుకపోవడంలో తెలంగాణ భాష చుక్కానిగా అవతరించింది. సామాన్య జనులకు అర్థమయ్యేరీతిలో తెలంగాణ మాండలిక భాష చొచ్చుకుపోయింది. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక అవతరణతో తెలంగాణ మాండలికానికి పూర్వ వైభవం వచ్చింది. తెలంగాణ మాండలిక పదాలను విరివిగా ప్రయోగిస్తూ 'నమస్తే తెలంగాణ' దినపత్రిక వార్తలను ప్రధాన స్రవంతిగా ప్రచురిస్తున్నది. పాఠకుల అభిరుచికి తగ్గట్టుగా పత్రికను తీసుకొస్తున్నది. అస్తిత్వ వాద సాహిత్యానికి తన వంతుగా ఊపిరులూదుతున్నది. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక మార్గంలోనే మన తెలంగాణ, నవ తెలంగాణ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, సాక్షి, సూర్య, వార్త, ఈనాడు వంటి పత్రికలు తెలంగాణ మాండలికానికి తగిన స్థానాన్ని కల్పిస్తున్నాయి.

దినపత్రికలకు అనుగుణంగా వచ్చే జిల్లా టాబ్లాయిడ్‌లలో తెలంగాణ మాండలిక పద ప్రయోగంతో విభిన్న శీర్షికలు వచ్చాయి. ఆంధ్రజ్యోతి, సాక్షి, నమస్తే తెలంగాణ వంటి దినపత్రికలలో 'గీనడ్మ', 'రచ్చబండ' పేర్లతో సమకాలీన రాజకీయాల పై రచనలు వెలువడ్డాయి. ఇవి ఆయా సందర్భాలకనుగుణంగా రాయబడ్డాయి. సార్వత్రిక ఎన్నికలు, మున్సిపాలిటీ ఎన్నికలను పురస్కరించుకుని ఈ శీర్షిలను ఆయా పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ప్రస్తుతం వస్తున్న నమస్తే తెలంగాణ, మన తెలంగాణ, నవ తెలంగాణ దినపత్రికలలో తెలంగాణ మాండలికానికి సంబంధించి ఒక ప్రత్యేక శీర్షికను నిర్వహించడం గొప్పవిషయం. తెలంగాణ మాండలిక భాషను ఇవి పునరుజ్జీవింప జేస్తున్నాయి. ఈ పత్రికలలో కొన్ని కథలు, కవితలు, వ్యాసాలు, లేఖలు, ఇంటర్వ్యూలు, సమీక్షలు కూడా తెలంగాణ మాండలికంలోనే రావడం

విశేషం. కనుమరుగైపోతున్న తెలంగాణ భాషకు ఇవి ప్రాణంపోస్తున్నాయి. ప్రముఖ జర్నలిస్ట్ తెలిదేవర భానుమూర్తి తెలంగాణ మాండలికంలోనే రచనలు చేస్తున్నారు. 'తెలంగాణ' మాసపత్రికలో 'యాదికున్నకాడికి' శీర్షిక ద్వారా తెలంగాణ మాండలిక సొబగులను అందిస్తున్నారు. 'నవతెలంగాణ' దినపత్రికలో 'చిత్తా బొత్తా' శీర్షికలో సమకాలీన రాజకీయాంశాలను సున్నితంగా హెచ్చరిక చేస్తున్నట్లు మాండలిక భాషలో రచనలు చేస్తూ తెలంగాణ భాషకు చుక్కానిగా నిలుస్తున్నాడు.

అలాగే మన తెలంగాణ 'హరివిల్లు' ఆదివారం అనుబంధంలో కాలువ మల్లయ్య ' తెలంగాణ తాతలు చెప్పిన కథలు', అన్నవరం దేవేందర్ 'ఊరిదస్తూరి' పేరిట వస్తున్న శీర్షికలు తెలంగాణ మాండలికాన్ని మరోసారి నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ శీర్షికలలో గతం తాలూకు గుర్తులే కాకుండా సామాజిక, సాంస్కృతిక విశేషాలను కూడా తెలుపుతాయి. ఇవన్నీ చదువుతుంటే మన ఊర్లు జ్ఞాపకమోస్తాయి. ఊరిలోని ప్రతి గల్లీ తిరిగినట్టు అనిపిస్తుంది. మళ్ళీ మన ఊరి పెద్దలతో మాట్లాడినట్టు అనిపిస్తుంది. మరచిపోతున్న తెలంగాణ భాషను ఇవి పట్టి చూపెడుతున్నాయి. ఇవన్నీ హాస్య, వ్యంగ్య శైలిలో చెప్పినప్పటికీ లోతైన జీవన అంశాలను, సామాజిక, రాజకీయ అంశాలకు ముడివెడుతూ వినూత్న శైలి విన్యాసంతో కూడుకున్నవి.

గతంలో ఇలాంటి శీర్షికలను గజ్జెల మల్లారెడ్డి, పతంజలి, నగ్నముని, దేవీప్రియ, గోపాల చక్రవర్తి, జి.కృష్ణ, నామిని సుబ్రహ్మణ్యం తదితరులు వేరు వేరు రీతిల్లో నిర్వహించారు. అయితే ఈ దశాబ్దకాలంలో తెలంగాణ మాండలిక పదప్రయోగంతో శీర్షికలు నిర్వహించే సంప్రదాయం బలపడింది. తెలంగాణ మాండలిక భాషను వాడుతూ ప్రముఖ జర్నలిస్ట్, రచయిత ఉప్పల నరసింహం 'స్వగతాలు' పేరిట ఒక శీర్షికను నిర్వహించాడు. ఇందులో తెలంగాణా సమాజంలోని నిత్య జీవన సమస్యలను తీసుకొని తెలంగాణ భాషతోనే రచనలు చేశాడు. అనంతరం ఉప్పల నరసింహం బాటలోనే వార్త, సూర్య మొదలైన దినపత్రికలలో ఇలాంటి శీర్షికలు వెలువడ్డాయి. ఈ శీర్షికలలో ప్రధానంగా రాజకీయ వ్యవస్థను నగ్నంగా చూపెట్టే ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. అటు వ్యంగ్యం, ఇటూ హాస్యంతో కూడుకున్న రచనలతో ఈ శీర్షికలు పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇపుడు వెలువడుతున్న అన్ని దినపత్రికల్లోనూ ప్రధాన వార్తలు ముఖ్య పతాకశీర్షికల్లో కూడా

తెలంగాణ మాండలిక పదాలను అప్పుడప్పుడు ప్రయోగిస్తున్నారు. ప్రధాన శీర్షికలను కూడా తెలంగాణ మాండలిక భాషలోనిర్వహిస్తున్నారు.

పూర్వం దినపత్రికల్లో గ్రాంథిక భాషను వాడేవారు. ఇపుడు వ్యవహార భాషను వాడుతున్నారు. అయితే తెలంగాణ భాషకు కూడా పట్టం కట్టాలనే ఉద్దేశంతో వివిధ శీర్షికలను నిర్వహిస్తున్నారు. తెలంగాణ భాష అంతరించిపోకుండా సజీవంగా నిలుపుతున్నారు. అయితే దినపత్రికల సంపాదకులు తెలంగాణ భాష సజీవంగా బతికి బట్టాకట్టాలంటే భాషాపరమైన ఏకరూపత సాధించాలి. అపుడే తెలంగాణ భాష బతుకుతుంది. వ్యవహార భాషమీద జరుగుతున్నంత చర్చ తెలంగాణ భాషమీద జరగడంలేదన్నది నిర్వివాదాంశం. భాషను నిర్లక్ష్యం చేస్తే ఒక జాతిని నిర్వీర్యం చేసినట్లే. తెలంగాణ భాషకు భాషాశాస్త్రవేత్తలు ముందడుగు వేయకపోతే మన భాష కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం. తెలంగాణ భాషకు ఏకరూపత సాధించడానికి, ఒక ప్రామాణికమైన తెలంగాణ భాషను పత్రిక భాషగా వ్యవహరించడానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి, అందుకనుగుణంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ భాషకు మళ్ళీ పురుడు పోసి రక్షించుకోవాల్సిన అవసరం కూడా అంతే ఉంది.

వ్యాసకర్త – **రచయిత, జర్నలిస్టు**

# తెలుగు భాష వికాసంలో మీడియా పాత్ర

**- కూర సంతోష్**

ఒకప్పుడు ప్రచార సాధనాలు అంటే కేవలం పత్రికలు మాత్రమే. వీటి ద్వారానే సమాచార మార్పిడి జరిగేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. పత్రికల తర్వాత రేడియోలు వచ్చాయి. ఆ తర్వాత టీవీలొచ్చాయి. ఇప్పుడు ఇంటర్‌నెట్ యుగంలో ఉన్నాం. సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతో సమాచార వినిమయం జరగుతోంది. కొన్ని సార్లు న్యూస్ ఛానళ్ల కంటే ముందే ట్విట్టర్లు, ఫేస్‌బుక్ ద్వారా వార్తలు తెలిసిపోతున్నాయి. మరోవైపు సమాజం కూడా దినదినాభివృద్ధి చెందుతోంది. సాంకేతిక రంగంలో మార్పులు చాలా వేగంగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మీడియాలో భాష ఎలా ఉంటుంది...? గతంలో భాషాభివృద్ధికి ఎంతో కృషి చేసిన పత్రికలు ఇప్పుడు ఎటువంటి పాత్ర పోషిస్తున్నాయి? కొత్తగా వచ్చిన న్యూస్ ఛానళ్లలో ఎలాంటి భాష ఉపయోగిస్తున్నారు? వంటి అంశాలను చర్చించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం. స్థూలంగా చెప్పాలంటే తెలుగు భాషా వికాసంలో మీడియా పాత్రను గురించి చర్చించడం ఈ వ్యాసం లక్ష్యం.

భాష సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి ఉపయోగపడే మాధ్యమం. తమను తాము వ్యక్తం చేసుకోవడానికి భాష ఉపయోగపడుతుంది. సమాచార వినిమయానికి

ఓ సాధనం. అందుకే సమాచార, ప్రసార సాధనాలు సమచార వినిమయానికి భాషను వాడుకుంటున్నాయి. దినపత్రికలు కూడా ఈ దిశలో తాము అందించే సమాచారాన్ని ప్రజలకు లేదా పాఠకులకు సులభమైన రీతిలో, వారికి అర్థమయ్యే రీతిలో అందించడానికి ప్రయత్నిస్తున్నాయి. అందుకోసం అవి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. పాఠకుల కోసం భాషను ఆధునీకరించడం లేదా సరళీకరించడం అనే ప్రకియ దినపత్రికల్లో ప్రతి రోజు జరుగుతుంది. ఇక ఈ మధ్య కాలంలో ఆవిర్భవించిన ఎలక్ట్రానిక్ మీడియా అంటే టీవీ ఛానళ్లు పత్రికలనే అనుకరిస్తున్నాయి. పేపర్లో వచ్చిన భాషను ఛానళ్లలో పనిచేసే సబ్ ఎడిటర్లు (కాపీ ఎడిటర్లు) వాడేస్తున్నారు. నిజానికి ప్రస్తుతం తెలుగు ఛానళ్లలో పెద్ద తలకాయలతో సహా చాలా మంది ప్రింట్ మీడియా నుంచి వచ్చిన వారే. అచ్చంగా ఎలక్ట్రానిక్ మీడియా నుంచి వచ్చిన వారు చాలా తక్కువ. నిజానికి తెలుగు ఛానళ్ల చరిత్ర అంతా మూడు నాలుగు దశాబ్దాలకు మించి ఉండదు. కానీ తెలుగులో పత్రికల చరిత్ర మాత్రం గొప్పదే. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలుగు పత్రికలు విశేష పాత్ర పోషించాయి. సుదీర్ఘ చరిత్ర ఉన్న పత్రికలు నాటి నుంచి నేటి వరకు భాషాపరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

పత్రికల భాషను పరిశీలిస్తే పందొమ్మిదో దశాబ్దం మొదట్లో నడిచిన పత్రికల్లో దాదాపు గ్రాంథికభాష కనిపిస్తుంది. అయితే వ్యవహార భాషోద్యోమ పితామహుడు గిడుదు వేంకటరామమూర్తి చొరవతో వాడుక భాషను పత్రికల్లో వాడడం ప్రారంభమైంది. ఆయన స్వయంగా వ్యావహారిక భాషా ప్రచారంకోసం తెలుగు పత్రికను స్థాపించడంతో వ్యవహార భాషావాదం ఉద్యమరూపం దాల్చింది. మార్పు లేకుంటే అభివృద్ధి లేదు కాబట్టి పత్రికలు తమ స్వరూపాలు మార్చుకున్నాయి. మరోవైపు గిడుగు చలవతో సమాజంలో కూడా గ్రాంథిక భాష వినియోగం తగ్గడం, పత్రికలు కూడా వ్యవహార భాష వినియోగానికి పెద్ద పీట వేశాయి. ఈ తరం వారికి గ్రాంథికమంటే తెలియకుండా పోయిందంటే సందేహపడాల్సిందేమి లేదు.

తెలుగు భాషను అంతరించి పోకుండా కాపాడుతున్న ఘనత పత్రికలదేనని ఘంటాపథంగా చెప్పొచ్చు. సమాజం ఎప్పుడూ లేనంత వేగంగా మారిపోతున్నది. సాంకేతిక రంగంలో కూడా వేగంగా మార్పులు సంభవిస్తున్నాయి. ఎన్నో కొత్త

కొత్త వస్తువులు కనుగొంటున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక సమాచార సాంకేతిక రంగం ప్రాంతీయ భాషలకు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. అయితే తెలుగు భాష వికాసానికి కృషి చేయడంలో తెలుగు అకాడమీ కానీ, తెలుగు విశ్వవిద్యాలయం కానీ చివరకు విశ్వవిద్యాలయాల్లోని తెలుగు శాఖలు విఫలమయ్యాయి. దీంతో తెలుగు భాషను పరిరక్షించే బాధ్యతను తెలుగు పత్రికలు నెత్తిన వేసుకున్నాయి. ఈ పాత్రను ఎంతో సమర్థవంతంగా పోషిస్తున్నాయి. తెలుగు భాషా వికాసానికి పత్రికలు చేస్తున్న కృషి మూడు రకాలుగా ఉంది. అ) అనువాదం ఆ) అనుసృజన ఇ) సరళీకరణ. ముందుగా అనువాదం విషయానికి వద్దాం. సమాజంలో, సాంకేతికరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తెలుగును అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేస్తున్నాయి. పరభాషా పదాలకు సమానమైన తెలుగు పదాలను ఖాయం చేస్తున్నాయి. (Real Esate) = స్థిరాస్తి, (Smoking) పొగతాగడం, (Concluding Session)=ముగింపోత్సవం (High Command) అధినాయకత్వం, అధిష్ఠానం (Arieal Servey) విహంగ వీక్షణం వంటి పదాలు తెలుగు పత్రికల సృష్టి. కాంట్రాక్టర్ అనే పదాన్ని గుత్తేదారుగా వాడుతున్నారు ఇది మెల్లగా ప్రజల్లోకి వెళ్తున్నది.

అనుసృజన విషయానికి వస్తే – పత్రికలు అనువాదం చేయడంతో పాటు కొంత సృజనాత్మకతను జోడించి పదాలను ఖాయం చేస్తున్నాయి. ఇందులో మూల భాషలోని పదానికి సమానమైన అర్థం ఉంటుంది. అయితే కొంత తెలుగు భాషలోని కమ్మదనం, రమణీయత, సృజనాత్మకత కనిపిస్తుంది. ఉదాహరణకు కొన్ని పదాలు చూద్దాం రియల్ ఎస్టేట్ వ్యాపారం ఈ మధ్య వచ్చింది. భూములు అమ్మడం కొనడం పెద్ద ఎత్తున జరగుతోంది. ఈ వ్యవహారాలు చేసే వారిని గతంలో స్థిరాస్తి వ్యాపారి అనే వారు. ఇది రెండు పదాలుగా ఉంది. దీనికి కొంత సృజనాత్మకత జోడించి రియల్టర్ అనే పదం ఖాయం చేశారు. ప్రస్తుతం ఈ పదం వాడుకలో ఎక్కువగా ఉంది. ఇలాంటి మరో పదం (Passive Smoking) అంటే పొగతాగేవారు వదిలే పొగను పీల్చడం. ఈ పదానికి మారు పొగ అని ఖాయం చేశారు. స్మోకింగ్ అంటే తాగడం అని ఎప్పటి నుంచో అంటున్నాం.

సరళీకరణ విషయానికి వస్తే– తెలుగు భాషను సరళీకరించాలన్న వాదన ఎప్పటి నుంచో వినిపిస్తోంది. నిజానికి 56 అక్షరాల్లో కొన్ని మనుగడలో లేవు.

రెండో–చ, ఝరాసే పదాలు అంతరించి పోయాయి. (ఇప్పుడు తెలుగు సాఫ్ట్‌వేర్లో లేవు). ఋ,ౠ,ఙ,ఌ,క్ష, ఞ వంటి అక్షరాలను తీసివేయాలని కొంత మంది భాషావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. ఈ పనిని తెలుగు పత్రికలు సమర్థవంతంగా అమలు చేస్తున్నాయి. స్థలాభావం, లైన్ అలైన్‌మెంట్ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ పదాలను రాయడం లేదు. ఋషిని ఇప్పుడు రుషి అనే రాస్తున్నారు. ఇప్పుడు ర ఒత్తుతో పదాలు రాయడం లేదు. బ్రతికించు కాస్తా బతికించే, త్రాగు నీరు తాగునీరు అయింది. ఇదంతా సరళీకరణలో భాగమే. అంతేకాదు కళ్యాణం బదులుగా కల్యాణం అని రాస్తున్నారు. ళ వత్తు ఎగిరిపోయింది. పెళ్ళిళ్ళకు బదులు పెళ్లిళ్లు అని రాస్తున్నారు. పత్రికలకు క్లుప్తత అత్యంత ప్రధానం. గత సంవత్సరం అనే పదం పెద్దగా, సంక్లిష్టంగా ఉంది కాబట్టి దానికి సమానంగా నిరుడు అనే పదాన్ని తెలుగు పత్రికలు తెచ్చుకున్నాయి. అలాగే గతేడాది అని వాడుతున్నారు. గతంలో (Finance Minister) ను విత్తమంత్రిగా అనువాదం చేసేవారు. తెలుగు పత్రికలు ఆవిర్భవించాక ఆర్థిక మంత్రి అంటున్నారు. (Gold Medal) కు స్వర్ణపతకం, (Cabinet) కు మంత్రివర్గం స్థిరపడిపోయాయి.

అనువాదం, అనుసృజన, సరళీకరణే కాకుండా తెలుగు భాసా వికాసానికి పత్రికలు చేస్తున్న కృషి ఇంకొంత ఉంది. అనువాదాలకు వీలు కాని పదాలను యథాతథంగానో కొద్దిగా మార్పుతోనో పదాలను ఇతర భాషల నుంచి యథాతథంగా తీసుకున్నారు. పార్టీ, రోడ్డు, బస్సు, మాజీ, ఖరీదు, కారు, కంప్యూటర్,ఫోన్ పార్లమెంటు వంటి పదాలను తెలుగు పదాలు కావంటే నమ్మలేనంతగా తెచ్చుకుని వాడుకుంటున్నాం. రైలును పొగబండి అని అనువాదం చేశారు. మొదట్లో రైలు లక్షణాన్ని బట్టి ఆ పదం వాడారు. బొగ్గుతో నడవడం వల్ల పొగ వెలువరిస్తు నడిచేది. దాంతో పొగబండి అనే పదం వాడుకలోకి వచ్చింది. అయితే విద్యుద్దీకరణ జరిగిన తర్వాత ఈ పదం రైలు అనే పదానికి సరైన అర్థం ఇవ్వకపోవడం వల్లనే కాకుండా రైలు అనే పదం దానికన్నా సరళంగా ఉండడం వల్ల ఈ పదమే స్థిరపడిపోయింది. అలాగే విమానానికి గాలిమోటరు అనే పదం కూడా ఉంది. దాన్ని వాడవచ్చు. కానీ విమానమే ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చింది. మిసైల్ అనే పదానికి క్షిపణి అనే పదం మాత్రం వాడుకలో ఉంది. క్షిపణి కన్నా మిసైల్ పదం

కఠినంగా అనిపించడమే అందుకు కారణం కావచ్చు. అలాగే, తెలుగు పదాలకు ఇతర భాషా పదాలను జోడించి కొత్త పదబంధాలను తయారు చేయడం కూడా ఉంది. వేర్వేరు గ్రూపులు, ఓటర్లజాబితా, బడ్జెట్ ప్రసంగం, హైకోర్టు న్యాయమూర్తి వంటివాటిని చెప్పుకోవచ్చు.

## 'ఈనాడు' కృషే ఎక్కువ

తెలుగు పత్రికలు జర్నలిజం స్కూళ్ల ద్వారా తెలుగు భాషా వికాసానికి కృషి చేస్తున్నాయి. ఈ జర్నలిజం స్కూళ్లలో కొత్త వారికి వివిధ విషయాల మీద అవగాహన కల్పిస్తారు. అనువాదంతో పాటు భాషా ప్రయోగానికి సంబంధించిన శిక్షణ కూడా ఇస్తున్నారు. తెలుగు భాషా వికాసానికి మిగతా పత్రికల్లో కంటే ఈనాడు కృషి ఎక్కువగా ఉందన్నది జగమెరిగిన సత్యం. పర భాష పదాలకు తెలుగు పదాలు సృష్టించడానికి అక్కడ ప్రత్యేక ప్రయత్నం జరుగుతుంది. అంతేకాదు పరభాషలోని పదాలను తెలుగీకరించిన వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా ఉంటాయి. రియల్టర్ వంటి పదాలు ఈనాడు సృష్టే. ఈ పత్రికకు ఉన్న పెద్ద ఆస్తి ప్రత్యేక జర్నలిజం స్కూల్. తెలుగులోని దాదాపు అన్ని ప్రముఖ దినపత్రికలకు జర్నలిజం స్కూళ్లు ఉన్నా, ఇంత పెద్ద స్కూల్ దేనికి లేదు. నిష్ణాతులైన జర్నలిస్టుల ఆధ్వర్యంలో నడుస్తున్న ఈనాడు జర్నలిజం స్కూల్‌లో కేవలం జర్నలిజం మెలకువలను నేర్పడంతో సరిపెట్టకుండా తెలుగు భాషా వినియోగం, అనువాదంపై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈనాడు పత్రికకు ప్రత్యేకంగా స్టయిల్ షీట్ (భాషాశైలి) ఉంది. ఏ పదాన్ని ఎలా రాయాలో ఇందులో ఉంటుంది. పత్రికలో వాడే భాషలో ఏకరూపకత ఉండడానికి స్టయిల్ షీట్ ఎంతో ఉపయోగపడుతుంది. తెలుగు దినపత్రికల్లో ఈనాడును మినహాయిస్తే మిగితావాటికి ఇలాంటి స్టయిల్ షీట్ ఉన్నట్టు కనిపించదు. ఎందుకంటే మొదటి పేజీలో ఒక పదాన్ని ఒకలా రాస్తారు. లోపలి పేజీల్లో అదే పదం వేరేలా ఉంటుంది. ప్రముఖ భాషావేత్త బూదరాజు రాధాకృష్ణ ఈనాడు భాషా స్వరూపం అనే పుస్తకం రాశారు. ఇది వ్యక్తీకరణలో ఏకరూపత లేదా సామాన్యీకరణ కోసం ఎంతో ఉపయోగపడుతుంది. కేవలం ఈనాడు పత్రిక వారే కాకుండా మిగితా వారు దీన్ని అనుసరిస్తున్నారు.

## శృతి మించుతోందా..?

సాధారణంగా ఇతర భాషల్లోని పదాలు మాతృభాష లోకి లేదా వేరే భాషలోకి అనువదించడం లేదా మూల భాషలోని పదానికి వేరే భాషలో సమానమైన పదం ఖాయం చేయడం చాలా కష్టమైన పనే. మక్కికి మక్కిగా అనువాదం ఆచరణీయం కాదు. కొన్ని సార్లు పత్రికలు ఖాయం చేస్తున్న పదాలు వెగటు పుట్టిస్తున్నాయి. ఆ మధ్య ఆంధ్రప్రభలో మిషన్  కాకతీయను యంత్ర కాకతీయగా అనువదించారు. ఈ పదం ఎబ్బెట్టగా ఉండడంతో చాలా పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఎయిర్ హోస్టెస్ కు గగన సఖి అన్న పదం కూడా అంతే. కార్డన్ సెర్చ్‌ను కట్టడి – ముట్టడి అని అనువాదం చేయడం చాలా మందికి నచ్చలేదు. దీనికి బదులు నిర్బంధ తనిఖీ అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇలా కొన్ని సార్లు అత్యుత్సాహం శృతి మించి కొత్త పదాల సృష్టి అభాసు పాలవుతోంది.

## అన్ని పదాలకు ఆదరణ లభిస్తోందా?

ఇంటర్నెట్ , పేస్బుక్, ట్విట్టర్, వాట్సప్ వంటి అనేక ఆవిష్కరణలను తెలుగులో అందించడానికి, వాటికి తెలుగు రూపాలు ఏర్పరచడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. ఇంటర్నెట్ ను అంతర్జాలం అని, ఫేస్ బుక్ ను ముఖ పుస్తకం అని అనువదించారు. ట్వీట్ ను కూత అని ఖాయం చేశారు. అయితే ఈ మూడు పదాలకు ఆదరణ అభించలేదు. కొంత మంది మాత్రం ఇంటర్నెట్‌ను అంతర్జాలం అని రాస్తున్నారు **(Cell Phone)** సంచారవాణి అని, **(Out Source)** – పొరుగుసేవ అని అనువాదం చేసి అప్పుడప్పుడు వాడుతున్నప్పటికీ అవి అంతగా ప్రాచుర్యంలోకి రాతేదు. కాన్వాయ్ అనే పదాన్ని వాహనశ్రేణిగా అనువాదం చేసినా ఎవ్వరూ వాడడం లేదు. గ్రోత్ క్యారిడర్‌ను అభివృద్ధి నడవా అని తెలుగీకరించారు కానీ ఇది కూడా పెద్దగా ప్రాచుర్యంలోకి రాలేదు.

## పత్రికల సంగతి సరే, ఛానళ్ల సంగతి ఏంటి?

తెలుగు భాషాభివృద్ధికి పత్రికల కృషిని ఇప్పటి వరకు చూశాం. మరి ఛానళ్ల పరిస్థితి ఏమిటి ? తెలుగు ఛానళ్ల చరిత్ర రెండు, మూడు దశాబ్దాలకు మించి ఉండదు. ప్రస్తుతం ఛానళ్లలో పని చేస్తున్న వారిలో ఎక్కువ మంది పత్రికల

నుంచి వచ్చిన వారే. కాబట్టి ఛానళ్ల పాలసీల మేరకు వారు (అంటే ఈటివి తర్వాత హెచ్ఎంటీవీ, మహా టీవీ వంటి ఛానళ్లు తెలుగుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి) తెలుగు భాష ఎక్కువ వినియోగిస్తున్నాయి. అయితే ప్రస్తుతం వాడుక భాష పేరుతో ఇంగ్లీష్ పదాలను ఎక్కువగా వాడుతున్నారన్న వాదన ఎక్కువగా వినిపిస్తోంది. ఇది పూర్తిగా నిజం. ఎందుకంటే పత్రికలకు ఛానళ్లకు వార్తా ప్రసారం విషయంలో ఎంతో తేడా ఉంది. ఏదైనా పదం అర్థం కాకపోతే మరోసారి చదువుకునే సౌలభ్యం పత్రికల్లో ఉంటుంది. కని ఛానళ్లలో అలా వీలు కాదు. అందుకే ఛానళ్లు వ్యవహారిక భాషను విరివిగా వినియోగిస్తున్నాయి. అయితే ఈ పేరుతో దుర్మార్గం చేస్తున్న ఛానళ్లు కూడా ఉన్నాయి.

అనవసరంగా లేదా తెలుగు పదాలున్నా ఇంగ్లీష్ వాడేస్తున్నారు. సూసైడ్ అనే పదానికి అందమైన తెలుగు పదాలున్నాయి. ఆత్మహత్య లేదా బలవన్మరణం. అలాగే సీరియస్‌కు విషమం. బలవన్మరణం కాస్త ఇబ్బందిగా ఉన్నా ఆత్మహత్య వాడితే తప్పు లేదు.కానీ ఈ ఛానళ్లలో సూసైడ్ అనే వాడతారు. ఈ మధ్య విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పసికందు మాయమైంది. అక్కడి నుంచి రిపోర్టింగ్ చేసిన అమ్మాయి వాడిన ఎగ్జాట్లీ లాస్ట్ శాటర్ డే అనుకుంటూ వారం కిందట సంఘటనను గుర్తు చేసింది. అయితే దీనికి సరిగ్గా వారం రోజుల కిందట అంటే పోయిన శనివారం అంటే బాగుండేది. కేవలం రేటింగ్ విషయంలోనే కాదు. తెలుగుభాషను ఖూనీ చేయడంలోను, భ్రష్టు పట్టించడంలో టీవీ యాంకర్లు అగ్రస్థానంలో ఉన్నారనడంలో సందేహం లేదు.

## ముగింపు :

చివరగా తెలుగు భాషా వికాసానికి తెలుగు పత్రికలు, కొన్ని ఛానళ్లు ఇతోధికంగా కృషి చేస్తున్నాయని చెప్పొచ్చు. అయితే ఇప్పుడు గ్లోబలైజేషన్ యుగంలో ఉన్నాం. గ్లోబల్ భాషగా ఇంగ్లీష్ భాషకు ప్రాధాన్యం పెరిగింది. చివరకు గ్రామాల్లోని ఉండే వారు సైతం ఖర్చు ఎక్కువైనా తమ పిల్లలకు ఇంగ్లీష్ చదువులే చెప్పిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలుగు భాషకు ముప్పు ఉందన్న అన్న మాట వాస్తవం.

ఈ నేపథ్యంలో తెలుగు భాషా పరిరక్షణను కేవలం పత్రికలు, ఛానళ్లకే వదిలేయకూడదు. ప్రభుత్వం తరపున కూడా కృషి జరగాలి. సాధ్యమైనంత వరకు పరిపాలన వ్యవహారాలు తెలుగులో సాగేలా చూడాలి. తెలుగులో సినిమా పేర్లు పెట్టే వారికి రాయితీలివ్వాలి. ఇక విశ్వవిద్యాలయాలు, తెలుగు భాషాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలి. అప్పుడే తెలుగు భాషను అంతరించిపోకుండా కాపాడగలం.

వ్యాసకర్త - **టివి జర్నలిస్టు**

# జర్నలిజంలో సామాజిక మాధ్యమాలు

**- కొలకలూరి శ్రీధర్**

మార్పు అనేది నిరంతర ప్రవాహం. ఏ కాలమైనా, ఎవరైనా ఈ నూతన ఆగమనాన్ని ఆహ్వానించాల్సిందే. గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో అనేక నూతన మార్పులు వస్తున్నాయి. ప్రత్యేకించి సోషల్ మీడియా రాకతో జర్నలిజం రూపురేఖలు సమూహంగా మారిపోతున్నాయి. ప్రపంచంలో ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా నిమిషాల్లో సోషల్ మీడియాలో ప్రసారమవుతున్నాయి. కొత్త కొత్త పదాలు సోషల్ మీడియా ద్వారా జర్నలిజంలో ప్రవేశించాయి. ఈ రోజు కేవలం సోషల్ మీడియాను వినియోగించేవారే వార్తలను అతి త్వరగా తెలుసుకోగలుగుతున్నారు. ట్వీట్, రీ ట్వీట్, లైక్, షేర్, సెల్ఫీ, ఫ్రెండ్, అన్‌ఫ్రెండ్...ఇలా అనేక పదాలు జర్నలిజంలో ప్రవేశించాయి. యువత విభాగానికి వస్తే వారు ఎక్కువగా సోషల్‌మీడియా ద్వారానే వార్తలను తెలుసుకొంటున్నారు. ఈ అంశాన్ని గ్రహించిన వార్తా ప్రపంచంలో దిగ్గజ కంపెనీలైన న్యూయార్క్ టైమ్స్, బీబీసీ, సీఎన్ఎన్‌తో సహా చిన్న చిన్న వార్తాసంస్థలు కూడా సోషల్‌మీడియా అకౌంట్లను ప్రారంభించాయి. ఆయా వెబ్‌సైట్లలోకి వెళ్లే సోషల్ మీడియా బటన్స్‌ను ఫాలో అయితే చాలు మనకు వాళ్లు చేసే పోస్టులు అన్ని ఎప్పటికప్పుడు మన సోషల్‌మీడియా ఖాతాల్లోకి వచ్చేస్తుంటాయి. వీటితో పాటు యాప్‌లు కూడా విశేషాదరణ పొందుతున్నాయి. అనేక వార్తాసంస్థలు యాప్‌లను రూపొందించాయి. వీటిని మన మొబైల్‌ఫోన్‌పైకి డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారాన్ని వినియోగదారులకు వార్తాసంస్థలు చేరవేస్తుంటాయి.

**మేసిజింగ్ యాప్స్**

మెసెజింగ్ యాప్స్‌లో విశేషాదరణ పొందినది వాట్స్‌యాప్. ఒకవేళ మనం మంచి వార్తను చూడలేకపోయినట్టయితే మన గ్రూపులోని స్నేహితుడు ఆ లింక్‌ను మనకు పోస్ట్ చేస్తాడు. ఈ లింక్‌ను తెరవడం ద్వారా మన వెబ్‌సైట్‌కి వెళ్లి వార్తలను వీక్షించే సౌకర్యం ఏర్పడింది.

**కొత్త పదాలు**

**హెష్‌టాగ్**

# ఈ హెష్‌టాగ్ ఇంటర్నెట్‌లో ట్రెడింగ్‌ను తెలుపుతుంది. ట్విట్టర్‌లో ఎక్కువగా ఈ గుర్తును ఉపయోగిస్తారు. ప్రస్తుతం జరిగే ఏదేని అంశంపై యూజర్లు తమకు తెలిసిన సమాచారాన్ని ఈ గుర్తును ఉపయోగించి పోస్ట్ చేస్తారు.

ఉదా : దక్షిణ చైనా సముద్రం. ఈ అంశంపై హెష్‌టాగ్ ద్వారా పోస్ట్‌చేస్తే దీనికి సంబంధించిన అన్ని రకాల కవరేజి మనకు ఒకే చోట లభ్యమవుతుంది. ఇంటర్నెట్‌లో నెటిజన్ల విశేషాదరణ పొందిన పదమిది.

**సెల్ఫీ**

స్మార్ట్ ఫోన్ల రాకతో బాగా వాడుకలో వచ్చిన పదమిది. మనల్ని మనమే ఫోన్‌లోని కెమెరాతో స్వీయ ఛాయాచిత్రం తీసుకోవడాన్ని సెల్ఫీగా వ్యవహరిస్తారు. అనంతరం ఫోటోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తారు. స్మార్ట్‌ఫోన్లకు రెండు కెమెరాలు రావడంతో ఇవి విపరీతమైన ప్రాచుర్యం పొందాయి. గతంలో రాజకీయ నాయకులు, సినీతారలు, క్రీడాకారులు కనిపిస్తే వారి దగ్గర నుంచి ఆటోగ్రాఫ్ తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపేవారు. నేడు ఆ స్థానాన్ని సెల్ఫీలు ఆక్రమించాయని చెప్పవచ్చు.

**ఫ్యాబ్లెట్**

మొబైల్‌ఫోన్ కంటే పెద్దదిగా టాబ్లెట్ కంటే చిన్నదిగా వున్న దానిని ఫ్యాబ్లెట్ అంటారు. ఐదు నుంచి ఏడు అంగుళాల మధ్యలో వున్న తెర కలిగిన ఫోన్లను ఫ్యాబ్లెట్‌గా పేర్కొంటారు.

**లైక్**

ఫేస్‌బుక్‌లో మనకు ఇష్టమైన అంశంగానీ వస్తే దానికి లైక్ కొట్టిన వెంటనే మనం ఆ ప్రచురణకర్తకు చందాదారులయినట్టే ఆ ప్రచురణకర్త ఎలాంటి అంశాన్ని ప్రచురించినా మనకు వెంటనే వస్తుంది. అందుకనే లైక్‌లకు విపరీతమైన డిమాండ్ వుంది.

**షేర్**

ఈ పదం కూడా ఫేస్‌బుక్ ద్వారా ప్రజాదరణ పొందింది. మనకు నచ్చిన అంశాన్ని చదివిన వెంటనే మన గ్రూపులోని స్నేహితులకు కూడా తెలియజేయాలంటే షేర్ చెయ్యాలి. వెంటనే ఆ అంశం మన గ్రూపులోని సభ్యులందరికి వెళుతుంది. వారిలో ఎవరికయినా నచ్చితే వారు షేర్ కొడుతారు. వెంటనే వారి గ్రూపు సభ్యులకు చేరుతుంది. ఇదొక వలయంలాంటిది. ఇలా మనకు తెలిసిన సమాచారం కొద్ది గంటల్లోనే వేలాది మందికి చేరుకునే సౌలభ్యముంది.

**అన్‌లైక్**

ఫేస్‌బుక్ లో మనకు నచ్చని అంశముంటే అన్‌లైక్ క్లిక్ చేస్తాము. లేదా హైడ్ చేయమని అడుగుతాం. దీంతో ఆ పోస్ట్ మనకు కనబడదు. అన్‌లైక్‌లు ఎక్కువయితే ఆ వెబ్‌సైట్ ప్రేక్షకాదరణ కోల్పోతున్నట్టు లెక్కే

ట్వీట్, రీట్వీట్, ట్విట్టరటి

ప్రముఖ మైక్రో బ్లాగింగ్ సైట్ ట్విట్టర్ ద్వారా బహుళ ప్రాచుర్యంలోకి వచ్చిన పదాలివి. మన ట్విట్టర్ ఖాతాలో ఏదేని అంశానికి సంబంధించి రాయడాన్ని ట్వీట్ అంటారు. ఒక వేళ ఇతరుల అభిప్రాయం గాని వార్తలు గాని నచ్చితే రీట్విట్ క్లిక్ చేస్తాం. దీంతో ఈ అంశం మనలను అనుసరిస్తున్న వారందరికి చేరుతుంది. ఒక రకంగా ఫెస్‌బుక్‌లోని షేర్ లాంటిదే. ట్విట్టర్ ద్వారా జరిగే సమాచారమార్పిడిని ట్విట్టరటి అంటారు.

**ఎస్‌ఆర్ఎస్లీ (Srsly)**

షార్ట్ ఫర్ సీరియస్లీ అంటారు.కొన్ని మెసేజింగ్ సర్వీసుల్లో పదాలను 160 లోపే రాయాల్సి వుంటుంది. అలాగే ట్విట్టర్‌లో 140 పదాలను ఉపయోగించాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ పదం ప్రాచుర్యంలోకి వచ్చింది.

**ఇన్‌బాక్స్**

మెయిల్స్ వచ్చిన తరువాత ఇన్‌బాక్స్ పదం వాడకం పెరిగింది. మన మెయిల్‌కు ప్రతిరోజు వచ్చే మెయిల్స్ అన్ని ఇన్ బాక్స్‌లో వుంటాయి. మెయిల్ చందాదారులు ఇన్‌బాక్స్ కెళ్లి తమకు వచ్చిన మెయిల్స్‌ను చెక్ చేసుకోవాల్సి వుంటుంది.

**ఓఎంజీ - ఓ మై గాడ్**

దీన్ని తెలుగులోను ఓరి భగవంతుడుగా పేర్కొనవచ్చు. అద్భుతాలు, వూహించనిది సంభవించిన సమయంలో ఓఎంజీ అని అంటారు. ఒక రకంగా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చే పదమిది.

**ఎల్‌వోఎల్ (LOL)**

దీన్ని లాఫింగ్ అవుట్ లౌడ్ అని పేర్కొంటారు. ఛాట్‌లో ఎక్కువగా పేర్కొంటారు. బిగ్గరగా నవ్వడంగా తెలుగులో పేర్కొనవచ్చు. మెసేజింగ్‌లో కూడా వాడుతుంటారు. సరదా వ్యాఖ్యలకు, జోక్స్‌కు స్పందనను తెలియజేసే సమయంలో ఈ పదాన్ని వాడుతుంటారు.

**వెబినార్**

సెమినార్ లాంటిదే వెబినార్. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన సమయానికి వెబినార్ సైట్‌లో మనము ముందు గానే పేర్లను నమోదు చేసుకొని వుండాలి. అనంతరం నిర్దేశిత సమయంలో వ్యాఖ్యాత ముందుగానే చేసిన అంశంపై తన విశ్లేషణలను వెల్లడిస్తాడు. ఇందులో ప్రశ్నోత్తరాల సమయం కూడా వుంటుంది. వెబినార్‌కు మనం ఎక్కడికో పోకుండా మన దగ్గర వున్న కంప్యూటర్‌తో గాని, స్మార్ట్‌ఫోన్‌తో వీక్షించాలి.

ఇంటర్నెట్ లేని ప్రపంచాన్ని సోషల్‌మీడియా లేని వెబ్ ప్రపంచాన్ని మనం ఊహించలేం. ప్రస్తుతం మన జీవితాలతో అంతగా ముడివేసుకొని వుంది సోషల్ మీడియా. రాజకీయనాయకులు, సెలబ్రిటిలు, క్రికెట్ క్రీడాకారులు ప్రజలకు దగ్గర అయ్యేందుకు సోషల్ మీడియాను అస్త్రంగా ఎంచుకున్నారు. తొలినాళ్లలో డెస్క్‌టాప్ వున్నప్పటికీ మారుతున్న ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్లు అందరికి అందుబాటులోకి రావడంతోబాటు డేటా వినియోగం పెరగడంతో సోషల్ మీడియాను మెజార్టీ నెటిజన్లు వినియోగిస్తున్నారు.

ఇవే కాకుండా అనేక కొత్త కొత్త పదాలు సోషల్ మీడియా ద్వారా జర్నలిజంలోకి ప్రవేశిస్తున్నాయి. సమాచారం తెలుసుకోవడం అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కుగా మారిపోయింది. దీంతో సమాచారాన్ని వేగంగా ఇచ్చేందుకు వార్తాసంస్థలతోపాటు వ్యక్తులు కూడా పోటీపడుతుండటం విశేషం.

వ్యాసకర్త - **జర్నలిస్టు**

## తెలంగాణ సారస్వత పరిషత్తు కొన్ని ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర | రూ. 150/- |
| 2. | తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు(వ్యాస సంకలనం) | రూ. 200/- |
| 3. | తెలంగాణా మాండలికాలు - కావ్య ప్రయోగాలు | రూ. 60/- |
| 4. | బంజారాల వివాహ ఆచార పద్ధతులు | రూ. 60/- |
| 5. | యాభై సంవత్సరాల జ్ఞాపకాలు | రూ. 100/- |
| 6. | కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్య సేవ | రూ. 40/- |
| 7. | మా వూరు మాట్లాడింది | రూ. 40/- |
| 8. | పరిణతవాణి (ఏడవ సంపుటి) | రూ. 125/- |
| 9. | ప్రాచీన తెలంగాణ కవుల కవితా ప్రాభవం | రూ. 40/- |
| 10. | తెలంగాణ చరిత్ర | రూ. 220/- |
| 11. | సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు | రూ. 240/- |
| 12. | తెలుగు జానపద సాహిత్యము - స్త్రీల గేయములలో సంప్రదాయము | రూ. 250/- |
| 13. | ఆంధ్ర మహాభారతోపన్యాసములు | రూ. 100/- |
| 14. | తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం | రూ. 70/- |
| 15. | తెనుగు సాహితి | రూ. 36/- |
| 16. | స్త్రీల రామాయణపు పాటలు | రూ. 36/- |
| 17. | సమీక్షణం | రూ. 36/- |
| 18. | పరిణతవాణి - 1,2,3,4,5,6 సంపుటాలు (రూ.36,45,60,65,60,150) | రూ. 370/- |
| 19. | ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు | రూ. 70/- |
| 20. | ఇరివెంటి వ్యాసాలు | రూ. 30/- |
| 21. | శాలివాహన గాథా సప్తశతీసారము | రూ. 15/- |
| 22. | రాయప్రోలు రచనలు - తత్త్వవివేచన | రూ. 60/- |
| 23. | తెలుగు సాహిత్యోద్ధారకులు | రూ. 40/- |
| 24. | మల్లికా గుచ్ఛము | రూ. 8/- |
| 25. | మన జాతినిర్మాతలు | రూ. 4/- |
| 26. | సుమతి, వేమన, కృష్ణ శతకాలు | రూ. 24/- |
| 27. | ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక | రూ. 50/- |
| 28. | ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక | రూ. 250/- |
| 29. | తెలంగాణలో జాతీయోద్యమాలు | రూ. 10/- |
| 30. | సంస్కృత పాఠవల్లరి | రూ. 4/- |
| 31. | నా సాహిత్యోపన్యాసములు | రూ. 5/- |
| 32. | గౌతమబుద్ధుడు - జవహర్‌లాల్ నెహ్రూ | రూ. 3-60 |
| 33. | విమర్శకవతంసులు | రూ. 45/- |
| 34. | మన దేశం - తెలుగుసీమ | రూ. 7/- |
| 35. | మన నదులు - కృష్ణా గోదావరులు | రూ. 3/- |
| 36. | మధురభక్తి - ముగ్ధభక్తి | రూ. 80/- |
| 37. | ప్రాచీన కవిత | రూ. 10/- |
| 38. | ప్రసంగ వ్యాసాలు | రూ. 5/- |
| 39. | దశరూపక సారం | రూ. 5/- |
| 40. | భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం | రూ. 2/- |
| 41. | నా రేడియో ప్రసంగాలు | రూ. 5/- |
| 42. | సాహిత్యానువాదం : సమాలోచనం | రూ. 60/- |
| 43. | శివరాత్రి మాహాత్మ్యము | రూ. 75/- |
| 44. | తెలుగు రచన | రూ. 7/- |
| 45. | ఆంధ్ర వాఙ్మయ చరిత్ర | రూ. 85/- |
| 46. | సాహిత్య సోపానములు | రూ. 75/- |
| 47. | మన హాస్యము | రూ. 100/- |
| 48. | తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం | రూ. 100/- |
| 49. | వ్యాస గుళుచ్ఛం (1, 2 భాగాలు) | రూ. 130/- |
| 50. | తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం | రూ. 150/- |